

శ్రీవిష్ణవీయ

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ



ప్రథమ ప్రతి స్వీకర్త

పురుషోత్తమక్షేత్ర ధైవం -

బలభద్రా సుభద్రా సమేత శ్రీ జగన్నాథస్వామి.

SRI SARADA PEETHAM

SRINGERI

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्री शारदापीठम्, शृङ्गेरी
Sri Sri Jagadguru Shankaracharya Mahasamstanam
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.

Ref : Camp : SRINGERI Date :

Camp : మైసూరు

సర్వధారి సంవత్సర నృసింహ జయంతి
18-5-2008

వేదవ్యాసమహర్షి విరచిత మహాభారతసాగరంలోని అమోఘరత్నములలో విష్ణుసహస్రనామస్తోత్రంకూడా ఒకటి. సకలధర్మమర్మజ్ఞుడయిన భీష్మ పితామహుడు శరతల్పమునందుండి యుధిష్ఠిరునకువదిశించిన యమోఘ రత్నమిది. సర్వజనసులభము సర్వోత్కృష్టఫలదము అయిన దీనిని ప్రతియొక్కడూ పఠించి తరించవలయునన్న మహోన్నతాశయమే ఏతదుపదేశనిదానము. పరశివావతారులయిన శ్రీమదాదిశంకర భగవత్పాదులు దీనికి భాష్యము వ్రాసియుండుట దీని ఉత్కర్షను వేనోళ్ళ చాటుచున్నది. తదనుసారముగ దీనినవగతముచేసికొని మననము చేయుట సకల శిష్టజనకర్తవ్యము. దీనినపేకులు పలువిధములుగను పలుభాషలలోనూ అనువదించి ధన్యులయిరి.

శ్రీయుతులు సామవేదం షణ్ముఖశర్మగారు తమదే అయిన విశిష్టరీతిలో దీనిని వ్యాఖ్యానించి విష్ణువిద్యయను పేరున ప్రచురించుచుండుట ముదావహము. శ్రీశర్మగారు బహుగ్రంథ పరిశీలనపురస్సరముగ దీనిని రచించిరని ఏతద్గ్రంథావలోకనముచే ప్రస్ఫుటమగుచున్నది.

శ్రీశారదాచంద్రమౌళీశ్వరుల కృపవలన ఈ గ్రంథము బహుళ ప్రచారమునందుగాక, శ్రీశర్మగారు ఇదేవిధముగా పద్యగ్రంథములవాంఙ్మ ప్రజానీకమునకందించుచూ పితపక్ష శీతకిరణోపమయశోవిరాజితులగుదురుగాకయని శ్రీజగద్గురు చరణులాశీర్వదించిరి.

శుభమస్తు

T Dakshinamurthi

Phone : 08265-250123 / 250192 Fax : 08265-250792
E-mail : info@sringerisharadapeetham.org Visit us : www.sringerisharadapeetham.org

శ్రీ విష్ణువిద్య

(శ్రీవిష్ణుసహస్రనామ భాష్యము)

ద్వితీయ భాగము

సామవేదం షణ్ముఖ శర్మ

ఋషిపీఠం ప్రచురణలు
హైదరాబాద్

సామవేదం షణ్ముఖ శర్మ

11051

Call - 2 కాపీలు

విష్ణువిద్య
(శ్రీవిష్ణు సహస్రనామ భాష్యం)
ద్వితీయ భాగము

-సామవేదం షణ్ముఖ శర్మ

ప్రథమ ముద్రణ: జనవరి 2007

సర్వహక్కులు రచయితవి

వెల: రూ.250/-

ముఖచిత్రం : రాము పి, విజయవాడ



ప్రతులకు:
ఋషిపీఠం కమ్యూనికేషన్స్ ప్రై.లిమిటెడ్
శివజ్యోతి, ప్లాట్ నెం-1, ఫస్ట్‌ఫ్లోర్,
10వ వీధి, హౌస్ నెం-1-8-105,
చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్. 040-27655859

ద్వితీయ భాగము

వృషాహీ వృషభో విష్ణు ర్వృషపర్వా వృషోదరః।
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః॥ ... 28

256. వృషాహీ, *257.* వృషభః, *258.* విష్ణుః,
259. వృషపర్వా, *260.* వృషోదరః, *261.* వర్ధనః,
262. వర్ధమానః (చ), *263.* వివిక్తః, *264.* శ్రుతి సాగరః

వృషాహీ.. 256

1. ధర్మ, పుణ్య ప్రకాశ స్వరూపుడు.
   'వృషః' – ధర్మం, పుణ్యం, యజ్ఞం. వీటిని – **'అహః'** – ప్రకాశింపజేయువాడు. వర్షించే స్వభావము కలది – వృషః. ధర్మము, పుణ్యము, యజ్ఞము ఆచరించిన వారికి ఫలాలను కురిపిస్తాయి (వర్షిస్తాయి) కనుక వృషములు. వాటిలోనున్న ప్రకాశమే – చైతన్యమే విష్ణువు.
2. యజ్ఞమునకు సంబంధించిన శబ్దమిది. సప్తాహ, ద్వాదశాహ – క్రతువులను వేదం పేర్కొన్నది. అటువంటి క్రతువుల (యజ్ఞముల) రూపములో నున్న యజ్ఞమయుడు విష్ణువు.
3. 'వృష' శబ్దం – 'అగ్ని' వాచకం కూడా. 'అగ్ని' మొదలైన తేజస్సులలో (సూర్య, జోతిర్మండలాదులలో) ప్రకాశ స్వరూపంగా ఉన్నవాడు.
   యదాదిత్య గతంతేజో జగద్భాసయతేఖిలమ్।
   యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకమ్॥
   సూర్యచంద్రాగ్నుల యందు తేజస్సు తానేనని 'గీత'లో భగవద్వచనం.

వృషోఽగ్నిః సమిధ్యతే దేవానాం యజ్ఞవాహనః। (ఋగ్వేదం)

త్వాం భాసా రోదసీ ఆతతన్థ జ్రేణ శోచిషా శోశుచానః। (ఋగ్వేదం)

4. ధర్మమయమైన పగటి స్వరూపుడు.

ధర్మమాచరించే దినమే భగవత్స్వరూపం. అటువంటి దినాలే కావాలని భక్తులు, యోగులు కోరుకుంటారు. ధర్మ, యజ్ఞాది పవిత్ర (పుణ్య) కర్మల నాచరించకుండా సాగే దినాలు వ్యర్థాలు.

దైవస్వరూపమైన ధర్మ యుక్త సుదినాలు కావాలని -

"సూషా చ మే సుదినం చ మే" (మంచి ఉదయం - మంచి దినం)

నాకు లభించాలని చమక మంత్రాలు.

కాంతి, కరుణ, అభీష్ట సిద్ధులు వర్షించే ధర్మస్వరూపుడు కనుక -

వృషభః.. 257

1. వర్షణ శీలుడై ప్రకాశించువాడు.

యజ్ఞాదులకు ఫలములను వర్షించుచూ ప్రకాశించే హరి,

"ప్రణతకామవర్షిన్" - భక్తుల కోరికలను వర్షించే దయాళువు.

2. వృషభం అనే పేరు కూడా అగ్నికీ, సూర్యునికీ వేదం పేర్కొన్నది.

'సమావృషభో లోహితాక్షః సూర్యోవిపశ్చిన్మనసాపునాతు। (శ్రుతి)

'పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః' (ఆదిత్య హృదయం) తన కిరణాలతో కాంతిని వర్షిస్తూ, తదుపరి వర్షకారకుడై, ఋతు చక్ర ప్రవర్తకుడై అనేక ప్రాణశక్తులను వర్షించే లక్షణం గల తేజోమయుడు సూర్యుడే వృషభం.

అదేవిధంగా యజ్ఞాగ్ని హవిస్సులను స్వీకరించి, దేవతలకు అందించి వర్షాలను కురిపిస్తోంది. యజ్ఞరూపుడైన విష్ణువు అగ్నిగా వర్షకారకుడై 'వృషభు'డయ్యాడు.

త్వమగ్నే వృషభః పుష్టివర్ధన ఉద్యతస్రుచే భవసి శ్రవాయ్యః।

ఆహుతిం పరి వేదా వషట్‌కృతిమేకాయురగ్రే విశ ఆవివాసాసి ।

(ఋగ్వేదం)

– అని ఋగ్వేదం స్పష్టం చేసింది.

3. కొందరు వేదవిదులు శబ్ద స్వరూపమే వృషభంగా పేర్కొన్నారు. అగ్ని వాగధిదేవత గనుక అదీ సముచితమే.

త్రిధాబద్ధో వృషభో రోరవీతి
మహోదేవో మర్త్యా ఆ వివేశ! (ఋగ్వేదం)

అ,ఉ,మ అనే ప్రణవం, త్రేతాగ్నుల రూపమైన వహ్ని, త్రయీమయమైన వేదం – ఇవన్నీ త్రిధాబద్ధ వృషభరూపమే.

ఈ శబ్ద బ్రహ్మ స్వరూపం, యజ్ఞ స్వరూపం, ధర్మస్వరూపం విశ్వమంతా వ్యాపించినది గనుక –

విష్ణుః.. 258

1. వ్యాపించినవాడు.

'వృషభ' నామ వ్యాఖ్యానంలో ప్రస్తావించిన 'త్వమగ్నే' 'త్రిధాబద్ధో' మంత్రాలలో **'విశ' 'ఆవివేశ'** – మాటలకు ప్రవేశించుట, వ్యాపించుట అని అర్థాలు. ఈ అర్థాలను తెలియజేసే శబ్దమే 'విష్ణు'.

ధర్మ, యజ్ఞాదుల రూపంతో, సూర్య అగ్న్యాది తేజస్సుల రూపంలో శబ్ద స్వరూపంలో అన్నిటా వ్యాపించినవాడు. 'వృష' శబ్దంతో కూడిన ఈ శ్లోకపాదంలో (వృషాహీ, వృషభో, వృషపర్వా, వృషోదరః) నడుమ 'విష్ణు' నామ ప్రస్తావనలో విశిష్టమిదే.

'యజ్ఞోవై విష్ణుః' అనే మంత్రానుసారం 'వృష' (యజ్ఞ) నామాల నడుమను విష్ణు నామాన్ని కూర్చటంలో ఆర్ష దృష్టి స్పష్టమౌతోంది.

2. **'ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదం'** – అనే మంత్రం, **'త్రిధాబద్ధో వృషభో'** – అనే మంత్రం కాంత్యాది స్వరూపుడైన మూడు

విధముల వ్యాపించిన విష్ణుని ప్రస్తావిస్తున్నాయి.

వృషభ శబ్ద వాచ్యుడైన సూర్యరూప విష్ణువు ప్రాతర్వేళ 'మిత్ర' సంజ్ఞతో, మధ్యాహ్నం, 'ఇంద్రు'నిగా, సాయంత్రం 'అగ్ని'గా వేదవిజ్ఞానం పేర్కొన్నది. ముప్పూటలా మూడు విధములైన కాంతి గతులు (**త్రేధా నిదధే పదం**) కలిగిన సూర్యుడే విష్ణువు. యజ్ఞముగా (వృషస్వరూపునిగా) జగద్ధితానికై విశ్వమంతా వ్యాపించిన ధర్మస్వరూపుడే-

వృషపర్వా .. 259

1. ధర్మమార్గముల స్వరూపుడు.

   'పర్వం' అంటే 'ఒక దాని నుండి ఇంకొక దానికి కలిపే స్థానములు' (**ప్రీణాతి పూర్వాత్ పరమితి పర్వ**). సంధులు, భాగములు, సోపానములు, చెరకు వంటి వాటి కణుపులు... ఇవి 'పర్వములు.' అవి ఒకదాని కొకటి సంబంధం తెగకుండానే భాగములుగా ఉంటాయి. అలాగే ధర్మం (వృషం) అనేక భాగములుగా ఉన్నది. వివిధ ధర్మమార్గములన్నీ ఈశ్వర సోపానములే. తాను తన అనంత ధర్మ శక్తిని వర్షింపజేసి ఈ సోపానము లేర్పరచాడు. ఈ ధర్మ సోపానాలతోనే పరమపదాన్ని చేరగలం.

2. శరీరాదులలో సంధులలో చైతన్య వృష్టితో కలిసి, కలిపే వృషపర్వుడతడే. వివిధ కాంతి మార్గాలను, కాలసంధులను, జలసంధులను, పృథ్వీ భాగములను కలుపుతూ వ్యాపించినవాడు.

3. యజ్ఞములలో 'పర్వ' యజ్ఞములు పూర్ణిమ, అమావాస్య, సంక్రమణాదులయందు ఆచరిస్తారు. అహః స్వరూప యజ్ఞములను 'వృషాహీ' నామం చెబితే, 'పర్వ' యజ్ఞాలను (ఉదా॥ దర్శపూర్ణ మాసాదులు) 'వృషపర్వా' నామం చెబుతున్నది.

   పూర్ణ యజ్ఞ స్వరూపమైన విష్ణు సహస్ర నామస్తోత్రంలో సర్వయజ్ఞ

విశేషాలను నిబద్ధించారు మహర్షులు.

ఇలా ధర్మాదుల నన్నిటినీ తనలో దాచుకున్నవాడై -

వృషోదరః .. 260

1. వృషమును (ధర్మాదులను) గర్భము నందుకలవాడు.

   గర్భము సృష్ట్యాదులకు ఉత్పత్తిస్థానం. యజ్ఞాదులతో నిండినవాడు. వాటితో సృష్టిని కలిగించువాడు. ప్రజాకారకమైన తేజస్సును, బీజములను తనలో నిక్షిప్తం చేసుకొని - (ఒకపరి లోపలికి గొనుచు) ఉన్నవాడు.

2. 'వృష' శబ్దానికి 'అగ్ని' అనే ప్రధానార్థాన్ని ముందే చెప్పుకున్నాం. 'అగ్నిని ఉదరమునందు కలవాడు.' సర్వ జగత్తును ఆహరించే అగ్ని ఆయనలోనే ఉన్నది.

   'సర్వ ప్రాణుల గర్భాన అగ్నిగా ఉన్నవాడు' - అనే అర్థాన్ని కూడా గ్రహించితే - జఠరాగ్నిగా మానవులలో, బడబాగ్నిగా సముద్ర గర్భంలో, దావాగ్నిగా వనములలో దాగినవాడు. సర్వమును పచనం చేసే ఈ అగ్ని భూగర్భంలో కూడా నిక్షిప్తమై బీజాదులను అంకురింపచేస్తోంది. సమస్త వస్తుజాతములు అగ్ని గర్భములే. ఈ అగ్ని గర్భ స్వరూపంగా విశ్వమంతా వ్యాపించిన విష్ణువు వృషోదరుడు.

   హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్। (ఋగ్వేదం)

   ఈ యజ్ఞాది వృష స్వరూపంతో స్వరమును వృద్ధి చేయువాడు గనుక-

వర్ధనః.. 261

1. పెంపుచేయువాడు.

   వివిధ శక్తులను, ధర్మాలను వర్షింపజేస్తూ ఈ విశ్వాన్ని వర్ధిల్ల చేయువాడు. ఈ వర్ధన రూప విష్ణు చైతన్యంతోనే కల్పకాల విశ్వమంతా

వర్ధిల్లుతోంది. విత్తనం మహావృక్షమవడం, జీవి ఆయుః పరిసమాప్తి వరకు శరీరంతోపాటు పెరగటం.. ఈ ఎదుగుదలకంతా తనలో వ్యాపించిన విష్ణు చైతన్యమే కారణం.

అస్య బ్రహ్మా వర్ధనం యస్యసోమో యస్యేనం రాధః సజనా స ఇన్ద్రః

(అథర్వవేదం)

సవర్ధితా వర్ధనః పూయమానః సోమో మీధ్వాం అభినో జ్యోతిషావీత్।

(ఋగ్వేదం)

అనాదిగా ఈ సర్వజగము ఆయన చేతనే పెంపుదల పొందుతోంది. పెరిగే జగముతోపాటు తానూ పెరుగుతున్నట్లు గోచరించువాడు కనుక -

వర్ధమానః .. 262

1. పెరుగుతున్నవాడు.

   పెంపు జరుగుతున్న ప్రపంచంతోపాటు తానూ పెరుగువాడు. వర్ధిల్లడమనే చైతన్యమే ప్రతి వస్తు జాతంలోనూ ఉన్నది. తాను ప్రవేశించి వ్యాపించటం చేత, వస్తువుతోపాటు ఆయన కూడా పెరుగుతున్నట్లే. తన నిత్యగుణం చేతనే విశ్వాన్ని వర్ధిల్ల చేస్తున్నాడతడు.

   సూర్యుడు తాను పెరుగుతూ, తన కాంతిని వృద్ధి చేసి, ప్రపంచాన్ని పెంపుచేయటం పై రెండు నామాలకు ప్రత్యక్షోదాహరణం. ఎదుగుదలలోనే ఈశ్వర చైతన్యాన్ని చూడగలం.

2. సాధకులైన ఆశ్రిత భక్తులలో భక్తి జ్ఞానాది సాధనలను పెంపుచేస్తూ, వారిలో క్రమంగా తన అనుభూతిని (స్వరూపాన్ని) స్ఫుటీకరింపజేసే వర్ధమానుడు. జ్ఞాన భక్తి యోగాదుల పెంపుకొలది తన పెంపును ప్రకటించువాడు.

   అయితే - పెరిగే జీవుని దృష్టికి ఆయన పెరుగుతున్నట్లు గోచరిస్తున్నా, పెరుగుదలకు అతీతుడైన పూర్ణుడు కనుక-

వివిక్తః.. 263

1. వేరైనవాడు.

ఆయన లేనిదే విశ్వానికి పెంపుదల లేదు. విశ్వంలో నిండి దానితోపాటు తాను వర్ధిల్లినట్లు కనిపిస్తున్నా, నిజానికి విశ్వానికి అందక, దానిని మించి ఉన్నవాడు. మాయామయ జగత్తులో నిండినా, నిస్సంగుడై ఉన్న పరమాత్మ.

పైన చెప్పుకొన్న సూర్యుని ఉదాహరణనే ఇక్కడ స్మరించాలి. సూర్యుడు క్రమంగా ఎదుగుతూ, ప్రపంచాన్ని ఎదుగుతున్నట్లు చేస్తున్నా ఎదుగుదల, తరుగుదల లేని పూర్ణ అఖండ, తేజస్సుగా, తాను పెంపు చేస్తున్న ప్రపంచానికి అందకుండా ఎలా భాసిస్తున్నాడో అలా మార్పు చెందని పరిపూర్ణుడై విశ్వానికి వేరుగా ఉన్న విష్ణువు 'వివిక్తుడు'.
సాధనకి వివక్తస్థితి చాలా యోగ్యమని తత్త్వ శాస్త్రబోధ. ఏకాంత స్థితే వివిక్తం. ఇతరులకు, ఇతరములకు అంటని స్థాయి అది. ఆ స్థితిలోనే పరమాత్మానుభవం లభ్యం. **'వివిక్త సేవీలఘ్వాశీ'** అని గీతాబోధ. తాను వివిక్తుడై, వివిక్తులైన భక్తులకు తన కలరూపును గోచరింపచేస్తాడు. ఋగ్వేదంలోని 'ద్వాసుపర్ణా....' మంత్రం పరమాత్మ యొక్క ఈ వివిక్త స్థితినే ద్యోతకం చేస్తుంది.

'త్రి పాదూర్ధ్వ ఉదైత్పురుషః' 'విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులం' - అనే పురుష సూక్తమంత్రాలు విశ్వాతీతుడైన విష్ణుని పరమాత్మ స్వరూపాన్ని 'వివిక్తు'నిగా వివరిస్తున్నాయి.
ఆ పరతత్త్వాన్నే వేదములన్నీ తమ లక్ష్యంగా ప్రస్తావించినవి కనుక-

శ్రుతిసాగరః.. 264

1. శ్రుతులకు (వేదములకు) గమ్యస్థానం.

సమస్త వేద విద్య పరమాత్మ తత్త్వాన్ని ప్రకటించడమే లక్ష్యంగా ఉన్నది.

నదులన్నీ సముద్రాన్ని చేరినట్లుగా వేదములన్నీ 'చివరకు తీర్మానించి చెప్పిన పరమ తాత్పర్యం' పరమాత్మ జ్ఞానం. అదే వేదాంతం. ఆ పరమాత్మయే విష్ణువు.

'వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః' అని భగవానుడే స్వయంగా, "వేదములన్నిటిచే నేనే తెలియబడుతున్నాన"ని ప్రకటించాడు. నది సముద్రాన్ని చేరుకొనే గమనంలో వివిధ ప్రయోజనాలను నెరవేర్చుతున్నా, దాని లక్ష్యం సముద్రమే అయినట్లుగా, వేదవిద్యలన్ని ఎన్నో విజ్ఞానాలను అందిస్తున్నా అంతిమ ప్రతిపాదన మాత్రం బ్రహ్మ జ్ఞానమే.

ఆ బ్రహ్మజ్ఞాన స్వరూపుడు విష్ణువు.

'సర్వే వేదా యత్పదమామనంతి' (శ్రుతి)

వాచాస్తా వదన్తి యధాయధమ్ ॥ (అథర్వవేదం)

2. మరియొక భావంలో - 'వేద సముద్రుడు' (జ్ఞాన సముద్రుడు). సముద్రం ఎంతటి అపారమో, అగాధమో, బహువస్తుసముపేతమో - అలాగే వేదం అంతులేని, లోతైన, బహు ప్రయోజనకరమైన జ్ఞాననిధి. అది సాక్షాత్తు నారాయణ స్వరూపమే. వేదమే తానైన వాడు కనుక విష్ణువు వేదసాగరస్వరూపుడు.

ఆపూర్యమానం అచల ప్రతిష్ఠం
సముద్రం ప్రవిశంతి యద్వత్॥ -అని ఉపనిషత్తులు, భగవద్గీత ఆయనను సముద్రము వలె అంతుపట్టని వానిగా ప్రస్తావించాయి. పూర్ణజ్ఞాన నిధి గనుకనే వేద విజ్ఞానంతో అనంత జగత్తును పాలించువాడై-

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేన్ద్రో వసుదో వసుః
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః... 29

265. *సుభుజః,* ***266.*** *దుర్ధరః,* ***267.*** *వాగ్మీ,* ***268.*** *మహేన్ద్రః,*
269. *వసుదః,* ***270.*** *వసుః ।* ***271.*** *నైకరూపః,* ***272.*** *బృహద్రూపః,*
273. *శిపివిష్టః,* ***274.*** *ప్రకాశనః ॥*

సుభుజః .. 265

1. చక్కగా పాలించువాడు, రక్షించువాడు.

   'భుజపాలనాభ్యవహారయోః' అనే అర్థం ఉన్నది. **శోభన ప్రకారేణ (సు) విశ్వం భునక్తి రక్షతి (భుజః).** శోభాయమానంగా ఈ అనంత విశ్వాన్ని పాలించుచూ రక్షిస్తున్నవాడు.

   ఈ పాలన రక్షణ వ్యవస్థను వ్యాపక ధర్మంతో సర్వత్రా నిర్వహిస్తున్నది విష్ణువు. జల, వాయు, గగన, స్థలాదులలో జీవించే సర్వజన్తుకోటి తగిన విధమైన దేహ నిర్మాణ నిర్వహణాదులతో పాలింపబడుతున్నాయి. ఆయా స్థానముల (జలాదుల)లో నున్న విష్ణు చైతన్యం ద్వారానే రక్షింపబడుతున్నాయి. కాల ఖగోళాదులను నియమించుతూ, ఎవ్వరూ నిర్వహించలేని చక్కని పాలన, రక్షణలనందిస్తున్న జగత్పాలకుడు సుభుజుడు.

   .'పూషా నో యథా వేదసామసద్వృధే రక్షితా పాయురదబ్ధః స్వస్తయే' అని యజుర్వేదం పై విష్ణు ధర్మాలను వింగడించింది.

2. దేనినైనా ధరించగలిగేవి, దెబ్బతగలబోతే అడ్డుకొనేవి (పాలన, రక్షణ, భరణ ధర్మాలు గలవి) కనుక చేతుల మూలస్థానాల వద్ద 'భుజములు' అని వ్యవహారం. ధరించే సమర్థత గలవి కనుక 'భుజ' (పాలన) అర్థం సరిపోతోంది. ఈ 'రక్షణ'అర్థం కలవి కనుకనే భుజముల నుండి

రక్షకులు, పాలకులు (క్షత్రియులు) ఉద్భవించారు. విశ్వంలోని రక్షక పాలక శక్తులన్నీ స్వామి భుజముల నుండే ఆవిర్భవించాయి.

ప్రదిశోయస్య బాహూ (ఋగ్వేదం), బాహూ రాజన్యః కృతః।

(యజుర్వేదం)

-వంటి వేద వాక్కులు ఈ విషయాన్ని స్పష్టపరచాయి.

3. విశ్వమునే ధరించి పాలించి రక్షించే అందమైన శుభంకర భుజములు కలవాడు - 'సుభుజుడై'న విష్ణువు. స్వామి యొక్క ధ్యానయోగ్యమైన దివ్య మంగళ విగ్రహంలో భుజములు భక్తులకు అభయ, వరములను ప్రసాదించుతాయి.

శంఖ చక్ర గదా పద్మములు ధరించిన చతుర్భుజాలు, అష్టదిక్కుల వ్యాపించి రక్షించుటకు సంకేతాలైన అష్ట భుజాలు, విరాట్పురుషునిగా వేల భుజాలు, శ్రీకృష్ణ శ్రీరామాది దివ్య సుందర స్వరూపాలలో వేణు, కోదండాదులను ధరించిన ద్విభుజాలు... అన్నీ సుభుజాలు. జగద్రక్షా కరములు. ధ్యానించినంత మాత్రాన భక్తులకు సకలాభీష్టాలను, పురుషార్థాలను, రక్షణను అందించే పాలనాస్వరూపాలు.

'ఇందరికి అభయమ్ము లిచ్చు చేయి

కందువగు మంచి బంగారు చేయి -' అన్ని అన్నమయ్య వర్ణించినట్లు బంగారు చేతులవాడు (హిరణ్యబాహు) - హితం, రమ్యం కలిగించే పాలనా ధర్మం కలిగినవాడు.

ఎవరూ భరించలేని వాటిని ధరిస్తూ, ఏ ఒక్కరూ తనను ధరించలేనివాడు కనుక -

దుర్ధరః.. 266

1. ఇతరులచే ధరించబడ(లే)ని వాడు.

తన సుభుజములతో లోకాదులను ధరిస్తున్న వానిని ఇతరులు తేలికగా ధరించలేరు.

మనం ధరించలేని పర్వతాదులను, భూమిని, గ్రహనక్షత్రాదులను తన అనంత ధారణ శక్తితో ధరించే ఆతనిని ఏ ఒక్కరూ దాల్చలేరు. ఆ దుర్ధరుని కృప చేతనే ఈ దేహాదులు, ధరణి మొదలైనవి తమకు తగిన ధారణ శక్తిని పొందుతున్నాయి.

రామకృష్ణావతారాలలో సముద్ర నియమనం, దుందుభి దేహాన్ని ఎగరగొట్టడం, తృణావర్తాదులను అణచటం, గోవర్ధనోద్ధరణం వంటి చేష్టలతో ఈ 'దుర్ధర' లక్షణాన్ని ప్రకటించాడు.

2. ముముక్షువులైన యోగులు తమ హృదయాలలో ఆ పరమాత్మను 'ధారణ' చేయటానికి తీవ్రమైన ప్రయత్నాలు, ప్రయాసతో కూడిన సాధనలు చేస్తారు. అటువంటి కష్టముతో కూడిన తీవ్రసాధనలచేత భక్తాదుల హృదయాలలో ధరింపబడే దైవం కనుక దుర్ధరుడు. హనుమంతుడు భక్తి యోగంతో రాముని ధరించగలిగాడు. రావణుడు లక్ష్మణునే ఎత్తలేకపోయాడు.

విశ్వధారకుడైన ఆతడు తన పాలనాశక్తితోనే కాక శాశ్వత ధర్మాలతో శాసిస్తున్నాడు. ఆ శాసన రూప వేదవిద్యను తన పలుకుగా ప్రకటించిన వాడు కనుక –

వాగ్మీ.. 267

1. చక్కని వాక్కులు కలవాడు.

వేదరూప దివ్య వాక్కులే ఆయన స్వరూపములు. **'వాగ్విమృతాశ్చ వేదాః'** (వాని వాక్కు నుండి వెలువడినవన్నీ వేదాలే).

యుక్తియుక్త మితభాషణము, విస్తృత భాషణము కలిగిన వాడు వాగ్మీ.

పలుకుటకు తగిన జ్ఞాన సంభారముండి, జ్ఞానము తప్ప మరేదీ ప్రకటించని యుక్తియుక్త మిత హిత సత్య మధుర గంభీర పావన మృదు శుభ వచస్సులు నారాయణుని స్వరూపాలు.

ఈ లక్షణాలున్న వాక్కులే వేదాది స్వరూపాలు.

ఇటువంటి దివ్య లక్షణ సంపన్న వాక్కులనే తన రామకృష్ణాది అవతారాలలో ప్రకటించాడు స్వామి.

'బుద్ధిమాన్ మధురాభాషీ పూర్వభాషీ ప్రియం వదః, స్మిత పూర్వభాషీ, వాగ్మీ వశీ' - వంటి అనేక విశేషణాలతో శ్రీరాముని వాగ్వైభవాన్ని పరవశంగా వర్ణించాడు వాల్మీకి. ఇక - గీతాచార్యుడైన శ్రీకృష్ణుని పరిపూర్ణత సరేసరి.

చిత్పతిర్మా పునాతు వాక్పతిర్మాపునాతు దేవో మా సవితా పునాతు।।
యథేమాం వాచం కల్యాణీ మావదాని జనేభ్యః।।

అని 'యజుర్వేదం' వాక్పతి వాగ్వైభవాన్ని వర్ణించింది.

2. 'యథార్థవాది' అని కూడా ఈ నామానికి అర్థం.

ప్రకటించడమే వాగ్లక్షణం. ఈ లక్షణాన్ని విశ్వమంతా వ్యాపింపచేశాడు. వాఙ్నియమంతో మనమూ వాగ్మిని పట్టుకోవాలి. శబ్దరహితంగా యథార్థాన్ని ప్రకటించగలడు పరమాత్మ - ప్రకృతిలో జరిగే మార్పులను బట్టి కాల పరిణామాలను ప్రకటిస్తాడు. చలువ తేమ గాలుల ననుసరించి మేఘాల రాకను తెలియబరుస్తాడు. ఉరుములతో, గాఢమైన వ్యాప్తితో మేఘాలు వర్షాన్ని ప్రకటిస్తాయి.

ఇదంతా విశ్వవ్యాపక విష్ణుచైతన్య విన్యాసమే.

పాలనాధర్మంతో ధరిస్తూ, ప్రకటన స్వభావంతో తెలియబరుస్తున్నవాడై మహాతేజస్వీగా, భాసిస్తున్న కారణంగా-

మహేన్ద్రః .. 268

1. గొప్ప ఐశ్వర్యవంతుడు, గొప్ప తేజశ్శాలి.
'ఇన్ద్ర' శబ్దం వేదం పరమేశ్వర పరంగా ఉపయోగించింది. ముజ్జగాలను పాలించే పరమేశ్వర చైతన్యమే ఇన్ద్ర శబ్ద వాచ్యం. ఋగ్వేదాదులన్నీ సహస్రాక్ష, సురేంద్ర, పురందర, సురేశ, దేవదేవ - వంటి శబ్దాలను ఇన్ద్ర పర్యాయంగా ఉపయోగించాయి.

వేదం ఒకే పరమేశ్వరుని బహువిధ అభివ్యక్తులను బహునామాలతో ప్రకటించింది. వాటన్నిటి ద్వారా ఆ సర్వవ్యాపక పరమేశ్వరుని సంభావించాలి. దేవతాభేదాలతో బుద్ధుల్ని సంకోచపరచుకోరాదు.

'ఇది పరమైశ్వర్యే' - అని ధాతువు ననుసరించి, 'ఇది' అనే సంస్కృత ధాతువుకు 'పరమైశ్వర్యం' అని అర్థం. పరమైశ్వర్య సంపన్నుడు 'ఇన్ద్రుడు'. ఈశ్వర భావమే ఐశ్వర్యం. సర్వోన్నతుడు, సర్వశాసకుడు, తన విభూతులతో (ఐశ్వర్యాలతో) విశ్వమంతా నిండినవాడు - ఇన్ద్రుడు. అందుకే విష్ణువు ఇన్ద్ర శబ్దవాచ్యుడు.
దీనిని బలపరుస్తూ 'మహత్' శబ్ద ప్రయోగం. సర్వోన్నతమైన, పరిపూర్ణ ఐశ్వర్యవంతుడు - పరబ్రహ్మ - అని 'మహేన్ద్ర' నామం వ్యక్తీకరిస్తోంది. ఈశ్వరులకు ఈశ్వరుడు ఈతడు.

2. **ఇన్ధే ఇధ్యతే వా తేజోభిరితి ఇన్ద్రః.**
మహోద్భుతమైన, సర్వాధిక తేజస్సుతో జ్వలించు (ప్రకాశించు)వాడు ఇన్ద్రుడు. అపరిమిత తేజశ్శాలి. ఆ తేజస్సుతోనే - విశ్వమంతా దీపిస్తున్నది.

3. సూర్యునికి కూడా 'ఇన్ద్ర' శబ్దం వాడబడింది. ఐశ్వర్య తేజస్సులు కలిగిన సూర్యరూప విష్ణుని సూర్యకిరణాలలో అత్యధిక తేజోమయ కిరణాలకు 'ఇన్ద్ర' కిరణాలని పేరు. అందుకే మధ్యాహ్నకాల సూర్యశక్తిని 'ఇన్ద్రు'నిగా వర్ణించాయి వేదాలు.

య ఇన్ద్రో భూత్వా తపతి మధ్యతో దివమ్ ॥ (అథర్వవేదం)

మహేన్ద్రుడైన విష్ణువు మనలను అనుగ్రహించాలని శ్రుతులు బహుధా ప్రార్థించాయి. తేజస్సు, ఐశ్వర్యాల పరంగా మహేన్ద్ర శబ్దాన్ని ఉపయోగించాయి.

రశ్మిభిర్నభ ఆభృతం మహేన్ద్రా ఏత్యావృతః (అథర్వవేదం)

ఉపయామ గృహీతోసి మహేన్ద్రాయ వైష తే యోని మాహేన్ద్రాయ త్వా (యజుర్వేదం)

శన్న ఇన్ద్రో బృహస్పతిః శన్నో విష్ణురురుక్రమః (ఋగ్వేదం)

పరమైశ్వర్య సంపన్నుడు కనుక –

వసుదః .. 269

1. సంపదలిచ్చువాడు.

సర్వజీవులకు వారి ఉపాధులకు తగిన ఉపకరణాలను, ఆ ఉపకారణాల ద్వారా పోషణాది శక్తులను సమకూర్చే విశ్వవ్యాపకుడు విష్ణువు. **'అన్నాదో వసుదానః'** – పోషణకరమైన అన్నములను, తగిన సంపదలను ఇచ్చువానిగా పరమాత్మను బృహదారణ్యకోపనిషత్తు అభినుతించింది. యోగులకు కావలసిన సాధన సంపత్తిని కూడా ప్రసాదించే దయాళువు విష్ణువు. శిశువుకు మాతృస్తన్యాన్ని; ఫల వృక్ష సస్యాదులను, జల, రత్న, శిలాది సంపదలను విశ్వానికి ప్రసాదించిన విశ్వ నిర్వాహకునిలో 'వసుద' లక్షణం స్పష్టంగా గోచరిస్తోంది.

'ద్రవిణోదా దదాతు నో వసూనియాని శృణ్విరే ।' (ఋగ్వేదం)

'వసోర్వసోర్వసుదాన ఏధి వయం త్వేన్ధానస్తన్వం పుషేమ' (అథర్వవేదం)

ఇచ్చేవానిగానే కాక, ఇచ్చే సంపద కూడా తానే కనుక –

వసుః.. 270

1. సంపద రూపమైనవాడు.

సంపదలన్నీ విష్ణు రూపాలే. ఇచ్చే సంపదలో ఉన్నది కూడా ఈశ్వరుడే. ఈ తెలివి మనకు లభిస్తే ప్రతి సంపదలోనూ పరమేశ్వరునే చూడగలం. ఆయన స్వరూపమైన వాక్, శ్రవణ, దర్శన, స్పర్శన, గమనాది వసువులతో దేహం నడుస్తోంది. దానిని పోషించే ఆహార భోగాదులు కూడా విష్ణు రూప వసువులే. విష్ణువు వలన ఉనికి కలిగిన మనం, ఆ సంపదతోనే ఆయన ఉనికిని సంశయిస్తున్నాం. సంపదలలో కూడా సర్వేశ్వరుని చూడగలిగేవాడు ఆ సంపదను యోగంగా అనుభవించి, మహాయోగి కాగలడు.

'వసు' రూపుని వేదం బహు భంగుల భావించింది.

ఇళస్పదే సమిధ్యసే సనో వసూన్యాభర । (యజుర్వేదం)

వసోష్పతే నిరమయ మయ్యేవాస్తు మయి శ్రుతమ్ (అథర్వవేదం)

వసుర్వసుపతిర్హి కమస్యగ్నే విభావసుః । (ఋగ్వేదం)

విష్ణురూపమైన సంపద బహు విధాలుగా విశ్వంలో గోచరిస్తున్నది కనుక -

నైకరూపః.. 271

1. ఒకే రూపము లేనివాడు (బహురూపములు కలవాడు).

విశ్వమంతా ఏకతత్వమైన విష్ణుని రూపమే అయినా బహురీతులలో గోచరిస్తున్నది. బహు విధములుగా గోచరించే ఏకుని ఆ బహుత్వంలో దర్శించి పరవశించాలి.

'అఖిల రూపులు తన రూపమైన వాడు' (గజేన్ద్రస్తుతి)

తన 'నైకరూప' లక్షణంతో విశ్వమంతా ఎలా వ్యాపించాడో పరిశీలించాలి.

మన శరీరమంతా ఒకే రూపమని అంగీకరిస్తాం. కానీ ఇందులో ఎన్నో రూపాలున్నాయి. చేతులదో రూపం. కాళ్లదొక రూపం. మళ్లీ వాటిలో వేళ్ళు ఒక్కొక్కటీ ఒక్కొక్క రూపం. నేత్రాలదీ, శ్రవణాలదీ – ఇలా దేనికదే ప్రత్యేకం. అంతేకాదు – వివిధావస్థలలో వివిధ విధాలుగా మన రూపమే గోచరిస్తుంది. కోప, కామ, దుఃఖ, సుఖ, భయాది భావాలతో మన రూపంలోనే బహురూపాలు, అలాగే వాయువులో, అగ్నిలో, జలంలో – అన్నిటిలో ఈ 'నైకరూప' లక్షణం ప్రత్యక్షమౌతుంది.

।రూప్యతే రూపయతి రూపం।

రూపింపచేయునది (ప్రకటించునది), రూపింపబడేది (ప్రకటింపబడేది) –రూపం.

రూపం రూపం ప్రతిరూపో బభూవ తదస్య రూపం ప్రతి చక్షణాయ।
ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే యుక్తాహ్యస్య హరయః శతాదశ

॥ఋగ్వేదం॥

ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వాజాతాని పరితా బభూవ॥

(యజుర్వేదం)

2. **'నక్షత్రాణిరూపం'.** (శ్రుతి). ప్రకటింపబడే నక్షత్రాలన్నీ జ్యోతిర్మయుడైన విష్ణుని రూపమే. ఇందులో 'నైకరూప' లక్షణాన్ని పరిశీలించవచ్చు.

'జ్యోతీం షి విష్ణుః' అని విష్ణు పురాణం.

నక్షత్ర మండలాలన్నీ సమాన సంఖ్యాకం కావు. స్థూల దృష్టిగా అన్నీ ఒక గుంపుగా గోచరించినా ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క విధం. అశ్వినీ నక్షత్ర మండలంలో మూడు తారకలు, భరణిలో మూడు, కృత్తికలో ఆరు, రోహిణిలో ఐదు.... ఇలా జ్యోతిశ్శాస్త్రం చెబుతుంది. గ్రహాలలో కూడా స్వరూప, గతుల భేదాలున్నాయి. సూర్యచంద్రాదులు కూడా ఒక్కొక్క రాశిలో ఉన్నప్పుడు ఒక్కొక్క విధంగా భాసిస్తారు. విడివిడిగా వీటి ప్రయోజనాలు విశ్వ నిర్వహణలో అత్యంత ప్రాధాన్యాలు.

ఆ ప్రాధాన్యాలను అంగీకరిస్తూనే అన్ని రూపాలుగా ఉన్న ఒకే విశ్వరూపుని దర్శించగలిగితే – అది పరిమితులకు దొరకని –

బృహద్రూపః.. 272

1. అతిపెద్ద రూపము గలవాడు.

బ్రహ్మాండ పరీవ్యాప్తమైన విరాద్రూపుడు, **'నాన్తం నమధ్యం న పునస్తవాదిం'** అని తుది మొదలు నడుములు కానరాని తేజోమయ స్వరూపాన్ని అర్జునాదులకు దర్శింపచేశాడు. విశ్వ వ్యాపకుడు మాత్రమేకాక, విశ్వాతీతుడు కూడా అయిన విష్ణుని బృహద్రూపం ఊహాతీతం.

వరాహ, నృసింహ, త్రివిక్రమాది రూపాలలో కూడా ఈ బృహత్తత్త్వాన్నే స్పష్టం చేశాడు.

యద్రోమ రన్ధ్ర పరిపూర్తి విధాన దక్షౌ
వారాహ జన్మని బభూవ రమీ సముద్రాః ।(శ్రీకృష్ణ కర్ణామృతం)

వరాహరూపంలో సమస్త సముద్రజలమూ ఆ తనువులోని ఒక్కో రోమ కూపాన్ని తడపడానికి కూడా సరిపోలేదు. నారసింహరూపంలో స్వామి సింహవదనపు జూలుకదలికతో గ్రహతారకలే రాలి పడిపోయాయి. రామ, కృష్ణాదులు ప్రదర్శించిన విశ్వరూపాలు పురాణాలలో బహుధా వర్ణితాలు. ఆతడు ఏ రూపంలోనైనా బృహద్రూపుడే.

'ద్యావా పృథివ్యోరిద మన్తరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః
– 'భూమ్యాకాశాల మధ్యనున్న దిక్కులంతటా నీవొక్కడవే వ్యాప్తి చెంది యున్నా'వని గీతలో విశ్వరూపాన్ని చూసిన అర్జునుడు కీర్తించాడు.

యస్య భూమిః ప్రమాన్తరిక్షమథోదరమ్।
దివం యశ్చక్రే మూర్ధానం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణేనమః।
యస్య సూర్యశ్చక్షుశ్చన్ద్రమాశ్చ పునర్నవః।

అగ్నిం యశ్చక్ర ఆస్యం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః।

అని 'అథర్వవేదం' ఆ బృహద్రూపుని అభివర్ణించింది.

బృహద్రూపుడైన ఆ విష్ణువే తన చైతన్యంతో సర్వజీవులయందు ప్రవేశించినవాడై –

శిపివిష్టః .. 273

1. యజ్ఞ పశువులయందు ప్రవేశించినవాడు.

   'యజ్ఞోవై విష్ణుః పశవశ్శిపిః యజ్ఞ ఏవ పశుషు ప్రతితిష్ఠతి'.

   (తైత్తిరీయసంహిత)

   'యజ్ఞ స్వరూపుడు విష్ణువు. యజ్ఞ పశువులు శిపులు. వాటియందు యజ్ఞమే ప్రతిష్ఠితమైనది'

   విశ్వమంతా యజ్ఞరూపం. దానిలో బహు కర్మపాశాలతో బంధింపబడిన జీవులు పశువులు. పరమేశ్వరుడు గమనించు (పశ్యతి) వారు పశువులు.

   బ్రహ్మాద్యాః స్థావరాన్తశ్చ పశవః పరికీర్తితః।
   తేషాం పతిత్వాద్దేవేశః శివః పశుపతిః స్మృతః॥

   బ్రహ్మదేవుని మొదలు స్థావర జగం వరకు సర్వులు పశువులే. వారిని పాలించే పశుపతి పరబ్రహ్మ. (ఆతనిని శివుడని వర్ణించింది శివపురాణం. శివుని నామాలలో 'శిపివిష్ట' నామం ఒకటి) **'నమః శిపివిష్టాయచ'** అని రుద్ర నమకమంత్రం. వస్తుతః ఒకే పరమేశ్వరుడే అక్కడ శివుడని, ఇక్కడ విష్ణువని కీర్తించబడుతున్నాడు. ఏదేమైనా వైదిక యజ్ఞ విజ్ఞానానికి సంబంధించిన నామమిది.

   సర్వజీవులలో ప్రవేశించి వారి కర్మ పాశములను నిర్వహించి నడిపించే వ్యాపకుడు విష్ణువు.

2. **శిపయః రశ్మయః.** 'శిప'లనగా రశ్ములు. వాటియందు ప్రవేశించి వ్యాపించిన కాంతి, శక్తి రూప సూర్య చైతన్యమే 'శిపివిష్టుడు' – సూర్య నారాయణుడు.

విశ్వంలో జీవులందరూ కిరణములవంటివారు. మూలమైన చైతన్యమయ బింబం పరమాత్మ విష్ణువు. బింబ కాంతియే (శక్తియే) కిరణములందు ఉన్నట్లుగా విష్ణు చైతన్యమే జీవులయందు దీపిస్తున్నది. మొదటి అర్థంతో ఇది సమన్వయమౌతోంది. కిరణాలు 'నైకరూపః'. ఈ కిరణములన్నిటితో కూడిన సూర్యబింబం 'బృహద్రూపః'. ఇవి నామాల వరుసలోని ఔచిత్యం.

సూర్యకిరణ శుక్తులకు సంబంధించిన వైదిక విజ్ఞానం అపారంగా ఉంది. ఆ కిరణాలలోనే పోషక, ప్రాణధారక, కాంతి, వర్ణకారక, ఉష్ణతాది బహుశక్తులున్నాయి. వాటి నుండి ఆ శక్తులను గ్రహించే భూమ్యాది గ్రహాలలో బహుస్వరూపాలు ఏర్పడుతున్నాయి. పోషించబడుతున్నాయి. పరమేశ్వర చైతన్యం సూర్యమండలమందు నిండి – అగ్నినీ, చన్ద్రునీ కూడా ప్రకాశింపచేస్తూ, తన కిరణములలో బహువిధ శక్తులను నింపి భువనాలను పోషిస్తోంది. ఈ దర్శనాన్నే ఈ నామం వివరిస్తోంది.

'రశ్మయస్తస్యసన్తతా – సన్తాపయతి స్వన్దేహ మాపాదతలమస్తకః।',

హృదయకుహరంలోనున్న పరమేశ్వర శక్తి రశ్ములే దేహమంతా చైతన్యమయం చేస్తున్నవని మంత్ర పుష్పం సంభావిస్తోంది. ఆ విధంగా కూడా జీవులయందు వ్యాపించిన శిపివిష్టుని గ్రహించవచ్చు.

కిమిత్ తే విష్ణో పరిచక్ష్యం భూత్
ప్ర యద్ ఏవక్షే 'శిపివిష్టో' అస్మి ॥ (ఋగ్వేదం)

'నీ నామాన్ని పరికించి పలుక దలచాను – శిపివిష్టుడవ'ని... అంటూ ఋగ్వేదం ఈ నామం చాలా విజ్ఞానయుక్తమైనదిగా సూచించింది.

విష్ణుః శివిష్ట ఉరావాసన్నో విష్ణుర్నరన్ధిషః ॥ యజుర్వేదం॥

ఇంకా, ఈ నామాన్ని గూర్చి స్మృతి తెలియచేస్తూ –

శైత్యాచ్ఛయన యోగాచ్చ శీతవారి ప్రచక్షతే।
తత్పానా ద్రక్షణా చ్చైవ శిపయోరశ్మయో మతాः।
తేషు ప్రవేశాద్విశ్వేశः శిపివిష్ట ఇహోచ్యతే॥

శి–పి–విష్టః. శైత్య (చల్లదనం) లక్షణం, శయనలక్షణం (విష్ణువు శయనించుట) వలన జలములకు 'శి' అని సంజ్ఞ. వాటిని పానం చేసి (గ్రహించి), పాలనం చేసే ధర్మం చేత కిరణములకు 'పి' అని సంజ్ఞ. "జలములను పానం, పాలనం చేసేవి – శిపులు (రశ్ములు)". వాటియందు ప్రవేశించిన విశ్వేశుడే శిపివిష్టుడు.

మహాభారతం శాంతి పర్వంలో –

శిపివిష్టేతి యచ్చాన్యపీతం రోమ చ యద్భవేత్।
తేనాపి విష్టం యత్కిఞ్చిత్ శిపివిష్టం హి తత్స్మృతమ్॥

"స్వామి రోమములే (రశ్ములు) స్వర్ణ వర్ణములలో ఉన్నవి. వాటితో విశ్వాన్ని ప్రకాశింపచేస్తున్న శిపివిష్టుడు – మహా తేజః స్వరూపుడు."

'తేజోభిరాపూర్య జగత్సమగ్రం' (గీత) – సమస్త జగత్తును తన తేజస్సుతో నింపిన బృహద్రూపుని వర్ణన 'శిపివిష్ట' నామంతో స్పష్టమౌతోంది. ఆ తేజస్సుతోనే అన్నిటినీ ప్రకాశింపచేస్తూ, చలింపచేస్తూ, ప్రకటింపచేసేవాడు –

ప్రకాశనః .. 274

1. సర్వమును ప్రకాశింపచేయువాడు.

తన ప్రకాశ ధర్మముతో అన్నిటినీ చైతన్యవంతం చేసేవాడు. నేత్రాదులలో వెలుగై ఉన్నవాడు – నేత్రాదులకు కాంతిని గోచరింపచేయువాడు. పార్థివ శరీరాన్ని అంతరాత్మగా ప్రకాశింపచేస్తున్నదీ ఆతడే.

ఇదం స్వరిదమిదాస వామమయం ప్రకాశ ఉర్వన్తరిక్షమ్ ॥ (ఋగ్వేదం)

తన వ్యాపక తేజ స్వరూపాన్ని – చూడగలిగే దృష్టినిచ్చి తనను తాను ప్రకాశం చేసినవాడు. అర్జునునకు –

దివ్యం దదామి తే చక్షుః పశ్యమే యోగమైశ్వరమ్। ...
... సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ॥ (భగవద్గీత)

"నా సర్వవ్యాపక పరమేశ్వర స్వరూపాన్ని చూడగలిగే దివ్య దృష్టిని నీకిస్తున్నాను, దర్శించు" అని అతనికి యోగదృష్టిని ప్రసాదించి – "ఇతరులు చూడలేని నా ఈ విశ్వరూపాన్ని చూడగలిగావు" అని భగవానుడు అర్జునుని అనుగ్రహించాడు.

సర్వ ప్రకాశుడే తన ప్రకాశంతో తేజో బలాదులను విశ్వాని కందిస్తున్నందున –

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః।
ఋద్ధః స్పష్టాక్షరో మన్త్రశ్చన్ద్రాంశుర్భాస్కరద్యుతిః॥...30

275. ఓజస్తేజోద్యుతిధరః, 276. ప్రకాశాత్మా, 277. ప్రతాపనః।
278. ఋద్ధః, 279. స్పష్టాక్షరః, 280. మన్త్రః,
281. చన్ద్రాంశుః, 282. భాస్కరద్యుతిః॥

ఓజస్తేజోద్యుతి ధరః.. ——— 275

1. బల, శౌర్య, దీప్తులను ధరించెడివాడు.

సమస్త విశ్వాన్నీ భరించగలిగే బలానికి 'ఓజస్సు' అని పేరు. దానితో కూడిన చైతన్యం 'తేజస్సు', ఆ రెండింటినీ ప్రకాశింపచేసే శక్తి 'ద్యుతి'. ఈ మూడు గలవాడు.

'ఉజ్జతీతి ఓజో బలం' అని వ్యుత్పత్తి. **"యద్బలం కామరాగ వివర్జితం ఐశ్వరం జగద్విధారణ సామర్థ్యం"** అని గీత శాంకరభాష్యం. కామ రాగాదులచే కలుషితం కాని, జగత్తును ధరించే సమర్థత గల ఈశ్వర బలం ఓజస్సు.

తేజః శౌర్యాదయోగుణాః. శౌర్యాదిగుణములు, చైతన్యము – 'తేజస్సు'. **ద్యుతిః – 'ద్యు అభిగమనే', 'ఆభిముఖ్యేన గమనమ్'** – అనే ధాతువు ననుసరించి, 'అభిముఖంగా ప్రసరించునది'. ఉన్న తేజస్సు జగత్తునకు

అభిముఖంగా ప్రసరించితే ద్యుతి. అంతేకాదు 'అంతటా గమనం చేయునది' అని కూడా అర్థం. భగవానుని ఓజస్తేజస్సులు నిరాఘాటంగా అంతటా గమనం చేయగలవు. సూర్యాదులలోని వెలుగు ప్రాణులకు అభిముఖంగానూ, అంతటను గమనంచేసి వ్యాపించుతుంది గనుక దానికి 'ద్యుతి' అని పేరు.

ఈ మూడింటిలో విశ్వాన్ని జీవింపచేసే వ్యాపకుడు, జీవులను కూడా ఈ మూడింటితో నిర్వహిస్తున్నాడు.

'బలం బలవతాం చాహమ్', 'తేజస్తేజస్వినా మహమ్' అని భగవద్గీత.

2. జీవులలో ప్రాణబలమే ఓజస్సు. శరీరమంతా వ్యాపించిన తేజస్సే చైతన్యం. అది సర్వేంద్రియములలో ప్రకటింపబడుటయే ద్యుతి. జ్ఞాన లక్షణమే ద్యుతి – అనే భావాన్ని గ్రహిస్తే, జీవులలోని జ్ఞానమే దీప్తి. ఈ మూడింటిని(తో) ధరించే అంతరాత్మయే విష్ణువు.

తన బలంతో, శత్రువులను జయించే శౌర్యాది తేజస్సుతో, తన దీప్తిని ప్రదర్శించేవాడు.

ఓజోసి ఓజోమయిధేహి, తేజోసి తేజోమయిధేహి। (యజుర్వేదం)

ద్యుమాన్ అసి క్రతుమాన్ ఇన్ద్ర ధీరః। (ఋగ్వేదం)

"నీవు ఓజస్సువు. నా యందు దానిని ప్రసరించు. నీవు తేజస్సువు. నాయందు తేజస్సును అనుగ్రహించు." "ద్యుతివి, క్రతువువి (యజ్ఞస్వరూపుడవు), ఇన్ద్రుడవు, ధీరుడవు" అని శ్రుతి వచనాలు.

ఈ మూడింటితో సర్వులయందు ప్రకాశించువాడు –

ప్రకాశాత్మా .. 276

1. ప్రకాశ స్వభావుడు, స్వరూపుడు.

ప్రకాశమే తన స్వరూపమైనవాడు.

యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।

సూర్యుడు ఈ సర్వలోకమును ప్రకాశింపచేయునట్లుగా అన్నిటినీ దీపింప (జీవింప) చేయువాడు. దేహము ప్రకాశశీలం కాదు. అది జడం. అలాగే బుద్ధి, ప్రాణములు. వాటన్నిటి యందున్న ప్రకాశ స్వభావుడే ఆత్మ. అదే విష్ణువు. మన ఇంద్రియాలలో ప్రసరించే ప్రకాశాన్ని బట్టి, ఆ ప్రకాశ స్వభావుని గుర్తెరగాలి.

ఈ 'ప్రకాశాత్మా' సర్వమున వ్యాపించినవాడు.
తన అవతారాదులలో కూడా ఈ ప్రకాశ స్వభావాన్ని ప్రదర్శించాడు.

త్వమేవ పుణ్డరీకాక్ష! సర్వస్య జగతః ప్రభుః।
తస్మాన్మే యాదవ శ్రేష్ఠ! ప్రసాదం కర్తుమర్హసి।। (భారతం. ఉద్యోగ పర్వం)

ధృతరాష్ట్రుని సైతం అనుగ్రహించి తన బృహద్రూపాన్ని చూడాలని కృష్ణునితో ఆ రాజు అన్న మాటలు : "ఓ పుండరీకాక్ష! సమస్త లోకానికి మీరే ప్రభువు కాన నన్ను అనుగ్రహించాలి." ఈ మాటతో ఆ అంధుని కన్నులకు సైతం ప్రకాశాన్నిచ్చి, తన ప్రకాశ స్వరూపాన్ని చూపించాడు. రణరంగంలో అర్జునునకు చూపించిన స్వామి విశ్వరూపం–

దివిసూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా।
యదిభాస్సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మనః।। (గీత)

'ఆకాశంలో ఒకేసారి వేలకొలది సూర్యులు ఉదయించినట్లుగా ఉన్న ప్రకాశవంతమైన స్వరూపమా మహాత్ముని.'

వేదాహమేతం పురుషం మహాన్తం
ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్ ।। (యజుర్వేదం)

అంధకారానికి ఆవల వెలిగే అఖండ ప్రకాశమతడు.
ఆ దీప్తితో లోకాలను తపింపజేయగలవాడతడే –

ప్రతాపనః .. 277

1. బాగా తపింపచేయువాడు.

'శిపివిష్టః' నామం నుండి కాంతి (సూర్యాది) స్వరూపుడైన విష్ణువును చెబుతున్నారు. ఆ కాంతిలో ప్రకాశ లక్షణం వెనుకటి నామంలోను, ప్రతాప లక్షణం ఈ నామంలోను వ్యక్తమౌతున్నాయి.

"భాసస్తపోగ్రాః ప్రతపన్తి" అని ఆ ప్రకాశ స్వరూపుని వర్ణించాయి స్మృతులు. ఈ తాపన లక్షణం చైతన్యానికి సహజం.

"సంతాపయతి స్వన్దేహ మాపాద తలమస్తకః" - తనువంతా వేడిమి, విశ్వమంతా వెచ్చదనం కలిగించే చైతన్యమిది. ఈ తాపన లక్షణంతోనే సూర్యుడు జలాలను గ్రహించి వర్షరూపంగా అందిస్తున్నాడు.

మాతృగర్భంలో తాపం జీవునికి ఆకృతినిస్తోంది. భూగర్భంలోని తాపం సస్యాదులను ఉత్పత్తి చేస్తోంది.

తపోరూప తాపం యోగుల కర్మ సంచయాన్ని దహించి కైవల్యప్రదాయక మవుతోంది. వర్చస్సును ప్రసాదిస్తోంది. ఇలా నారాయణుని ప్రతాపమే విశ్వమంతా బహువిధాల పరీవ్యాప్తమై ఉంది.

"ఏమని పొగడవచ్చు ఈతని ప్రతాపము" (అన్నమయ్య)

దనుజశక్తుల్ని దునుమిన ప్రతాపశాలిగా తన అవతారవైభవాల్ని ప్రకటించిన వాడతడే.

వృషా విజజ్ఞే జనయన్నమర్త్యః ప్రతపన్ జ్యోతిషా తమః॥ (ఋగ్వేదం)

ఇన్ని విధముల పూర్ణ శక్తులను ప్రకటించినవాడు కనుక -

బుధ్ధః .. 278

1. సమృద్ధుడు. పూర్ణుడు.

సర్వము పూర్ణముగా గలవాడు. వెలితి, లోటు లేని నిండుతనమే విష్ణువు. సర్వ నిర్వాహక గుణైశ్వర్యాలు సమృద్ధిగా కలిగినవాడు. ధర్మ జ్ఞాన

వైరాగ్యాదులచే పరిపూర్ణుడు కనుక బుద్ధుడు. 'నిరంతరం సముద్రం వలె సమృద్ధుడు.' బుద్ధ లక్షణమే 'సమర్థత'. దీనిని సర్వులయందు వ్యాపింపచేసి, విశ్వమును నిర్వహిస్తున్నవాడు.

2. అర్థుల (భక్తుల) అర్థములను పరిపూర్ణం చేయువాడు.

అత్ బుధ్నోతి హవిష్కృతమ్॥ (ఋగ్వేదం)

ప్రవృద్ధో దస్యుహాభవన్॥ (ఋగ్వేదం)

కాంతిరూపంగానే కాక, శబ్దంగా కూడా సమృద్ధి కలిగినందున –

స్పష్టాక్షరః.. 279

1. స్పష్టమైన అక్షర స్వరూపుడు.

శబ్ద బ్రహ్మ స్వరూపుడు విష్ణువు. తొలుత ఈ నాదం 'ఓం'కారంగా వ్యక్తమయింది. ఉదాత్తంగా స్పష్టంగా వ్యక్తమైన ఈ ప్రణవం నుండి సర్వాక్షరాలు ఉద్భవించాయి. ఆ 'ఓం'కారమే నారాయణుని స్వరూపం. **'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ'** అని శ్రుతి వచనం. 'ఓం' అనే ఏకాక్షరమే బ్రహ్మ. బ్రహ్మము స్పష్టమయ్యే అక్షరమే 'ఓంకారం'.

'త్వమక్షరే పరమేవ్యోమన్' (శ్రుతి)

2. ఉచ్చరించే వాక్కుకి ఉండవలసిన లక్షణాలు. పై నామానికి (278) ఈ నామంతో అనుబంధం ఉంది. పలుకు 'సమృద్ధి'గా (బుద్ధం) ఉండాలి. స్పష్టమై, శాశ్వత ధర్మ (అక్షర-నాశరహిత) సహితమై ఉండాలి. ఆ లక్షణాలున్న వేదవాక్స్వరూపుడు స్పష్టాక్షరుడు.

3. అవతారమూర్తిగా స్వామి పలికిన మాటలు కూడా సర్వ సమృద్ధి కలిగి, స్పష్టమై, ధర్మ బోధకంగా ఉన్నవి. భావాన్నీ, సత్యాన్నీ, పూర్ణంగా తేటగా ఆవిష్కరించగలిగే అక్షర శక్తియే రమ్యమైనది. అది స్వామి విభూతి. రాముని స్పష్టాక్షర లక్షణాన్ని వాల్మీకి వర్ణించాడు.

తతస్స పురుషవ్యాఘ్రుః సఞ్జగాదపునస్స్వయమ్॥

తాన్దివ్యా మద్భుతాఞ్ఛ్రీ త్రామృద్ధిమత్తా మరిన్దమ ॥

(భారతం. ఉద్యోగపర్వం)

"శ్రీకృష్ణుడు దివ్యమైన, అద్భుతమైన, ఆశ్చర్యకరమైన, 'ఋద్ధి' (పూర్ణత్వం) కలిగిన మాటలను పలికాడు" అని వ్యాసుడు కృష్ణుని వాగ్విలక్షణతని వ్యాఖ్యానించాడు.

4. స్పష్టః - బద్ధః. అక్షరం నక్షరం నక్షత్రం వా।

అక్షరం - అంటే 'నశించనిది' 'నక్షత్రములు' అని కూడా అర్థాలు.

నక్షత్రములతో లోకమును బద్ధం చేసినవాడు.

యాని నక్షత్రాణి దివ్యంతరిక్షే అప్సు భూమౌయాని నగేషు దిక్షు॥
తమృతం చ సత్యం చ సూర్యశ్చ చన్ద్రశ్చ నక్షత్రాణి
చానువ్యచలన్ ॥ (అథర్వవేదం)

అలాగే తన బద్ధ (బంధన) శక్తితో జగత్తును అక్షరం చేసినవాడతడు.

ఆయుః పర్యంతం శరీరంలో అస్థి, స్నాయు మొదలైన వాటిని పదిలంగా బంధించి నడిపే చైతన్యమాతడు. అలాగే వృక్ష, గుల్మ, లతాదులు, సర్వప్రాణిజాతం - 'స్పష్టమైన నాశనరహిత చైతన్యం' (స్పష్టాక్షరః)తోనే జీవిస్తున్నాయి.

ఆ చైతన్యమే నిత్యం మననం చేయదగినది - దివ్య శబ్ద రూపమైనది...

మన్త్రః .. 280

1. మననం చేయతగినవాడు.

మననం చేయవలసిన శబ్దాన్ని 'మంత్రం' అంటారు. దేనితో పరతత్వం మననం చేయబడుతుందో ఆ అక్షరం మంత్రం. 'స్పష్టాక్షర'మైన ప్రణవం ప్రథమ మంత్రం. దాని నుండి అక్షరాలు ఉద్భవించాయి.

'అమంత్ర మక్షరం నాస్తి', మంత్రంకాని అక్షరం లేదు. ఔషధం కాని మూలిక లేదు. ఏ మూలికని ఎలా వాడితే ఔషధమవుతుందో వైద్యునికి

తెలుసు. ఏ అక్షరాలని ఎలా సమకూర్చితే మంత్ర మావిర్భవిస్తుందో వేదానికి తెలుసు – వేదవేద్యుడైన విష్ణువునకు తెలుసు.

వేదవాక్యములకు మంత్రములని పేరు. ఋగ్యజుస్సామములనబడే వేదమంత్రములు నారాయణుని స్వరూపాలు.

అవికాక – మహర్షులు తపస్సుతో ఆవిష్కరించిన వివిధ శబ్ద శక్తులు తంత్ర శాస్త్రాలలో బహుమంత్రాలుగా భాసిస్తున్నాయి. మంత్రంలోని శబ్ద శక్తి ప్రకంపనమే, విశ్వంలోని దేవతా చైతన్యాన్ని జాగృత పరచి ఆవిష్కరిస్తుంది. జలాశయంలోని నీటిని కలశంతో గ్రహించినట్లుగా, కలశాకృతిలో జలం గోచరించినట్లుగా – మంత్రంతో దేవతా చైతన్యం గ్రహింపబడి, ఆ శబ్ద శక్తితో దేవతాకృతి ఆవిర్భవిస్తుంది. "మంత్ర వాచ్యులే దేవతలు" అని వేదవిజ్ఞానం.

మంత్రమే దేవతా స్వరూపం. దేవతకు అభిన్నమైన మంత్రరూపుడు విష్ణువు.

2. **మననాత్ త్రాయతే ఇతి మన్త్రః, "మన్తారంత్రాయతే మన్త్రః"** మననం (చింతనం) చేసే వారిని రక్షించేది మంత్రం. అలా మననం చేసే వారిని కాపాడే దయాళువు విష్ణువు.

3. **'మన జ్ఞానే' 'మన అవబోధనే' – మన్యతే మనుతే అనేనేతి మంత్రః,** 'మన' అనే సంస్కృత ధాతువుకి 'జ్ఞానము' 'తెలుసుకొనుట' – అని అర్థాలు.

దేని ద్వారా జ్ఞానము, తెలుసుకొనుట సిద్ధిస్తాయో అది మంత్రం. అందుచేత జ్ఞానమునకు సాధనలైన వేద వాక్యాలను మన్త్రాలన్నారు. విశ్వమంతా ఈ జ్ఞాన కారక శక్తితో విష్ణువు వ్యాపించుట చేత జీవుల బుద్ధీంద్రియాలకు 'ఎరుక', స్పృహ' అనేవి కలుగుతున్నాయి.

"అపక్రామన్ పౌరుషెయాద్ వృణానోదైవ్యం వచః।"(అథర్వవేదం)

"యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మా దపాకషన్।" (అథర్వవేదం)

"ఋచః సామాని యజూగ్ంషి" "ఋచఃసామానిజజ్ఞిరే ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్" (అథర్వవేదం)

– మొదలైన వేద వాక్కులు స్వామి యొక్క మంత్ర స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి.

శబ్దశక్తికి, కాంతి శక్తికి మూలమైనవాడతడు. శబ్దానికి కాంతిని ప్రచోదనం చేసే శక్తి, కాంతికి శబ్దాన్ని పలికించే శక్తి ఉన్నాయని వైదిక విజ్ఞాన దర్శనం. విష్ణు స్వరూపుడైన సూర్యుని కిరణ జాలాలలోనే ఋగ్యజుస్సామములున్నాయని వేద గ్రంథాలు విశ్లేషిస్తున్నాయి.

ఋద్ధః, స్పష్టాక్షరః, మన్త్రః – అనే నామాలు శబ్ద శక్తిని తెలియచేస్తుంటే, అటుపై రెండు నామాలు కాంతి శక్తులను తెలియచేస్తున్నాయి. నిజానికి – మంత్ర సాధన వల్ల జాగృతమయ్యే చైతన్యకాంతి పుంజాలను, తరువాతి రెండు నామాలు *(చన్ద్రాంశుః, భాస్కరద్యుతిః)* వ్యక్తం చేస్తున్నాయి. కేవలం కాంతి వర్ణన చేసే నామాలు కావివి. మంత్రానుబంధంతో గోచరించే దేవతా తేజస్సు విశేషాలే –

చన్ద్రాంశుః .. 281

1. ఆహ్లాదకరమైన కిరణజాలముల స్వరూపుడు.

'చది ఆహ్లాదే దీప్తౌ' అనే ధాతువు ననుసరించి 'చన్ద్రకాంతి' ఆహ్లాద దీప్తులకు ఆలవాలం. స్వామి తనువు నుండి ప్రసరించే కాంతి కిరణాలు చంద్ర కిరణాలవలె ఆహ్లాదంగా, ఆప్యాయనంగా (రసవంతంగా) దీపించుతున్నాయి.

'చన్ద్ర కాన్తాననం రామం అతీవ ప్రియదర్శనమ్' – అని వాల్మీకి శ్రీరాముని సౌన్దర్యాన్ని చన్ద్రకాన్తితో పోల్చాడు. ప్రసన్నత, ఆహ్లాదం, వర్చస్సు కలబోసిన పూర్ణత్వం చేత ఆ వర్ణన.

మంత్రానుష్ఠానం వలన దేవతావిర్భావమై మనస్సుకి కలిగే ప్రసన్నతా

భావమే ఆనంద రసానుభవం. తాపత్రయములు శాంతించటం ' చన్ద్రాంశు'వుగా వర్ణితమైనది. ఆ అనుభవ స్వరూపుడే విష్ణువు.

2. 'అంశు' శబ్దం వివిధ ధాత్వర్థాలతో కూడి – 'విభజన, వ్యాప్తి, సంఘాతం (కలిపేది, కలిసేది)' అనే అర్థాలనిస్తుంది. విడివిడిగా రేఖలుగా వస్తున్నా అంతా ఒకటై కలిసి వ్యాపించే లక్షణం ఉండటం చేత కిరణాలను 'అంశువు'లు అన్నారు. ఆహ్లాదకరంగా విభజన, వ్యాప్తి, కలుపుట చేయువాడు 'చన్ద్రాంశుః'.

విశ్వమంతా చైతన్య కిరణాలను ఉపాధుల కనుగుణంగా విభజించి, వాటిని వ్యాపింపచేసి, ఆ శరీరాదులలో ఏకత్వంగా నిండి ఆనందింప (జీవింప) జేసే విష్ణువు చన్ద్రాంశువు. (**ఆహ్లాదనే ప్రాణితి** – అనే ధాత్వర్థాన్ని అనుసరించి ఆ అంశువులతో జీవింపచేయువాడు అని అర్థం).

ఆహ్లాదకరమైన ప్రసన్నతతో, స్పష్టమైన వెలుగుగా ఉన్నవాడు కనుక–

భాస్కర ద్యుతిః.. 282

1. సూర్యుని వలె ప్రకాశించువాడు.

ఆహ్లాదింప (జీవింప) జేసే ఆ ప్రసన్న కాంతులలో అమృతత్వ శక్తితో పాటు, సత్యాన్ని తేట పరచే జ్ఞాన శక్తి ఉంది. మంత్రానుష్ఠానం వల్ల లభించే భగవదనుభూతిలో ఆనంద రూప అమృతానుభూతే కాక, జ్ఞాన రూప సత్యస్ఫురణ ఉంటుంది. అదే 'సచ్చిదానందం' 'జ్ఞానానందం' అని శాస్త్రాలు బహుధా వర్ణించిన విశేషం. ఆనందాన్నీ తాపత్రయశాంతినీ 'చన్ద్రాంశుః' తెలియచేస్తే, అఖండ జ్ఞానానుభవాన్ని 'భాస్కరద్యుతి' నామం స్పష్టపరుస్తోంది.

నారాయణుని స్వరూపాన్ని వర్ణిస్తూ – **"కోటి సూర్య ప్రతీకాశం, కోటి చన్ద్ర సుశీతలం"** అని పురాణాలు వర్ణించాయి.

యోగులైన భక్తులకు గోచరించే విష్ణు స్వరూపం అత్యంత స్పష్టమై సూర్యకాంతిలా భాసిస్తున్నా, అందులో తాపహరణమైన ప్రశాంత చన్ద్ర లక్షణం ఉన్నదని ఈ రెండు నామాలలో చక్కగా నిబంధించారు.

2. ప్రతాపవాచకంగా ఈ నామాన్ని చూస్తే -

శరజాలాంశుమాన్ శూరః కపే! రామ దివాకరః।
శత్రు రక్షోమయంతోయముపశోషం నయిష్యతి॥

"బాణ సమూహాలనే కిరణాలను వెదజల్లుతూ, రాముడనే సూర్యుడు, రాక్షసులైన శత్రువులనే జలాన్ని ఇంకించగలడు" అని శ్రీరాముని భాస్కరద్యుతిని సీతమ్మ హనుమంతునికి వర్ణించి చెప్పినది (రామాయణం. సుందరకాండ).

భక్తులకు 'చన్ద్రాంశువు'గా చలువ కలిగిస్తూ, దుష్టులకు 'భాస్కరద్యుతి'గా చూడ శక్యంకాని తేజస్సుతో గోచరించే విష్ణువు.

ఏవమేషోఽసురాణాఞ్చ సురాణాఞ్చైవ సర్వశః।
భయాఽభయకరః కృష్ణః సర్వలోకేశ్వరః ప్రభుః॥ (భారతం)

"అసురులకు భయంకరుడు, దేవతలకు అభయంకరుడు సర్వలోకేశ్వరుడైన శ్రీకృష్ణుడు."

3. మంత్ర విజ్ఞానపరంగా చూస్తే మంత్రంలో సోమసూర్యతేజఃస్వరూపాలు నిహితమై ఉంటాయి. ఆ రహస్యాన్ని ఈ శ్లోకపాదంలోని నామాల వరుస చక్కగా ఆవిష్కరిస్తోంది. మంత్ర స్వరూపదర్శనమే ఈ నామాలు. మంత్రకాంతి మూలమైన ఆతడే చన్ద్రాదుల రూపంలో ఉన్నవాడు కనుక-

అమృతాంశూద్భవో భానుః శశబిన్దుః సురేశ్వరః।
ఔషధం జగతః సేతుః సత్యధర్మ పరాక్రమః॥... 31

283. అమృతాంశూద్భవః 284. భానుః 285. శశబిన్దుః
286. సురేశ్వరః 287. ఔషధం 288. జగతః సేతుః
289. సత్యధర్మ పరాక్రమః॥

అమృతాంశూద్భవః .. 283

1. అమృత కిరణుని కలిగించినవాడు.
   చంద్రుని'వలె', సూర్యుని 'వలె' – అంటూ వర్ణించినా, సూర్యచంద్రులకు అతీతుడై వారి పుట్టుకకు కారణమైనవాడు.
   'అమృతాంశువు' అంటే చన్ద్రుడు. చంద్ర కిరణాలలో దేవతలను, పితృ దేవతలను పోషించే అమృత శక్తి ఉందని వేద విజ్ఞానం. చన్ద్రకళలలో దాగిన అమృతశక్తులే సస్య, ఓషధులను కలిగించి జీవులకు అమృతమువలె పోషకాలౌతున్నాయి. అటువంటి అమృతాంశువును తన నుండి 'ఉద్భవింప' చేసి దేవతలను, జీవులను పోషింపజేస్తున్నవాడు.
   'చన్ద్రమా మనసోజాతః' – అని పురుషసూక్తం. చన్ద్రుడు ఆ పరమపురుషుని మనస్సు నుండి పుట్టాడు.
2. 'అమృత' శబ్దానికి 'రసం' (జలం) అని కూడా అర్థం. **"సోమో భూత్వా రసాత్మకః"** (భగవద్గీత) "నేను రసస్వరూపుడైన చంద్రుడనై..." అంటూ కృష్ణుని వచనం. రసమయమైన అంశువులతో ఉన్నవాడు చన్ద్రుడు. అతడిని **(ఉద్భావయతి వర్ధయతి ప్రకాశయతి)** ప్రకాశింపజేయువాడు విష్ణువు.
3. యోగపరంగా పరిశీలిస్తే – 'అమృత' శబ్దం రసానుభూతిని (అఖండానందం), 'అంశుః' (చిత్ శక్తిని) శక్తిని తెలియజేస్తున్నాయి.

యోగసిద్ధిలో సహస్రారమందు చిదేకరస స్వరూపంగా భాసించువాడు.

4. **'అంశ విభాజనే'** అని ధాతువు ననుసరించి 'అంశుః' అంటే విభాగం. జలమును (అమృతమును) విభజించి ఉద్భవించువాడు. జలముల ద్వారా జగత్తును కలిగించువాడు, వర్ధిల్లజేయువాడు – అని భావార్థం. జలము నుండే ఈ జగత్సృష్టిని ప్రారంభించడం ప్రాచీన సృష్టి క్రమ విజ్ఞానం. **'యా సృష్టిః స్రష్టురాద్యా'** – సృష్టికి మొదలి కారణమని కాళిదాసు మహాకవి జలం గురించి వివరించాడు.

రసమయుడైన చంద్రునికే కాక, సూర్యాది కాంతులకు కూడా మూలమితడే –

భానుః .. 284

1. ప్రకాశమును కలిగించువాడు (విస్తరింపజేయువాడు).

'తమేవ భాన్త మనుభాతి సర్వమ్' - 'స్వయం ప్రకాశకుడైన ఆయనను అనుసరించే సర్వము భాసిస్తున్నది'. వెలుగులన్నిటికీ మూలమైనవాడు.

'యస్యాదిత్యో భాముపయుజ్య భాతి'

'ఎవని కాంతిని ఉపయోగించి సూర్యుడు ప్రకాశిస్తున్నాడో' అని శ్రుతి వాక్యం.

ఆ కాంతియే తనయందు పొంది ప్రకాశించే చన్ద్రుడై –

శశబిన్దుః.. 285

1. శశము వంటి బిందువు కలవాడు – చన్ద్రుడు.

'శశాంకుడు' అని చన్ద్రునికి ప్రసిద్ధ నామం. 'శశము' అంటే 'కుందేలు' అని అర్థం. కుందేలు వంటి లాంఛనము కలవాడు చన్ద్రుడు అని పురాతన ప్రసిద్ధి. సూర్య నారాయణుడైన విష్ణువే చన్ద్ర రూపంతో తన విభూతిని సాక్షాత్కరింపజేస్తున్నాడు.

2. **శశానాం కుటిలగతీనాం బిన్దుః అపలపితా ఇతి శశబిన్దుః.** 'శశ' అంటే వక్ర గతి అని కూడా ఒక అర్థం. 'బిన్దుః' తొలగించువాడు అని ఒక భావం. 'వక్రగతిలో పోవువారిని (అధర్మవర్తనులను) హరించువాడు' అని అర్థాన్ని పరాశరభట్టు వ్యాఖ్యానించారు.
3. **'శశ ప్లుతగతౌ'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి – కదలిక గలవాటికి బిందువువంటివాడు. నలుదిక్కులా ప్రసరించడమే కదలిక. అదే వెలుగు. దానికి మూలస్థానం బిందువు. అన్ని కదలికలకీ ఏది మూలమో ఆ చైతన్యమే 'శశబిన్దుః'. శబ్దార్థాన్ని అనుసరించి విష్ణువును రూపింపచేసే ముఖ్యార్థమిదే. కదలి వ్యాపించే కాంతి కిరణాలకు మూలమైన జ్యోతి. బుద్ధిప్రాణ ఇన్ద్రియాలన్నిట ప్రసరించే చైతన్యానికి (కదలికలకు) మూలమైనది స్థిరమైన పరంజ్యోతి ఆత్మ. అదే శశబిన్దువు. అత్యంత సూక్ష్మమైనది కనుక 'బిన్దువు'గా వర్ణితం.

'నీవారశూకవత్తన్వీ భీతాభాస్వత్యణూపమా
**తస్యాఃశిఖాయాఃమధ్యే పరమాత్మ వ్యవస్థితఃఃః

సురేశ్వరః.. 286

1. సురలకు ఈశ్వరుడు.

బిందువు వంటి పరంజ్యోతి యొక్క కిరణముల వంటి శక్తి విశేషాలే దేవతలు. వాటిని నియమించే మూలజ్యోతి సురేశ్వరుడు. **(చిత్రం దేవానాముదగా దనీకం)** ఆత్మ యొక్క చైతన్యం ఇన్ద్రియాలయందు ప్రసరించి వివిధ ఇన్ద్రియాభిమాన దేవతలుగా వాటిని నియమిస్తున్నది. వాటిని పాలించే ఆత్మయే విష్ణువు.

2. శోభన దాతలు సురలు. వారికాశక్తి నిచ్చి జగత్తును నిర్వహింపచేయువాడు సురేశ్వరుడు. 'దాన-ఆదాన' – ఈ రెండు క్రియలను లోకక్షేమం కోసం నిర్వహించే వ్యవస్థే 'సుర' వ్యవస్థ. ఈ వ్యవస్థను వ్యాపింప చేసిన ఈశ్వరుడు విష్ణువు. ఉచ్ఛ్వాస దానం – నిశ్శ్వాస ఆదానం. అన్నం దానం. శక్తిగా మారి ఇన్ద్రియాలకు చేరుట ఆదానం. సృష్టిలో ప్రతిచోట ఈ దానాదాన వ్యవస్థ ఉన్నది. యజ్ఞముల ద్వారా తుష్టులై జగతికి వృష్ట్యాదులనిచ్చి శోభనము చేకూర్చే సురలను పాలించే దేవదేవుడు.

దేవో నః సవితా వసోర్దాతా వస్వదాత్। (యజుర్వేదం)

త్వం దాతా ప్రథమో రాధసామసి సత్య ఈశానకృత్।। (అథర్వవేదం)

సర్వ శుభంకరుడైన సురేశ్వరుడే, సకల అశుభ రూప వ్యాధులను హరించే –

ఔషధం.. 287

1. ఓషధుల శక్తి.

ఓషధీ సంబంధమైనది ఔషధం. పృథివిలో పలు ఓషధులు భగవదనుగ్రహ విశేషాలే. సోమ స్వరూపుడై ఓషధులను కలిగించువాడు విష్ణువని గీతా ప్రమాణం.

పుష్ణామి చౌషధీసర్వా స్సోమో భూత్వా రసాత్మకః.

"రసాత్మకుడనైన చన్ద్రుడనై సర్వ ఓషధులను పోషిస్తున్నవాడను నేను" అని పరమాత్మ వచనం.

'అమృతాంశూద్భవః' నుండి పరిశీలించుతూ వస్తే – ఓషధుల కారకుడై తదంతర్గత శక్తిని బహువిధ ఔషధాలుగా వ్యక్తం చేసే వాడితడే.

ఏకాగ్రతా మూల్యబలేనిలభ్యమ్
భవౌషధస్త్వం భగవాన్! కిలైకః,

"సంసారరోగ హరణానికి, ఏకాగ్రత అనే మూల్యంతో పొందదగిన మందువు నీవే."

2. **ఓషో దాహః పాకో వా. స ఓషో ధీయతేత్ర ఇతి 'ఓషధిః'. ఓషధేర్వికారః కర్మా వా ఔషధమ్.**

'ఓష' అనే శబ్దానికి దాహము (దాహం), పాకం అని అర్థం. అది దేనియందు ధరింపబడి ఉందో అది ఓషధి. ఆ ఓషధి యొక్క పరిణామము (వికారం) లేదా 'పని' ఔషధం. వివిధ విధములైన తేజస్సులను ధరించేవి ఓషధులు. ఆ తేజస్సుల చేతనే రోగాలను తొలగించుకోగలం. అలా ఆ ఓషధులు చేసే పనులు లేదా ఓషధుల నుండి తయారయ్యే పరిణామాలు ఔషధాలు.

పై శబ్దార్థంతో పరిశీలించితే – 'తేజస్సును ధరించే ఓషధుల స్వరూపంగా (కర్మగా) వ్యాపించినవాడు' అని అర్థాన్ని గ్రహించవచ్చు. మన జఠరంలో ఓషస్సును (అగ్నిని) ధరించే అగ్న్యాశయం ఉంది. **('అహం వైశ్వానరో భూత్వా).** అది అన్నాదులను పాకం చేస్తున్నది. (ఆ అన్నం కూడా అగ్నితో (ఓషస్సుతో) పచనమై వచ్చినదే కనుక అదీ ఔషధమే) సముద్రం బడబాగ్నిని దాచుకున్న ఓషధి. జఠరం జీర్ణకారక అగ్నిని దాల్చిన ఓషధి. సూర్యాత్మక ఓషస్సును (ధీయతే) దాల్చిన బ్రహ్మమే ఓషధి. ఆ ఓషధుల క్రియా విశేషంగా వ్యాపించిన చైతన్యమే ఔషధం. విశ్వమంతా నిరంతరం నిర్వహింపబడే ఔషధ కర్మ ఇది. ఇదే విష్ణు

స్వరూపం. దీనితోనే సర్వము జీవిస్తున్నది.

అవపతన్తీరవదన్ దివ ఔషధయస్పరి।

యం జీవమశ్నవామహై న స రిష్యాతి పురుషః ॥ (ఋగ్వేదం) వంటి సూక్తములలో ఋగ్వేదం వర్ణించిన, తేజస్స్వరూప ఔషధ విజ్ఞానం ఆధారంగా పై వాఖ్యానాన్ని గ్రహించవచ్చు.

విశ్వంలోని ఇన్ని ఔషధులకు ప్రధానమైన ఔషధ స్వరూపుడు విష్ణువు. సర్వౌషధులను ఫలవంతం చేయగలిగేది ఆ విష్ణుని స్మరణయే. నిజానికి ఆయన నామ, తత్త్వములే చాలు – మనకు ఔషధములై భవరోగాలను బాపుతాయి –

అన్నిటికి నిదె పరమౌషధము
వెన్నుని నామమె విమలౌషధము
చిత్తశాంతికిని శ్రీపతినామమె
హత్తిన నిజ దివ్యౌషధము
మొత్తపు బంధ విమోచనమ్మునకు
చిత్తజ గురుడే సిద్ధౌషధము
పరిపరి విధముల భవరోగములకు
హరిపాద జలమె ఔషధము
దురిత కర్మములు తొలగించుటకును
మురహరి పూజయె ముఖ్యౌషధము.
ఇల నిహపరముల ఇన్దిరావిభుని
అలరి భజించుటె ఔషధము
కలిగిన శ్రీవేంకటపతి శరణమె
నిలచిన మాకిది నిత్యౌషధము. (అన్నమయ్య కీర్తన)

విమలౌషధ, దివ్యౌషధ, సిద్ధౌషధ, ముఖ్యౌషధ, నిత్యౌషధ – స్వరూపుడే విష్ణువు.

4. తినడానికి చేదుగా ఉన్నా ఆరోగ్యానికి మంచిదని ఔషధాన్ని సేవించినట్లే, ఆచరించటానికి తాత్కాలికంగా అసౌకర్యంగా ఉన్నా శాశ్వత సుఖం కోసం ధర్మాన్ని ఆచరించాలి. ధర్మమే ఔషధం వంటిది. జీవుని అజ్ఞాన వ్యాధినీ, దుఃఖ రోగాన్నీ తొలగించి కైవల్యాన్నిచ్చే ధర్మం నారాయణుని స్వరూపం. లోక రక్షణ కోసం ఏర్పాటు చేసిన ధర్మ వ్యవస్థే విష్ణువు కనుక –

జగత్సేతుః.. 288

1. జగతికి వంతెన వంటివాడు.

'జగతి' అంటే 'సాగునది' అని అర్థం. దీనినిలా సాగనిచ్చే వ్యవస్థ 'సేతువు'. 'షిణ్ బంధనే' ధాతువుకి 'తున్' ప్రత్యయం చేరితే 'సేతుః' అని పదం కలిగింది. దీనికి 'బంధించునది', 'దాటించునది' అని అర్థాలను గ్రహించవచ్చు.

జీవుని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసుకువెళ్ళడానికి, ఆ పరమస్థితితో బంధం కావాలి. అదే 'ధర్మం'. ఇదే ఉన్నత గతికి హేతువు. దుఃఖాల నుండి దాటించేది. తాత్పర్యంగా– ధర్మమే జగతికి సేతువు. వర్ణాశ్రమాది విహిత ధర్మాచరణ ద్వారానే ఉత్తమ స్థితిగానీ, చివరకు కైవల్యంగానీ ప్రాప్తించుతాయి.

జీవుని ప్రగతికి హేతువైన ధర్మరూపసేతువుగా ఉన్న విష్ణువు, సాధనలో పండిన యోగికి జ్ఞానరూప సేతువుగా సంసార ప్రవాహం నుండి దాటిస్తున్నాడు.

2. ఒక దానితో ఒక దానికి బంధం వేసి, ఇటూ అటూ పయనం సాగించే పద్ధతిని 'సేతువు' అని భావించవచ్చు. విశ్వమంతా ఒకదాని నుండి ఒకటి ప్రసరించే ధర్మ వ్యవస్థ ఉంది.

ఏష సేతుః విధరణ ఏషాం లోకానామసమ్భే దాయ

(బృహదారణ్యక ఉపనిషత్తు)

"ఈ పరమాత్మయే లోకమర్యాదను చెడక పాలించు సేతువు వంటివాడు"

"శుభకృత్ శుభమాప్నోతి పాపకృత్ పాపమశ్నుతే"

శుభానికి శుభఫలం, పాపకర్మకి పాపఫలం ఇచ్చే సహజ ధర్మవ్యవస్థ (సేతువు) ప్రకృతిలో నిబద్ధం చేసినవాడు శ్రీహరి.

కర్మకీ ఫలానికీ సేతువు.

మన దేహంలో మూలాధారం నుండి సహస్రారం వరకు ఉన్న 'మేరు దండం' సేతువు. ముఖ్యనాడులు ప్రసరిస్తున్న సేతువిది. జీవి ఉన్నతికి సహకరించే శరీరం, శరీరధర్మం ఈశ్వరుని సేతుస్వరూపమే.

ఈ ధర్మస్వరూపం 'సత్యం', లక్ష్యం 'పరాక్రమం' కనుక –

సత్యధర్మపరాక్రమః .. 289

1. వ్యర్థముకాని ధర్మముతో అంతట వ్యాపించువాడు.

   ధర్మం సత్య స్వరూపమైనది. మారనిది సత్యం.

   జగతిలో ధర్మం శాశ్వతంగా ఉన్నది. ధర్మ శబ్దానికి 'స్వభావం, లక్షణం, పట్టి ఉంచేది' అని ప్రధానార్థాలు. స్వభావ లక్షణాలే ఒక దానిని పట్టి నడుపుతాయి. సూర్యుని వేడిమి వెలుగు, నక్షత్రాల తళుకు, చంద్రుని చలువ, ఇలా పంచభూతాల లక్షణాలు వాటికి స్వాభావికం. వాటి పట్టుతోనే నిత్యం జగతిని నిర్వహిస్తున్నాయి. వ్యాపిస్తున్నాయి. ఈ ధర్మం వాటిలో ఏనాడు మారదు. అలా మారని (సత్య) ధర్మంతో జగమంతా నిండినవాడు విష్ణువు.

2. జగతికి సేతువువంటి వేదాది ధర్మాలు సత్యమైనవి. వాటితోనే వ్యక్తి విజయం సాధించగలిగే పరాక్రమాన్ని సంపాదించుకోగలడు. సత్య, ధర్మాలు లేనప్పుడు పరాక్రమం (ఇతరులపై విజయం సాధించుట / లేదా, ఆక్రమించుట) సిద్ధించదు.

3. నారాయణుడు ఔషధం వలె దుష్టత్వ శిక్షణకు, శిష్టత్వ రక్షణకు ధర్మరూప

సేతువును పదిల పరచటానికై సత్యమైన (అమోఘమైన) ధర్మంతో పరాక్రమించే అవతారాలను ధరించాడు. శ్రీరామకృష్ణాది అవతారాలతో ఈ పరాక్రమాన్నే ప్రకటించి, ధర్మాప్రతిష్ఠాపన చేశాడు.

సః పృథివ్యా యే వా దివం సత్య ధర్మాన్వానట్ (యజుర్వేదం)

ఆ పరాక్రమంతోనే త్రికాలాలలోనూ త్రిలోకాలను నిర్వహిస్తున్న కారణం చేత –

భూతభవ్య భవన్నాథః పవనః పావనోనలః
కామహా కామకృత్కాన్తః కామః కామప్రదః ప్రభుః॥... 32

290. *భూతభవ్య భవన్నాథః* ***291.*** *పవనః* ***292.*** *పావనః*
293. *అనలః* ***294.*** *కామహా* ***295.*** *కామకృత్*
296. *కాన్తః* ***297.*** *కామః* ***298.*** *కామప్రదః* ***299.*** *ప్రభుః*

భూత భవ్య భవన్నాథః .. 290

1. మూడు కాలములకు నాథుడు.

భూత భవిష్య వర్తమాన కాలాలకు చెందిన భూతకోటికి నాథుడు.

నాథ శబ్దానికి అనేకార్థాలున్నాయి. 'నాథృ' ధాతువునకు –

యాచన – ఉపతాప – ఐశ్వర్య – ఆశిష్ను – అని అర్థాలు.

యాచింపబడువాడు, తపింపచేయువాడు, ఈశ్వరుడు (పాలకుడు), శాసించువాడు = నాథుడు.

మూడు కాలములలోని దేవతలు, భూతములు, మనుజాదులు అందరూ 'యాచించేది' సర్వ శక్తిమంతుడైన విష్ణువునే. అలాగే ఆతడే సర్వకాలములందు సర్వమును 'తపింపచేసే' తేజశ్శాలి. పాలన చేసే 'ఈశ్వరుడు'. 'శాసించే' గురువు – ధర్మ శాసన కర్త.

కాలంలో వారు మారుతూ వెళుతున్నా, తాను మాత్రం సర్వ కాలములకు

మారని స్వామియై మూడు కాలాలను, మూడు లోకాలను నిర్వర్తిస్తున్నాడు. దేశ దిక్కాల అవధులు లేని నాథుడతడు.

యో భూతం చ భవ్యం చసర్వం పశ్చాదధితిష్ఠతి ।
సర్వస్య చ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః ॥ (అథర్వవేదం)
పురుష ఏవేదం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్।
ఉతామృత్వస్యేశానః యదన్నే నాతి రోహతి॥ (యజుర్వేదం)

– అని వైదిక ప్రమాణాలు.

భూతభవ్యభవన్నాథః కేశవః కేశిసూదనః – అని మహాభారతం సభాపర్వంలో చెప్పిన శ్రీకృష్ణుని నామాలు. కదిలే కాలమంతటా నిండి కదిలి, కదిలించేవాడు –

పవనః .. 291

1. పవిత్రం చేయువాడు.

వాయు, అగ్ని, జలం, పృథివి ఇవి పవిత్రమైనవి. వీటి ద్వారా జీవులు శుద్ధులౌతున్నారు. వీరిలో 'పవన' శబ్దం వాయువుపరంగా రూఢి. **'పవనః పవతామస్మి'** (గీత).

'వాయుః పవిత్రం స మాపునాతు అగ్నిః పవిత్రం సమాపునాతు'
అని **'శ్రుతి'**.

అనస్థాః పూతాః పవనేన శుద్ధాః। (అథర్వవేదం)
తస్య తే పవిత్రపతే పవిత్రపూతస్య యత్కామః పునే తచ్ఛకేయమ్॥
(యజుర్వేదం)

2. **పునాతీతి గచ్ఛతీతి పవనః.** కదలువాడు.

వాయువుగా ప్రాణశక్తియై జీవులలో కదిలేవాడు, శుద్ధులను చేయువాడు పవనుడు. ఈ ధర్మంతో విశ్వమంతా వ్యాపించే పరమ పవిత్రుడు కనుక–

పావనః .. 292

1. పవిత్ర స్వరూపుడు.

పావనతా ధర్మం చేత అగ్ని, వాయువుల యందు వ్యాపించి సర్వులను పవిత్రులను చేసేవాడు. వాయువును కూడా కదిలించేవాడు.

భగవానుడు సర్వ కాలములందు సర్వజీవులను పవిత్రం చేసే నామ, రూప, గుణ, చరిత్రలు కలవాడు. ప్రాణాది రూపంగా అందరినీ కదిలించేవాడు.

'పావనః సర్వలోకానాం త్వమేవ రఘునందన'. అని రామాయణం శ్రీరాముని కీర్తించింది.

పవమాన స్సువర్జనః పవిత్రేణ విచర్షణిః ।
యః పోతా సపునాతు మా । (యజుర్వేదం)

కదలిక చేతనే పవిత్రం చేసే గుణం కలిగి ఉన్నవి – వాయువు, నదులు మొదలైనవి.

చలించే వాడేకాక, జ్వలించే పవిత్రుడు కూడా –

అనలః .. 293

1. అగ్ని స్వరూపుడు.

అనత్తీతి అనాః ప్రాణనః తాన్ లాతి ఆదత్త అనలః.

ప్రాణములను గ్రహించువాడు. ప్రాణాలను స్వీకరించి వ్యాప్తి చెందేవాడు. వాయువు (ప్రాణము)చే జ్వలించేవాడు. వాయు, వహ్నుల సఖ్యం ప్రసిద్ధం. ప్రాణములకు అవసరమైన అగ్ని స్వరూపుడు. జీవులలో తేజస్సుగా, ఉష్ణతాది ధర్మాలతో ఉన్నవాడు.

2. గన్ధాదులు లేని శుద్ధుడు. శబ్ద స్పర్శ రూప రస గన్ధాదులకు అంటని ఆత్మ స్వరూపుడు.'అగన్ధమరసమ్' అని శ్రుతి.
3. 'అలం' (చాలును) అనేది లేనివాడు.

'చాలుట' అనేది పరిమితి. ఏ పరిమితీ లేనివాడు అనలుడు. ఎన్ని కట్టెలున్నా 'చాలున'ని లేకుండా దహించగలడు అగ్ని. కాలే కట్టెలకు మితి ఉండవచ్చు. కాల్చే అగ్నికి లేదు.

'ఇంత' అని మితి చేయలేని అపరిమితుడైన విష్ణువు, అనలధర్మంతో అగ్నియందు వ్యాపించాడు. అగ్ని వలె కలిగించుట, దహించుట చేయగలిగి – జనులను కామాదులను దగ్ధం చేయగలిగే జ్ఞానదీప్తి కనుక –

కామహా .. 294

1. కామమును తొలగించువాడు.

'ఇచ్ఛ' 'ఏషణా' – అని కామానికి పర్యాయాలు. లోక వస్తు విషయాదులపై ఉండే 'కావాల'నే స్పందనకు కామం అని పేరు. జ్ఞానియైనవానికి అన్ని కామములను దహింపచేసే మోక్షకారకుడు విష్ణువు.

సర్వోన్నత శిఖరానికి చేరినవాడు మరి క్రిందకి చేరడు – చేరాలనుకోడు. అంతకు మించిన ఉన్నతత్వం లేదు కనుక పైకి చేరాలనీ ఉండదు. అలాంటి సర్వోన్నత స్థితియే విష్ణు స్థితి. ఆ పరంధామాన్ని చేరినవానికి ఇంక ఏ కోరికా ఉండదు. సర్వతృప్తి, ఆప్త కామ, ఆత్మారామ మొదలైన మాటలకు ఆ విష్ణు పదమే వాచ్యం. ఆ స్థితిని కలిగించేవాడు కనుక 'కామహా!'

అకామో ధీరో అమృతః స్వయంభూ
రసేన తృప్తో న కుతశ్చనోనః ॥ (అథర్వవేదం)
యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు
వయం స్యామ పతయో రయీణామ్ ॥ (ఋగ్వేదం)

కామం నుండి సంకల్పం – తద్వారా అనుకూలములందు రాగం,

ప్రతికూలములందు ద్వేషం... క్రమంగా జీవుడు ఆత్మస్థితి నుండి పతనమౌతాడు. అందుకే ముముక్షువులు ఆయనను ఆశ్రయించి, కామములను హరింపజేసుకుంటారు.

2. ఆశ్రితులలో పతనకారకమైన అధర్మ వాంఛలను తలలెత్తనీయకుండా చేయువాడు. దుష్టులైన రాక్షసాదుల కోరికలు లోకవినాశ హేతువులు కనుక, వారి కోరికలను సాగనీయకుండా విఘాతం కలిగించేవాడు. కోరికలు తొలగించే విష్ణు చైతన్యమే కోరికలను కలిగించగలదు-

కామకృత్ .. 295

1. కామములను కలిగించువాడు.

సృష్టి నిర్వహణకు 'కోరిక' కూడా విష్ణు చైతన్యంగా ప్రసరిస్తోంది. కోరికయే లేకుంటే కర్మకి ప్రేరణ ఉండదు. దానితో సోమరితనం వంటి తమోగుణాలు నిండి జీవుడు తరించలేడు. జగతి కొనసాగదు. కర్మని ప్రేరేపించే కోరికను ప్రేరేపించుతాడు.

అసలు సృష్టి ఆవిర్భావానికి ఆయనలోని స్పందన ఇచ్ఛగా వ్యక్తమవటమే కారణం.

'అథ నిత్యో నారాయణః. స అకామయత' (నారాయణ సూక్తం)

నిత్యుడైన నారాయణ బ్రహ్మము కోరుకున్నాడు. దానితో నారాయణుని నుండి జగమంతా ఆవిర్భవించింది. 'ఒక్క నేనే ఎన్నో అవుతాను **(ఏకోహం బహుస్యాం)** అనే స్పందనయే ఆతని కామం. ఆ ఇచ్ఛాశక్తియే సర్వజీవులందు ప్రసరించి కామంగా వ్యక్తమౌతోంది.

ధర్మ సమ్మతమైన కోరికలు జీవుని కర్మానుభవానికి హేతువులై, క్రమంగా సుజ్ఞానానికి సేతువులౌతాయి. జ్ఞానులలో సైతం దీనిని రగిల్చి, వారి ద్వారా ఉత్తమ లక్ష్యాలను సిద్ధింపజేసే కామకృత్.

భక్తులలో దుష్ట వాంఛలు హరించి (కామహా), ధర్మబద్ధమైన కామనలను

కలిగించి ప్రేరేపించేవాడు (కామకృత్) అతడే.

'మనసः కామ మాకూతిం వాచస్పత్యమశీమహి' (శ్రుతి)

విరాట్పురుషుని మనశ్శక్తి నుండి ఉద్భవించిన కామం విశ్వమంతా పరీవ్యాప్తమై జీవుల మనస్సుల్లో ప్రరోచన కలిగిస్తున్నది.

కోరికను కలిగించడమేకాదు – కోరదగిన, కోరబడిన తత్త్వమూ అతడే–

కాన్తः .. 296

1. కమనీయమైన వాడు.

కోరాలనిపించేది కమనీయత. నిజానికి భక్తులు ఆయననే కోరుతారు. సర్వ జీవులకు ఆనందవాంఛ సహజం. అయితే ఆనందానికి అసలు అర్థం నారాయణుడే. అందుకే తెలివి కలిగిన భక్తులు జగద్విషయాలను వదలి – శాశ్వతమైన సత్ చిత్ 'ఆనంద' ఘనుడైన విష్ణువునే అభిలషిస్తున్నారు.

'సత్యం శివం సుందరం' అని వర్ణించబడిన సౌందర్యవంతుడు, నిత్య సౌందర్యానంద నిధానుడు గనుక అందరూ ఆయననే కోరుతున్నారు.

అందరిచే కోరదగిన మధురస్వరూపుడు కాన్తుడు.

కరములతో ఆయననే కొలుచుకోవాలనీ, వీనులతో ఆయన కథలే వినాలనీ, కన్నులతో ఆయననే చూడాలనీ నిజమైన రసజ్ఞులైన సాధకులు ఉవ్విళ్లూరుతారు.

అటువంటి కమనీయుడే, 'కోరిక' అనే చైతన్యంగా వ్యాప్తి చెందినవాడు కనుక –

కామः .. 297

1. కామస్వరూపుడు.

సాధనల యందు ప్రవర్తింపచేసే కామం విష్ణువిభూతియే. కామ్యములైన

వాటిని పొందాలనే ప్రేరణ ఉన్నప్పుడే వస్తువుల సార్థక్యం. తాపసులు తపస్సిద్ధికై వ్రతాదుల నాచరిస్తారు. విద్యార్థులు విద్యావ్యాప్తికై గురువును శుశ్రూష చేస్తారు. సంపదల కోసం క్షేత్రాదులు వ్యవసాయం చేయబడతాయి. జగత్తులోని నిగూఢమైన విజ్ఞానాది శక్తులన్నీ కామం చేతనే బహిర్గతమౌతాయి.

ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ । (భగవద్గీత)

'ప్రాణులయందు ధర్మ విరుద్ధము కాని కామం నేనే అయిఉన్నాన'ని శ్రీకృష్ణుడు, తన విభూతి స్వరూపంగా కామాన్ని నిర్వచించాడు. నిర్వికారమైన బ్రహ్మము జగద్రూపంగా పరిణమించడానికి ఈశ్వరుడైనది ఈ 'కామ' చైతన్యం చేతనే. ఇదే ఈశ్వర స్థితి.

2. క + అ + మ = కామ. 'క' కారం బ్రహ్మకు (సృష్టికి), 'అ' కారం విష్ణునకు (స్థితికి), 'మ' కారం రుద్రునకు (లయకు) వాచకాలు. సృష్టి స్థితి లయలను చేసే బ్రహ్మ విష్ణు రుద్రాత్మక ఏక చైతన్యమే కామః.

కోరికలను తీర్చేవాడు కూడా స్వామియే కనుక –

కామప్రదః .. 298

1. కోరికలను సమృద్ధిగా తీర్చువాడు.

భక్తుల మనోవాంఛితాలను కొరతలేకుండా తీర్చి, వారి లోక యాత్రలను నెరవేర్చు కరుణాళువు. కోరిక తీర్చే సంపదలను, కోరిన వారితో యోజనం చేసే విశ్వ చైతన్య శక్తి విష్ణువు.

'ఏకోబహూనాం యో విదధాతి కామాన్,' అని కఠోపనిషద్వచనం. తానొక్కడే అనేకుల కోరికలను నెరవేర్చువాడు.

వత్సః కామ దుఘో విరాజః సగుహా చక్రౌ తన్వః పరాచైః॥

అని శ్రుతి వర్ణించింది. భక్త కామధేనువైన వాడు శ్రీహరి.

ఈ విధంగా తన సర్వ సమర్థతను ప్రకటించుటచే –

1. సర్వ సమర్థుడు.

ప్రభవతీతి సమర్థో భవతీతి. సమర్థతలన్నీ ఆ అనంత శక్తిమంతునివే.

2. **ప్రకృష్టేన భవతి.** అనేక విధములుగా, ఊహాతీతంగా కలుగువాడు. అనంత వ్యాపకత్వం ధర్మంతో అగ్నియందు విస్ఫులింగముల వలె, తనయందు అనంత సృష్టులను కలిగించువాడు.

296 నామం నుండి ఈ నామం వరకు విశ్వ వ్యాపక 'కామ' చైతన్యం వివరించబడినది.

కోరికని తొలగించువాడై (కామహా) కలిగించువాడై (కామకృత్), వస్తువులందు కోరదగిన ఐశ్వర్య స్వరూపుడై (కాన్తః), వాటితో అనుసంధానించే 'కోరిక' తానై (కామః), ఆ కోరికలను తీర్చే ఈశ్వరుడై (కామప్రదః), గొప్పగా బహువిధములుగా అయినవాడు (ప్రభుః) అనే చక్కని వాక్యమువలె కూర్చిన నామాలివి.

'నారాయణోఽకామయత ప్రజాః సృజేయేతి.

నారాయణాత్ బ్రహ్మాజాయతే. నారాయణాత్ రుద్రోజాయతే,

నారాయణాత్ ద్వాదశాదిత్యాః... ' ఇలా 'ప్ర-భుః' రూపంతో బహువిధ విశ్వంగా పరిణమించాడు. ఈ శ్రుతిమంత్ర క్రమమంతా ఈ ఆరునామాలలో నిక్షిప్తమై ఉంది.

ఈ ప్రభుశక్తితోనే యుగములకు ఆరంభాన్ని చేస్తున్న -

యుగాది కృద్యుగావర్తో నైకమాయో మహాశనః।
అదృశ్యో వ్యక్తరూపశ్చ సహస్రజిదనంతజిత్॥... 33

300. యుగాదికృత్, *301.* యుగావర్తః, *302.* నైకమాయః,
303. మహాశనః *304.* అదృశ్యః, *305.* వ్యక్తరూపః,
306. సహస్రజిత్, *307.* అనన్తజిత్॥

యుగాదికృత్ .. 300

1. యుగములను ఆరంభించువాడు.

సృష్టికి ముందున్న శాశ్వతుడే సృష్టిని ఆరంభించగలడు. ఆ శాశ్వత బ్రహ్మమైన నారాయణుడు ఆరంభించడంతోనే కాలం, కాలాధారమైన విశ్వం మొదలయ్యాయి.

యుజ్యతేస్మిన్ సర్వమితి యుగమ్ - కాలచక్రం.

సర్వము దేనియందు యోజనమౌతాయో ఆ కాలమే యుగం.

యోజన శక్తికి ఆదికర్త విష్ణువు.

వృషభములు, కాడె, నాగలి, నేల, విత్తనాలు - వీటన్నిటినీ యోజనం చేసి కృషిని సలిపి పొలాన్ని పండించే కర్షకుని వలె - వివిధములైన వాటిని కాలరూపంగా యోజన చేసే ఆదికర్త విష్ణువు.

తస్మాత్ విరాడజాయత విరాజోఽధిపూరుషః।
స జాతో అత్యరిచ్యత పశ్చాత్ భూమి మథోపురః॥ (యజుర్వేదం)
ఇయం విసృష్టిర్యత ఆ బభూవ ॥ (ఋగ్వేదం)

'ఈ విధములైన సృష్టి ఎవరివలన కలిగినదో' అంటూ ఆ విరాట్పురుషుని వేదములు 'యుగాది కర్త'గా వర్ణించాయి. యుగములకు ఆరంభమున వట పత్రశాయిగా గోచరించిన వాడితడే.

తృతీయ శతకమ్ సమాప్తమ్

యుగాది కర్తగా ప్రారంభకుడే కాక, మధ్య అంతముల ప్రవర్తకుడు కూడా తానే -

యుగావర్తః.. 301

1. యుగములను త్రిప్పువాడు.

కాలచక్రాన్ని ప్రవర్తింపచేసే విష్ణువు. యుగముల తరువాత యుగాలను నడుపుతూ, నిర్వహిస్తున్నాడు. కృతయుగం నుండి కలి వరకు తిరిగి మళ్లీ కృత నుండి... ఇలా ఒకదానితో ఒకటి కలుపుతూ, ఒకదాని నుండి ఒక దానిలోనికి ప్రవేశిస్తూ యుగ చక్రాన్ని త్రిప్పుతున్న చక్రధారి.

కుంభకారుడు మట్టిని చక్రంపై త్రిప్పి కుంభాదులను చేసి, మళ్లీ కొత్త మట్టితో మళ్లీ చక్రాన్ని త్రిప్పినట్లుగా యుగ కల్పాది కాలాలలో సూర్య చంద్ర పంచభూతాదులను యథాపూర్వం నడుపుతున్నాడు.

'సూర్యా చంద్రమసౌ ధాతా యధాపూర్వ మకల్పయత్.'

ఈ యుగచక్రంలో ప్రకృతిని అనేక విధముల గోచరింపచేసే స్వామి -

నైకమాయః.. 302

1. బహుళమైన మాయలు కలవాడు.

'మాయాన్తు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్। (శ్వేతాశ్వతర ఉపనిషత్తు.)

ప్రకృతియే మాయ. అది యుగ చక్రాదులలో బహువిధముల భాసిస్తున్నది. ఈ బహువిధములైన మాయలలో జగతిని నిర్వహించేస్వామి - తన అవతారాదులలో కూడా అంతుపట్టని చేష్టలతో 'బహుమాయలు వాడై' చరించాడు.

బాలుడై విహరిస్తూనే గిరిని దాల్చుట, కాళీయుని మర్దించుట, విశ్వరూపాన్ని చూపుట - మళ్లీ అంతలో తనను మరుగు పరచుట వంటివి కృష్ణావతారంలో దృష్టాలు.

విష్ణోర్విచిత్రాః ప్రభవన్తి మాయాః – అని శ్రుతి ఆశ్చర్యకరమైన అనేక మాయలు చేసేవానిగా విష్ణుని కీర్తించింది.

ప్రళయార్ణవంలో కేవలం మఱ్ఱి ఆకుపై పసిరూపంలో కనబడడం, ఆశ్చర్యపడిన మార్కండేయుని తన కుక్షిలోకి పంపి సర్వలోకాలను ప్రదర్శించటం, తిరిగి వెలికి తీసుకురావటం... ఈ లీలలన్నీ యుగాదికి పూర్వమే ప్రదర్శించిన వటపత్రశాయి రూపమే బహుమాయల లీలావినోదం.

మాయాభిరిన్ద్ర మాయినం త్వం శృణ్వమవాతిరః॥ (ఋగ్వేదం)

త్వం మాయాభిరపమాయినోధమః స్వధాభిర్యేశుద్ధవజుహ్వత॥

(ఋగ్వేదం)

శ్రుతి నైకమాయుని చెప్పిన తీరిది.

ఇన్ని మాయలలో భాగంగా విశ్వమును స్వీకరించేవాడు –

మహాశనః.. 303

1. గొప్పగా ఆరగించువాడు. గొప్ప ఆహారాన్ని భుజించువాడు. కల్పాన్తంలో సర్వలోకములను మ్రింగినవాడు గనుక, మహా ఆహారాన్ని ఆరగించినవానిగా కీర్తితుడు. వటపత్రశాయి చిన్ని కడుపులోని సమస్త భువనాలను దర్శించాడు మార్కండేయ మహర్షి
2. **'అశ భోజనే'** విశ్వమంతా ఆరగింపు రూపంలో ఒకదానినొకటి పోషించుకునే వ్యవస్థగా వ్యాపించినవాడు. వృక్షాలు పృథి వ్యాదుల వికారాలను ఆరగిస్తాయి (స్వీకరిస్తాయి). దాని ద్వారా పండిన ఫలాలను, పత్రాలను ఇతర జీవులు స్వీకరిస్తాయి. జగమంతా ఈ గొప్ప 'అశన వ్యవస్థ'గా నిండినవాడు మహాశనుడు.

ఆహారాది స్వీకరణతో వాటిని కనబడకుండా చేసేవాడు కనుక తాను కానరాకుండానే ఈ వ్యవహారాలను నిర్వహిస్తున్నాడు కనుక

అదృశ్యః..304

1. (ఇంద్రియాలకు) కానరానివాడు.

   బుద్ధికీ ఇంద్రియాలకు గోచరించనివాడు.

   'యం చక్షుర్నపశ్యతి' 'యన్మనసా నమనుతే'.

   - అని శ్రుతి ప్రతిపాదించిన తీరుగా, నేత్రాది బాహ్యేంద్రియాలకు బుద్ధ్యాది అంతరింద్రియాలకు అందనివాడు. అన్నిటి యందు వ్యాపించినా బాహ్యమునకు గోచరించనివాడు.

   నతం విదాథ య ఇ మా జజానాన్యద్ యుష్మాకమన్తరా బభూవ।

   (ఋగ్వేదం)

   -అని ఋగ్వేదం ఈ భావాన్నే చెబుతోంది.

2. విశ్వమంతా తాను కానరాకుండానే కాలాది వ్యవస్థను నిరాఘాటంగా నిర్వహిస్తున్నాడు. మాతృగర్భంలో శిశువృద్ధి, బీజంలో వృక్ష సత్త్వం... సర్వమూ కానరాకుండా గర్భితం చేసేది ఈ పరమ పురుషుడే.

3. వటపత్రశాయిగా గోచరించినా - ఊహకు కూడా అందని ఆశ్చర్యకర వృత్తాంతం కలవాడు.

   కథం స్వయం శిశుశ్శేతే లోకేనాశముపాగతే।
   తపసా చిన్తయం శ్చాపి తం శిశుం నోపలక్షయే॥

   'లోకమంతా నశించినా ఈ చిన్ని శిశువు మాత్రం ఎలా నిద్రించి ఉన్నాడు? - అని ఆలోచించి చింతించినా 'ఇట్టిద'ని నిర్ణయించలేకున్నాను' అని మార్కండేయుడు అచ్చెరువు చెందాడు.

   అదృశ్యుడైనప్పటికీ బుద్ధీంద్రియాల నతిక్రమించిన యోగులకు వ్యక్తమయ్యేవాడు -

1. స్పష్టముగా గోచరించువాడు.

కారణావస్థలో కానరానివాడు, కార్యరూప జగత్తుగా వ్యక్తమై – వ్యక్తరూపుడయ్యాడు.

2. స్పష్టంగా రూపింపజేయువాడు.

తాను ప్రచ్ఛన్నుడైనా సర్వ విశ్వమును స్పష్టంగా గోచరింప జేసే పరమేశ్వరుడితడు.

భావించి దర్శించగలిగేవాడు విశ్వముగా వ్యక్తమౌతున్నది విష్ణువేనని గుర్తించగలడు.

3. భక్తులకు యోగులకు తనను తాను వ్యక్తపరచుకొని అనుగ్రహించేవాడు.

తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః।
దివీవ చక్షు రాతతమ్॥ (అథర్వవేదం)
సుసందృశం త్వా వయం మఘవన్ వందిషీమహి। (యజుర్వేదం)
అపశ్యమస్య మహతో మహిత్వమర్యస్య మర్త్యాసు విక్షు ॥ (ఋగ్వేదం)
రూపం రూపం మఘవా బోభవీతి మాయాః కణ్వానస్తన్వం పరి స్వామ్॥ (ఋగ్వేదం)

– మొదలైన వేదమంత్రాలు విశ్వమంతా స్పష్టంగా వ్యాపించి, రూపింపజేసేవాడిని పేర్కొన్నాయి.

అవ్యక్తుడైనా, అవతారాదులుగా వ్యక్తమైనవాడు నారాయణుడు.

ప్రళయ జలధిలో సైతం బాలముకుందునిగా మార్కండేయునకు తన సుందరాకృతిని స్పష్టంచేసినవాడు –

అతసీ పుష్ప సంకాశః శ్రీవత్సకృత లక్షణః
సాక్షాల్లక్ష్మ్యా ఇవావాసః స సదాప్రతిభాతిమే ॥ (భారతం. అరణ్యపర్వం)

'నల్ల అవిసెపువ్వు వలె భాసించుతూ శ్రీవత్సలాంఛనుడై లక్ష్మీనివాసుడై గోచరించిన స్వరూపాన్ని' వర్ణించారు. ధ్రువునకు, ప్రహ్లాదునకు తదితర

భక్తుల తపః ఫలంగా దివ్యరూపంలో వ్యక్తమైనవాడితడే.

అలా వ్యక్తమై వేలాది దనుజులను జయించి, వేలాది భక్తుల మనస్సులను సైతం జయించినవాడై -

సహస్రజిత్.. 306

1. అన్నిటినీ జయించువాడు.

సహస్ర శబ్దం బహుత్వాన్ని తెలియజేస్తుంది. లెక్కకు మిక్కిలి జగములను జయించినవాడు. అనగా - తన వశము నందుంచుకున్నవాడు.

లెక్కకందని యుగాలలో లెక్కకందని దనుజుల ఉక్కడగించినవాడు. భక్తుల అంతరంగాలను జయించినవాడు.

సూర్యాదుల ప్రకాశాలను మించినవాడు.

గోజిన్నః సోమో రథజిద్ధిరణ్యజిత్ స్వర్జిదబ్జిత్॥ (ఋగ్వేదం)

పవస్వ గోజిదశ్వజి ద్విశ్వజిత్ స్తోమరణ్యజిత్॥ (ఋగ్వేదం)

ఇదం శ్రేష్ఠ జ్యోతిషాం జ్యోతిరుత్తమం విశ్వజిద్ధనజిదుచ్యతే బృహత్॥

(ఋగ్వేదం)

- అని వేద మంత్రాలు నారాయణుని సహస్రజిల్లక్షణాన్ని నుతించాయి.

2. వెయ్యి యుగాల కల్పకాలమంతా వటపత్రశాయిగా శయనించినవాడు, సహస్రయుగజేత.

యావద్యుగానాం విప్రర్షే సహస్రం పరివర్తతే। తావత్వమపి... (భారతం. అరణ్యపర్వం) 'వెయ్యియుగాలు గడచేవరకు శయనించి ఉంటాన'ని మార్కండేయునితో విన్నవించిన పరమపురుషుడు.

అన్నిటినీ జయించిన ఈతని జయలక్షణానికి అంతులేదు. అంతం తెలియని ఈ విశ్వాన్ని పూర్ణంగా జయించిన జగదీశ్వరుడు కనుక -

అనన్తజిత్.. 307

1. అనంతమును జయించినవాడు.

విశ్వం మితులకు అందనిది. అందుకే ఇది అనంతం. మనకు అనంతమైన ఈ విశ్వాన్ని తాను అంతం చేయగలిగే నిజమైన అనంతుడు. 'విశ్వజిత్' అని వేదం సంభావించిన పరమేశ్వరుడీతడు.

విశ్వంలో ఒక సహజ వ్యవస్థను ఏర్పరచిన శ్రీహరి – ఒకదానిని ఒకటి జయించే చైతన్యాన్ని సర్వత్ర వ్యాపింపజేసినవాడు. ఒక కాలంలో ఒకదాని అధిక్యం, తరువాతి కాలంలో దానిని జయించి మరియొకదాని అధిక్యం. ఈ జయలక్షణంతో విశ్వమంతా వ్యాపించిన కారణంగా, ఈ శక్తిని గ్రహించి జీవులందరూ విఘ్నాలను జయించగలుగుతున్నారు.

అనన్త శక్తితో సర్వప్రాణులను శాసించి, తన ఆజ్ఞావర్తులనుగా నడిపించే జయశక్తి సంభరితుడు. మనకు అంతుపట్టని సూర్యచన్ద్రేన్ద్రాది దేవతలను, లెక్కకందని గ్రహనక్షత్రాదులను తన శాసనానుగుణంగా జయించి పాలించే జేత ఇతడు.

అనన్తం శుష్మముదియర్తి భానునా। (ఋగ్వేదం)
ఉగ్రంతే పాజో నన్వా రురుధ్రే వశీ వశం నయసే ఏకజత్వమ్।
(ఋగ్వేదం)

సంక్రన్దనోఽనిమిష ఏకవీరః శతం సేనా అజయత్ సాకమిన్ద్రః ।
(ఋగ్వేదం)

– ఇలా పలు శ్రుతి వాక్యాలు ఆ అనంతజేతను ప్రస్తుతించాయి.

2. పరిమితిగల రూపంగా గోచరిస్తూనే, తన అపరిమితత్వాన్ని స్ఫురింపజేసి, తన సర్వాధిక్యతను ఎరుక పరచువాడు.

అన్తశ్శరీరే తస్యాహం వర్షాణామధికం శతమ్।
నహి పశ్యామి తస్యాహం అన్తం దేవస్య కర్హిచిత్।।
ఆసాదయామి నైవాన్తం తస్యరాజన్మహాత్మనః।।

"లెక్కకందని కాలం వటపత్రశాయి లోపల విహరించినప్పటికీ ఆ నారాయణుని పొరాన్ని (అంతాన్ని - తుదను) తెలుసుకోలేకపోయాను" అని మార్కండేయుడు (భారతం - అరణ్యపర్వం) ధర్మరాజాదులకు వర్ణించాడు.

ఆ విధంగా అనన్త జయలక్షణుడు కనుకనే, యోగులు భక్తులు ఆతని యందే ప్రీతికలిగి ఉండడం చేత -

ఇష్టో విశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః।
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహుర్మహీధరః॥... 34

308. ఇష్టః, 309, అవిశిష్టః, 310. శిష్టేష్టః, 311. శిఖణ్డీ, 312. నహుషః, 313. వృషః। 314. క్రోధహా, 315. క్రోధకృత్ కర్తా, 316. విశ్వబాహుః, 317. మహీధరః॥

ఇష్టః..... 308

1. అందరిచే ఇచ్చగింపబడువాడు. ప్రీతియైనవాడు.

'ఇచ్ఛా విషయా క్రియతే ప్రాప్తుమితి - ఇష్టః'

అందరికీ ప్రీతికలిగించేది అనన్దం. ఆ అనన్దం యొక్క పూర్ణస్వరూపమే ఈ సచ్చిదానంద ఘనుడు. కనుక అసలైన ఇష్టం ఈ బ్రహ్మమే.

'బ్రహ్మేష్టం శరణముపగమ్య' - 'ఇష్టమైన ఈ బ్రహ్మమును శరణువేడదగిన వాని'గా శ్రుతి పేర్కొంది. సర్వజీవకోటికి ప్రియమైన ఆత్మస్వరూపుడితడే కనుక - ఇష్టుడు.' **'ఆత్మనస్తుకామాయ సర్వం ప్రియంభవతి'** అంతా ఆత్మార్థమే ప్రియంగా గోచరిస్తోంది. (బృ.ఉ.)

2. **ఇజ్యతే ఇతి ఇష్టః.**

ఆరాధింపబడు (యజనము చేయబడు)వాడు.

యజ్ఞాది క్రియాస్వరూపుడు. యజ్ఞములకు లక్ష్యమైనవాడు.

విశ్వమంతా ఒకదాని నుండి ఒకటి స్వీకరిస్తూ, పరస్పరం ప్రదానం చేస్తున్న వ్యవస్థే యజ్ఞం. సర్వవ్యాపకమైన విష్ణువే ఈ యజ్ఞరూప చైతన్యంగా గోచరిస్తున్న కారణంగా – ఇష్టుడు. యజ్ఞాలలో ఆరాధింపబడే దైవమీతడు. సర్వదేవతాత్మకుడు. దయతో ప్రీతితో లోకాన్ని రక్షించే నిజమైన ఇష్టుడితడు. సహజమైన ఇష్ట లక్షణం (ఆనంద స్వభావం) కల ఈతనిని భక్తులు ఇష్టునిగా ఆశ్రయిస్తున్నారు.

ఇష్టో యజ్ఞో, భృగుభిరాశీర్దా వసూభిః।
తస్య న ఇష్టస్య ప్రీతస్య ద్రవిణహోగర్భాః।। (యజుర్వేదం)
ఇష్టో అగ్ని రాహుతః పిపర్తు నః।। (యజుర్వేదం)

– ఈ శ్రుతి వాక్యాలు ఇష్టరూపుడైన యజ్ఞేశుని ప్రస్తావించాయి. అందరికీ ఇష్టుడైన ఈతడు, అందరికీ విడిగా లేనివాడై –

అవిశిష్టః.. 309

1. విశేషముగా లేనివాడు.

అంతా తానైయున్నవాడు కనుక, వేరుగా లేడు. నిర్విశేషుడు. సమానరూపంగా సర్వాంతర్యామిగా సర్వజీవులకు ఇష్టుడై హృదయాంతర్వర్తియై ఉన్న కారణంగా అవిశిష్టుడు.

వటపత్రశాయిగా మార్కండేయునకు – సర్వమునకు అభిన్నంగా ఉన్న స్వరూపాన్ని దర్శింపచేశాడు.

ఈ సత్యమెరిగిన యోగులు ఈయననే ప్రీతిగా తలంచి చేరిన వారు కనుక –

శిష్టేష్టః.. 310

1. శిష్టులకు ఇష్టమైన వాడు.

   శాసనాన్ని అనుసరించేవారు శిష్టులు. 'తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే' - (గీత) అనే కృష్ణవచనానుసారం శ్రుతిస్మృత్యాది శాస్త్ర విహిత కర్మల నాచరించే సత్పురుషులు - ఆ శాస్త్రములు నారాయణాజ్ఞలుగా భావించి పరమ ప్రీతితో ఆచరిస్తారు. శాస్త్రాచారాల ద్వారా ఆ సత్పురుషులచే ఆరాధింపబడేవాడు - వారికి ప్రీతిపాత్రుడు.

   'ఇష్టః సర్వస్య లోకస్య శశాఙ్క ఇవ నిర్మలః' (రామాయణం)

2. శిష్టులకు ఇష్టుడే కాకుండా, 'శిష్టులను ఇష్టంగా కాచుకొనేవాడు' - అని కూడా అర్థం. శిష్ట రక్షణకోసం అవతారధారణ చేసిన పరమ కారుణికుడు శ్రీమహావిష్ణువు.

   "ప్రియోహి జ్ఞానినోత్యర్థమహం స చ మమ ప్రియః" - "జ్ఞానులకు నేను ప్రియుడను. జ్ఞానులు నాకు ప్రియులు" - అని కృష్ణవచనం.

3. శిష్టులనే శబ్దానికి **'సాధ్యా దేవాః'** అని వైదికార్థం. అనగా 'దేవతలు'. దేవతలచే ఆరాధింపబడేవాడు, సదాచార సంపన్నులచే యజనము చేయబడువాడు - శిష్టేష్టుడు.

   విశ్వమంతా యజ్ఞమయం. వసంతాది ఋతువులు ఆజ్య, ఇధ్మ, హవిస్సులుగా, సప్తవాయువులు పరిధులుగా, త్రిగుణితమైన సూర్యాది శని పర్యంత గ్రహములు సప్తసమిధలుగా నిత్యం విశ్వంలో యజ్ఞరూప విష్ణు చైతన్యం పరీవ్యాప్తమై ఉందని 'పురుషసూక్తం' తెలియజేస్తోంది.

   ✦ **యజ్ఞేన యజ్ఞమయజన్త దేవాః తాని ధర్మాణి ప్రథమాన్యాసన్ - ।**
   తే హ నాకం మహిమానః సచన్తే యత్ర పూర్వే సాధ్యాః సన్తిదేవాః॥

   ✦ **తం యజ్ఞం బర్హిషిప్రౌక్షన్ పురుషం జాతమగ్రతః।**
   తేన దేవా అయజన్త సాధ్యా ఋషయశ్చయే॥

   ✦ **యత్ పురుషేణ హవిషా దేవాయజ్ఞ మతన్వత ।**
   వసన్తోఽస్యాసీదాజ్యం గ్రీష్మ ఇధ్మశ్శరద్ధవిః॥

4. వటపత్రశాయి అయిన నారాయణుని వృత్తాంతాన్ని చెప్తూ, భారత అరణ్య పర్వంలో ప్రస్తావన –

సత్త్వస్థాః నిరహఙ్కారాః నిత్యమధ్యాత్మకోవిదాః।
మామేవ సతతం విప్రాః చిన్తయన్త ఉపాసతే।

"సత్త్వగుణ ప్రధానులై, అహంకారములేనివారై, నిత్యము అధ్యాత్మకోవిదులైన బ్రహ్మవేత్తలు (శిష్టులు) నన్ను ఉపాసిస్తారు."

అలా యజనము చేయబడే అగ్ని (తేజః) స్వరూపుడు కనుక –

శిఖణ్డీ.. 311

1. తేజఃస్వరూపుడు.

శిఖయా – తేజోరూపయా జ్వలయా శేతే ఆకాశే (ఖే) వ్యాప్నోతి.

శిఖణ్డః. అమితి –గచ్ఛతి వ్యాప్నోతి – అణ్డః. ఆకాశమునందు వ్యాపించి ప్రసరించు తేజస్సు 'శిఖణ్డం'. అలా వ్యాపించే తేజస్సుగలవాడు 'శిఖణ్డీ'. ఇది అగ్నినీ, సూర్యునీ తెలియజేస్తుంది. తత్ స్వరూపుడైన విష్ణువు 'శిఖణ్డీ'. యజ్ఞమునందు ఆరాధింపబడి ఊర్ధ్వముఖంగా వ్యాపించే వహ్నిస్వరూపుడు.

2. **శక్నోతి సర్వధా శిఖణ్డః,** అన్ని విధాల సమర్థుడు. జగములను సమర్థవంతంగా నడుపుతున్న బ్రహ్మాది శిఖణ్డులను నిర్వహిస్తున్న పరమేశ్వరుడైన విష్ణువు – సమర్థులకు సమర్థుడు.

3. ఇన్ద్రధనువునకు కూడా శిఖణ్డమనిపేరు. ఇది సూర్యకాంతి విశేషం. వివిధ వర్ణ విశిష్ట కాంతులను వెదజల్లే ఇన్ద్రధనూరూప తేజస్స్వరూపం. బహువర్ణకారకమైన సూర్యతేజస్సు విష్ణు స్వరూపమే కనుక ఈ నామం వ్యవహృతం. వరుణుని (జల తత్త్వంతో కూడిన సూర్యకాంతి యొక్క) 'హేతి' (ఆయుధం)గా వేదం వర్ణించింది.

ధనుర్బిభర్షి హరితం హిరణ్యయం
; సహస్రఘ్ని శతవధం శిఖణ్డినమ్।

రుద్రస్యేషుశ్చరతి దేవహేతి స్తస్యై
నమో యతమస్యాం దిశీతః॥ (అథర్వవేదం)

4. మయూర పింఛానికి కూడా 'శిఖండి'మని పేరు. హరివిల్లు వలె వివిధ వర్ణములను వెదజల్లే కారణంగా ఈ పేరు వేదాలలోనే దృశ్యమవుతుంది.

ఆనృత్యతః శిఖండినో గన్ధర్వస్యాప్సరాపతేః (అథర్వవేదం)

వేదంలో 'చిత్రాగ్ని'గా వర్ణింపబడిన తేజో విశేషమే – నెమలిపింఛంగా ఉపలక్షితం. **'చినోతి అనేక వర్ణాః ఇతి చిత్రం'** – "అనేక రంగులను వెదజల్లునది – చిత్రం" ఆ తేజస్సే చిత్రాగ్ని. వర్ణకారక తేజోవిశేషం. అది విష్ణు స్వరూపం.

ఋతువులలో జరిగే పలు మార్పులు చిత్రాగ్ని శక్తులు. యజ్ఞ స్వరూపుడైన విష్ణువు ఈ చిత్రాగ్నిగా వ్యాపించినవాడు కనుక శిఖండీ.

5. వటపత్రశాయిగా గోచరించిన శ్రీహరి, 'మహాతేజస్వి'గా వర్ణింపబడ్డాడు.

'ఆసీనన్తం నరవ్యాఘ్రం పశ్యామ్యమిత తేజసమ్'

(భారతం.అరణ్యపర్వం)

6. నెమలి పింఛాన్ని సిగపై దాల్చిన శ్రీకృష్ణుడు శిఖండీ.

'మదశిఖణ్డ శిఖణ్డి విభూషితం', 'నవశిఖిపింఛాలాంఛితం వాంఛితం నః' – అని లీలాశుకుడు శ్రీకృష్ణుని వర్ణించాడు (శ్రీకృష్ణకర్ణామృతం).

యజ్ఞస్వరూపుడైన ఆ మహాతేజస్వి తన తేజస్సుతోనే ఈ జగమంతటినీ బంధించి (ఒకదాని కొకటి లంకెగా) నిర్వహిస్తున్న కారణంగా –

నహుషః.. 312

1. బంధించువాడు.

నహ్యతి బధ్నాతి సర్వం విశ్వం. సృష్ట్యారంభం నుండి అంతం వరకు పరస్పర సంబంధంతో సర్వాన్ని నిర్వహించువాడు. సూత్రము వివిధాలను ఏకంగా బంధించినట్లుగా తన మాయాశక్తితో సర్వజీవులను బంధించి నడిపించువాడు.

2. యజ్ఞాదుల ద్వారా దివికీ భువికీ అనుబంధాన్ని ఏర్పరచినవాడు.

త్వమగ్నే ప్రథమ మాయుమాయవే
దేవా అకృణ్వన్ నహుషస్య విశ్పతిమ్।

– అని ఋగ్వేదం యజ్ఞ స్వరూపుడైన విశ్వ పతిని వినుతించింది.

ఇదీ యజ్ఞాగ్ని బోధక నామమే.

యజ్ఞముతో ఉత్పన్నమయ్యే ధర్మమే (*ధారణాత్ ధర్మః* – పట్టిఉంచేది ధర్మం) విశ్వాన్ని తగిన రీతిగా 'బంధించి' (నియమాలను ఏర్పరచి) నహుషత్వాన్ని ద్యోతకం చేస్తోంది. ఆ యజ్ఞ ధర్మముల ద్వారా ఫలాలను వర్షించువాడు కనుక –

వృషః.. 313

1. వర్షించువాడు.

యజ్ఞరూపుడైన విష్ణువు యజనం చేసేవారి వాంఛితాలను వర్షిస్తున్న కారణంగా 'వృషః' అని స్తుతింపబడుతున్నాడు. ధర్మమే కోరిన కోరికలను తీర్చేది కనుక ధర్మరూపుడైన విష్ణువే వృషస్వరూపుడు. వృష్టికి హేతువైన యజ్ఞం, ధర్మం, అగ్ని, సూర్యుడు – ఇవి 'వృష' శబ్దంతో వేదంలో సంభావితాలు, ఈ నాలుగు విష్ణు రూపాలే.

వృషాగ్నిం వృషణం భరన్నపాం గర్భం సముద్రియమ్। (యజుర్వేదం)
అచిక్రదద్ వృషా హరిర్మహాన్ మిత్రః న దర్శతః। (యజుర్వేదం)
వృషోగ్నిః సమిధ్యతేశ్వో న దేవవాహనః। (అథర్వవేదం)

ఈ విషయాన్నే మహాభారతం (శాంతిపర్వం)లో –

వృషోహి భగవాన్ ధర్మః, స్మృతో లోకేషుభారత ।
నైఘణ్టుక పదాఖ్యానే విద్ధి మాం వృషముత్తమమ్।।

–అని వక్కాణించారు.

2. వటపత్రశాయి తన మాటల అమృత సేచనంతో మార్కండేయుని

ఆప్యాయనపరచి తన 'వర్షణశీల' లక్షణాన్ని ఋజువు చేశాడు.

తతో మా మబ్రవీద్బాలః స పద్మనిభలోచనం.
శ్రీవత్సధారీ ద్యుతిమాన్ వాక్యం శ్రుతి సుఖావహమ్।
జానామి త్వాం పరిశ్రాన్తం తదా విశ్రమకాంక్షిణమ్॥

(భారతం.అరణ్యపర్వం)

అటుపై పద్మాక్షుడైన బాలముకుందుడు శ్రీవత్సధారి వినసొంపుగా పలికి, 'నీవు అలసటని పొందినట్లు తెలుసుకొన్నాను' అని సాంత్వనపరచాడు. ధర్మ స్వరూపుడైన విష్ణువే క్రోధాది వికారాలను పోగొట్టువాడు కనుక –

క్రోధహా.. 314

1. క్రోధమును పోగొట్టువాడు.

ఇక్కడ 'క్రోధ' శబ్ద ప్రయోగంతో రజోగుణవికారాలైన క్రోధ, కామాదులను తెలియజేస్తున్నారు. 'కామ' వికారాలు లోభమోహాలు, 'క్రోధ' వికారాలు మదమాత్సర్యాలు, మొత్తంగా ఇవి రజో గుణ సముద్భవాలు. **'కామ ఏష క్రోధ ఏషరజోగుణ సముద్భవః'** (గీత).

రజస్తమోగుణాల వికారాలు లేని సత్త్వ గుణాలను అనుగ్రహించే శుద్ధ సత్త్వ స్వరూపుడు శ్రీహరి. ఆశ్రయించిన భక్తులలో ఆ రజోగుణ వికారాలను తొలగించి శాంతిని కూర్చే ప్రసన్నమూర్తి.

భృగుమహర్షివంటి వారి క్రోధం కూడా ఆ సుప్రసన్నుని దర్శనంతో ఉపశమించింది. యజ్ఞాది ధర్మములకు నిజమైన ఫలం క్రోధాది వికారాల శమనమే. తాపత్రయ నాశకుడైన శ్రీహరి కృపావర్ష (వృషః – వెనుకటి నామం) కారణంగా క్రోధాదులు తొలగుతాయి.

క్రోదాధి వికార రహితుడైన నిత్య ప్రసన్నుడు విష్ణువు.

2. భక్తి పూర్వక ఉపాసనా భావనతో చూస్తే – ఈ నామం నుండి 'ప్రాణః' (322) నామం వరకు పరశురామావతార ప్రస్తావనను సంభావించారు శ్రీపరాశరభట్టు.

ఇరవై ఒక్క మార్లు క్షాత్ర కులాన్ని జయించి, ఆ కోపాన్ని కశ్యపుని ప్రార్థనతో పోగొట్టుకున్నవాడు పరశురాముడు.

నక్రోధో న చ మాత్సర్యం న లోభో నాశుభామతిః।
భవన్తి కృత పుణ్యానాం భక్తానాం పురుషోత్తమే।।

"విష్ణు భక్తులకు క్రోధ, మాత్సర్య, లోభ, అశుభ బుద్ధులు కలుగవు."

వృషా నక్రుద్ధః ప్రతయద్రజః స్వా యో అర్యపత్నీరకృణ్మేదిమా అపః।।

(ఋగ్వేదం)

*(ఈ వేదమంత్రంలో 'వృష', 'నకృద్ధః' – నామాల క్రమాన్ని గమనించితే పై నామాల ('వృషః', 'క్రోధహా') వరుసలో వైదికపరమైన ఔచితిని గ్రహించవచ్చు. ఈ సహస్ర నామాలు వేద విజ్ఞాన సంభరితాలు అనడానికి ఇదొక తార్కాణం. **'ఋషిభిః పరిగీతాని'** అనే మాటలో ఆంతర్యమిది.)*

తాపనివారకుడైన సుప్రసన్ననిగానేకాక, తాప కారకమైన శక్తిగా, తాపకారులను కలిగించువానిగా ఉన్నది కూడా విష్ణువు కనుక –

క్రోధకృత్కర్తా.. 315

1. క్రోధముగలవారిని కలిగించువాడు.

క్రోధం కూడా భగవత్ శక్తియే. ఒక వ్యక్తి ప్రతాపం క్రోధం వల్ల ఉద్ధతంగా వ్యక్తమవుతుంది. కామం వలె క్రోధం కూడా ఒక ఆయుధం. అది ధర్మ రక్షణార్థం ఉపయోగపడినప్పుడు దైవీగుణం.

నృసింహుడు, వీరభద్రుడు, దుర్గ – మొదలైనవి భగవత్ శక్తి యొక్క క్రోధ స్వరూపాలు. ధర్మరక్షణ కోసం భగవానుడు వ్యక్తీకరించిన ఈ క్రోధాకారాలు భక్తుల సంతాపనాశనం కోసమే అవతరించాయి.

"కాలాగ్ని సదృశః క్రోధే".. అని శ్రీరాముని వర్ణించాడు వాల్మీకి. "క్రోధంలో కాలాగ్నివంటివాడు రాముడు".

ప్రళయకాలంలో ఈ క్రోధాగ్నితోనే భువనాలను జ్వలింపజేస్తాడు. సూర్యుని

ప్ర'చండ' తాపం క్రోధ సంకేతము. క్రోధ (చండ) లక్షణం కల అగ్ని సూర్యాదులలోని ప్రతాపం విష్ణుతేజమే.

"కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్యసంయుగే" – ధర్మ రక్షణ విషయంలోను, ప్రళయ వేళల్లోనూ పరమేశ్వరుడు ప్రకటించే కోపం దేవతలను సైతం భయకంపితులను చేస్తుంది. (రామాయణం)

"మన్యురసి మన్యుం మయి ధేహి" – అని వేదం పేర్కొన్నది. "క్రోధనస్వరూపుడైన భగవానుడు తగిన క్రోధశక్తిని నాయందుంచాల"ని దీని భావం. అధర్మం పట్ల క్రోధం కలగనివాడు అసమర్థుడు, కర్తవ్య మూఢుడు. ధర్మం కోసం క్రోధించి, అధర్మాన్ని శిక్షించే మహావీరులలోని వీరత్వము, క్రోధము భగవత్స్వరూపాలే. ఆ రూపాలతో దుష్టులను దునుమాడి శాంతిని ప్రతిష్ఠిస్తాడు శ్రీహరి. 'జ్ఞానయుక్తమైన క్రోధం శాంతికరం. అజ్ఞానమయమైన క్రోధం భయంకరం.'

ఔషధాదులలో ఉండే తీవ్ర స్వభావం (చండత్వం) మనకు ఆరోగ్యప్రదం. వాటిలో ఆ స్వభావ రూపంలో ఉన్నది విష్ణు విభూతియే.

2. క్రోధం కలుగువారిని (కలిగించువారి(టి)ని) తొలగించువాడు. క్రోధమే స్వభావం గల రజస్తమో దూషితులైన రాక్షసులను సంహరించేవాడు నారాయణుడు. **'కృంతతీతి – కర్తా'** 'సంహరించువాడు' అనే అర్థంలో 'కర్తా' శబ్దాన్ని ప్రయోగించుతారు.

అలాగే సాధకులలో క్రోధగుణాన్ని ప్రేరేపించే స్వభావాలను నిగ్రహింపజేసి శాంతిని చేకూర్చే అనుగ్రహ ప్రదాత.

కృధీన ఊర్ధ్వాఞ్చ రథాయ జీవసే విదా దేవేషునో దువః॥ (ఋగ్వేదం)

3. తన క్రోధానికి కారకులైన అధర్మపరులను శిక్షించేవాడు. కార్తవీర్యార్జునాది క్రోధకారులను నరకిన పరశురాముని గా విష్ణువే ఈ తత్త్వాన్ని ప్రత్యక్షం చేశాడు.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ – అనే కృత్యాలను నిర్వహించే స్వామి లక్షణాన్ని పై

రెండు నామాలు (314, 315) తెలియజేస్తున్నాయి. ఈ శిక్షణ రక్షణ కార్యాలను నిర్వహించే 'కార్య' (చేసే) శక్తికి సంకేతాలే హస్తాలు. అవి అనంతంగా కలవాడు కనుక –

విశ్వబాహుః.. 316

1. అనంత బాహువులు కలవాడు.

వ్యాపకశీలుడైన విష్ణువు అంతటను రక్షా – శిక్షా రూపమైన కర్మను నిర్వహిస్తున్నాడు. కర్మకు సంకేతమే బాహువు. అంతటను తన కర్మను సాగిస్తున్నందున విశ్వబాహువు.

కార్తవీర్యుని వేయి బాహువులను ఛేదించిన పరశురామునిగా ఈ నామంలో తన కృత్యాన్ని గోచరింపజేస్తున్నాడు.

బాధతే విలోడత ఇతి బాహుః, బాధించునవి – మథించునవి – సాధించునవి... అనే అర్థాలలో 'బాహు' శబ్దాన్ని ఉపయోగిస్తారు. మట్టిని 'బాధించి' (నాగలితో దున్ని), విత్తనాలను వెదజల్లి పంటను పండించే కర్మ చేతుల ద్వారానే జరుగుతోంది. ఒక వస్తువులో మార్పు అనేది ఈ బాధక ధర్మం చేత సాధ్యమవుతోంది. బాధితమైన స్వర్ణమే నగగా మలచబడుతోంది. ఈ కర్మలన్నీ చేతుల ద్వారానే జరుగుతున్నాయి కనుక 'బాహు' శబ్ద వాచ్యాలు. అంటే 'సాధన'కు ఇవి సంకేతాలు. ఈ ధర్మమును విశ్వమంతా నిర్వహించే వ్యాపకచైతన్యమే విశ్వబాహువైన విష్ణువు.

..'విశ్వతో బాహురుత విశ్వతస్పాత్,
సం బాహుభ్యాం ధమతి సం ఏ పతత్రైర్ద్యావాభూమి జనయత్ దేవ ఏకః ॥
(ఋగ్వేదం)

సహస్ర బాహుః పురుషః సహస్రాక్షః సహస్ర పాత్ । (అథర్వవేదం)

2. విశ్వానికి ఆలంబనమిచ్చేవాడు. ఆలంబనకు సంకేతమే బాహువులు.

'ఇందరికి అభయమ్ము లిచ్చుచేయి

కందువగు మంచి బంగారుచేయి' (అన్నమయ్య కృతి)

ఇటువంటి అనంత బాహువులతోనే భూమ్యాదులను ధరించి, బహుకర్మలను నిర్వహిస్తున్నందున -

మహీధరః.. 317

1. భూమిని దాల్చువాడు - నిర్వహించువాడు.

   అంతుపట్టని పర్వత సైకత నదీనద అర్ణవ సస్య రత్నాదులేకాక బహు జీవరాశులతో కూడిన పృధివి యొక్క విస్తారాన్ని గమనిస్తే - దీని 'గొప్పతనం' (మహత్త్వం) అర్థమౌతుంది. అందుకే భూమిని 'మహీ' అన్నారు.

   భూమియందున్న ఈ 'మహీ' లక్షణాన్ని నిర్వహింపజేసే విష్ణు చైతన్యమే 'మహీధరుడు'. సర్వమునకు ఆధారమైన భూమికి తాను ఆధారమైనవాడు కనుకనే -

   వరాహాది రూపాలతో భూమిని దాల్చినవాడు.

   ధర్మము నుద్ధరించి భూమిని ప్రతిష్ఠించినవాడు.

2. **'మహ- పూజాయాం'** అను ధాత్వర్థాన్ని అనుసరించి - పూజలను స్వీకరించి, ఫలమునిచ్చువాడు.

3. సకల జీవుల శరీరోపాధులు 'మహీ' శబ్ద వాచ్యాలని భావించవచ్చు. పార్థివమైన ఉపాధులను ఆత్మరూపుడై ధరించి నిర్వహించే మహీధరుడు ఈ పరమాత్ముడే.

   ఆకృష్ణేన రజసా వర్తమానో నివేశ యన్నమృతం మర్త్యంచ।

   (యజుర్వేదం)

4. మహీశబ్దానికి 'వాణీ' (వాక్కు) అని అర్థాన్ని గ్రహించవచ్చు. వాక్కులను ధరించే శబ్ద బ్రహ్మరూపుడు.

   ఈ ధారణాధర్మంతో దేనినీ జారనీయని, జారని వాడు కనుక -

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః।
అపాంనిధి రధిష్ఠాన మప్రమత్తః ప్రతిష్ఠితః॥... 35

318. అచ్యుతః, **319.** ప్రథితః, **320.**ప్రాణః,
321. ప్రాణదః, **322.** వాసవానుజః, **323.**అపాంనిధిః,
324.అధిష్ఠానమ్, **325.**అప్రమత్తః, **326.** ప్రతిష్ఠితః॥

అచ్యుతః.. 318

1. మార్పు, వికారం లేనివాడు.

సృష్ట్యారంభంలో ఏవిధమైన వ్యవస్థను స్థాపన చేశాడో దానిని ఏ మార్పు లేకుండా నడిపిస్తున్న చైతన్యమై సర్వత్ర వ్యాపించిన వాడు. పత్ర పుష్ప ఫలాదుల ఉత్పత్తి, దేహాదుల నిర్మాణం, సూర్యాదుల లక్షణాలు సృష్ట్యాది నుండి ఒకే విధమైన వ్యవస్థతో నడుస్తున్నాయి. ఆ వ్యవస్థా స్వరూప చైతన్యమే విష్ణువు.

ధ్రువోచ్యుతః ప్రమృణీహి... (అథర్వవేదం)
తావన్త మింద్ర తే గ్రహమూర్జా గృహ్ణామ్యక్షితం మయి
గృహ్ణామ్యక్షితమ్ ॥ (యజుర్వేదం)

('అక్షితమ్' అనే శబ్దానికి 'అచ్యుతమ్' అనే అర్థం)

సర్వమును ధరించినవానికి (మహీధరునకు) ఉండవలసినది ఈ అచ్యుత (జారని, జారనీయని) లక్షణమే. ఈ లక్షణం చేతనే అనంత కాలమునందు, అనంత విద్యలలో ప్రసిద్ధుడై –

ప్రథితః.. 319

1. ప్రఖ్యాతి చెందినవాడు.

విశ్వమంతా విష్ణుని ప్రసిద్ధియే గోచరిస్తోంది.

సృష్టి స్థితి లయాది కర్మలతో ప్రసిద్ధి చెందినవాడు. అచ్యుతమైన విశ్వ నిర్వహణ కృత్యములతో, మార్పు చెందని ఆత్మగా సర్వత్ర వ్యక్తమైనవాడు.

ద్యౌర్న ప్రథినా శవః ॥ (ఋగ్వేదం)
వర్ధమానో మహాం ఆ చ పుష్కరే దివో మాత్రయా
వరిమ్ణా ప్రథస్వ! (యజుర్వేదం)

ఇలా ప్రథిత శబ్దానికి వైదిక మూలాలు పలు చోట్ల లభిస్తాయి.

ఈ సర్వ విఖ్యాత లక్షణాన్ని సర్వ ప్రాణులలో ప్రాణ స్వరూపంగా వ్యక్తం చేస్తున్నవాడు-

ప్రాణః.. 320

1. జీవింపజేయువాడు.

సూత్రాత్మగా ప్రాణరూపుడైన విష్ణువు జీవకోటిని జీవింపజేయుచున్నవాడు.

'ప్రాణో వాహమస్మి' - అని బహ్వృచ **(ఋగ్వేదీయ)** శ్రుతి తెలియజేస్తోంది.

ప్రాణాయ నమో యస్య సర్వమిదం వశే।
... యస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్ ॥ (అథర్వవేదం)
ప్రాణ మాహు ర్మాతరిశ్వానం వాతోహ ప్రాణ ఉచ్యతే।
ప్రాణో హ భూతం భవ్యం చ ప్రాణే సర్వం ప్రతిష్ఠితమ్॥ (అథర్వవేదం)
... ప్రాణో నిత్యో న సూనుః ॥ (ఋగ్వేదం)

'సర్వం ప్రాణమయం. ప్రాణ వశంలోనే సర్వము ప్రతిష్ఠింపబడినదని' సర్వ ప్రాణులకు ప్రాణమైన పరమాత్మను బహుధా వేదం ప్రస్తుతించింది. **'ప్రాణోస్మి ప్రజ్ఞాత్మా, తన్మామాయు రమృత మిత్యుపాస్వ'** అని కౌషీతకి బ్రాహ్మణము (శ్రుతి) చెబుతోంది.

విశ్వమంతా ప్రాణ శక్తిగా వ్యాపించిన విష్ణువే సర్వులకు ప్రాణములనిస్తూ-

ప్రాణదః.. 321

1. జీవము, బలము ఇచ్చువాడు.
   జీవుల కర్మగతుల ననుసరించి ఉపాధుల కవసరమైన ప్రాణశక్తిని ప్రసాదించి నిర్వహించువాడు.

   ప్రాణదా అపానదా వ్యానదా వర్చోదా వరివోదాః। (యజుర్వేదం)
   యః ప్రాణదః ప్రాణదవాన్ బభూవ
   యస్మై లోకాః ధృతవన్తః క్షరన్తి ॥ (అథర్వవేదం)

2. ప్రాణశక్తి తానై తగిన కాలములందు ప్రదానం చేసి, ఉపసంహరించువాడు కూడా తానైనవాడు. **'ప్రాణాన్ ధ్యతి ఖండయతి'** – ప్రాణములను తొలగించే మృత్యుశక్తి కూడా ఈతడే.

   ప్రాణో మృత్యుః తక్మా ప్రాణం దేవా ఉపాసతే। (అథర్వవేదం)

   ప్రాణాత్మకుడై జీవన్మరణ వ్యవస్థను నిర్వహించువాడు.
   దేవాదులకు 'బలము' నిచ్చి (దదాతి) అసురుల బలమును హరించు (ద్యతి) వాడు. అందుకై దేవనాథుడైన ఇంద్రుని కోరిక మేరకు, అవతరించినవాడై–

వాసవానుజః.. 322

1. ఇన్ద్రునకు (వాసవునకు) తమ్ముడు.
   దేవతలను రక్షించడానికి – అదితీ కశ్యపులకు తనయునిగా, ఇన్ద్రునకు అనుజునిగా అవతరించిన వామనావతారుడు.
2. ఇన్ద్రియ చైతన్యాన్ని ఇన్ద్రునిగా భావిస్తే – ఆ చైతన్యం ద్వారా స్ఫురింపబడే ఆత్మ స్వరూపుడు విష్ణువు. మనకు ముందుగా తెలిసేది ఇన్ద్రియ జ్ఞానమే. విచారణ ద్వారా – ఈ ఇన్ద్రియాలకు మూలమై, ఇన్ద్రియాతీతమైన పరమాత్మ జ్ఞానం స్ఫురిస్తుంది. ఇలా ఇన్ద్రియములకు తరువాత స్ఫురించు – ఇన్ద్రియాతీతుడే వాసవానుజుడు.
3. **వసతి సర్వత్ర ఇతి 'వాసుః'.** అంతట వసించు(ఉండు) వాడు వాసుః. ఆ

'వాసు'నిచే వసింపబడే జగతి 'వాసవం'. అ జగతిని సృజించి దానియందు 'అనుప్రవిష్టుడు' (ఎడతెగక ప్రవేశించి, వ్యాపించువాడు) – వాసవానుజుడు.

'తత్ సృష్ట్వా తదేవ అనుప్రావిశత్' – అని శ్రుతి.

అంతట ప్రవేశించి జీవింపజేసే ఆధారరూపుడు కనుక –

అపాంనిధిః 323

1. ఆపస్సులకు నిధివంటివాడు.

ఆప్యంతే జీవనాయేత్యాపః. జీవింపజేయునవి 'ఆపస్సులు'.

వాటికి ఆ శక్తినిచ్చిన ఆధార చైతన్యమే 'అపాంనిధి' అయిన విష్ణువు. భూమి మొదలు అంతరిక్షం వరకు ఉన్న జీవన సాధనాలకు (స్థానం) అయినవాడు.

"ఆపోవా ఇదం సర్వం – విశ్వాభూతాన్యాపః –
ప్రాణావా ఆపః – పశవ ఆపోన్న మాపో–మృత మాపః –
సర్వమాపః... భూర్భువస్సువ రాపః" – అని శ్రుతి.

ఆపోమయం – జీవింపచేసే శక్తులతో కూడిన ఈ విశ్వం.

దీనికి స్థానమై, ఆశ్రయమైన నారాయణుడు.

3. ఆప్యాయనం కలిగించే జలములకు జీవములనీ, 'ఆపస్సుల'నీ ప్రసిద్ధనామం. సర్వజలములకు ఆధారస్థానమైన జలతత్త్వ స్వరూపుడు విష్ణువు 'అపాంనిధి'గా ప్రస్తుతింపబడుతున్నాడు.

సముద్రాదులను మొదలుకొని సర్వ జలాశయాలను విష్ణురూపంగా భావించి ప్రణుతించాలి. విశ్వమంతా జలవ్యవస్థను మేఘు, వర్ష, పల్వల, తటాక, నదీ, సాగరాది రూపాలతో వ్యాపింపచేసే వాడతడే.

4. **"సరసామస్మి సాగరః"** (భగవద్గీత. విభూతియోగం) –

'జలాశయాలలో సముద్రుడను నేను' అని భగవానుని వచనం. విష్ణు విభూతియైన సముద్రాన్ని ఈ నామంలో ప్రస్తుతించారు. సముద్రాన్ని ఈశ్వర స్వరూపంగా వేదం వర్ణించింది. అనంత జలనిధి వలె గంభీరుడై, విస్తారుడై,

అంతు చిక్కని వింతలకు ఆకరుడైన అద్భుత తత్త్వ స్వరూపుడు.

...యస్య సముద్రం రసయా సహాహుః! (ఋగ్వేదం)

ఆపోహ యద్ బృహతీ విశ్వమాయన్

గర్భం దధానా జనయన్తీరగ్నిమ్! (ఋగ్వేదం)

విశ్వమంతా వ్యాపించిన జలతత్వం కూడా విష్ణు విభూతియే. ఈ విధంగా అంతటికీ ఆశ్రయమైనవాడు –

అధిష్ఠానమ్..324

1. ఆశ్రయ, ఆధార రూపుడు.

   అధి – ష్ఠ. ఎవరిని ఆధారం చేసుకొని ఈ విశ్వమంతా ఉన్నదో అతడు అధిష్ఠానం. మాతృగర్భాన్ని ఆధారం చేసుకొని శిశువు వర్ధిల్లినట్లుగా, విష్ణు చైతన్యాధారంగా విశ్వం విస్తరిల్లుతోంది.

   ఈ సర్వజగతికి ఉపాదాన కారణమైన బ్రహ్మము గనుక – అధిష్ఠాన నామవాచ్యుడు. (వస్తువు ఏ మూలద్రవ్యం నుండి ఉత్పన్నమౌతుందో – ఆ మూలద్రవ్యం ఆ వస్తువునకు ఉపాదాన కారణం).

   ఉదా ॥ కుండ మొదలైన వాటికి మన్ను వలె.

   'మత్స్థాని సర్వభూతాని' నాయందే సర్వ ప్రాణకోట్లున్నవని భగవానుని గీత.

2. కూర్మరూపుడైన ఆధారశక్తిగా అవతారాన్ని వ్యక్తం చేశాడు. తిరిగే మందర పర్వతానికి నిశ్చలాధారుడై నిలచి తన సర్వాధార తత్త్వాన్ని వ్యక్తపరచినవాడు.

   'మందరాద్రేరధిష్ఠానం భ్రమతో భూన్మహామునే!' అని పురాణవచనం.

   వేదం పలుచోట్ల పరమేశ్వరుని ఈ నామాన్ని ప్రతిష్ఠించింది.

   కింస్విదనీదధిష్ఠాన మారంభణం కతమత్స్వి త్కథాసీత్! (ఋగ్వేదం)

   యత్రేమా విశ్వా భువనాని తస్థుః। (ఋగ్వేదం)

   యస్మిన్ విశ్వాని భువనాని తస్థుః। (యజుర్వేదం)

మనీషిణో మనసా పృచ్ఛతేదు తద్యదధ్యతిష్ఠత్ భువనాని ధారయన్।
(ఋగ్వేదం)

బృహన్నేషామధిష్ఠాతా అన్తికా దివ పశ్యతి । (అథర్వవేదం)

సర్వజీవులకు అధిష్ఠానమైన చైతన్యం (ఆత్మ) ఈతడే. ఆధార, ఆశ్రయరూపుడు ఏమాత్రము ఏమరపాటులేనివాడు కనుకనే -

అప్రమత్తః.. 325

1. ఏమరపాటులేనివాడు.

నారాయణుని అప్రమత్త లక్షణం విశ్వమంతా వ్యాపించి గోచరిస్తుంది. మనం మనల్ని మరచినా మనలో శ్వాస, హృదయ స్పందన, ఇంద్రియచాలనం మొదలైనవి మనలోని అంతర్గత విష్ణు చైతన్యం నిర్వహించే అప్రమత్త వ్యవస్థ. అదేవిధంగా సూర్యాది గ్రహాల సువ్యవస్థ మొదలైనవి విశ్వనిర్వాహకుడైన విష్ణుని అప్రమత్త సమర్థతకు సాక్ష్యాలు.

మహంస్త్వేన్ద్రో రక్షత్యప్రమాదత్ (అథర్వవేదం).

అత్యంత జాగరూకుడైన పరమజ్ఞాన స్వరూపుడు.

2. ఎవరికి ఏ ఫలాన్ని అందివ్వాలో అత్యంత జాగరూకతతో తగిన విధంగా, తగిన సమయానికి అందించే కర్మఫల ప్రదాయకుడు.

భక్తులను రక్షించడంలో ఎల్లవేళలా మిక్కిలి జాగరూకుడై గమనించువాడు. ఏమరపాటులేక కనిపెట్టుకొని కాపాడే నిజమైన రక్షకుడు శ్రీహరియే. ప్రహ్లాదులను పరిరక్షించడంలో ఈ లక్షణాన్నే ప్రదర్శించాడు. ఆయనను ఆధారం చేసుకొని అన్నీ నిలచి ఉన్నాయి. కానీ ఆయనకు ఆధారం? ఆయనయే. కనుక -

1. తనయందు తాను నిలుకడ కలిగినవాడు.

"సభగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి – స్వేమహిమ్ని" (ఛాందోగ్య ఉపనిషత్)

'ఆ భగవానుడు దేనియందు నిలకడగా (ఆధారమై) ఉన్నవాడు?' అనే నారదుని ప్రశ్నకు 'తన మహిమయందే' అని సనత్కుమారుని సమాధానం.

2. సభయందు సభాపతి ప్రతిష్ఠితుడు. అతడిచే సభయంతా నిర్వహింపబడుతోంది. అలాగే సర్వజీవనోపాధుల ఇంద్రియ చైతన్యాదులు ఆత్మచైతన్యంచే నిర్వహించబడుతున్నాయి. కానీ ఆత్మకు ఏదీ ఆధారం కాదు.

ఆ విధంగా సర్వజీవులందు వ్యాపించిన ఆ అంతర్యామియే స్వయం ప్రతిష్ఠితుడు.

చరాచర విశ్వంలో సృజనాది కర్మలను, సభాపతి సభను వలె, నిర్వహించే ప్రతిష్ఠితుడీ విష్ణువే.

అసతి సత్ ప్రతిష్ఠితం సతి భూతం ప్రతిష్ఠితమ్।
భూతేహ భవ్య ఆహితం భవ్యంభూతే ప్రతిష్ఠితమ్
తవేద్విష్ణో బహుధా వీర్యాణి ॥ (అథర్వవేదం)

కూర్మ, వరాహాది అవతారాలలో సర్వమును తాను ధరించి, తనను ధరించేవారెవరూ అక్కరలేని 'ప్రతిష్ఠిత'స్వరూపాన్ని రూఢిచేశాడు.

ఈ శ్లోకంలోని నామములన్నీ నారాయణుని ఆధార స్వరూపాన్ని తెలియజేస్తున్నవే. ప్రాణాదులన్నీ విష్ణుని ప్రతిష్ఠా రూపశక్తిని ప్రకటిస్తున్నాయి. ఈ చైతన్యంగా సర్వజీవుల పోషణ, శోషణలకు హేతువైనవాడు –

స్కన్దః స్కన్దధరో ధుర్యో వరదో వాయువాహనః।
వాసుదేవో బృహద్భానుర్ ఆదిదేవః పురన్దరః॥ ... 36

327. స్కన్దః, **328.** స్కన్దధరః, **329.** ధుర్యః,
330. వరదః, **331.** వాయువాహనః, **332.** వాసుదేవః,
333. బృహద్భానుః, **334.** ఆదిదేవః, **335.** పురన్దరః॥

స్కన్దః.. 327

1. గమనము చేయు (చేయించు) వాడు. శోషింపజేయువాడు.

   'స్కందిర్ - గతి శోషణయోః' - అనే ధాతువు నుండి స్కంద శబ్దం నిష్పన్నమయ్యింది.

   గమనము చేయుట - ప్రసరించుట - ప్రవహించుట సమానార్థకాలు. విశ్వమంతా ఈ ప్రసరణ రూపంగా విష్ణు చైతన్యం వ్యాపకమై గోచరిస్తున్నది. వాయువు, జలం మొదలైనవే కాక, ప్రతి క్షణంలో, కణంలో నిరంతరం చైతన్య ప్రసరణ ఉంది. కదలిక (గతి) ఉంది. అదే చైతన్య లక్షణం. సముద్రంలో అలలలో కదలిక ఉంది. ఆ కడలిలోనే ఎన్నో ప్రాణుల కదలికలున్నాయి.

   అదేవిధంగా 'వాయు' రూపుడై ప్రతిదానినీ శోషింప (ఎండింప) జేసేవాడు. గాలిలోని ఈ శక్తి చేతనే పదార్థాలకు 'పొడి' లక్షణం సమకూరుతుంది.

2. నిరంతర గమనంతో, శత్రువులను శోషింప చేసే శక్తి స్వరూపుడు.

3. అమృతరూపంగా ప్రవహించే విష్ణుని వల్లనే సర్వమూ చైతన్యమయమవుతున్నాయి.

   యోగసిద్ధిలో సహస్రారకమలంలో అమృత ప్రవాహంగా లభించే సచ్చిదానంద స్థితియే విష్ణువు. ఇదే స్కన్ద స్వరూపం. సర్వనాడులను తడిపే

అమృత ప్రవాహమితడే. (ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయ మహసః – అని 'సౌందర్యలహరి'లో ఈ స్థితిని శంకరులు వర్ణించారు.)

4. 'సేనానీనామహం స్కన్దః'

'సేనానులలో కుమారస్వామి(సుబ్రహ్మణ్యుడు)ని నేను" అని గీతావచనం. సుబ్రహ్మణ్యరూపుడై దేవసేనలను నడిపిన వాడితడే.

పురుషో విష్ణురిత్యుక్తః శివోవా నామతః స్మృతః।
అవ్యక్తం తు ఉమాదేవీ శ్రీర్వా పద్మనిభేక్షణా।
తత్సంయోగా దహంకారః సచసేనాపతిర్గుహః॥

– అని స్కాంద పురాణ వచనం.

"పార్వతీ శివులు, లేదా – లక్ష్మీనారాయణులు.. వీరే ప్రకృతీ పురుషులు. వారి సమైక్య చైతన్యమే 'అహంకారం'. ఇదే సేనాపతి అయిన గుహుని స్వరూపం."

అధి స్కన్ద వీరయస్వ (అథర్వవేదం)
ద్రప్సశ్చస్కన్ద ప్రథమాం అను.... (ఋగ్వేదం).

సర్వజీవులలో 'అహం' స్ఫురణగా వ్యక్తమయ్యే విష్ణు చైతన్యమే స్కన్దుడు. ఈ 'అహం' రూప స్ఫురణ మన ఇంద్రియాల చైతన్యాన్ని ఏకోన్ముఖం చేసి నడిపించే సేనాని. ఈ అహానికి మూలమైన ఆత్మగా ఉన్నది విష్ణువే కనుక ఆయనే–

స్కన్దధరః.. 328

1. గతులను, మార్గములను ధరించువాడు.

ధర్మాది మార్గాలను చక్కబరచి నడిపించువాడు కనుక స్కన్ద ధరుడు. 'స్కన్ద' శబ్దానికి 'మార్గం' అని కూడా అర్థం ఉంది. 'గమనమునకు ఆధారమైనది' కనుక ఈ అర్థం.

ధర్మ పథములను ధరించే సమర్థత కలిగిన కారణంగా –

ధుర్యః.. 329

1. మార్గ నిర్దేశకుడు.

'ధూః' అనే శబ్దాన్ని 'అగ్రభాగం' అనే అర్థంలో వ్యవహరిస్తారు. ఆ అగ్రభాగాన్ని వహించువాడు - ధుర్యః.

అగ్రగామి - పురోగామి. సర్వసేనలకు ముందుండి నడిపే స్కన్దుడే ధుర్యుడు. గతికి మూలమైనవాడు.

శ్రేష్ఠుడు, ముఖ్యుడు అనే అర్థంలో ఈ శబ్దాన్ని వాడతారు. సర్వజగతికీ, సర్వదేవతలకు శ్రేష్ఠుడై, ముఖ్యుడైన శ్రీహరియే ధుర్యుడు. ఈయనని అనుసరించే సర్వ విశ్వము సంచరిస్తోంది.

ఇహ త్వష్టారమగ్రియం విశ్వరూప ముపహ్వయే। (ఋగ్వేదం)
కవిః శుషస్య మాతరా రిహాణే జామ్యై ధుర్యం పతిమేరయే తామ్ ।
(అథర్వవేదం)

2. **ధురం వహతి ధుర్యః.**

సమస్త ప్రాణికోట్ల జన్మస్థితిలయాది భారాన్ని వహించేవాడు ధుర్యుడు. భక్తులను సదా - పసిపాపలను తల్లి వలె - భరించి కాపాడే కరుణాళువు. సర్వమునకు అగ్రగామి, సర్వ కార్య భార నిర్వాహకుడు కనుకనే, వలసినవి సమకూర్చే ఈతడు -

వరదః.. 330

1. వరములనిచ్చువాడు.

'వ్రియతే ప్రార్థ్యతే ఇతి వరః'. కోరబడునవి వరములు. అభీప్సితార్థములు. సర్వజీవులు శుభాలను కోరుతాయి. ఎవరికి ఏ శుభాల నివ్వాలో వాటిని ప్రదానం చేసేవాడు. భక్తులకు ఇష్టార్థములను ఇచ్చువాడు.

2. వేద సంప్రదాయ ప్రకారం - యజ్ఞంలో యజమానుడు ఋత్విజులకు ఇచ్చే దక్షిణను 'వరం' అంటారు. **'గౌర్వై వరః'** (గోవుయే వరము - దక్షిణ)

అని వేదవచనం. యజ్ఞ స్వరూపుడైన శ్రీహరియే గోరూపాది దక్షిణ నిచ్చువాడు.

3. వరదుడైన వాడితడే కనుక సర్వులూ ఈయననే అర్థించి ధన్యులౌతున్నారు. కనుకనే శ్రుతి ఈతనిని 'వరేణ్యం' అని కీర్తించింది.

(వరేణ్యం విష్ణ్వాత్మనే – గాయత్రీన్యాసం), 'తత్సవితుర్వరేణ్యం' అని గాయత్రీ ప్రథమపాదం. వరములను కోరువారిచే ప్రార్థింపబడువాడు; వరించుటకు యోగ్యమైనవాడు – వరేణ్యుడు.

'యత్కామస్తే జుహు మస్తన్నో అస్తు వయం స్యామ
పతయో రయీణామ్'.

'భూరిదా భూరి దేహి నోమా దభ్రం భూర్యాభర'

– అని ఋగ్వేదం 'ఐశ్వర్యాల పతిగా, కామితాలను సమృద్ధిగా తీర్చువాని'గా ప్రస్తుతించింది.

వాయువు వలె సర్వత్ర సంచరించి కర్మఫలాల నందించువాడు కనుక –

వాయువాహనః.. 331

1. వాయువును ప్రవర్తింపజేయువాడు.

జలములకు నిధి (అపాంనిధిః)యై విశ్వాన జలతత్త్వాన్ని వర్తింపజేయునట్లే, వాయుతత్త్వాన్ని నిర్వహించేవాడు విష్ణువే.

వాయుశబ్దానికి 'గతి, గన్ధన' అని అర్థాలు. 'వాహన' శబ్దం **'వహొ ప్రాపణే'** అనే ధాతుజన్యం. వాయువును వహించువాడు, ప్రవర్తింపజేయువాడు.

విశ్వంలో వాయువు వివిధ విధాలుగా వ్యాపించి సర్వమును వహిస్తున్నది. దానిని వహించి, నడపువాడు శ్రీహరి.

2. శరీరంలో ప్రాణములుగా ఉన్నవి వాయువులే. వాటిని శరీరంలోని వివిధ స్థానాలలో, వివిధ విధాలుగా ప్రవర్తింపజేసే ప్రాణ శక్తి స్వరూపుడు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన – అనే పంచ ప్రధాన వాయువులు; నాగ,

కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ - అనే పంచ ఉపవాయువులుగా శరీరంలో ప్రవర్తిల్లుతూ జీవింపజేస్తున్న చైతన్యం విష్ణు స్వరూపం. 'ప్రాణాది భేదాలతోనున్న వాయువు ద్వారా జీవులను సంచరింపజేయువాడు' అని ఈ నామానికి అర్థాన్ని గ్రహించవచ్చు.

వ్యవహారంలో కూడా యంత్ర గణాలు వాయువు ద్వారా సంచాలితాలౌతాయి.

3. విష్ణు రూపుడైన సూర్యుడు వాయు మండలాలను వివిధ కాలాలలో వివిధ రకాలుగా నిర్వహిస్తున్నందున ఆదిత్యుని 'వాయు వాహనుడు' అని నిర్వచించాలి.

వాయువు మందంగా వీచి సుఖింపజేసినట్లే, తీవ్రుడై క్షోభింపజేస్తున్నాడు. అదేవిధంగా జీవుల కర్మగతులనందించే విష్ణువు వాయువు వలె శుభ, అశుభ, శుభాశుభ మిశ్ర - అనే మూడు విధాల కర్మ ఫలాలను ప్రదానం చేస్తున్నాడు.

3. వైదిక విజ్ఞానపరంగా - ఈ విశ్వాన వాయువు వివిధ స్థలాలలో అనేక భేదాలతో నిండి ఉన్నాడు.

1. ఆవహ, 2. ప్రవహ, 3. అనువహ, 4. సంవహ, 5. వివహ, 6.వరావహ, 7. పరివహ - అనే ఏడు విధాలుగా వాయు మండలాలు ప్రవర్తిస్తున్నాయి. ఈ నామాలలోని 'వహ' శబ్దం - 'వాయువాహన' నామంలో ఇమిడి ఉంది.

1. భూమికి మేఘ మండలానికి నడుమ - ఆవహం, 2. మేఘమండలానికీ రవి మండలానికీ నడుమ - ప్రవహం, 3. రవి మండలానికీ చంద్రమండలానికీ (సూర్య మండలమునకు పైనున్న రసస్థానం) నడుమ - అనువహం, 4. చంద్రమండలానికీ నక్షత్ర మండలానికీ నడుమ - సంవహం, 5. నక్షత్ర మండలానికీ గ్రహాలకీ నడుమ - వివహం, 6. గ్రహాలకీ సప్తర్షులకీ నడుమ - వరావహం, 7. సప్తర్షి మండలానికీ ధ్రువ మండలానికీ నడుమ - పరివహం.

అనంత విశ్వంలోని వాయువుల లక్షణాల ననుసరించి మన ప్రాచీన విజ్ఞానం పెట్టిన పేర్లివి.

మనలో మూలాధారం నుండి సహస్రారం వరకు వ్యాపించిన ముఖ్య ప్రాణ స్వరూపాన్ని కూడా సప్తవాయుభాగాలుగా గ్రహించవచ్చు. ఈ వాయూపాసనయే యోగవిద్య. యోగ విద్యా స్వరూపుడైన యోగీశ్వరుడే వాయువాహనుడు.

తద్ధావతో న్యానత్యేతి తిష్ఠత్తస్మిన్నపో మాతరిశ్వా దధాతి। (యజుర్వేదం)
... కస్మాదంగాత్ సవతే మాతరిశ్వా। (అథర్వ వేదం)
యస్మాద్ వాతా ఋతుధా పవన్తే.... । (అథర్వవేదం).

ఈ విధంగా వాయ్వాది రూపాలతో అంతట వ్యాపించి, దీపించువాడైనందున–

వాసుదేవః.. 332

1. (అంతట) వసించి ప్రకాశించువాడు.

ద్వాదశాక్షరీ మహామంత్రంలోని నామమిది.

'వస నివాసే' 'వస అచ్ఛాదనే' – అనే ధాత్వర్థాల ననుసరించి – నివసించుట, ఆచ్ఛాదనము చేయుట – అనే ధర్మము చేత 'వాసుః'. **వసతి – వాసయతి – ఆచ్ఛాదయతి = వాసుః.** సర్వమున అంతర్యామిగా 'వసించువాడు', తద్వారా సర్వమును 'వసింపజేయు వాడు' దీపప్రకాశం అంతటా ఆవరించినట్లు తన చైతన్యంతో విశ్వమునంతా ఆవరించు (ఆచ్ఛాదించు) వాడు 'వాసుః'.

'ఈశావాస్యమిదం సర్వం యత్కించిజ్జగత్యాంజగత్'

....విశ్వంలో సర్వము ఈశ్వరునిచే ఆవాస్యమై (ఆవరించబడి) ఉన్నది. కుసుమాలలో గంధానికి మనం 'వాసన' అని అంటాం. అంటే 'అంతటా ఆవరించే ధర్మం కలది' అని అర్థం. పువ్వులలో గంధం ప్రతి అణువులోనూ వ్యాపించి ఉండడం చేత, అది పరిసరాలలో పరచుకోవడం చేత దానికి ఆ పేరు వచ్చింది. అదేవిధంగా సర్వజగతిలో ప్రతి అణువునా వ్యాపించిన

చైతన్య స్వరూపుడు 'వాసుః'.

వాసుశ్చాసౌ దేవశ్చ - వాసుదేవః.

ఆ విధంగా వాసించి 'ప్రకాశించువాడు' - వాసుదేవుడు.

'దేవ'శబ్దం ప్రధానంగా చైతన్యవాచకం. 'ప్రకాశించుట' అనేది ప్రకటించుట-ప్రచోదనము చేయుట అనే ధర్మాలను తెలియజేస్తుంది. విశ్వమంతా ప్రకటింపబడే చైతన్యమే సర్వమును ప్రచోదనం చేస్తున్నది. ఈ 'వాసించుట', 'దీపించుట' (ప్రకాశించుట) అనే లక్షణాల చేత విష్ణువు 'వాసుదేవుడు'.

'దివ్' అనే ధాతువు నుండి 'దేవః' అనే శబ్దం పుట్టింది.

'దీవ్యతి ఇతి దేవః'. ఈ ధాతువునకు అనేక అర్థాలున్నాయి.

దీవ్యతి - క్రీడతే, విజిగీషతే, వ్యవహరతి, ద్యోతతే, స్తూయతే, గచ్ఛతీతి -దేవః.

1. **క్రీడతే** - సృష్టిస్థితిలయాది కృత్యాలను లీలగా ఆటవలె నడుపువాడు.
2. **విజిగీషతే** - సర్వమును జయించదలచువాడు. విశ్వ, ధర్మాలకు విఘాతం కలిగించే దుష్టులను జయించి విశ్వ ధర్మములను ప్రతిష్ఠించేవాడు.
3. **వ్యవహరతి** - విశ్వమందు జీవరూపమున వ్యవహరించువాడు. విశ్వ వ్యవహారంగా గోచరించువాడు.
4. **ద్యోతతే** - స్వయం ప్రకాశుడై అంతటా దీపించువాడు.
5. **స్తూయతే** - దేవతలచే, ఋషులచే, వేదాలచే స్తుతింపబడువాడు.
6. **గచ్ఛతి** - అంతటా సంచరించే చైతన్యస్వరూపుడు.

- సర్వత్ర వ్యాపించి (వాసుః), పై ఆరు ధర్మాలతో గోచరించు (దేవః) వాడు కనుక 'వాసుదేవుడు'.

అంతటా వ్యాపించిన ఆత్మజ్ఞానాన్ని స్ఫురింపజేసే నామమిది.

'వాసుదేవ స్సర్వమితి సమహాత్మా సుదుర్లభః'. (గీత). వాసుదేవ జ్ఞానం కలిగిన మహాత్ములు అరుదు. జ్ఞానములలో పరమమైనది ఇదే. అంతటా

వసించి దీపించే ఆత్మ తత్త్వాన్ని దర్శించడమే కైవల్యం.
ఆ తత్త్వమే విష్ణువు.

ఛాదయామి జగత్సర్వం భూత్వా సూర్య ఇవాంశుభిః।
సర్వభూతాధి వాసశ్చ వాసుదేవస్తతః స్మృతః॥

"సూర్యుడు తన కిరణాలతో జగత్తునంతా అవరించి (కప్పి)నట్లుగా, నేను సర్వమును వ్యాపించి ఉన్నాను. సర్వ భూతములకు అధివసించే ఆశ్రయస్థానాన్ని కూడా నేనే అయి ఉన్నాను (అవి నాయందు వసించును). అందుచే నేను 'వాసుదేవుడ'ని స్మరింపబడుతున్నాను."

వాసనాత్ సర్వభూతానాం వసుత్వా ద్దేవయోనితః।
వాసుదేవస్తతో వేద్యః యోగిభిః తత్త్వదర్శిభిః॥

(మహాభారతం. ఉద్యోగపర్వం)

"సర్వ ప్రాణులను వాసించుట (కప్పివేయుట) చేతను, 'వసువు' (అన్ని భూతములను తనయందు వసింపజేయుట) వలనను, దేవతలకు మూలమగుట వలనను 'వాసుదేవుడ'ని తత్త్వవేత్తలచే తెలియబడుతున్నాడు."

సర్వత్రాసౌ సమస్తం చ వసత్యత్రేతి వైయతః।
తతస్స వాసుదేవేతి విద్వద్భిః పరిపఠ్యతే॥ (విష్ణుపురాణం)

"అన్నిటియందు ఈతడు, ఈతని యందు అన్నీ వసించడంచేత ఇతడు వాసుదేవుడు అని వేద శాస్త్రములందంతట పఠింపబడుతున్నాడు."

సర్వాణి తత్ర భూతాని వసంతి పరమాత్మని ।
భూతేషు చ స సర్వాత్మా వాసుదేవస్తతః స్మృతః॥ (విష్ణు పురాణం)

"ఆ పరమాత్మయందే సర్వభూతములు వసించుచున్నవి. భూతములయందు సర్వాత్ముడై (ఆత్మ తత్త్వమై) ఉన్నది ఆ పరమాత్ముడే. అందుచేతనే ఆతడు వాసుదేవుడు."

బలాద్వసుత్వాత్ దాతృతో వర్తనాశ్చ
తం వాసుదేవం ప్రవదంతి వేదాః.

"ప్రాణమై, వసువై (వసించువాడై – వసింపజేయువాడై), ఫలప్రదాతయై, వర్తించువాడై ఉన్నందున వేదములాతనిని 'వాసుదేవుడ'ని చక్కగా పలుకుతున్నాయి." (స్మృతి)

ప్రకాశాలకే ప్రకాశుడై (దేవః) ఉన్నందున ఆ వాసుదేవుడే –

బృహద్భానుః.. 333

1. గొప్ప ప్రకాశములు కలవాడు.

విస్తృతమై, అనంతమైన ప్రకాశశక్తి కల విష్ణువు చేతనే సూర్య నక్షత్రాదులు ప్రకాశాన్ని పొందుతున్నాయి. సర్వ జీవులలోని ప్రకాశం (చైతన్యం) అతడే కనుక, అనంత ప్రకాశ మూర్తి.

ఆయన నుండి వెలువడే చైతన్య కిరణాల చేతనే సర్వశక్తులు ప్రకాశింపబడుతున్నాయి.

స్వామి వెలుగులు ఎంత దూరానికైనా ప్రసరించేటంత బృహల్లక్షణం కలవి.

బృహంతో భానవో యస్య చంద్ర సూర్యాది గామినః।
తైర్విశ్వం భాసయతియః స బృహద్భాను రుచ్యతే"

"సూర్యచంద్రాదులను కూడా చేరి, వాటిచే విశ్వాన్నంతటినీ ప్రకాశింపజేస్తున్న పరమ తేజస్స్వరూపుడైనందున బృహద్భానుడ"ని పురాణ వచనం.

వేదం ఈ నామాన్ని పలుచోట్ల పలికింది –

పాహి రీషత ఉత వా జిఘాంసతో బృహద్భానో యవిష్ఠ్య' (ఋగ్వేదం)
దేవాస్త ఇన్ద్ర సంఖ్యాయ యేమిరే బృహద్భానో మరుద్గణ (ఋగ్వేదం)
బృహద్భానో శవసా వాజముక్థం దధాసి దాశుషే కవే ।। (యజుర్వేదం)

2. "గొప్ప శబ్ద (వాక్) స్వరూపుడు" అనే అర్థాన్ని కూడా, వైదిక సంప్రదాయానుగుణంగా చెప్పవచ్చు.

వాక్కులు కూడా భానువుల (కిరణాల) వంటివే.

వాక్కులు విషయాన్ని ప్రకాశింపజేసే శబ్ద రూపకిరణాలు.

సామాన్య అనుభవంలో చూసినా – అకస్మాత్తుగా చీకటి ఏర్పడినప్పుడు మన నుండి శబ్దాలు వెలువడతాయి. 'ఎక్కడున్నావు? ఎక్కడుంది? జాగ్రత్త?' ఇలాంటి మాటలతో ఉనికిని గమనించే ప్రయత్నం చేస్తాయి. జ్ఞాన ప్రకాశ (తెలియజేసే) లక్షణం చేత వాక్కులను కిరణాలుగా వేదవిజ్ఞానం పలుచోట్ల వర్ణించింది. అన్ని వాక్కులకు మూలమైన శబ్ద బ్రహ్మ స్వరూపుడు, వేద రూపుడు శ్రీ మహా విష్ణువే 'బృహద్భానుడు'.

తాను ప్రకాశింపజేసే సూర్యాది వస్తువుల కన్నా ముందున్న పరమ ప్రకాశుడు, స్వయంప్రకాశుడు కనుక –

ఆదిదేవః.. 334

1. తొలి కారణమై, ప్రకాశాది లక్షణములు కలవాడు.

   అన్ని ప్రకాశాలకు మూలమైనవాడు కనుక ఆది. అంతేకాక – దేవతలందరికీ మొదటివాడు అదిదేవుడు. **'యో దేవానాం ప్రథమం పురస్తాత్'** అని శ్రుతి. అన్నిటికీ తొలియై ప్రకాశించువాడు.

   'దేవ' శబ్దానికి 'క్రీడనార్థం' 332 నామంలో చెప్పుకున్నాం –

   సంప్రయోజ్య వియోజ్యాయం కామకారకరః ప్రభుః।
   క్రీడతే భగవాన్...

   జగమునందు అన్నిటినీ చేర్చి, విభజించే జగత్ప్రభువు తన ఇచ్ఛవచ్చినట్లు 'క్రీడించుచున్నాడు' అని భారతం (ఆదిపర్వం. 30-40).

   తొలికారణమై, పై విధంగా క్రీడించువాడు.

2. అన్నిటినీ (ఉపసంహరించు) తనలోనికి గ్రసించు దేవుడు.

   అదత్త ఇతి ఆదిః. తనలోనికి తీసుకొను దేవుడు తననుండి విస్తరించిన సృష్టిని తిరిగి అవ్యక్తరూపుడై ఉపసంహరించువాడు. 'ఒక పరి జగముల వెలినిడి, ఒకపరి లోపలికి గొనుచు' అని గజేన్ద్రుని స్తుతి.

   యస్మాజ్జాతం న పురా కించనైవ య ఆబభూవ భువనాని విశ్వా।

   (యజుర్వేదం)

.... ఏషో హదేవః ప్రదిశోను సర్వాః
పూర్వోహ జాతః స ఉ గర్భే అన్తఃll (యజుర్వేదం)

– అని పరమాత్ముని ఆదిదేవ తత్త్వాన్ని వేదం వినుతించింది.

ఆది మాత్రమే కాక, అంతమునందుండు చైతన్యరూపుడు కూడా –

పురన్దరః.. 335

1. పురములను పడగొట్టు (పగులగొట్టు) వాడు.
   సమయమెరిగి జగద్రూప పురములను పోగొట్టువాడు – నశింపజేయువాడు.
   'పూరణాత్ పురః' – భగవానునిచే నింపబడిన చైతన్యంతో కూడిన శరీరాదులే పురములు. ఈ ఉపాధులను నశింపజేసేవాడూ ఆయనే.
2. స్థూల సూక్ష్మ కారణ శరీరాలను తన చైతన్యంతో నడిపిస్తూనే, వాటికి అవల వెలిగేవాడు. ఆ శరీరాలు నశించినా తాను నశించని ఆత్మ స్వరూపుడు. ఈ పురందర జ్ఞాన మెఱిగిన వాడు 'తాను దేహాన్ని (పురమును)' అనే భ్రాంతిని విడచి కర్మ బంధనాలను ఛేదించుకోగలడు. అన్ని ఆవరణలను తొలగించువాడు ఆతడే.
   ఏది ఆదిగా ప్రకాశించే ఆత్మ చైతన్యమో (ఆది దేవః) – అది పురందర జ్ఞానము చేతనే అవగతమౌతుంది. స్థూల సూక్ష్మ కారణ దేహ బంధాలను తొలగించేవాడు ఆతడే.
3. మహేశ్వర స్వరూపుడై తారకాక్ష, విద్యున్మాలి, కమలాక్షుడు అనే త్రిపుర దనుజులను సంహరించిన జ్ఞాన ప్రకాశుడు.
   సర్వ రాక్షసుల స్థానాలను (నివాసాలను) సంహరించే వాడని కూడా అర్థాన్ని గ్రహించవచ్చు.

పురన్దరో గోత్ర భిద్ వజ్ర బాహురాయాతు యజ్ఞముప నో జుషా ణఃll
(యజుర్వేదం)

ఇన్ద్రో మన్థతు మన్థితా శక్రఃపురన్దరఃll (అథర్వవేదం)

జనన మరణ రూపమైన పురములను ఛేదించి, పురములకు అతీతమైన ఆనన్దాన్ని ప్రసాదించువాడు కనుక –

అశోకస్తారణస్తారః శూరః శౌరిర్జనేశ్వరః।
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః॥... 37

336. అశోకః, **337.** తారణః, **338.** తారః, **339.** శూరః,
340. శౌరిః, **341.** జనేశ్వరః, **342.** అనుకూలః, **343.** శతావర్తః,
344. పద్మీ, **345.** పద్మనిభేక్షణః.

అశోకః.. 336

1. శోకాదులు లేనివాడు.

శోక భయ మోహాది వికారాలు అజ్ఞాన జనితాలు.

కేవల జ్ఞాన స్వరూపుడైన హరి అశోకుడు కేవలానందమయుడు.

శోక మోహాలు, ఆకలి దప్పులు, జరామృత్యువులనే షడూర్ములు లేనివాడు.

తత్ర కో మోహః కః శోకః ఏకత్వ మనుపశ్యతః। (యజుర్వేదం)

"అంతటా ఏకత్వాన్ని నిరంతరం చూసేవానికి మోహమెక్కడ? శోకమెక్కడ?"

వికృతులన్నిటి వెనుక అవికారుడై ఉన్న ఆత్మ నెరిగిన వానికి శోకాదులుండవు.

"తరతి శోకమాత్మవిత్" అనే ఉపనిషత్ప్రమాణంతో – ఆత్మ నెరిగినవాడు శోకం నుండి తరింపబడతాడు. ఈ క్రమమే తరువాత నామాలతో అనుసంధానమయింది.

ఆనంద స్థితిని చేకూర్చుతూ శోకాదుల నుండి జీవులను దాటించువాడు కనుక –

తారణః.. 337
తారః.. 338

1. దాటించువాడు.

ఈ రెండు నామాలు సమానార్థకాలు. మరి విడివిడిగా చెప్పడానికి కారణం ఏమిటి?

జీవులు కర్మ గతిలో ఒక స్థితి నుండి మరియొక స్థితికి చేరతారు. ఒక జన్మ నుండి మరియొక జన్మకు, ఒక లోకం నుండి మరియొక లోకానికి. అలా క్రమంగా వారి వారి పక్వత ననుసరించి ఉత్తమ గతులను పొందుతారు. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి దాటించే వ్యవస్థారూపంగా వ్యాపించిన విష్ణువే తారణుడు.

ఆశ్రయించిన భక్తులను భయశోకాది అజ్ఞానమయమైన సంసార సముద్రం నుండి దాటించేవాడు నారాయణుడే

గర్భ జన్మ జరామరణాది సంసార సాగరమహాభయాత్తారయతీతి తస్మాదుచ్యతే తారః (అథర్వ శిరః)

గర్భ - జన్మ- వార్ధక్య - మృత్యు... మొదలైన స్థితులతో కూడిన సంసార సాగర మహా భయం నుండి దాటించువాడు తారుడు.

ఒక స్థితి నుండి మరియొక స్థితికి చేర్చువాడు 'తారణః' అయితే, అసలు అన్ని స్థితులకు అతీతమైన కైవల్య ధామాన్ని చేర్చేవాడు 'తారః' - ఈ రెండూ హరి కృపా ఫలాలు.

ఈ భావమే యజుర్వేదంలో -

"నమః ప్రతరణాయ చోత్తరణాయ చ" - అని రుద్ర నమక మంత్రం.

2. ఓం కారస్వరూపుడు.

ఓం కారమే తారకము. ప్రణవాన్ని 'తారః' అని శ్రుతి చెబుతోంది -

'ఓంకారస్తారః'

'నమస్తారాయ' (రుద్ర నమకం)

ప్రణవోసాపనతో జీవుడు తరించుతున్నాడు. అలా తరింపజేసే ప్రణవమే పరమాత్ముని స్వరూపం.

శ్రీరామాది నామ, రూపాలతో తరింపజేసే తారకమంత్రస్వరూపుడు.

సన ఇన్ద్ర ఇవ దేవేభ్యో వహ్నిः సన్తారనోభవ। (యజుర్వేదం)

ఇన్ద్ర, వహ్ని శబ్ద వాచ్యుడైన వేదవేద్యుడు, విష్ణువు. దుఃఖాదుల నుండి దాటించువాడిగా వేదాలలో పలు విధాల కీర్తితుడు.

అలా దాటించగలిగే పరాక్రమం ఆయన వద్దనే ఉంది గనుక –

శూరః.. 339

1. విక్రమము కలవాడు.
   'శూర వీర విక్రాన్తౌ' అనే ధాత్వర్థాన్ని అనుసరించి విక్రమణ స్వభావము కలవాడు కనుక శూరుడు. మాయని దాటించే (జయించే) జ్ఞానమే నిజమైన విక్రమము. ఆ విధమైన జ్ఞానమే తానైనవాడు శూరుడు.
2. వివిధ దనుజులను దునుమాడిన రాక్షస సంహారకుడు, జయశీలుడు కనుక శూరుడు.
3. వి–క్రమ... విశేషముగా విశ్వమంతా వ్యాపించినవాడు శూరుడు. ఉత్పత్తి స్థితిలయాది కృత్యాలతో అద్భుతంగా విశ్వాన వ్యాపించిన 'త్రి–విక్రమత్వా'న్ని పైనామం సూచిస్తోంది.
4. **శవతి గచ్ఛతి సర్వత్ర...** అడ్డులేకుండా అంతటా నడచువాడు.
5. **'శవతి ప్రాపయతి సర్వాభీష్టం'...** భక్తుల సర్వాభీష్టములను పొందింపజేయువాడు. మోక్షకారకునిగా 'తారః'. అభీష్టప్రదాతగా 'శూరః'.

   త్రాతార మిన్ద్ర మవితార మిన్ద్రం హవే హవే సుహవం శూర మిన్ద్రమ్।
   ఆ యాత్విన్ద్రోవస ఉప నఇహా స్తుతः సధమాదస్తు శూరః।

   (యజుర్వేదం)

   ... సఖా చ శూరోవితా చ నృణామ్ ॥ (అథర్వ వేదం)

ఈ నిత్య శూరస్వభావం చేతనే –

శౌరిః.. 340

1. విక్రమ స్వభావంతో సృష్ట్యాది నుండి ప్రళయ పర్యంతం - సర్వదా దీపించువాడు.
2. వసుదేవునకు 'శూరు'డని పేరు. అతని పుత్రుడు శ్రీకృష్ణుడు శౌరి. (**శూరస్య వసుదేవస్య అపత్యమ్ శౌరిః**)

ఈ పరాక్రమ లక్షణంతో సర్వజనులకు ప్రభువై -

జనేశ్వరః.. 341

1. జనులకు పాలకుడు.

జనన ధర్మం కల జీవులందరికీ ఐశ్వర్యాదులనిచ్చువాడు, శాసించువాడు, పాలించువాడు.

కాలో హ సర్వస్యేశ్వరో యః పితాసీత్ప్రజాపతేఃll (అథర్వవేదం)

య ఈశే అస్య ద్విపదశ్చతుష్పదః - (యజుర్వేదం)

జనులను పాలించే ఈ ఈశ్వరుని చేతనే జన్మను నిలిపే ఆయువు వంటివి వృద్ధి చెందుతాయి కనుక **'మా న ఆయుః ప్రమోషీః'** (యజు) అని జీవులు ఈతనిని ప్రార్థిస్తున్నారు.

ఈ ఈశ్వరునిగా సర్వజనులకు -

..ుకూలః.. 342

1. అనుకూలుడు.

సర్వ ప్రాణికోట్లలో ఆత్మగా ఉన్నవాడు. ఎవరైనా తనకు తాను ప్రతికూలుడు కాలేడు కదా. తనకు తానే అనుకూలుడు.

ఆత్మేతరమే ప్రతికూలం. **'అహమాత్మా గుడా కేశ! సర్వభూతాశయస్థితఃll'** - అని గీతావాక్యం. అందరిలో ఆత్మగా ఉండే పరమాత్మయే అనుకూలుడు.

2. ఆశ్రితులైన భక్తులను తగిన విధంగా అనుగ్రహించే భక్త వశ్యుడు.

'హస్తావలంబకోహ్యేకః భక్తి క్రీతః జనార్దనః' –
భక్తిచే కొనబడి స్వాధీనునిగా ఉండే జనార్దనుడు.
భక్తుల భావాలను అనుసరించి ఎలా పిలచినా, ఎలా తలచినా, ఎలా కీర్తించినా అలా బదులు పలికి అనుగ్రహించే కరుణానిధి.

'యే యథామాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అని గీతావాక్యం.

3. విశ్వమందంతటా 'అనుకూలత' అనేదే విష్ణు శక్తి.
ఒక్క కర్మయైనా, ఒక్క వస్తువైనా ఈ 'అనుకూలత' అనే విశ్వ వ్యవస్థ లేనిదే ఉనికిని పొందలేవు. ఒక పంట చేతికి రావాలంటే విత్తనం, భూమి, వర్షం వంటివాటితోపాటు పురుగూ, వ్యాధీ వంటి అవాంతరాలు లేని స్థితి ఉండాలి. ఇన్నీ అనుకూలిస్తేనే పంట లభిస్తోంది. అలాగే ప్రతి జీవి ఉనికీ, ప్రతి పని తీరూ మనకంతుపట్టని అనుకూలతను అనుసరిస్తూనే ఉంటుంది. ఈశ్వరశక్తి ఈ విధంగా అనుకూలంగా ఒదిగి రాకపోతే మన ప్రయోజనాలేవీ నెరవేరవు. కాస్త నిశితంగా ఆలోచిస్తే 'అనూకులతే దైవమ'ని అర్థమౌతుంది.
పంచభూతాలు, పంచేంద్రియాలు ఇన్నీ అనుకూలిస్తేనే మన మనుగడ. వీటన్నిటిలో వ్యాపించిన అనుకూలతా రూప ఈశ్వర స్వరూపమే విష్ణువు.

4. 'కూలః' అనే శబ్దానికి ఒడ్డు, హద్దు – అని అర్థం.
ఈ విశ్వమంతా హద్దులతో (పరిమితులతో) కూడినది. హద్దునెరుగని అపరిమితుడైన విష్ణువు ఈ విశ్వపు హద్దులలో వ్యాపించి ప్రసరించుటచేత 'అనుకూలుడ'య్యాడు.
జలం రెండు ఒడ్డులను అనుసరించి నదిగా ప్రవహిస్తోంది. **'ఇదం ద్యావా పృథివీ సత్యమస్తు'** (శ్రుతి)– అన్నట్లుగా ఆకాశము, భూమి – అనే రెండు కూలముల నడుమ వ్యాపించినవాడు ఈ విష్ణువు.
దేహంలో శిరస్సు ద్యౌస్థానం. పాదం పృథివీ స్థానం. ఈ రెంటి నడుమ దేహమంతా వ్యాపించి ప్రసరించే విష్ణు చైతన్యమే అనుకూలం.

'సన్తాపయతి స్వన్దేహ మాపాదతలమస్తకః' (శ్రుతి వాక్యం)

నది రెండు ఒడ్డుల మధ్య ప్రవహించినట్లుగానే విశ్వంలో ప్రతిదీ ద్వంద్వాల నడుమ చైతన్యమే. ఆ చైతన్యమే విష్ణువు.

ఉత్తిష్ఠతా ప్రతరతా సఖాయోశ్మన్వతీ నదీ స్యన్దత ఇయమ్ (అథర్వవేదం)

5. ఎప్పుడు ఏది ఎక్కడ ఎంత అవసరమో ఆ హద్దుల నెరిగి తన శూరత్వాన్ని, ఈశ్వరత్వాన్ని ప్రసరించి అనుగ్రహించే కర్మ ఫలప్రదాత.
6. నది ఒడ్డు ననుసరించి అనుకూలమనిపించుకుంది. అలాగే లోకంలో ధర్మమే 'హద్దు' (మర్యాద). ఈ మర్యాదల ననుసరించే ధర్మస్వరూపుడు నారాయణుడు. ధర్మ మర్యాదలకు కర్త.

(మర్యాదానాం చ కర్తా – రామాయణం). అవతారములు దాల్చి ధర్మపు హద్దులను అనుసరించువాడీతడే.

విశ్వనిర్మాతగా విశ్వనియమాలను (హద్దులను) ఏర్పరచి, వాటిని 'అను'సరించి గ్రహాదులను నడుపువాడు. సర్వ విశ్వము విష్ణుని నియమాలను అనుసరించి నడుస్తున్నదే. సర్వ మానవాళిని అనుశాసించే వేదరూప మర్యాదలను ఏర్పరచిన అనుకూలుడితడే. రామకృష్ణాద్యవతారాలలో ఆ మర్యాదలను అనుసరించిన ఆదర్శమూర్తి ఈ అనుకూలుడు.

నామ రూపాదుల కతీతుడైన ఈ పరమాత్మ నామ రూపాది హద్దులలో ఇమిడి భక్తుల ననుగ్రహించే అనుకూలుడు.

ఈ అనుకూలమైన అవతారాలను అనన్తాలుగా అనేకమార్లు ధరించడం చేత –

శతావర్తః.. 343

1. అనంత రూపములతో మాటి మాటికి కలుగువాడు.

'ఆవర్తనము' అంటే చక్రమువలె మాటి మాటికి వచ్చునది – కలుగునది. 'శతం' అనే శబ్దం అనంత వాచకం. మర్యాదలను (ధర్మమును) రక్షించడానికై అనంతావతారములను ధరించినవాడు. పూర్ణ, అంశ, కళాది అవతారము

లతో గణనకందని బహు రీతుల ఆవిర్భవించిన వాడితడు.

2. వందల కొలది నాడులలో ప్రాణ రూపంలో ఆవర్తించే ప్రాణ స్వరూపుడు. అనుకూలయైన నది అనంతములైన రీతుల తిరిగి తిరిగి ప్రవహించునట్లు ఈ విశ్వమునందు, సర్వ జీవుల యందు నిరంతరం బహువిధాల వర్తించే చైతన్యమే శతావర్తం.
3. 'ఆవర్తం' అనే మాటకు 'చక్రం' అని కూడా అర్థం.
అనంత చక్ర స్వరూపుడు. ఈ విశ్వమే అనంత విధముల పరిభ్రమించే మహాచక్రం. **'భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా'** అని గీతలో చెప్పినట్లుగా భగవానుడు ఈ విశ్వాన్ని బహువిధముల త్రిప్పుతున్నవాడు.

బహురూపముల పదార్థ గణములను మాటిమాటికి కలిగించే విశ్వ సంచాలక చైతన్య రూపుడైన విష్ణువే గ్రహచక్ర, రాశి చక్ర, జీవ చక్రాదులలో మనలో మూలాధారాది చక్రాదులలో ఆవర్తనం చెందేవాడు.
అనంత కిరణాదులతో, శక్తులతో ఆవర్తించే సూర్యరూపుడు కూడా ఈతడే.

సూర్యస్యావృతమన్వావర్తే (అథర్వవేదం)
శతచక్రం యోహ్యో వర్తనిః (ఋగ్వేదం)
జాతవేదో వివర్తయ శతం తే సన్త్వావృతః (అథర్వ వేదం)

-మొదలైన శ్రుతివాక్యాలు పరమాత్ముని శతావర్త లక్షణాన్ని బహుధా పేర్కొన్నాయి. విశ్వమంతా వ్యాపించి ప్రవహించే ఆ అనుకూల చైతన్య మహా సాగరునిలో సర్వ భూతముల సృష్టి స్థితి లయలే సుడులుగా (ఆవర్తములగా) భ్రమిస్తున్నాయి.
అనంత ఆవర్తములే దళాలుగా విశ్వరూపంగా వికసించినవాడు కనుక -

పద్మీ..——————————————— 344

1. పద్మము కలవాడు -

పద్యతే ఇతి పద్మ - జ్ఞానమ్. జ్ఞాన స్వరూపుడైన శ్రీహరి పద్మీ. ఈ అనంత విశ్వాన్ని శతావర్త స్వరూపంగా నడిపే జ్ఞానం నారాయణునిదే. వికసన లక్షణం కలది పద్మం. బహుశక్తులతో వికసించే విశ్వమే పద్మం. దీనియందంతట వ్యాపించి ధరించువాడు పద్మీ.

ఇక్కడ నుండి పద్మ సంబంధ విష్ణు నామాలు ఐదు విశ్వ నిర్వాహక విష్ణు చైతన్యాన్నీ, సగుణ దివ్యవిగ్రహ సౌందర్యాన్నీ వ్యక్తం చేస్తున్నాయి.

పంకయుత జలమందు ప్రకాశిస్తున్నా నీటికీ, బురదకీ అంటని పద్మము వలె విశ్వంలో ఉన్నా వికారాలంటని నిర్మల జ్ఞానమే విష్ణు స్వరూపమని ఈ నామం తెలియజేస్తోంది.

అనేక దళాలను, పద్మం ఏకంగా బంధించినట్లుగా విశ్వాన్ని సంధానించే విష్ణు చైతన్యమే పద్మీ.

2. సగుణంగా విష్ణువు దివ్య సుందర విగ్రహుడు. పరిపూర్ణంగా వికసించిన సౌందర్యమే పద్మంగా వర్ణింపబడుతుంది. లోటులేని పూర్ణ వికసిత సౌందర్య, ఐశ్వర్యాల సమగ్రత శ్రీహరి రూపంలోనున్నది. ఆ సౌందర్య లక్షణం ఈ నామంతో మొదలై ఐదు నామాలతో ద్యోతకమౌతుంది.

లీలాపద్మాన్ని శంఖ చక్ర గదలతో పాటు ధరించి దీపించే స్వామి రూపాన్ని ఈ నామం తెలియజేస్తోంది.

జ్ఞాన పద్మ ధరుడైన స్వామి చూపులు కూడా వికసిత జ్ఞాన, సౌందర్యాదులను వెదజల్లుతున్న కారణంగా -

1. పద్మమువంటి కన్నులు (చూపులు) కలవాడు.
   పద్మమువలె వికసించిన విశాల నేత్రాలు. జ్ఞానార్థంలో – సర్వజ్ఞత కలిగిన దృష్టి. జ్ఞాన దర్శన స్వరూపుడు. స్వామి చూపులు సర్వమును తెలుసుకొనే శక్తిమంతాలు. కారుణ్య సౌందర్య జ్ఞాన ఐశ్వర్య నిధులు. ధ్యానయోగ్యమైన దివ్యాకృతిలో నేత్రాలది ప్రధాన స్థానం. భగవానుని హృదయం నేత్రముల ద్వారా వ్యక్తమౌతోంది. **'రామః కమలపత్రాక్షః'** అని శ్రీరాముని హనుమంతుడు (సుందరకాండ) వర్ణించాడు. **'నల్లనివాడు పద్మనయనమ్ములవాడు'** అని భాగవతంలో శ్రీకృష్ణ వర్ణన.
2. పద్మము సంకోచ వ్యాకోచాల వలె (మొగ్గ దశ – వికసన దశ) ఈ జగత్తు సృష్టి స్థితిలయాదులతో కూడినది. ఈ జగద్రచనకు మూలమైన పరమేశ్వరుని శక్తిని 'ఈక్షణ శక్తి'గా వేదాదులు సంభావించాయి. వ్యక్తి కన్నులు తెరవడం క్రియారంభానికీ, చైతన్యానికీ సంకేతం. పద్మము తెరచుకున్నట్లుగా (విరబూసినట్లుగా) నారాయణుని అంతర్లీన చైతన్యం బాహిరపరచినప్పుడు జగద్రూప పద్మ వికసనం జరుగుతుంది. ఆ విధమైన వికసిత చైతన్య స్వపూరుడే పద్మనిభేక్షణుడు. (పద్మ – నిభ – ఈ క్షణః)
   'సఐక్షత' 'సఐచ్ఛత' – వంటి శ్రుతి ప్రతిపాదనలు నారాయణునిచే సృష్ట్యారంభాన్ని 'ఈక్షణ' శబ్దంలో తెలియజేశాయి.
   "తన జ్ఞానం (పద్మ)తో జగత్తును సృజించినవాడు" అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు.
   సంకల్పం, కోరిక... ఇవి ఈక్షణ శక్తి చేత లక్షితాలు. భగవానుని 'పూర్ణ జ్ఞానమయ సంకల్పశక్తి' (పద్మనిభేక్షణ)చే ఈ జగమావిర్భవించింది.
   'స ఐక్షత – స అకామయత' వంటి వేదవాక్యాలే ప్రమాణాలు.
   మిత్రా ఈక్షమాణ అవృత్త ఆనందః (అథర్వవేదం)
   'శతావర్తనామా'ల తరువాత ఈ నామాల ఔచిత్యాన్ని పై శ్రుతి వాక్యంలో సంభావించవచ్చు.

విశ్వ పద్మవికసన చైతన్యమైన విష్ణువు, దానికి కేంద్రమందున్నవాడు -

పద్మ నాభోరవిన్దాక్షః పద్మగర్భః శరీరభృత్।
మహర్ధి ఋద్ధో వృద్ధాత్మా మహాక్షో గరుడధ్వజఃII... 38

346. పద్మనాభః, **347.** అరవిన్దాక్షః, **348.** పద్మగర్భః, **349.** శరీరభృత్।
350. మహర్ధిః, **351.** ఋద్ధః, **352.** వృద్ధాత్మా, **353.** మహాక్షః,
354. గరుడధ్వజః.

పద్మనాభః.. 346

1. పద్మము వంటి నాభి కలవాడు.

   దివ్యసుందర ధ్యాన మంగళ విగ్రహంలో పద్మమువలె సుకుమార సుందరమైన నాభి కలవాడు.

2. సృష్టి కర్తకు మూలమైన పద్మమునకు హేతువైన నాభి కలవాడు. హరి నాభీపద్మం నుండి బ్రహ్మ ఆవిర్భవించాడు.

   సృష్టికారక శక్తులన్నీ బీజరూపంలో ప్రళయావస్థలో భుజగశయనుడైన శ్రీహరి గర్భంలో నిక్షిప్తమై, తిరిగి సృష్ట్యారంభంలో ఆ బీజాలు పద్మరూపంగా ఆయన నుండి ఆవిర్భవించాయి. 'నాభి' అంటే కేంద్రం, మూలస్థానం. విశ్వ బీజాలను దాచుకున్న మహాపద్మానికి ఆధారభూతమైన కేంద్రం (నాభి) కలవాడు. 'కారణ కారణుడు' అనే భావం ఈ నామంలో దాగిఉంది.

   "భువనస్య నాభిః" అని శ్రుతి.

   భువనమే వికసన లక్షణం గల పద్మం. దానికి నాభి (కేంద్రం) వంటివాడు.

3. ప్రకాశించువాడు - ప్రకాశించనివాడు.

   వికసించిన పద్మం ప్రకాశ లక్షణం కలది. **"న భాతీతి న భుః ఏవ నాభుః"** (సత్య భాష్యం) - ప్రకాశించనిది నాభము. వికసించే సూర్యాదులన్నీ నభమునందున్నవే. ఆ సూర్యాదులూ ఆ నభమూ అన్నీ విష్ణుమయములే.

సూరులైన జ్ఞానులు నారాయణుని స్పష్టంగా గోచరింపజేసుకోగలరు. వారికి ప్రకాశ లక్షణుడు (పద్మః). బహిః దృష్టి కలిగిన అజ్ఞానులకు అగోచరుడు (నాభుడు). పద్ముడూ నాభుడూ రెండూ ఈయనే కనుక పద్మనాభుడు **(పద్మశ్చాసౌ నాభశ్చ పద్మనాభః – సత్యభాష్యమ్)** ఈ క్రింది శ్రుతి వాక్యాలు పై భావాన్ని స్పష్టపరుస్తున్నాయి.

తస్మిన్ యద్ యక్ష మాత్మన్వత్ తద్వై బ్రహ్మ విదోవిదుః। (అథర్వవేదం)
తద్విష్ణోః పరమంసదం సదా పశ్యన్తి సూరయః।
దివీవ చక్షురాతతమ్।। (యజుర్వేదం)
పశ్యదక్షణవాన్ న విచేత దన్ధః ।। (అథర్వవేదం)

సృష్టికి పూర్వము అవ్యక్తమై (నాభః) ఉన్నవాడు, సృష్టిగా వ్యక్తమైనవాడు (పద్మః). నాభరూపుడైన ఈతడే పద్మరూపునిగా వ్యక్తమైనాడని భావం. ప్రతి పదార్థానికీ ఉండే రెండు అవస్థలివి. రెండవస్థలలోనూ నారాయణుడు మాత్రం శాశ్వతుడు.

దృశ్య (పద్మ), అదృశ్య (నాభ) రూప జగమంతా వ్యాపించినవాడే పద్మనాభుడు. అంతేకాదు పద్మమునకు సైతం దాని ఉనికీ, వ్యవహారం నాభితో (నడిమి భాగంతో) సంబంధమున్నంతవరకే. నాభితో బంధం లేనప్పుడు అది వ్యక్తం కాజాలదు. మన జాలదు. అదే విధంగా విశ్వానికి ఆధార చైతన్యమీతడేనని ఈ నామం తెలియజేస్తోంది.

విశ్వానికి మూలాధారమేకాక, నిరంతరం విశ్వాన్ని పరిశీలించేవాడు కనుక –

అరవిన్దాక్షః.. 347

1. పద్మమువలె నున్న నేత్రాలు కలవాడు.

'పద్మ నిభేక్షణ' శబ్దం దర్శన శక్తిని తెలియజేస్తే, ఆ శక్తిని ప్రకటించే నేత్రములు ఈ నామంలో వ్యక్తమౌతున్నాయి. నిజానికి ఈ రెండూ ఒకే

అర్థాన్ని తెలియజేసే నామాలే అయినా రెండు మారులు ఆవృతమైన కారణంగా రెండు రకాలుగా భావిస్తున్నాం. విశాల వికసిత నేత్రాలు కలవాడు. నారాయణునకు ఈ నామం స్వాభావికం.

సగుణ – నిర్గుణ తత్త్వాలకు అన్వయించే నామాలివి.

2. **'ఋగతి ప్రాపణాయోః'** అనే ధాతువునకు 'అపి' ప్రత్యయంలో 'అర' అనే శబ్దం సిద్ధిస్తుంది. **అరణం – అరః.**

దీనికి 'గతిః' అని అర్థం. **అరం–గతిం–విన్దన్తి–అరవిన్దాః.** 'గతిని పొందునవి' – గతి లక్షణం కలవి కాంతులు. అవే అరవిన్దములు. ఈ కాంతులనే తన నేత్రాలుగా కలవాడు.

గతి లక్షణం కలిగిన సూర్యచన్ద్రులను తన నేత్రములుగా కలవాడు – అరవిన్దాక్షుడు. (సత్యభాష్యం).

మనలో చక్షువులు, మనస్సు సూర్యచన్ద్రులు. వీటితోనే మన బాహ్య, అభ్యంతర దృష్టులున్నాయి. వీటికి మూలం ఆత్మచైతన్యం. అదే విష్ణువు.

యస్య సూర్య చక్షుశ్చన్ద్రమాశ్చ పునర్ణవః। (అథర్వవేదం)

చన్ద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత। (యజుర్వేదం)

ఆత్మరూపుడై ప్రతివారి హృదయ మధ్యంలో ఉన్నవాడు కనుక –

పద్మగర్భః.. 348

1. పద్మము నడుమ ఉండువాడు. పద్మము గర్భమునందు కలవాడు.

సంకోచ వికాస (సృష్టి స్థితి లయ) లక్షణంతో పద్మమువలె నున్న ఈ విశ్వమునకు నడుమనుండువాడు. బీజరూపమున విశ్వమును తన గర్భమున దాల్చువాడు.

బీజాదులు ఏవిధంగా అగోచరంగా ఉంటాయో, అదే విధంగా ప్రళయాదులలో విశ్వబీజాలను తన కడుపున దాచుకునే పరమాత్ముడు.

పద్మం ముకుళావస్థలో నున్నా, వికసనావస్థలో నున్నా దాని నడుమనున్న

కర్ణిక నిర్వికారమే. అదేవిధంగా విశ్వానికి ముఖ్యమైన దాని గర్భాన ఉన్న హరి నిర్వికారుడు.

బ్రహ్మాండరూప పద్మములు తన కుక్షిలో దాల్చువాడితడే.

'ఒకపరి జగముల వెలినిడి ఒకపరి లోపలికి గొనుచు' వర్తించే స్వామి.

2. పద్మము వంటి మృదుల సుందర ఉదరంలో శోభిల్లే దివ్యవిగ్రహుడు. దేహాన్ని పోషించే ఉదరం వలె సర్వభువన సర్వ జీవ పోషక చైతన్యరూపుడైనవాడు. తన నాధారం చేసుకున్న జీవులకు కర్మానుభవ రూప భోగ భుక్తులనిచ్చువాడు.

సజాతో గర్భో అసి రోదస్యోరగ్నే చారుర్విభృత ఓషధీషు (ఋగ్వేదం)

ఆత్మా దేవానాం భువనస్య గర్భో యధావశం చరతి దేవ ఏషః

(ఋగ్వేదం)

గర్భో దేవానాం పితా మతీనాం పతిః ప్రజానామ్ (యజుర్వేదం)

తస్మిన్ హ తస్థుర్భువనాని విశ్వా। (యజుర్వేదం)

– అని శ్రుతి వాక్యాలు పై నామార్థాలను విశదపరుస్తున్నాయి.

3. జీవుల హృదయపద్మ మధ్యంలోనున్న పరమాత్మ.

"పద్మకోశ ప్రతీకాశం హృదయం....

.... తస్య మధ్యే వహ్నిశిఖా... తస్యాశ్శిఖాయాః మధ్యే పరమాత్మా వ్యవస్థితః ... సోగ్రభుక్ విభజన్తిష్ణన్నాహార మజరః కవిః" – వంటి వేద విజ్ఞానం ఈ నామంలో ప్రస్ఫుటిస్తోంది.

దహరం విపాపం పరమేశ్మ భూతం యత్పుణ్డరీకమ్

(తైత్తిరీయ నారాయణం)

దహరం పుణ్డరీకం వేశ్మ (ఛాందోగ్యోపనిషత్తు)

హృదయపద్మాన్ని శుద్ధం చేసుకొని, తన్మధ్యంలోనున్న నారాయణుని ఉపాసించాలని శ్రుతిశాసనం. అలా హృత్పద్మగర్భంలో ఉపాసింపబడుటచే పద్మగర్భుడు.

దీనికి సంకేతంగానే నారాయణుడు పద్మాసన స్థితునిగా ధ్యానింపబడు తున్నాడు.

"ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ 'నారాయణః సరసిజాసన సన్నివిష్టః'. సూర్యమండల మధ్యంలో పద్మాసన స్థితునిగా, పద్మాకరునిగా గోచరించే పరమతేజస్స్వరూపుని ఉపాస్యమూర్తి 'పద్మీ' నామం నుండి ఈ నామం వరకు వర్ణింపబడింది.

హృద్దేశంలో ఉన్న ఈతడే శరీరాన్ని తన చైతన్యంతో అణువణువు నిండి పోషిస్తున్నందున -

శరీరభృత్.. 349

1. శరీరము(ల)ను పోషింపజేయువాడు.

జీవుల హృద్దేశంలో ఉన్న పరమాత్ముని చైతన్యమే శరీరమంతా ప్రసరించి పోషిస్తున్నది. ప్రాణ రూపంలో శరీరాన్ని పోషించేవాడే గాక, విశ్వాన అన్నాది వ్యవస్థల నేర్పరచి జీవులను పాలించేవాడు కూడా ఈతడే. సర్వజీవ శరీరాలకు ఉనికి, జీవనం నారాయణుని వల్లనే లభిస్తున్నాయి. ప్రతి ఇంద్రియానికీ పోషణ, శక్తి సమకూర్చువాడితడే.

"సోగ్రభుగ్విభజన్తిష్ఠన్నాహారమజరః కవిః
తిరగూర్ధ్వమధశ్శాయీ రశ్మయః తస్యసంతతా
సన్తాపయతి స్వన్దేహ మాపాద తలమస్తకః"

శరీరంలో ప్రాణ స్వరూపుడై, జఠరాగ్ని రూపుడై ఆహారాన్ని స్వీకరించి, ఆరగించి, తద్రసాన్ని ఇంద్రియాలకు అందించి పోషించి 'శరీర పోషకుని'గా వ్యవహరిస్తున్న చైతన్యం నారాయణుడే. **(అహం వైశ్వానరోభూత్వా... గీత)**

2. విశ్వమే నారాయణుని శరీరం **(త్రిభువన వపుషం)**. దీని యందంతటా వ్యాపించి పోషించి, క్రియాసమర్థతను కల్పిస్తున్నదీతడే. శరీరాదులలో ప్రసరించే ఈ పరబ్రహ్మచేతనే వీటికి ఉనికి లభిస్తున్నదని శ్రుతి బహువిధాల చెబుతున్నది.

శరీరం బ్రహ్మ ప్రవిశన్, శరీరేధి ప్రజాపతిః । (అథర్వవేదం)
ఆదిత్యై రిన్ద్రః సగణో మరుద్భిరస్మాకం భూత్వవితా తనూనామ్॥ (అథర్వవేదం)

2. తన మాయాశక్తితో వివిధ శరీరాలతో వివిధావతారములను ధరించువాడు. **'సంభవామ్యాత్మమాయయా'** అని గీత. అదే విధంగా భక్తానుగ్రహం కోసం వివిధ దివ్య శరీరాకృతులతో వ్యక్తమైనవాడు.
'పద్మీ' నుండి ఈ నామం వరకు ధ్యాన యోగ్యమైన స్వామి దివ్యమంగళ శరీరాన్నే వర్ణించారు. అటువంటి శరీరాన్ని దాల్చిన కారణంగా 'శరీరభృత్'.
3. తనయందు వ్యాపించి పోషించే పరబ్రహ్మ స్వరూపాన్ని తెలిసినవాడు నిత్యానందంతో ఉంటాడు. అలా తనను తెలుసుకున్న భక్తులలో తానే సర్వపోషకుడై, రక్షకుడై దీపించడం చేత భక్తుల దేహాలను నిరంతరం పాలించేవానిగా ఈ నామం ద్వారా తెలియబడుతున్నాడు.
బ్రహ్మవేత్తలు తమలో నున్న నారాయణ బ్రహ్మమును తెలుసుకొని, ఆ దీప్తితోనే శరీర ధారణ చేస్తారు.

అందుకే విష్ణు భక్తులలో నారాయణ లక్షణమైన ప్రసన్నత, పూర్ణానందం కలిసిన సౌమ్య లక్షణం భాసిస్తుంది.

'బ్రహ్మవిద ఇవ సోమ్యతే ముఖం భాతి' – అని ఛాందోగ్యం బ్రహ్మవేత్త ముఖంలో సౌమ్యతను సహజ ప్రకాశంగా పేర్కొంది.
ఆత్మ శరీరాన్ని కాపాడినట్లు భక్తులను కాపాడువాడు హరి.

'రక్షతే భగవాన్ విష్ణుః భక్తానాత్మ శరీరవత్' అని పురాణవాక్యం.

వసతి హృది సనాతనే చ తస్మిన్
భవతి పుమాన్ జగతోస్య సౌమ్యరూపః (విష్ణుపురాణం)

పద్మగర్భుడు (హృదయమందు ఉపాసింపబడే నారాయణుడు) ఎవరి హృదయంలో స్ఫురించుతాడో ఆ ధన్యజీవి సౌమ్యరూపుడై ఆనందంగా ఉంటాడు. అలా భక్తులను తన ఆనందానుభవంతో పోషించేవాడు.
అన్నమయ్య – **"నానా మహిమల నమ్మినవారిని, పూనుక కాచే పోషకుడితడు"** అని కీర్తించాడు. సర్వ ప్రాణికోట్ల శరీరోపాధులను పోషించే ఈ చైతన్యమూర్తి అందుకు కావలసిన ఐశ్వర్యాదులు సమగ్రంగా కలవాడు. సమకూర్చగలవాడు.

మహర్ధిః.. 350

1. గొప్ప సంపదగలవాడు.

అనంత బ్రహ్మాండములందంతటా తన గొప్ప (మహా) విభూతులనే సంపదలతో భాసించువాడు.

'అఖిల బ్రహ్మాండరూప సంపత్తి' చేత మహర్ధిః.

ఇన్ని సంపదలు తానే అయినవాడు, తనకు ఏ సంపద అవసరం లేని ఆప్తకాముడు కనుక -

ఋద్ధః.. 351

1. పరిపూర్ణుడు.

ఆయనను మించి పెరిగేదీలేదు. ఆయన పెరగవలసినవాడూ కాడు. సర్వసంపత్పరిపూర్ణుడు.

2. వృద్ధినందినవాడు. ప్రపంచ రూపంలో వర్ధిల్లినవాడు.

ఈ పరిపూర్ణుని మించిన పురాతనుడు లేడు. సర్వులకు పైనున్న వెనుకటివాడు-

వృద్ధాత్మా... 352

1. అన్నిటికంటే పెద్దవాడైన సనాతనుడు, బృహత్స్వరూపుడు.

ఇంత విశ్వమూ స్వామిలో ఏకాంశమే. **(ఏకాంశేన స్థితో జగత్ - గీత).** ఇంక ఈయన మహోన్నతత్వం ఊహకందుతుందా? కాలాది మానములకు (కొలతలకు) అందని వృద్ధ స్వరూపుడు. కొత్తగా వృద్ధి చెందనవసరం లేని నిత్య సమృద్ధుడు.

350, 351, 352 నామాలు ఒక క్రమానుబంధం కలవి -

'వేనస్తత్పశ్యన్నిహితం గుహా సద్యత్ర విశ్వం భవత్యేకనీడమ్। (యజుర్వేదం)

'త్వం సుతస్య జీతయే సద్యోవృద్ధో అజామకాः।। (అథర్వవేదం)

ఒక గూటి యందువలె పరమాత్మయందీ విశ్వం ఇమిడి ఉన్నది. 'వృద్ధుడైన (పెద్దవాడైన) మూల పురుషుని ఆశ్రయించుకొని కుటుంబ సభ్యులందరూ ఒక ఇంట ఉన్నట్లుగా – విశ్వంలో వృద్ధాత్ముడైన ఈ సమృద్ధి స్వరూపుని ఆశ్రయించుకొని, విశ్వ శక్తులు, జీవులందరూ వృద్ధిచెందుతున్నారు. శరీరాన్ని పోషించే (శరీరభృత్) ఆత్మ చైతన్యం సర్వేంద్రియ శక్తులకు మూలమైనది (మహర్ధిః). స్వయంగా పరిపూర్ణమైనది (బుద్ధః). సనాతనమైనది (వృద్ధాత్మా).

ఈ స్వభావాలతో విశ్వ రథాన్ని నడిపిస్తున్న కారణంగా –

మహాక్షః.. 353

1. గొప్ప అక్షము(లు) కలవాడు.

   సర్వవ్యాపకత్వం, సర్వోన్నతత్వం కలవాడు కనుక 'మహా' శబ్దవాచ్యుడు. సర్వత్ర వ్యాపించిన అక్షః స్వరూపుడు. 'అక్షః' శబ్దానికి చక్రమని కూడా అర్థం. బండిని కదిలించే చక్రము అక్షం. విశ్వరథాన్ని నడిపే ఒక మహా చక్రము వంటివాడు. సూర్యునికి కూడా ఈ నామం చెందుతుంది. సంవత్సరాది కాలగమనానికి మూలమైన సూర్యుడు విష్ణు స్వరూపుడేకదా! 'మహా' శబ్దం బ్రహ్మాండ వాచకం కూడా. బ్రహ్మాండమునకు (విశ్వమునకు) సంచాలకమైన చక్రమువంటివాడు మహాక్షుడు.

   వ్యవహారంలో పరిశీలించినా –

   ఒక్క చక్రంతో ఏ యంత్రమూ నడవదు. అనేక చక్రాల వలనే యంత్రం తిరుగుతుంది. అలాగే విశ్వమంతా అనేక రకాలైన చక్రాలు నిండి ఉన్నాయి. గ్రహరాశి, జ్యోతిశ్చక్రాలు, ఋతుచక్రం, దేహంలో గ్రంధిరూపమైన స్థూల చక్రాలు కొన్నయితే, సూక్ష్మమైన షట్చక్రాలు, కర్మచక్రం... ఇలా సర్వ వ్యాపకునిగా విశ్వమంతా చక్ర లక్షణాన్ని బహుధా వ్యాప్తిచేసినవాడు.

2. విశ్వాన్ని నడిపే ఈ వృద్ధాత్ముడు విశ్వమంతా పరచుకున్న, విశాలమైన

చూపులతో త్రికాలపు, త్రిలోకాలను, సర్వజీవులను గమనించే 'గొప్ప నేత్రములు కలవాడు'.

చక్రమువంటి ఈతడే మహావేగంతో చలింపజేస్తున్న గతిశక్తిని నిర్దేశించువాడు కనుక -

గరుడధ్వజుఁ.. 354

1. గొప్ప గమనశక్తి కలవాడు.

   'గృనిగరణే', 'ధ్వజ గతౌ' అనే ధాత్వర్థాల ననుసరించి -

   గిరతీతి గరుడఃు -(ఎగురుట) గమన లక్షణం చేత గరుడుడు. అదే అర్థంలో గతివాచకనామం ధ్వజం (కదలునది). ఎగురుట, కదలుట - అనే గతి లక్షణాలు 'గరుడ - ధ్వజ' అనే నామాలలో ఉన్నాయి. ఊర్ధ్వ గతిలోను, వ్యాపక గతిలోను వ్యాపించే చైతన్యం విశ్వమంతా నిత్యగతిగా ఉన్నది. ఆ విష్ణు చైతన్యమే 'గరుడధ్వజుడు'.

2. ఈ నామం సూర్య స్వరూపుడైన శ్రీమహావిష్ణువును స్ఫురింపజేస్తోంది. తన కాంతి కిరణాలను గమింపజేస్తూ, వాటినే ధ్వజమువలె ఆకాశాన వ్యాప్తి చేస్తున్న సూర్యుని వేదం 'గరుత్మాన్' అని పేర్కొన్నది. కాంతి పక్షాలను విప్పార్చిన సూర్యుడు గరుత్మాన్ మాత్రమేకాక, ఆ పక్షాలనే ధ్వజమువలె వ్యక్తం చేస్తూ, దాని ద్వారా తన శక్తిని చాటుతూ గరుడ ధ్వజుడయ్యాడు.

   ఇన్ద్రం మిత్రం వరుణ మగ్ని మాహురథో దివ్యఃు
   స సుపర్ణో గరుత్మాన్ ॥ (ఋగ్వేదం)
   యతఃు సూర ఉదేత్యస్తం యత్ర చ గచ్ఛతి (అథర్వవేదం)

   - మొదలైన శ్రుతి వాక్యాలు ఈ గతి లక్షణ వాచకాలు.

3. శ్రీమన్నారాయణుడు గరుడవాహనుడు. గరుడ ధ్వజుడు.

   గమన లక్షణం కల శబ్ద (వేద) శక్తి, కాంతిశక్తులు వేదంలో గరుడునిగా సాక్షాత్కరించాయి. వాటి యందుండి, వాటి ద్వారా వ్యక్తమవుతున్న పరమాత్మ

చైతన్యమే గరుడవాహనునిగా గరుడధ్వజునిగా ఉపాసింపబడుతోంది. సాధారణంగా దేవతలు వాహనాన్నే, ధ్వజ చిహ్నంగా ధరిస్తారు. ఈ మహోక్షాది లక్షణాలను గమనించినట్లయితే – పోల్చిచూడడానికి కూడా వీలులేని అద్వయ స్వరూపుడీ విష్ణువేనని స్పష్టమౌతుంది.

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః।
సర్వలక్షణ లక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః॥... 39

355. అతులః, **356.** శరభః, **357.** భీమః,
358. సమయజ్ఞః, **359.** హవిర్హరిః । **360.** సర్వలక్షణ లక్షణ్యః,
361. లక్ష్మీవాన్, **362.** సమితింజయః॥

అతులః.. 355

1. పోలిక లేనివాడు.

ఇతడు ఇలా ఉంటాడని దేనితోనూ పోల్చలేం. ఇంద్రియాలకు గోచరించే వస్తుజాతంతోనే మనం పోల్చుతాం. కానీ ఆ వస్తు సమూహాలకు అతీతుడు, అతులుడు. మహిమ, వీరత్వం, గుణం, సౌందర్యం మొదలైన సర్వ లక్షణాలలోనూ శ్రీహరితో పోల్చదగినది ఈ జగతిలో లేదు.

'న తస్య ప్రతిమాఽస్తి యస్యనామ మహద్యశః' (శ్వేతాశ్వతరోపనిషత్తు) సాటిలేని మహాయశః స్వరూపునిగా శ్రుతి కీర్తించింది.

"నత్వత్సమోస్త్యభ్యధికః కుతోన్యః" – అని గీతలో అర్జునుడు, "కృష్ణా! నీకు సమానుడే లేడు. ఇంక అధికుని ప్రసక్తి ఎక్కడ?" అని విశ్వరూపుడైన శ్రీ కృష్ణ పరమాత్మను వీక్షించి వినుతించాడు.

"రామ మూర్తికిన్ రెండవసాటి దైవమిక లేడనుచున్" గోపన్న (రామదాసు) శ్రీరాముని నుతించాడు.

2. సృష్టిలో వ్యవహారంగా కొన్నిటిని కొన్నిటితో పోల్చుతున్నా, పోలినట్లు ఆ

పదార్థాలు కనిపిస్తున్నా దేని ప్రత్యేకత దానిదే. ఉదాహరణకు – వృక్షాలలో ఎన్నో రకాలు. మామిడి, చింత, అశోకం, మఱ్ఱి, రావి... ఇలా వేటికవే ప్రత్యేకం. మళ్ళీ మామిడిలో వేటికవే ప్రత్యేకంగా ఎన్నోరకాలు.
అలాగే మానవ జాతిలో, పక్షి, మృగ జాతులలో పూర్తిగా ఒకదానిలా మరొకటి ఉండదు.

ఇటువంటి ఆశ్చర్యకరమైన, అద్భుతమైన దేనికదే ప్రత్యేకమైన, పూర్తిగా సమానమని చెప్పలేని 'అతుల లక్షణా'న్ని విశ్వమంతా వ్యాపింపచేసిన విష్ణు చైతన్యమే 'అతులః'.

నత్వావాఁ అన్యో దివ్యో న పార్థివో న జాతో న జనిష్యతే ॥ (యజుర్వేదం)
అనే శ్రుతివాక్యాన్ని కూడా పై రీతిలో పరిశీలించవచ్చు.
ప్రతి జీవికీ ఈ ప్రత్యేక లక్షణాన్నిచ్చి 'అతుల'ంగా వ్యాపించిన పరమాత్మ చైతన్యమే సర్వజీవులలో ప్రసరించి ఉన్నది కనుక –

శరభః.. 356

1. సర్వ దేహములందు ప్రత్యగాత్మగా ఉన్నవాడు.
   శీర్ణ (శిథిల) లక్షణము కలవి శరములు (శరీరములు).
   వాటియందు (భాతి) – ప్రకాశించువాడు శరభుడు. శిథిలమయ్యే లక్షణం కల శరీరమందంతా వ్యాపించే ఆత్మ చైతన్యమే శరభుడు.
2. హింసించే (శీర్ణము చేసే) లక్షణం కలవి శరములు. అందుకే బాణానికి 'శరము' అని పేరు. ధర్మపు మేరలు తప్పిన వారిని హింసించి ధర్మాన్ని ప్రతిష్ఠించే అనంత విష్ణు శక్తులే శరములు. ఆ శక్తులతో 'భా'సించే విష్ణువు శరభుడు.

   ఇది శిక్షణా సమర్థత కలిగిన రక్షకుడైన పాలకుని స్వభావాన్ని తెలియజేసే నామం.
3. బాణము వలె కిరణములను తన నుండి వెదజల్లే 'భా'స్కరుడే శరభుడు.

అగ్ని నుండి జ్వలించే నిప్పురవ్వలు కూడా శరములే. వాటి యందంతటా అగ్ని ప్రకాశమే నిండి ఉంది.

అలాగే పరమాత్మ అనే జ్వాల నుండి రవ్వల వలె అఖిల లోకములు, జీవులు, దేవతలు ఆవిర్భవించినట్లుగా ఉపనిషత్తులు వర్ణించాయి.

"యథాఽగ్నే స్ఫులింగాः వ్యుచ్చరన్తి..." (బృహదారణ్యకోపనిషత్తు) **సర్వేనిమేషా జజ్ఞిరే విద్యుతः పురుషాదధి।** (యజుర్వేదం) అని శ్రుతి విశదపరచింది.

4. మృగాలలో 'అతుల'మైన పరాక్రమం కలదానిగా మన ప్రాచీన గ్రంథాలు 'శరభ' మృగాన్ని పేర్కొన్నాయి. హింసా లక్షణంలో సింహం గొప్పదని వర్ణిస్తారు. దానిని మించిన ప్రతాపంతో దేనినైనా హింసించి, శిక్షించగలిగే 'శర'త్వ లక్షణంతో భాసించేది శరభం.

ప్రస్తుతం భూమిపై ఆ జాతి అంతరించి ఉండవచ్చు. కానీ ఒకప్పుడు – ఎనిమిది పాదాలతో, ఎగరగలిగే ఱెక్కలతో అటు జంతువుగాను, ఇటు పక్షిగాను కూడా భాసించే మృగంగా మన ఇతిహాసాలలో, కావ్యాలలో శరభుని వర్ణించారు.

సింహం, గరుడుడు, అశ్వత్థం... మొదలైన వాటిలో విష్ణు విభూతులను దర్శించినట్లుగానే సర్వోన్నతమైన శరభం కూడా విష్ణు విభూతితో కూడినది.

★ ★ ★

ఇక్కడొక గొప్ప భావనని గ్రహించాలి.

విష్ణు సహస్రం ఉత్తమ వృక్ష, మృగాది జాతులనీ పేర్కొన్నది. **"యద్యద్విభూతి మత్సత్వం శ్రీమదూర్జితమేవ వ"** అని గీత విభూతి యోగం. శ్రీమంతమై, పరాక్రమవంతమైన ఉపాధులలోని ఆ ఉజ్జ్వలత హరివిభూతి.

సృష్టిలో ఏ ఉపాధియైనా అందులో ఒక ప్రత్యేక లక్షణముంటుంది. ఒక్కొక్క ఉపాధిలో ఒక్కొక్క శక్తి విశేషం. అవి ఆ జీవుని గొప్పదనాలనుకోరాదు. ఆ జీవి పూర్వకర్మ విశేషం చేత తదనుగుణమైన ఉపాధి ప్రాప్తిస్తుంది. ఆ ఉపాధి

ద్వారా ప్రకటమయ్యేది పరమేశ్వరుని చైతన్య విశేషమే. దానిని గుర్తించడమే విభూతి యోగం. ఈ కారణం చేతనే ఒక్కొక్క దేవత ఒక్కొక్క రకమైన వాహనాలని కలిగి ఉండడం, కొన్ని దేవతలు వివిధ మృగముఖాలతో ఉపాసింపబడడం మన సంప్రదాయంలో ఉన్నాయి. వివిధ మృగ, పక్షి ధ్వనులలో కూడా కొన్ని దేవతా శక్తులున్నట్లు మంత్ర శాస్త్రాలు చెప్తున్నాయి. (ఉదా॥ 'శిఖిచండి' అనే దేవత నెమలి వలె ధ్వనిస్తుందని పేర్కొన్నాయి. నెమలికేకలో ఉన్న ఒక నాదశక్తి విశేషమది.)

ఇలా శరభ చైతన్యం యొక్క దివ్యత్వస్థాయిని దేవతగా ఉపాసించే వారికి సర్వోన్నతత్వం, శత్రుబాధానివారణ సిద్ధిస్తాయని ఉపాసనా సంప్రదాయం. నృసింహోపాసన వలె శరభోపాసన. నారాయణుని రుద్రచైతన్యమే శరభునిగా గోచరించింది. శివావతారంగా శరభోపాసన సుప్రసిద్ధం. 'శివాయ విష్ణురూపాయ'. ఆ రూపం కూడా సర్వ వ్యాపకమైన ఒకే చైతన్యానిది.

☆ ☆ ☆

అధర్మపరులను శిక్షించే ప్రతాపవంతమైన విష్ణు చైతన్యమే 'శరభ' నామంతో పేర్కొనబడింది. ప్రతాపవంతుడైన పాలకుని శాసన భయం చేతనే పాలన సమర్థవంతంగా సాగుతుంది. ఆ శాసించే భీషణశక్తికల జగత్పాలకుడు నారాయణుడు -

భీమః.. **357**

1. సర్వులకు భయము కలిగించువాడు.

నారాయణుని శాసనభయం చేతనే, ఆయన అనుగ్రహించిన శక్తులతో సూర్య, వాయు, అగ్ని మొదలైన ప్రకృతి నియామక శక్తులు ప్రవర్తిస్తున్నాయి. దేనిలోనైనా అధిక్యత బలం. బలవంతుని చూసి భయపడి ఇతురులు అనుసరిస్తారు. గౌరవిస్తారు. సర్వాధికుడైన జగన్నాథుని శాసనాన్ని

అనుసరించి విశ్వశక్తులు చలిస్తున్నాయి.

'భీషాస్మాద్వాతః పవతే' (తైత్తిరీయ ఆరణ్యకం).

వీని భయం చేతనే వాయువు వీస్తున్నది.

భయా దేవాగ్ని స్తపతి భయాత్తపతి సూర్యః।

భయాదిన్ద్రశ్చ వాయుశ్చ।। (కఠోపనిషత్తు). అని శ్రుతి ఇంకా వివరించింది.

2. 'అభయ మందించువాడు' అని కూడా ఈ నామాన్ని గ్రహించవచ్చు.

'శరభో భీమః' – అనే రెండు నామాలను 'శరభః', 'భీమః' అనేకాక వ్యాకరణ రీత్యా 'శరభః', 'అభీమః' అని కూడా భావించవచ్చు. పరమేశ్వరుని చైతన్యం ఘోరరూపంలో 'భీమం'. అఘోర రూపంలో 'అభీమం'. శాసన భయాన్ని కలిగించే స్వామి అభయస్థాపన కోసమే దానిని పట్టి ఉంచాడు. స్వాభావికంగా అయన శాంతుడే.

హిరణ్యకశిపుని నృసింహరూపధారణతో సంహరించి భీతిని గొల్పిన 'భీమ' రూపం అందరికీ భయంకరంగా గోచరించినా, ప్రహ్లాదునికి 'అభీమం'గా కనిపించింది. ఆ భీమాకృతి అభయానికై ఆవిర్భవించింది. అధార్మికులకు భీముడు, ధర్మపరులకు అభీముడు.

"నమ ఉగ్రాయ చ భీమాయ చ"

"మృగన్నభీమముపహత్నుముగ్రమ్" అని యజుర్వేదం. (రుద్రనమకం).

ఇందులో మృగం – భీమ శబ్దాలే 'శరభో భీమః' అని ఇక్కడ కూర్చబడ్డాయి.

మృగో న భీమః కుచరో గిరిష్ఠాః। (ఋగ్వేదం)

సింహో న భీమో మనసో జవీయాన్ । (ఋగ్వేదం)

– వంటి వేదమంత్రాలు కూడా పైభావాన్ని స్పష్టపరచాయి.

ఈ భీమశాసకుని అనుసరించి కాలానుగుణంగా గ్రహాదులు, ఋతువులు, దేవతలు చరిస్తున్నారు. ఆ సమయ నిర్దేశక కాల స్వరూపుడు ఈ నారాయణుడే...

సమయజ్ఞుఁ.. 358

1. సమయమును తెలిసినవాడు.

**సమ్యక్ అయుఃసమయుఃసమయుఃసమ

గీతా వాక్యాలు సమత్వమే పరమాత్మానుభవమని పేర్కొన్నాయి. ఈ యోగస్థితిని సాధించడమే యజ్ఞం.

3. 'సమయములు' అంటే శాస్త్రములు. సమస్త శాస్త్ర జ్ఞానము లెరిగినవాడు, జ్ఞానమూల చైతన్యస్వరూపుడు కనుక సమయజ్ఞుడు.
సమయాన్ని ఆధారం చేసుకొని సాగే, శాస్త్ర (సమయ) చోదిత 'సమయజ్ఞ'ములందు హవిస్సులను గ్రహించువాడు కనుక –

హవిర్హరిః.. 359

1. యజ్ఞాలలో హవిర్భాగమును హరించు (గ్రహించు)వాడు. పొందించువాడు.
'అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ'
'భోక్తారం యజ్ఞతపసాం' – అని గీతలో భగవద్వచనాలు.
'యజ్ఞోవై విష్ణుః' – యజ్ఞ స్వరూపుడైన విష్ణువే హవిస్సులను స్వీకరించి, తన స్వరూపాలైన దేవతలను పోషింపజేస్తున్నాడు.
హవిస్సులను పొందించే అగ్ని స్వరూపుడు.

2. ఆహ్వానింపబడి (హవిః) ప్రాప్తింపజేయువాడు (హరిః).
యజ్ఞములందు వివిధ దేవతా రూపములుగా ఆహ్వానింపబడి ఆరాధితుడై తనను పొందించువాడు. (భక్తులకు తన కృపను అందించువాడు). **హరతి ప్రాపయతి.**

3. ఇదే నామాన్ని రెండు నామాలుగా కూడా భావించవచ్చు.
'హవిః' – 'హరిః'.
సమత్వం తెలిసిన యజ్ఞమే 'సమయజ్ఞ'మని వెనుకటి నామం.
'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్' – అని యజ్ఞాన్నంతటినీ పరబ్రహ్మమయంగా చూడడమే సమయజ్ఞం. అప్పుడు యజ్ఞ ద్రవ్యమైన 'హవిస్సు' కూడా విష్ణు రూపమే. **హూయతే హవిషా.** యజ్ఞంలో భగవదర్పణంగా అర్పితమయ్యేది హవిస్సు. అదీ విష్ణు చైతన్య

విలసితమే. విశ్వ'యజ్ఞం' (నిర్వహణ)లో తన చైతన్యాన్నే తన యందు అర్పించుకొని సమస్త కృత్యాలను నిర్వహిస్తున్నవాడు.

'అబధ్నన్ పురుషంపశుమ్' (పురుషసూక్తం) విరాట్పురుషునిలో ఇంద్రియ స్థానీయులైన దేవతలే ఆ విష్ణు చైతన్యాన్ని యజ్ఞ హవిర్భవ్యంగా బంధించారు. మన శరీర వృద్ధికి ఇన్ద్రియరూప విష్ణు చైతన్యం, ఆహార రూప విష్ణు చైతన్యాన్ని, జఠరాగ్ని రూప విష్ణు చైతన్యంలో అర్పించినట్లుగా విశ్వ యజ్ఞం కూడా సాగుతున్నది.

'హవిషా విధేమ' (యజుర్వేదం)

అతన్ద్రో దూతో అభవో హవిర్వాట్ (ఋగ్వేదం)

త్వం హి హవ్య వాడసి।। (ఋగ్వేదం)

నారాయణుని నామాలలో దివ్యమైనది 'హరి' నామం. 'చాలాదా హరి నామ సౌఖ్యామృతము తమకు', 'హరినామమే కడు ఆనందకరము' అని అన్నమయ్య పలుమార్లు 'హరి' నామాన్ని పలికాడు.

హరిర్హరతి పాపాని దుష్ట చిత్తైరపి స్మృతః।।

అనిచ్ఛయాపి సంస్పృష్టో దహత్యేవహి పావకః।।

"తెలియక ముట్టుకున్నా నిప్పు దహించునట్లుగా, దుష్ట చిత్తులు స్మరించినా వారి పాపాలను పోగొట్టువాడు హరి."

స్మరించినంత మాత్రాన పాపాలను, సంసార భయాలను హరించేవాడు కనుక 'హరిః'.

హరిద్వర్ణాత్ హరిః. సాంద్రమైన (పచ్చని - చిక్కని) చాయగల దివ్య విగ్రహుడు కనుక హరిః.

హరామ్యఘం చ స్మర్తౄణాం హవిర్భాగం క్రతుష్వహం।

వర్ణశ్చ మే హరిశ్రేష్ఠః తస్మాద్ధరి రహం స్మృతః।। (మహాభారతం)

"నన్ను స్మరించిన వారి పాపాన్ని హరిస్తాను. యజ్ఞములందు హవిర్భాగాన్ని కూడా హరిస్తాను (అందుకుంటాను). నా వర్ణము శ్రేష్ఠమైన పచ్చదనం. .

అందుచే నన్ను తత్త్వవేత్తలు 'హరి'యని తలంచుతార"ని సాక్షాత్తు భగవానుని మాట.

"హరి యను రెండక్షరములు
హరియించును పాతకముల"ను అంటూ శ్రీకృష్ణ శతక కర్త పరవశించాడు.
'హ' కారం ఆకాశతత్త్వాన్నీ, 'ర' కారం అగ్ని తత్త్వాన్నీ, 'ఇ' కారం శక్తినీ తెలియజేస్తాయి. 'హరి' నామం ఆకాశ గతమైన సర్వ వ్యాపకమైన, తేజోమయ చైతన్య వాచకం. ఈ నామస్మరణ యజ్ఞ ఫలాన్నిస్తుంది. విష్ణువు యజ్ఞ స్వరుపూడనే వేద విజ్ఞానాన్ని ఈ నామం స్పష్టపరుస్తోంది.
పాపహరణుడైన ఈ హరియే యజ్ఞాదులకు, వాటి శాస్త్రాలకు గమ్యమైన (లక్ష్యమైన)వాడు కనుక –

సర్వలక్షణలక్షణ్యః.. 360

1. అన్ని ప్రమాణాలకు, శాస్త్రాలకు లక్ష్యమైన వాడు.
'లక్షణం' అనే మాటకి చిహ్నం, శాస్త్రం, ప్రమాణం – అని అర్థాలు. అన్ని శాస్త్రాలచే, ప్రమాణాలచే తెలియబడే పరమార్థమితడు. సృష్టిలో ప్రత్యంశమూ పరమాత్మను ప్రకటించే లక్షణమే. ఒక వ్యక్తి ప్రతి ఇంద్రియం అతనిలోని చైతన్యాన్ని ద్యోతకం చేస్తుంది. అలాగే విశ్వంలో ప్రత్యణువూ ఆయన ఉనికిని చాటే చిహ్నమే (లక్షణమే).
అన్నిటి చేత తెలియబడేది ఆత్మ తత్త్వమే. విశ్వమంతా విష్ణుని లక్షణమే. విశ్వం ద్వారా లక్షింపబడేవాడతడు. విద్యలన్నిటి గమ్యమతడు.
2. సర్వ శుభ లక్షణములతో రాజిల్లుతూ, అన్ని సల్లక్షణాలకు తానే లక్ష్యమైనవాడు. ఏ శుభ లక్షణాన్నైనా పరిపూర్ణంగా చెప్పవలసినప్పుడు విష్ణువనే చెప్పాలి. అనంత కల్యాణ లక్షణ సంపన్నుడు.
ఆ సంపన్నతే లక్ష్మి. అందుచేతనే అతడు –

లక్ష్మీవాన్.. 361

1. లక్ష్మి కలవాడు.

నారాయణుని దివ్య విభూతులన్నీ లక్ష్మీ స్వరూపం. వాటితో ఉన్నవాడు లక్ష్మీవంతుడు. కిరణాలతో, కాంతితో ఉన్న సూర్యుని వలె లక్ష్మితో నున్నవాడు శ్రీహరి. పై నామంలో పేర్కొనిన సర్వ శుభ లక్షణ స్వరూపిణి మంగళ దేవత లక్ష్మి. ఆ తల్లి స్వామి వక్షఃస్థలాన శోభిస్తూ ఆయనను సేవించుకుంటున్నది. అనపాయినియై (వీడనిదై), అనపగామినియై (వదలకుండా అనుసరించునదై) సేవించే లక్ష్మీ దేవితో శోభిల్లే విష్ణువీతడు.

ఎక్కడ లక్ష్మి ఉంటుందో అక్కడ జయం – అంటారు. మరి లక్ష్మీవంతుడైన హరి అన్నిటా జయశీలుడే.

సమితింజయః.. 362

1. యుద్ధమున జయించువాడు.

'సమితి' అనే శబ్దానికి యుద్ధం అని అర్థం. 'జయం' అంటే ఆధిక్యాన్ని నిరూపించుకోవడం. సమమైన వారి నడుమ పోరాటం ఉంటుంది. ఆ పోరాటమే సమితి. గజబలం గజబలంతో, రథ బలంతో రథబలం, రాజులు రాజులతో పోరాడతారు. లోకంలో ఆధిక్యత కోసం సాగే ప్రయత్నాలు ఒకే రంగంలో (సమానుల నడుమ) సాగుతాయి. విద్యార్థి విద్యార్థులందరిలో అధికుడు కావాలనీ, వ్యాపారి తోటి వ్యాపారులలో అగ్రగామి కావాలని అనుకొంటాడు. అదే లక్ష్యంగా తపిస్తాడు. ఆ ప్రయత్నాలు సిద్ధించి అధికుడవడమే విజయం. ధార్మికుడు, జ్ఞాని, పండితుడు – అందరూ తమ ఉద్యమంలో సర్వోన్నతులు కావడమే లక్ష్యం. ఆ లక్ష్యం సిద్ధించాలంటే 'సమితింజయు'ని అనుగ్రహముండాలి.

"సమానానాం ఉత్తమ శ్లోకోస్తు" అని శ్రుతి ఆశీస్సు.

ప్రతాపవంతులలో, సంపన్నులలో, జ్ఞానులలో... ఇలా అందరిలోనూ

ముందరివాడు, సర్వోన్నతుడు లక్ష్మీవంతుడైన శ్రీ విష్ణువే. ఇతనితో సమానుడెవరూ లేరు.

'అతులః' నామంతో ప్రారంభమై 'సమితింజయః' నామంతో పూర్తయిన ఈ నామాల కూర్పులోని ఔచిత్యమిది. 'శరభ' నుండి 'లక్ష్మీవాన్' వరకు సాటిలేని ప్రతాపం, శాసనత్వం, పూజ్యత (యజ్ఞ), సమయజ్ఞత, సర్వ లక్షణ సంపత్తి కలవానిని చెప్పి... వీటన్నిటితో ఇతడే అసమానుడని తీర్మానించిందీ నామం.

ఈ అసమాన జయ లక్షణం శాశ్వతమైనది. పదిలమైనది కనుకనే –

విక్షరో రోహితో మార్గో హేతుర్దామోదర స్సహః।
మహీధరో మహాభాగో వేగవానమితాశనః॥.... 40

363. విక్షరః, **364.** రోహితః, **365.** మార్గః, **366.** హేతుః,
367. దామోదరః, **368.** సహః। **369.** మహీధరః, **370.** మహాభాగః,
371. వేగవాన్, **372.** అమితాశనః॥

విక్షరః.. 363

1. నాశనము, మార్పు లేనివాడు. (విగతః క్షరాత్)

   వివిధ విధములుగా తన ప్రతాపాది విభూతులను వెలార్చుతున్నా ఏమాత్రమూ తన స్థితి నుండి చెదరనివాడు. మార్పులు చెందే దేహాలలో మారని పరిపూర్ణ శాశ్వత ఈశ్వర చైతన్యమే 'విక్షరః'.

   అంతేకాక పైన పేర్కొన్న ప్రతాపాది లక్షణాలలో ఏ మాత్రమూ తరుగుదల లేనివాడు. అక్షర, అచ్యుత – అనే నామాల అర్థమే దీనిలోనూ ఉన్నది.

   జయ లక్షణాన్ని చెప్పి (సమితిం జయః) తరువాత ఈ నామం కూర్చడానికి వేద ప్రమాణాలు –

ధ్రువోచ్యుతః ప్రమృణీహి శత్రూన్ శత్రూయతో ధరాన్ పాదయస్వ

(అథర్వవేదం)

యస్మాన్న ఋతే విజయన్తే జనాసో యం యుధ్యమానా ఆవనే హవన్తే।
యో విశ్వస్య ప్రతిమానం బభూవ యో అచ్యుతచ్యుత్ స జనాస ఇన్ద్రః।

(అథర్వవేదం)

అక్షరమైన జయ లక్షణం చేతనే తనని తాను నిత్యం ప్రకటించుతూ, తన నుండి విశ్వాన్ని ప్రకటిస్తూ ప్రకాశిస్తున్నందున –

రోహితః.. 364

1. వ్యక్తమగువాడు (కలుగువాడు).

   'రుహ బీజ జన్మని ప్రాదుర్భావే చ' అనే ధాతువు ననుసరించి, 'రోహతి ప్రాదుర్భవతీతి రోహితః', ప్రాదుర్భవించువాడు. విక్షరమైన విష్ణు తత్వమే విశ్వంగా ప్రకటింపబడుతున్నది. విశ్వరూపంగా కలుగువాడు – రోహితుడు. సూర్యుడు తాను ఉదయించి తన శక్తితో ప్రపంచాన్ని ఉదయింపజేస్తాడు. బీజాలను ఉద్భవింపజేస్తాడు. అదేవిధంగా విష్ణువు తాను ప్రకటింపబడి, తన అనంత శక్తులతో విశ్వాన్ని ప్రకటింపజేస్తాడు.

   నమో రోహితాయ స్థపతయే ॥ (యజుర్వేదం)

   యో రోహితో విశ్వమిదం జజాన సత్వా రాష్ట్రాయ సుభృతం బిభర్తు।

   (అథర్వవేదం)

   యో రోహితో వృషభస్తిగ్మశృంగః –(అథర్వవేదం)

   రోహితో రశ్మిభిర్భూమిం సముద్రమనుసంచరత్ –(అథర్వవేదం)

2. వివిధ అవతారములుగా ఉద్భవించువాడు. తన ఇచ్ఛవచ్చినట్లుగా రూపాన్ని ధరించువాడు.

3. 'రోహితః' అంటే మత్స్య విశేషం కూడా. మత్స్యావతారుడైన శ్రీహరి అని అర్థం

4. 'రోహితః' అంటే 'ఎరుపు' అని అర్థం. ఎఱ్ఱని కాంతి కలవాడు రోహితుడు. ప్రకాశ సూచకమైన ఎరుపుతోనే సూర్యుడు తన తొలి వెలుగును ప్రసరిస్తాడు. ఈ రోహితం ఆదిని తెలియజేస్తుంది.

విశ్వానికే తొలి వెలుగైన విష్ణువు రోహితుడు. జ్ఞాన ప్రకాశ స్వరూపుడు. సూర్యమండలంలో పసిమి కలసిన ఎరుపు వర్ణంతో ఉన్న హిరణ్మయమూర్తి ఈతడే.

ధ్యాయేత్ కమలగర్భాభం దేవం లక్ష్మీపతిం తతః॥

"తామరపువ్వు నడిమి భాగం వంటి ఎరుపు రంగుతో నున్న లక్ష్మీపతి"యైన విష్ణుని ధ్యానమూర్తిని శాస్త్రాలు వర్ణించాయి.

ఈ వెలుగునే విద్యలు, విద్యావేత్తలు వెతుకుతున్నారు. కనుకనే –

మార్గః.. 365

1. వెదుకబడువాడు.

"మార్గ-అన్వేషణే" అని ధాతువు.

ముముక్షువులు, సాధకులు, శాస్త్రములు ఏ పరమపదాన్ని అన్వేషిస్తున్నాయో ఆ పదమే, ఆ సత్యమే విష్ణువు. అందరూ అన్వేషించే అనందమే శ్రీహరి.

తమేవ విదిత్వా అతిమృత్యుమేతి నాన్యః పంథా విద్యతేయనాయ॥

(యజుర్వేదం)

2. త్రోవగా ఉన్నవాడు.

ప్రకాశస్వరూపుడైన (రోహితుడు) విష్ణువే మోక్షకాములకు మార్గమై తరింపజేస్తున్నాడు. 'మోక్షంపు తెరువు ప్రాణులకెల్ల తెలిపెడి చేయి' అని అన్నమయ్య కీర్తించాడు. ఎన్ని త్రోవలున్నా వెలుగే అసలు త్రోవ, జ్ఞాన స్వరూపుడైన హరియే నిజమైన మార్గం.

మోక్షానికి మార్గం మాత్రమే కాక 'కారణం' కూడా ఈతడే.

అంతేకాదు – యోగులందరూ వెదికి పొందే ఆనంద పదమే ప్రపంచానికి అసలు మూల 'కారణం'

(ఆనందాదేవ ఖల్విమాని భూతాని జాయన్తే –శ్రుతి) అందుచేతనే –

హేతుః.. 366

1. కారణమైనవాడు.

'కార్యరూపేణ హినోతి వర్ణత – హేతుః', 'హిగతి వృద్ధ్యో' (ధాతువు) కార్యరూపంగా ఏది పరిణమించిందో అది హేతువు. విశ్వం కార్యం. విశ్వంగా పరిణమించిన విష్ణువు హేతువు.

'అస్య జగతః ఉపాదానం నిమిత్తం చ కారణం స ఏవ'

ఈ జగతికి ఉపాదాన, నిమిత్త కారణాలు రెండు ఆతడే. చేసిన సాధనం, చేసినవాడు. (కుండకు మన్ను ఉపాదన కారణం, కుమ్మరి నిమిత్త కారణం.) జగతికి హేతువు మాత్రమే కాక, కడుపున పెట్టి కాచుకున్నట్లుగా ఆధారుడై పోషకుడైన వాడు –

దామోదరః.. 367

1. దామములు (లోకములు) ఉదరంలో కలవాడు దామోదరుడు.

'దామ' శబ్దానికి రజ్జువు (త్రాడు), బంధనం (సూత్రం) అని అర్థం. ఈ బంధన రూప వ్యవస్థ కలవి లోకములు. త్రాళ్ళవలె ఉన్న మూలాలతో వృక్షాలు బంధింపబడతాయి. ఆ బంధనమే వాటి ఉనికికి ఆధారం. త్రుటి, నిమేష, ఘటికాదులతో బంధింపబడి కాలం, రాశులతో బంధింపబడి గ్రహాలు, ఇంద్రియాలతో బంధింపబడి దేహం... ఇలా లోకంలో ప్రతిదీ పరస్పర బంధన రూపంగా ఉన్నవే. అందుకే లోకములన్నీ దామములు. ప్రతి వస్తువు 'లోని భాగాల'న్నీ ఇలా బంధనా రూపంతో ఉన్నవే. 'లోని భాగాలే' ఉదరం. ఈ విశ్వ వ్యవస్థలో పదార్థాంతరాలలో (ఉదరాలలో) బంధన రూప చైతన్యంగా వ్యాపించిన విష్ణువే దామోదరుడు.

యో విద్యాత్ సూత్రం వితతం యస్మిన్నోతాః ప్రజా ఇమా। (అథర్వవేదం)

మయిసర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥ (గీత)

'సూత్రమునందు మణులవలె నా యందే సర్వము కూర్చబడ్డాయ'ని భగవద్వచనం. దామము వలె సర్వజీవుల అంతరాలలో వ్యాపించినవాడు.

దామాని లోక నామాని తాని యస్యోదరాంతరే।

తేన దామోదరో దేవః శ్రీధరః శ్రీ సమాశ్రితః॥ (వ్యాసోక్తి)

"లోకములకు దామములని నామం. అవి ఎవరి ఉదరంలో ఉన్నాయో అతడు శ్రీధరుడు, లక్ష్మీ సమాశ్రితుడైన దేవుడు. ఆ కారణం చేతనే అతనికి 'దామోదరు'డని పేరు". "జగజ్జాలములున్న బొజ్జ" అని పోతనగారు వర్ణించారు.

2. **'దమాత్ దామోదరో విభ్'** (మహాభారతం, ఉద్యోగపర్వం)
"దమము (ఇంద్రియ నిగ్రహం) చేత కలిగే ఉదార (ఉత్కృష్టమైన విశాల) బుద్ధి చేత తెలియబడే పరమాత్మ– దామోదరుడు."
ఇంద్రియనిగ్రహం, ఉదారబుద్ధి... అనే సాధనలతో నారాయణతత్త్వం అవగతమౌతుంది.

3. యశోద చేత త్రాడుచే కట్టబడిన ఉదరం కలవాడు.

తతస్సదామోదరతాం ప్రయయౌ దామబన్ధనాత్ (విష్ణు పురాణం)
"త్రాటిచే కట్టబడిన కారణంగా దామోదరుడయ్యాడ"ని అర్థం.
వేదవేద్యులైన హరి లోకాధారునిగా 'దామోదర' నామంతో కీర్తింపబడి, దానిని శ్రీకృష్ణ రూపంలో ఈ విధంగా సాక్షాత్కరింపజేశాడు. కృష్ణ లీలలో 'దామోదరలీల' ఒక అద్భుత తత్త్వ ప్రకటన.
ఏ ఒక్కరూ పట్టుకోలేని శ్రీకృష్ణుని ముగ్ధ వాత్సల్య భక్తితో పట్టుకోగలిగి, ఇంట్లో ఉన్న రజ్జువులన్నీ తెచ్చి కట్టినా కట్టుబడలేదతడు. చివరకు తల్లి అవస్థ చూసి జాలిపడి ఆయనే కట్టుబడ్డాడు. మనం పట్టుకోలేం. కట్టలేం. మన భక్తి తీవ్రతకు కరుణించి ఆ దయాళువే పట్టుబడాలి – కట్టుబడాలి. ఆయనను పట్టుకోవడం (ధారణ) – కట్టి ఉంచడం (ధ్యానం) ఇదే భక్తి సాధనకు ముఖ్యం.

అలా తల్లిచే బంధింపబడిన స్వామి – మద్దిచెట్లుగా శప్తులైన నలకూబర మణిగ్రీవుల శాప బంధాన్ని విడిపించాడు. ఇతరుల కట్టు విడదీయడానికి తాను కట్టుబడి వెళ్లిన భక్తవత్సలతకి ఇది తార్కాణం.

యశోదపట్ల, కుబేర పుత్రుల పట్ల స్వామి చూపించిన భక్త వాత్సల్యమంతా ఈ నామంలో పొదగబడింది. ఈ దివ్యనామంతో ఈ రమ్య ఘట్టాన్నీ, ఆ ఘట్టంలోని ఊలూఖల బంధితుడైన (తోటికి కట్టబడిన) బాలకృష్ణ రూపాన్ని ధ్యానించి పరవశించే భక్తి ఉత్కృష్టమైనది.

దదర్శ చాల్ప దంతాస్యం స్మితహాసం చ బాలకం।
తయోర్మధ్యగతం బద్ధం దామ్నా గాఢం తధోదరే।
తతశ్చ దామోదరతాం సయయౌ దామ బంధానాత్। (బ్రహ్మ పురాణం)

"యశోదమ్మచే తోటికి కట్టబడిన త్రాడుచే బంధించబడ్డ ఉదరంతో, కూలిన మద్ది చెట్ల నడుమ అమాయకంగా, తన చిన్ని దంతాలు కనబడేలా చిరునవ్వు నవ్వుతున్న దామోదర మూర్తి"ని బ్రహ్మపురాణం వర్ణించింది.

శ్రీవల్లభాచార్యులవారు బృందావనంలో ధ్యానంలో ఉండగా దామోదరుడు దర్శనమిచ్చాడు. వెంటనే పరవశించి 'దామోదరాష్టకం' పలికారాయన. అందులో ఒక్క రమణీయ శ్లోకం ;

రుదన్తం ముహుర్నేత్ర యుగ్మం సృజంతం
కరాంభోజయుగ్మేన సాతంక నేత్రం ।
మహుఃశ్వాస కంప త్రిరేఖాంక కంఠం
స్థితం నౌమి దామోదరం భక్త వంద్యమ్॥

"ఏడుస్తూ, బెదురు చూపులతో అటు నిటు చూస్తున్న నేత్రాలను, రెండు ముంజేతులతో తుడుచుకుంటూ, ఎగ శ్వాసతో కంపిస్తూ మూడు రేఖలతో నున్న కంఠంతో నిలబడిన భక్తవంద్యుడైన దామోదరుని నమస్కరిస్తున్నాను."

సమస్త భువనాలను తనలోనే భరిస్తున్నవాడు కనుక –

సహః.. 368

1. అన్నిటినీ సహించువాడు. ఓర్చుకొనువాడు. ఎదిరించువాడు.
దామములన్నీ (లోకములు) తనలో దాల్చిన దామోదరత్వమే ఆయన 'సహ'శ్శక్తిని ప్రకటిస్తోంది. దేనినైనా సహించగలవాడతడు.
శ్రీకృష్ణావతారంలోనే గోవర్ధన గిరిని అరచేతిలో దాల్చిన అమోఘ సహశ్శక్తి సంపన్నుడు.
కంసుని హింసలన్నీ ఓర్చి, ఎదిరించిన పటిమ గలవాడు.
భక్తవత్సలుడై యశోద చేసిన తర్జన భర్జనాదులను ఓర్చినవాడు,
భక్తానుకూలుడై తనకేమీ అవసరం లేకున్నా అన్నిటినీ ఓపికగా గ్రహించి అనుగ్రహించినవాడు.

భక్తులను క్షమించే ఈతడే, దుష్టులను తిరస్కరించి, ఎదిరించే ప్రతాపశాలి. ఈ సహశ్శక్తి చేతనే –

మహీధరః.. 369

1. పర్వతముల రూపాన ఉన్నవాడు.
పృథ్వి ధరించేవాటిలో పర్వతాలను శాస్త్రం పేర్కొన్నది. భూమిని స్థిరంగా నిలిపే పర్వతాల రూపంలోనున్న వాడితడు. కృష్ణావతారంలో 'గోవర్ధన గిరి'గా గోకులాన్ని కాపాడిన వాడు. పర్వతాలలోని ఐశ్వర్యాలన్నీ విష్ణు రూపాలే.

'వనాని విష్ణు ర్గిరయో దిశశ్చ' – 'వనములు, గిరులు, దిశలు విష్ణువే' అని పరాశరవచనం. (విష్ణు పురాణం.)
'విష్ణుః పర్వతానామధిపతిః' అని శ్రుతి వచనం.
పురాణాలలో హిమాచలాది కుల పర్వతాలు విష్ణువంశానికి చెందినట్లుగా పేర్కొన్నారు.

2. వాక్కును ధరించువాడు. (నిర్వహించువాడు).

'మహీ' శబ్దానికి వాక్కని కూడా అర్థముంది. వేదాది వాక్కులను దాల్చినవాడు. విశ్వవ్యాపకుడై సర్వ శబ్దాలను ధరించిన వాడితడు. మేఘాదులలో ఉరుములు, తిర్యక్కులలో వివిధ ధ్వనులు, మానవులలో స్వరాలు, అక్షరాలు, వాయువులలో గలగలలు, జలాలలో నాదాలు... అన్ని వాక్కులకు మూలమై వాటిని నిర్వహించు శబ్ద బ్రహ్మమితడు. (సత్యభాష్యం)

ఉచ్చిష్టే ఘోషణీ రాపః స్తనయిత్నుః శ్రుతిర్మహీ।
యత్ర ఋషయః ప్రథమజా ఋచః సామ యజుర్మహీ। (అథర్వవేదం)
మహీమధి శ్రియాయ వాచమ్ (అథర్వవేదం)
ఇదా సరస్వతీ మహీ తిస్రో దేవీ మయోభువః। (ఋగ్వేదం)

- వంటి శ్రుతి వాక్యాలు 'మహీ' పదాన్ని 'శబ్దం' అనే అర్థంలోనే చెప్పాయి.

3. శ్రీకృష్ణాది వివిధావతారాలతో భూభారాన్ని తొలగించి ధరించిన (కాపాడిన)వాడు.

ఇన్ని విధములుగా భువనాదులను ధరించుటచే -

మహాభాగః 370

1. గొప్ప భాగములు కలవాడు.

విశ్వమంతా భాగములతో కూడినది. స్వరూపతః విష్ణు డొక్కడే అయినా ఆయనలోనే ఆకాశాది గొప్పగొప్ప విభాగాలన్నీ ఉన్నాయి. ఇవే అంశలుగా (భాగాలుగా) తనలో దాల్చినవాడు మహాభాగుడు.

అహం సూర్యస్య పరియామి।
... అహం తా విశ్వా చకరం।
అహమస్మి మహామహో । (ఋగ్వేదం)

- అని శ్రుతి అన్ని మహాభాగములు హరి స్వరూపములేనని స్పష్టపరచింది.

2. గొప్పయజ్ఞ భాగాలు కలవాడు. దేవతా శ్రేష్ఠుడైన కారణంగా శ్రేష్ఠమైన హవిర్భాగాలను అపహరించే మహాభాగుడితడు.

మహాన్తి భాగ భుంక్తే - ఇతి మహాభాగః (శంకర భాష్యం)

స్వేచ్ఛగా దేహధారణ చేసి తన భాగంగా (భాగ్యంచే) జనించిన ఉత్కృష్టములైన భోజనాలను (అనుభవాలను) భుజించినవాడు.

తవ ప్రజాయా అనుయాజాశ్చ కేవల ఊర్జస్వన్తో హవిషః సన్తుభాగాః ।
తదాగ్నే యజ్ఞోయమస్తు సర్వాస్తుభ్యం నమన్తాం ప్రదిశశ్చ తస్రః॥

(ఋగ్వేదం)

- అని శ్రుతి వివరిస్తోంది.

విష్ణుని యజ్ఞ స్వరూపాన్ని ఈ నామం స్పష్ట పరుస్తోంది. సర్వ దేవాత్మకుడైన యజ్ఞ స్వరూపునిగా విష్ణువు మహాభాగుడు.

3. గొప్ప సౌభాగ్యవంతమైన అవతారములను ధరించినవాడు. తన సౌభాగ్యాల వలన సర్వులచే ఆరాధ్యుడు.

అనేక భాగములను నిర్వహించడంలో ఊహకందని వడి కలిగినందున -

వేగవాన్.. 371

1. వేగం కలవాడు.

శీఘ్ర గమన శక్తి (జవము-వడి) కలవాడు. కాంతిగా, శబ్దంగా, వాయువుగా ఈ వేగ గమనశక్తితోనే విశ్వమంతా వ్యాపించిన వాడు. కారణం కార్యంగా రూపొందే కాలం వేగం. కొన్ని మహావేగవంతాలున్నాయి. వాటిలో కాంతి ప్రసారం, వాయు గమనం, మనోగమనం వంటివి. అన్నిటిలో మహావేగం మనస్సుదే. అంతర్యామి అయిన నారాయణ చైతన్యం చేతనే మనస్సుకీ శక్తి ఉంది. మనలోని మనశ్శక్తి సైతం విష్ణు చైతన్య విలసితమే. మనస్సు కంటే కూడా వేగం కలవాడీ పరమాత్ముడు. స్థాణువై స్థిరంగా ఉన్నవాడే మనస్సు కంటే ప్రయాణించగలిగే వడి ఉన్నవాడు.

అనేజదేకం మనసో జవీయో
నైన ద్దేవా ఆప్నువన్ పూర్వమర్షమ్।

తద్ధావతోన్యానత్యేతి తిష్ఠత్ తస్మిన్నపోమాతరిశ్వా దధాతి॥ (యజుర్వేదం)

చలించని పరమాత్ముని వేగగమనం విశ్వంలో సాక్షాత్కరిస్తుంది. దీపం కదలదు. కాంతి ప్రసరిస్తుంది. అలాగే విశ్వ వ్యాపక ఆత్మశక్తి నిత్య చైతన్యాత్మకం.

వేద ప్రమాణాల ఆధారంగా - కాంతిమయుడైన సూర్యుని కిరణాదుల శక్తిని ఈ నామంతో సంభావించవచ్చు.

దివస్పృష్ఠే ధావమానం సుపర్ణమాదిత్యాః పుత్రం నాథకామ ఉపయామి భీతః॥

(అధర్వవేదం)

2. భక్తానుగ్రహ విషయంలో కూడా ఏ మాత్రం ఆలస్యం చేయని వేగవంతుడితడు.

ఆర్తుడైన గజేంద్రుని కాపాడడంలో 'సిరికిం జెప్పక, శంఖ చక్రయుగము చేదోయి సంధింపక' ఉన్నవాడున్నట్లు కదలివచ్చాడని పోతనగారి భక్తిభావన. గోవర్ధన గిరిని ఎత్తి గోకులాన్ని కాపాడడంలో, దావాగ్నిని మ్రింగి శరణాగతులను రక్షించడంలో, ద్రౌపదీమాన సంరక్షణలో, దుష్ట శిక్షణలో కూడా - జాగుసేయని దయామయుడు.

కాపాడడంలో ఎంత వేగమో, కాల మెరిగి కబళించడంలోనూ అంతే వేగం కలవాడు కనుక -

అమితాశనః.. 372

1. మితిలేని ఆహారం కలవాడు.

కొలతకందని విశ్వాన్ని ప్రళయవేళ ఆరగించే కాలస్వరూపుడు. **'కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో'** - అని గీతాచార్యునిగా ఈ మాటనే స్పష్టపరచాడు. ఎంత తిన్నా తనివితీరని కాల, మృత్యురూపుడు.

2. జీవుడు వివిధ శరీరాలను దాల్చి మితిలేని కర్మాదులను అనుభవించడం, ఆయా ఉపాధులతో ఎన్నిటినో ఆరగించడం చేస్తున్నాడు. ఆ జీవ చైతన్యం

అభివ్యక్తమయ్యేది ఈశ్వర చైతన్యమే.

విశ్వమంతా అమితాన్నమయం. ఇంద్రియాదులనుభవించే విషయాన్నాలే విశ్వమంతా నిండి ఉన్నాయి. ఈ విధంగా విశ్వరూపునిగా విష్ణువు అమితాశనుడు. ఈ అమితాశనునిగానే సర్వ జీవులకు అవసరమైన అన్నాలను సమకూర్చుతున్నాడు. అంతటి అపరిమిత అన్న భాండారం ఆదినారాయణుడు.

మాం హవన్తే పితరన్న జన్తవో అహం దాశుషే విభజామి భోజనం।

(ఋగ్వేదం)

యో మారయతి ప్రాణయతి యస్మాత్ ప్రాణన్తి భువనాని విశ్వా।

(అథర్వవేదం)

ద్యుక్షం సుదానుం తివిషీభిరావృతం గిరిం న పురుభోజసమ్॥

(అథర్వవేదం)

3. యజ్ఞాగ్నిగా మితిలేని ఆహుతులను స్వీకరించినవాడు.
4. శ్రీకృష్ణావతారంలో విషాన్నీ, దావాగ్నినీ మ్రింగినవాడు. అర్జునునకు విశ్వరూపాన్ని చూపినప్పుడు - అగ్నిలోకి మిడతలన్నీ ప్రవేశించినట్లుగా సర్వమూ భగవానుని ముఖంలోకి ప్రవేశించడం గోచరించింది.

గోవర్ధనగిరిని అర్చించమని గోకులాన్ని శాసించి, వారిచే నివేదించబడిన యజ్ఞ ద్రవ్యాలన్నిటినీ ఆరగించి గోపాలకులందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసిన అమితాహారి.

'దేవేవో వా దానవో వాత్వం?' - "నువ్వు దేవుడివా? దానవుడివా?" అని వారంతా ఆశ్చర్యపోయారట (విష్ణు పురాణం).

మహీధరః (369) నామం నుండి ఈ నామం వరకు గోవర్ధన గిరి రూపుడైన శ్రీకృష్ణుని స్మరించవచ్చు. వేగంగా ఆరగించి, అంతే వేగంగా గోకులాన్ని కాపాడిన వాడితడే.

అన్నిటినీ కబళించడమేకాక, తిరిగి తననుతాను గొప్పగా ప్రకటించుకోగలవాడు-

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః।
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః॥ ... 41

373.ఉద్భవః, 378.క్షోభణః, 379.దేవః, 380.శ్రీగర్భః,
381.పరమేశ్వరః । 382.కరణమ్, 383. కారణమ్, 384.కర్తా,
385. వికర్తా, 386. గహనః, 387. గుహః.

ఉద్భవః..373

1. ఉన్నతంగా కలుగువాడు.

   తాను కలిగితేనే అన్నీ కలుగుతాయి. 'జగములను లోపలికి గొని', తిరిగి 'వెలినిడ'గలడు. అవ్యక్తమైన తాను విశ్వరూపుడుగా వ్యక్తమై, తనయందు అన్నిటినీ కలిగించుతాడు. (విశ్వమంతా ఈతని నుండి ఉద్భవించినది)

   తన వ్యక్తీకరణ ఎప్పుడూ ఉన్నతమైనదే.

   'ఉచ్చైర్భవతీతి ఉన్నతః' – పృథివ్యాదుల కంటే 'ఉన్నతంగా ఉదయించే' (ఉద్భవించే) సూర్యుడు అందరికీ గోచరిస్తున్నాడు. జగతి నంతటినీ ప్రకాశింపజేస్తున్నాడు.

   తాను ఉద్భవించి (కలిగి), తననుండి ఉద్భవింపజేసి, ఒక దాని నుండి మరొకదానిని కలిగింపజేసే గొప్ప ఉద్భవ స్వరూపుడు విష్ణువు.

   ఈ ఉద్భవ వ్యవస్థగా విశ్వమంతా వ్యాపించి జీవులను, కర్మలను కలిగిస్తున్నవాడు.

2. అవతారాదులలో అందరితో కలిసి తిరిగినా, అందరికంటే ఉత్కృష్టుడై, మాయకందని ఉన్నతుడై చరించిన ఉద్భవుడు.

   ఇయం విసృష్టిర్యత ఆబభూవ యది వా దధే యదివానః (ఋగ్వేదం)
   యత ఆబభూవ భువనాని విశ్వా (యజుర్వేదం)

3. **ఉద్గతః భవాత్ సంసారాత్.** సంసారం నుండి పైకి వచ్చినవాడు. జగమంతా

తాను నిండినా దానిపైనే ఉన్న జన్మరహితుడు.

సృష్టికి (ఉద్భవానికి) మూలకారణమైన క్షోభ శక్తి ఈతనిదే కనుక –

క్షోభణః.. 374

1. కదలికగా ఉన్నవాడు. కల్లోల పరచువాడు.

కొలనులో ఒక చిన్న స్పందనవల్ల అలల కల్లోలం రేగుతుంది. అలాగే పరబ్రహ్మ యందు సంకల్ప కంపన వల్ల 'క్షోభ' ఏర్పడి జగత్ప్రజన జరుగుతుందని వైదిక జ్ఞానం. దీనిని 'స్పందన సిద్ధాంతం' 'క్షోభ సిద్ధాంతం' అంటారు.

సృష్టి, స్థితి, లయలలో – క్షోభ నిత్యం ఉంటుంది. ఈ కలవరం, కల్లోలం చైతన్య లక్షణం. సంకల్పం, ఇచ్ఛా, క్రియ, జ్ఞానం అన్నీ ఈ క్షోభశక్తులే. ఆ క్షోభరూపంతో నున్నది విష్ణు చైతన్యమే.

ప్రకృతిం పురుషం చైవ ప్రవిశ్యాత్మేచ్ఛయా హరిః।
ప్రవిశ్య క్షోభయామాస సర్గకాలే వ్యయావ్యయౌ।। (విష్ణు పురాణం)

"ఉద్భవ (సృష్టి) కాలంలో హరి తన ఇచ్ఛాశక్తితో ప్రకృతిలో పురుషునిలో ప్రవేశించి వ్యయ (వికార) తత్త్వమైన ప్రకృతిని అవ్యయ (నిర్వికార) తత్త్వమైన పురుషుని కూడా కలవరపరచాడు."

మన ఆలోచనల కదలికలకి, ఇంద్రియాల చలనాలకీ హేతువైన ఆత్మచైతన్యం మనలోనూ క్షోభశక్తిగా పనిచేస్తోంది.

కడలిలో తరంగాల కదలికలా, ఆత్మశక్తి కంపనలే 'తరంగాలు'గా భగవానుడు క్రీడిస్తున్నాడు కనుక –

దేవః... 375

1. క్రీడించువాడు.

వాసుదేవ (332) నామం వద్ద దేవ శబ్దానికి ఎన్నో అర్థాలను చెప్పుకోవచ్చు. ఇక్కడ క్రీడనార్థం గ్రహించవచ్చు.

లోకవత్తు లీలాకైవల్యం (బ్రహ్మసూత్రం)

ఈ ఉద్భవ, క్షోభణాదులన్నీ 'లీల'గా చేస్తున్నవాడు. లీలయే క్రీడ. అదే 'దేవ' శబ్దం. ఆట లాడినంత అలవోకగా, అంటీ అంటక... ఆచరిస్తున్నాడని "దేవః" అన్నారు.

ప్రతి తరంగంలో సముద్రం ఉంది. ప్రతి జీవునిలో స్వామి ఉన్నాడు. ఆయన ఆట ఉంది. 'తారంగం తారంగం'.... అనే బాలకృష్ణలీలను ఇక్కడ భావించవచ్చు. **'ఏకోదేవః సర్వభూతేషు గూఢః'** – 'ప్రతి ప్రాణిలోనూ నిగూఢంగా ఉన్న ఆత్మ చైతన్యమితడే' – అనే ఉపనిషత్తత్త్వమిది. అంతటా ప్రకాశించి, వ్యవహరింపబడి, క్రీడించేవాడు.

ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః ।(ఋగ్వేదం)

ఏషహి దేవః ప్రదిశోను సర్వాః। (యజుర్వేదం)

– అని శ్రుతి ఈ భావాన్నే పలికింది.

విశ్వమంతా క్షోభణునిగా సృష్టించడమేకాక, వలసిన విభూతులన్నీ తనయందు దాచి ఇచ్చే వానిగా –

శ్రీగర్భః.. 376

1. సిరులను కలిగించువాడు. సిరులు తనయందు కలవాడు.

చైతన్యమే శ్రీ. తన చైతన్యంతోనే ఈ జగతినంతటిని దాల్చినవాడు శ్రీగర్భుడు. సూర్యకాంతిలో భూమి ప్రకాశించి శక్తిని గ్రహించినట్లుగా, విష్ణుని చైతన్యంలో సర్వ విశ్వమూ విభూతులను గ్రహించి భాసిస్తోంది.

ప్రసవాన్ని కలిగించేది గర్భం. అనంతశ్రీలను సృష్టించేవాడు కనుక శ్రీగర్భుడు.

శరీరాని కంతటికీ కావలసిన చైతన్యం లోపలి ఆత్మలోనే ఉన్నది. అలా ఆత్మయైన నారాయణుడు శరీర చైతన్యాన్నంతటినీ తనలో దాచుకున్నవాడు.

శ్రియో వసానశ్చరతి స్వరోచిః (యజుర్వేదం)

యస్మిన్ విశ్వా అధి శ్రియో రణన్తి సప్త సంపదః (అథర్వవేదం)

– అని శ్రుతి శ్రీమయుడైన పరమాత్మను ప్రస్తావించింది.

అనంత శ్రీలతో జగత్స్థితిని నిర్వహిస్తున్న పాలకుడు కనుక –

పరమేశ్వరః.. 377

1. ఉత్కృష్టమైన శోభ కలిగిన ఈశ్వరుడు.

'పరా' శబ్దం ఉత్కృష్టవాచకం. 'మా' శోభావాచకం.

శరీరాది ఉపాధుల కతీతమైన శోభ కలిగిన పరమాత్ముడే ఈశ్వరునిగా ఈ సృష్టిక్రియను సాగిస్తున్నందున 'పరమేశ్వరుడ'య్యాడు.

ఐశ్వర్య సంపన్నుడు, శాసకుడు = ఈశ్వరుడు.

శ్రీ గర్భుడు కనుక అనంతైశ్వర్యం ఈయనదే. సర్వ జగతిని శాసించే ప్రభువీతడే. మనం చూసే భూ ప్రపంచానికి సూర్యుని వలె మన శరీరానికి జీవుని వలె ఈ అనంత విశ్వానికి పరమేశ్వరుడు మూలం. ఇతడే సూర్య, జీవ చైతన్యాలుగా వ్యక్తమై వ్యాపించాడు.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్।
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి॥ (గీత)

"అన్ని భూతములందు సమంగా ఉన్న పరమేశ్వరుడను నేను. వినాశ లక్షణం కలవాటిలో నాశనం చెందని నన్ను ఎవడు చూస్తున్నాడో అతనిదే సరియైన దృష్టి" అని శ్రీకృష్ణ పరమాత్ముని వచనం.

సత్యధర్మాది వ్యవస్థలలో సర్వ విశ్వాన్ని ఏర్పరచి శాసిస్తున్నవాడు.

జగతిని శాసించేది ఏది? **'ప్రాణోహ సర్వస్యేశ్వరః'**,

'కాలోహి సర్వస్యేశ్వరః'... అని అథర్వ వేదం చెబుతూ

ప్రాణమే అన్నిటికీ ఈశ్వరుడనీ, కాలమే సమస్తానికీ ఈశ్వరుడనీ..... చెప్పింది. అంటే ప్రాణ, కాలాదులుగా వ్యాపించిన ఆత్మయే సర్వమునకు ఈశ్వరుడని వేద ప్రతిపాదన.

య ఈశే మహతో మహాన్ తేన గృహ్ణామి త్వామహమ్ । (యజుర్వేదం)

దేహదృష్టిని వీడి క్రమంగా బుద్ధి, ప్రాణ, కాల, జీవాదుల నతిక్రమించి – సర్వమును శాసించే పరమాత్మను గ్రహించగలిగినప్పుడు – బుద్ధ్యాదులకు కూడా శాసకుడైన వాడితడే అనీ, ఈతని చైతన్యమే వీటియందు ప్రసరిస్తున్నదని గ్రహించగలం. అందుకే ఈ విష్ణువే పరమేశ్వరుడు. కనబడే కాలాదులన్నీ ఆయనకు ఉపకరణాలు. వీటిలో ఆయన కరణశక్తిగా ప్రసరిస్తేనే వీటికి చెల్లుబాటు.

కరణమ్.. 378

1. సాధన స్వరూపుడు.

   క్రియతే ఇతి కరణం – దేనితో ఒక పని చేస్తామో దానిని 'కరణం' అంటారు. క్రియా స్వరూపాన్ని ఇక్కడి నుండి నాలుగు నామాలతో చెప్తున్నారు. విశ్వమనే క్రియని 'పరమేశ్వరుడు (377) ఎలా నిర్వహిస్తున్నాడో ఈ నామాలలో గ్రహించవచ్చు.

   జగదుత్పత్తిని ఉద్భవుడైన ఈతడే కలిగిస్తున్నాడని చెప్పబడింది. అందుకు కావలసిన 'సాధకములు' ఈతని స్వరూపాలే.

2. అన్నిటికంటే ప్రధాన కారణం మనస్సు. దాని నుండి కామ, సంకల్పాదులు ప్రభవించి ఇన్ద్రియాదుల ద్వారా క్రియా నిర్వహణ జరుగుతుంది. ప్రధాన కరణమైన మనస్సులోని ఆత్మ యొక్క శక్తి వ్యక్తమౌతుంది – ఒక పనిముట్టుతో పనిచేసే వాని శక్తి ప్రయోగింపబడినట్లుగా. మనకైతే పనిముట్టు వేరు – పని వేరు.

   కానీ ఏకమై ఉన్న విష్ణుడు తానే పనిముట్టు – తానే పని.

'ఏకోహం బహుస్యాం' (ఒక్క నేనే ఎన్నో అవుతాను) అనే, 'అహం' రూప స్పందన 'బహుస్యాం' అనే కామంగా, సంకల్పంగా పరిణమించింది. ఆ కామము పుట్టిన చోటే చైతన్యపు ప్రథమ వ్యక్తీ'కరణ'. ఆ కరణంలో ఆతడే దీపిస్తున్నాడు. అదే సమస్త సృష్టికి హేతువైన ప్రథమ ప్రధాన కారణం. సృష్టిలో ప్రతి జీవునిలో మనస్సుగా ఉన్నది కూడా ఈ కరణమే.

యేన కర్మాణ్యపసో మనీషిణో
యజ్ఞే కృణ్వన్తి విదథేషు ధీరాః। (యజుర్వేదం)
నాన్య ఇన్ద్రాత్ కరణం భూమి ఇన్వన్తి। (ఋగ్వేదం)
కణ్వా ఇన్ద్రం యదకృత స్తోమైర్యజ్ఞస్య సాధనమ్। (అథర్వవేదం)

జ్ఞానోపకరణాలైన శ్రోత్రాది జ్ఞానేంద్రియాలలో, క్రియోపకరణాలైన కరచరణాది కర్మేంద్రియాలలో ప్రసరించే చైతన్యమే అసలు 'కరణం'. అదే మనోరూప కరణం. దానియందున్న విష్ణువును దర్శించాలని ఉపనిషద్వచనం.

చక్షుశ్చ ద్రష్టవ్యం చ నారాయణః
శ్రోత్రం చ శ్రోతవ్యం చ నారాయణః। (మహోపనిషత్తు)

'నేత్రము, చూడవలసినది నారాయణుడే. శ్రోత్రము, వినవలసినదీ నారాయణుడే'. ఒక క్రియను సాధించే ప్రతి సాధనాద్రవ్యంలోనూ విష్ణు చైతన్యమే ఉన్నది.

కరణాన్ని ప్రేరేపించే వాడితడే కనుక –

కారణమ్.. 378

1. చేయించేవాడు.

కారయతీతి కారణమ్. చేయించే దానిని కారణం అంటారు. కరణాల ద్వారా చేయించే ప్రేరకశక్తి అతడే.

మనదృష్టి కార్యాన్ని చూస్తుంది. భౌతిక విజ్ఞాన దృష్టి కొంత లోనికి వెళ్లి కొన్ని కారణాలనీ, కరణాలనీ దర్శిస్తుంది. నిశితమైన అధ్యాత్మ జ్ఞాన దృష్టి

ఈ కార్యంలో, కరణాలలో, కారణాలలో వ్యాపించిన అసలు కారణమైన పరమాత్మ చైతన్యాన్ని పట్టుకోగలుగుతుంది.

ఆ విష్ణు చైతన్యమే అసలు కారణం. (ఉపాదాన నిమిత్త కారణాలితడేనని వెనుకటి నామాలలో చెప్పబడింది.)

ఈ కరణ, కారణాలున్నా చేసేవాడు ఉండాలికదా. అతడీతడే –

కర్తా.. 380

1. చేసేవాడు.

ఇది పరమేశ్వరుని స్వతంత్రతా లక్షణాన్ని తెలియజేస్తుంది. కార్యసిద్ధి విషయంలో ఇతడు స్వతంత్రుడు. **'సత్యకామః సత్య సంకల్పః'** – అని తనదైన అమోఘ సంకల్పంతో, ఇచ్ఛకొలది స్వతంత్రంగా విశ్వాన్ని చేయువాడు. చేయించేవాడు (కారణం) చేసేవాడు (కర్తా) – రెండూ అతడే. అతని చేత చేయించేవాడు లేడు.

కర్తా సుదాసే అహ వా ఉ లోకం దాతా వసు ముహురా దాశుషే భూత్।

(ఋగ్వేదం)

త్వష్టేదం విశ్వం భువనం జజాన వహోः కర్తార మిహ యక్షి హోతः।

(యజుర్వేదం)

– అని శ్రుతి 'కర్త'గా సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుని వినుతించింది. కర్తగా ఈతడు చేసిన సృష్టిని పరిశీలిస్తే కేవలం 'కర్తా' అని ఊరుకోలేం ఈ స్వామి –

వికర్తా.. 381

1. విచిత్రమై, విశిష్టమైన కర్త.

   సృష్టి విశిష్టమైనది, వివిధమైనది. వివిధములైన ఈ సృష్టిని చేసినవాడు వికర్త. విచిత్ర చిత్ర రమణీయంగా వివిధగతులుగా విస్తృతంగా ఈ అనంత భువనాల నేర్పరచిన నేర్పరి. **'బహుస్యాం ప్రజాయేయ'** – బహువిధములుగా అయిన వాడితడు.

   అంతఃకరణ (మనస్సు) మొదలుకొని, బాహ్యకరణాల (ఇంద్రియాల) వరకు ప్రసరించు బహు భావాలను, కర్మలను కల్పించే 'వికర్త' ఆత్మగా మనలోనే ఉన్నాడని గుర్తించాలి. ఈ కరణ, కారణ, కర్త, వికర్త లక్షణాలకు ఒకే ఆత్మ చైతన్యం మూలమనీ, అదే విశ్వవ్యాపక విష్ణువనే జ్ఞానాన్ని గ్రహించడమే ఈ నాలుగు నామాల కూర్పులోని సారం.

2. 'వికర్తనం' అంటే (వికారం) మార్పు పొందించువాడు. చేసిన సృష్టిలో నిరంతరం మార్పు కలిగించువాడు. కుసుమం ఫలంగా, చినుకు వాగుగా... ఇలా అనేక పరిణామాలు జగతిలో కలిగించువాడు. చివరకు సంహార క్రియకూడా పరిణామమే. సంహార కారకుడు 'వికర్త'.

   ఇలా ఈ నామాల వరుస సృష్టి స్థితిలయకర్తయైన విష్ణుని 'పరమేశ్వరత్వా'న్ని (377వ నామం) తెలియజేస్తోంది.

3. ఇంత గొప్ప కర్తగా ఉన్నా, వాస్తవానికి దేనికీ అంటనివాడు కనుక– **'విగత కర్తృత్వ భావం'** కలవాడు. అంటే అన్నీ చేసేవాడితడే – చేయనివాడితడే అని కూడా భావించవచ్చు.

   తస్య కర్తారమపి మాం విద్ధి.....(గీతావచనం)

   ప్రతిపనికి ఉండే స్వరూపాన్ని ఈ నాలుగు నామాలతో కూర్చారు. ఈ నాలుగు విష్ణు చైతన్య విలసితాలు.

   ఇన్ని చేస్తున్నా ఆనవాలు చిక్కని వాడు కనుక –

1. తెలియుటకు సాధ్యం కానివాడు.

   అన్నిటినీ సాధించే ఈయనను సాధించలేం. అంతటినీ చూడగలుగుతున్నా చూపిస్తున్న కంటిని చూడలేం. ఇంద్రియాలలో ప్రసరిస్తున్న చైతన్యాన్ని ఇంద్రియాలే గ్రహించలేక పోతున్నాయి. అలాగే విశ్వమంతా ప్రసరిస్తున్న విష్ణు చైతన్యం ఏ ఒక్కరికీ అంత తేలికగా తెలుసుకోడానికి శక్యం కావడం లేదు.

   వృక్షంగా వ్యక్తమయిన మూలం కానరానట్లే, విశ్వమంతా వ్యాపించిన విష్ణుని స్వరూప, సామర్థ్య, చేష్టితాలు 'ఇటువంటివి' అని ఎరుగుట శక్యం కాదు.

2. శ్రీరామ కృష్ణాద్యవతారాలలో అన్ని లీలలనీ ప్రకటిస్తున్నా తానెవరో తెలియనివ్వక గహనంగానే విహరించాడు. ఆతని కారుణ్యాన్ని అనుభవిస్తున్న యశోదాదులే ఆతని కలరూపుని గ్రహించలేకపోయారు. ఆయనతోపాటు ఉన్న దేవతలే ఆయనని గుర్తించలేరు. **(సహైవసన్తం నవిజానన్తి దేవాః)**. బ్రహ్మేంద్రాదులు శ్రీకృష్ణుని తెలియలేక వత్సాపహరణంతో ఒకరు, రాళ్లవాన కురిపించి ఇంకొకరు మోహితులయ్యారు.

3. **'గాహు విలోడనే'** అనే ధాతువు ననుసరించి **'గాహ్యత' ఇతి గహనః. 'గాహత ఇతి గహనః'.** ప్రపంచాన్ని ముంచినవాడు. ప్రపంచమునందు మునుగువాడు. సూర్యకాంతిలో జగతి మునిగి ప్రకాశించునట్లు విష్ణునిలో విశ్వం మునిగి చైతన్యవంతమౌతోంది. అదేవిధంగా విశ్వంలో విష్ణువు. నిండుగా దిగి నడిపిస్తున్నాడు.

   విదే యదాసు సన్దదిర్మహీరపో వి గాహతే ॥ (ఋగ్వేదం)

   అభిగోత్రాణి సహసా గాహమానోదాయో వీరః శతమన్యురిన్ద్రః॥

   (యజుర్వేదం)

   - అని శ్రుతి గహనుడైన పరమేశ్వరుని ప్రస్తుతించింది.

బలవంతుడు నదిలో దిగినట్లుగా, విశ్వంలో దిగి కదలించి మథించువాడు గహనుడు.

తన యోగమాయ తెరగా వేసి తనను మరుగు పరచుకున్న వాడు కనుకనే -

గుహః.. 383

1. కప్పినవాడు. (కప్పబడినవాడు)

'గుహ సంవరణే' అనే ధాతువు ననుసరించి - తన తత్త్వాన్ని లీలాశక్తితో (యోగమాయతో) ఆవరింపజేసి తెలియనీయనివాడు.

నివురు చాటున నిప్పువలె యోగమాయ చేత ఆవృతం చేసుకొని అందరికి గోచరించనివాడు. విశ్వరూపాన్ని గుర్తిస్తున్న యశోదకు వైష్ణవమాయను కప్పి తనను మరుగుపరచుకున్నవాడు.

'నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః' (గీత)

"యోగమాయచే మూయబడియున్న నేను అందరికీ సులభగోచరుడ్ని కాను" - అని పరమాత్మ వచనం. అంటే ఏ కొందరికో గోచరుడు. అంతర్ముఖుడై మాయనతిక్రమించిన జ్ఞానికి మాత్రమే తెలిసే సత్యతత్త్వమే నారాయణుడు. బాహిరదృష్టిగల వానికి అగోచరుడు.

2. రహస్యమైనవాడు.

హృద్గుహలో విరాజిల్లే జ్ఞానానంద స్వరూపుడు.

'పరం పుమాంసం నిహితం గుహాయాం' అని ఉపనిషద్వచనం.

గుహ (హృదయం) యందున్న పరమ పురుషుడే రహస్యమైనవాడు.

'గూఢో గుహాశయః సాక్షీ మహాపురుష ఈశ్వరః' అని భాగవత వచనం.

స వై గుహ్యాః ప్రజాపతిః । (అథర్వవేదం)

.... విశ్వాయురగ్నే గుహా గుహం గాః। (ఋగ్వేదం)

...ధామ విభృతం గుహాసత్ । (యజుర్వేదం)

– అని వేదం గుహ స్వరూపుని వినుతించింది.

బుద్ధి ప్రాణాల కంటే రహస్యమైన ఆత్మ స్వరూపంతో అందరిలో ఉన్నవాడు. ఈ ఆత్మయందే సర్వమూ ఉన్నవి కనుక –

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః।
పరర్ధిః పరమస్పష్టస్తుష్టః పుష్టః శుభేక్షణః॥... 42

384. వ్యవసాయః, *385.* వ్యవస్థానః, *386.* సంస్థానః, *387.* స్థానదః,
388. ధ్రువః, *389.* పరర్ధిః, *390.* పరమస్పష్టః, *391.* తుష్టః,
392. పుష్టః, *393.* శుభేక్షణః॥

వ్యవసాయః... 384

1. విశేషముగా తనయందు నిబద్ధము చేయువాడు.

   'విశేషేణ అవబద్ధం – నిబద్ధ మస్మిన్ ఇతి వ్యవసాయః.'

   గుహస్వరూపమైన ఆత్మయందే సర్వము ఆధారపడి, నిబద్ధమై ఉంది. వృక్షమూలంలో వృక్ష స్వరూపమంతా నిబద్ధమైనట్లుగా పరమాత్ముడైన విష్ణువునందే విశ్వమంతా నిబద్ధమై ఉంది.

2. **"విశేషేణ అవసీయతే బధ్యతే"** జ్యోతిశ్చక్రాదులను, విశ్వ చక్రాన్ని చక్కగా బంధించి (నియంత్రించి) ఆధారమై నడుపుతున్నవాడు.

   'భవచక్రభృతం దేవం' అని శ్రీహరి స్తుతి.

   జీవుడు తన ప్రయత్నంలో తాను నిబద్ధుడై ఉంటాడు కనుక ప్రయత్నానికి కూడ 'వ్యవసాయ'మనే మాటను వ్యవహరిస్తాం. అలా జీవుని నిబద్ధించే ప్రయత్నరూప చైతన్యం విష్ణురూపమే.

   వృక్ష స్కంధమునందు నిబద్ధమై విస్తరించిన శాఖలవలె ఈ పరమాత్మయందే దేవతలు నిబద్ధులైనారని శ్రుతి చెప్తున్నది –

తస్మిన్ ఓయన్తే య ఉ కే చ దేవా
వృక్షస్య స్కన్ధః పరిత ఇవ శాఖాఃll (అథర్వవేదం)

3. కేవల జ్ఞాన స్వరూపుడు.

కేవలాత్మజ్ఞానమే సంవిత్తు. అదే 'గుహావిద్య'. దీనినే నిశ్చయాత్మక జ్ఞానం అంటారు. నిరంజనమై, నిర్విషయకమై (ఏ మాయా వరణాలు లేని, విషయస్పర్శ లేని) ఉన్న నిత్యశుద్ధ జ్ఞానమే తన స్వరూపంగా కలవాడు. ఈ జ్ఞానస్థితి నుండి చెదరకనే సమస్తాన్నీ తనయందు నిబద్ధం చేసి తాను బంధితుడు కాకుండా, విశ్వాన్ని అమర్చినవాడు కనుక –

వ్యవస్థానః.. 385

1. చక్కని అమరిక కలవాడు.

పరమాత్మయందే ప్రతి ప్రదార్థం 'అమరిక' పొంది ఉన్నది. ప్రతి వస్తు వ్యవస్థను చేసే వ్యవస్థానుడే ఈ విష్ణువు. ఇంద్రాది లోకపాలుర అధికారాలు, గ్రహ నక్షత్రాల స్థానం, వివిధ ప్రాణుల స్థితులు, వర్ణాశ్రమాది ధర్మాలు, పంచభూతాల లక్షణాలు, కాల స్థితిగతులు, ఋతువులు.... ఇలా సర్వ వ్యవస్థలను ఏర్పరచినవాడు. విశ్వాన్ని పరిశీలించేవారికి ఈ అద్భుత వ్యవస్థ అచ్చెరువు గొలుపుతుంది. అలాగే ప్రత్యేక ఉపాధిలో ఆయా ఉపాధిగత ఇంద్రియాది వ్యవస్థలు కూడా వ్యవస్థానుని నిర్వహణయే.

ఈ అమరికని తనయందే చేసి, తిరిగి తనయందే లీనం చేసుకొనేవాడు కనుక –

సంస్థానః.. 386

1. చక్కని ఉనికి అయినవాడు.

సమీచీనం స్థానం – సంస్థానం. విశ్వమంతా ఆయన అమర్చినది మాత్రమే కాదు. అయనయందే అమరి ఉన్నది కూడా. చక్కని ఆశ్రయస్థానమితడు.

యస్య సంస్థే న వృణ్వతే హరీ సమత్సు శత్రవః। (అథర్వవేదం)
ఆ మాతరా స్థాపయసే జిగత్నూ అత ఇనోషి కర్బురా పురూణి। (ఋగ్వేదం)

– అని సంస్థానుడైన ఈశ్వరతత్త్వాన్ని శ్రుతి ప్రతిపాదించింది.

ఈ సంస్థానంలోనే విశ్వం పుట్టి పెరిగి లయమౌతుంది. ప్రళయస్థానంలో కూడా చక్కగా ఈ విశ్వానికి తనయందు ఉనికినిచ్చే సంస్థానుడీ విష్ణువు.

ఈ సంస్థాన లక్షణం మొత్తంగా విశ్వానికేకాక, ప్రత్యేకంగా కూడా ప్రకటించినవాడై –

స్థానదః.. 387

1. స్థానమునిచ్చువాడు.

ప్రతి యొక్కరికీ వారి వారి, వాటి వాటి అర్హతల ననుసరించి తగిన స్థానాన్ని ఇచ్చినవాడు. ధ్రువునకు దివ్య పదవి నిచ్చినట్లుగా అందరికీ తగిన స్థితిని సమకూర్చువాడు.

దేనియందుంటామో దానిని 'స్థానం' అంటారు. **(తిష్ఠన్త్యస్మిన్ తత్ స్థానం).** పృథ్వి, అంతరిక్షం... వీటి స్థానాలు వీటివే. సముద్రాదులు, రాశి చక్రాలు అన్నీ వాటి వాటి స్థానాలలో అమరి ఉన్నాయి. ఆయా స్థానాల నమర్చి, అందు చక్కగా నిలిపినవాడు విష్ణువు. ఆ చోటున వాటిని నిలిపే శక్తి నిచ్చిన స్థానబలం కూడా అతడే – 'స్థానదః'.

శరీరంలో ప్రతి ఇంద్రియానికి వాటి చోటు వాటిదే. మార్చలేం. వృక్షానికి నేల, పత్రాలకి వృక్షం... ఇలా విశ్వమంతా 'వ్యవస్థాన, సంస్థాన, స్థానద' రూపంతో వ్యాపించిన పరమాత్ముడు విష్ణువు.

విరాట్పురుషుని శరీరమే ఈ విశ్వం. ద్యావాపృథివ్యాదులన్నీ ఆ శరీరంలో వివిధ అవయవస్థానాలలో ఉన్నాయి.

నాభ్యా ఆసీదన్తరిక్షం శీర్ష్ణో ద్యౌః సమవర్తత।
పద్భ్యాం భూమిర్దిశః శ్రోత్రాత్ తథా లోకాగ్ం అకల్పయన్॥ (యజుర్వేదం)

ఈ విధంగా తనదైన తనువున సర్వజగతికి స్థానమునిచ్చినవాడు 'స్థానదుడు.' ఇందరికీ, ఇన్నిటికీ స్థానాలిచ్చిన ఆయన స్థానం మాత్రము శాశ్వతమైనది-

ధ్రువః.. 388

1. స్థిరమైన (చెదరని) వాడు.

   విశ్వ వ్యవస్థను స్థిరంగా నడిపేవాడు ధ్రువుడు. సృష్ట్యారంభంలో సూర్య చన్ద్ర, పంచభూతాది వ్యవస్థను ఏర్పరచి దానినే స్థిరంగా నడుపుతున్నవాడు. సూర్యుడు తూర్పున ఉదయించడం, పడమరన అస్తమించడం, చంద్రుని కళలు, జీవుల జనన మరణాలు... ఇవి నిశ్చయంగా జరిగే స్థిర వ్యవస్థలు. **'ధ్రువో మృత్యుః, ధ్రువం జన్మ'** అన్నది ప్రసిద్ధి. ఈ ధ్రువత్వం లేకుంటే విశ్వం అస్తవ్యస్తమవుతుంది. ఈ నిశ్చయ వ్యవస్థే ధ్రువస్వరూపుడైన విష్ణువు. **'ఋతశ్చ సత్యశ్చ ధ్రువశ్చ ధరుణశ్చ॥** (యజుర్వేదం)

2. నాశన రహితుడైన శాశ్వతుడు. పరబ్రహ్మ.

   "సర్వత్రగ మచింత్యం చ కూటస్థమచలం ధ్రువం" - గీతావాక్యం.

   అంతటా కలవాడు, చింతన కందనివాడు, దేహకూటం లోపలనున్నవాడు, నిశ్చలుడు, శాశ్వతుడు.

   ఇది పరతత్త్వాన్ని స్పష్టపరచే నామం.

3. వైకుంఠపదాలలో ధ్రువపదం ఒకటి. వేదాంత పరంగా ఇదే పరబ్రహ్మస్థానం.

   జ్యోతిషపరంగా - ధ్రువనక్షత్ర రూపుడై తాను నిశ్చలుడై తనని ఆధారంగా జ్యోతిర్మండలాన్ని తనయందు, నిబద్ధించి, నియంత్రించి, నిర్వహిస్తున్నవాడు. 'వ్యవస్థానః' నుండి ఈ నామం వరకు 'ధ్రువ' స్వరూపమే వర్ణింపబడిందని శ్రీపరాశరభట్టు భావన.

   మరొక రకంగా - ధ్రువ నక్షత్రాన్నీ, దానిని ఆధారం చేసుకొన్న ఇతర జ్యోతిర్మండలాన్నీ పరిశీలించినట్లే - ధ్రువమైన ఆత్మను ఆధారం చేసుకుని నడిచే దేహమనోబుద్ధి ప్రాణాది వ్యవస్థల్ని పరిశీలించాలి. ఈ వ్యవస్థనీ,

సంస్థానాన్నీ, స్థానాన్నీ ఏ చైతన్యం నుండి పొందుతున్నామో గమనించితే ఆ ఆత్మయే మనలోని ధ్రువస్థానమని తెలుస్తుంది. అదే విష్ణుపదం. అదే పరమోత్కృష్టమైన వైభవస్థానం -

పరర్ధిః.. 389

1. సర్వోత్తమమైన సంపద కలవాడు.

'ఋద్ధి' అంటే సంపద. 'పరా' - ఉత్కృష్టం. విశ్వంలో ఒక్కొక్క దానిలో ఒక్కొక్క విభూతి (సంపద) ఉన్నది. కానీ సమూహంగా అన్నీ ఒక్క దగ్గరుండవు. ఈ భిన్న భిన్న సంపదలన్నిటికీ మూలమై, అన్నిటినీ మించిన సంపదల సమృద్ధి కలవాడితడు. సర్వము ఇక్కడి నుండి లభించిన సంపదలతోనే మనగలుగుతున్నాయి.

నాన్తోస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప। అని 'భగవద్గీత.' అంతులేని దివ్య విభూతులు కలవాడే 'పరర్ధిః'.

రాద్ధిః సమృద్ధి రవృద్ధి మతిరుదితయుః కృతుః। (అథర్వవేదం)
ఏవా హి తే విభూతయు ఊతయు ఇన్ద్రమావతే।। (ఋగ్వేదం)

2. ఈ నామం నుండి శ్రీపరాశరభట్టు రామకథను సంభావించారు. ఈ ఔచితీ దృష్టితో శ్రీరామవైభవాన్ని దర్శించవచ్చు.

సర్వోత్కృష్టమైన సమృద్ధితో, విభూతులతో అవతరించిన పరిపూర్ణుడు రాముడు. **"స చ సర్వగుణైుః పూర్ణుః"** అని వాల్మీకి వర్ణించాడు. అన్ని కల్యాణ గుణముల సమృద్ధి కలవాడు రాముడు.

విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియ దర్శనుః

(శ్రీమద్రామాయణం. బాలకాండ).

దేవానాం హృదయం సౌమ్యం గుహ్యం రామః పరన్తపుః।। (అయోధ్యకాండ)

"దేవతల హృదయము, సౌమ్యము, గుహ్యము - అయిన పరతత్త్వమే శత్రుంజయుడైన శ్రీరాముడు."

తన కల్యాణ గుణాలనే అవతారంలో చక్కగా స్పష్టపరచినవాడు -

పరమస్పష్టః.. 390

1. బాగా స్పష్టమైనవాడు.
   తన విభూతులనే విశ్వమంతా వ్యాప్తి చేసినవాడు. వాటి ద్వారానే తనను వ్యక్తపరుస్తున్నాడు. కేవల అనుభవ (సంవిద్) రూపుడు. ఏ మాయావరణ లేని అచ్చమైన జ్ఞానమే పరమస్పష్టం. ఆ శుద్ధ జ్ఞాన స్వరూపుడు కనుక – 'పరమస్పష్టః'.
2. ఉత్కృష్టమైన శోభతో స్వాధీనుడై ఉన్న పరముడు. స్వచ్ఛమై మాయాతీతుడై భాసించు స్పష్టుడు. **(పరమశ్చాసౌ స్పష్టశ్చ)**
   'పలుకులలోని తేట పరమాత్ముడు' (అన్నమయ్య). వేదాది విజ్ఞానాలన్నీ సర్వోత్కృష్టుడితడని స్పష్టపరచాయి.
3. **'స్పశతి బధ్నాతి స్పష్టః'.** తన సమృద్ధి చేత ఈ విశ్వాన్ని ఉత్కృష్టంగా (పరమంగా) నిబద్ధించినవాడు. ఆయన విధించిన ధర్మ బంధనాన్ని (నియమాన్ని) అనుసరించి విశ్వం నడుస్తున్నది. విశ్వ నియమాలను ఏర్పరచడం స్పష్టత.

   తం సూర్యం హరితః సప్తయహ్వీ: స్పశం విశ్వస్య జగతో వహన్తి।
   (ఋగ్వేదం)

   అస్య స్పశో న నిమిషన్తి భూర్ణయః పదే పదే పాశినః సన్తి సేతవః।
   (ఋగ్వేదం)

   దివః స్పశః ప్రచరన్తీదమస్య..... ॥ (అథర్వవేదం)

   – అని శ్రుతి పలు విధాల నారాయణుని పరమ స్పష్టతను విశదపరచింది.
4. శ్రీరామునిగా విష్ణువు తన కల్యాణ గుణాలను పరమ స్పష్టంగా ప్రదర్శించాడు. "గుణవాన్, వీర్యవాన్, ధర్మజ్ఞః, కృతజ్ఞశ్చ....." అంటూ కల్యాణ గుణ సమృద్ధిని పరమంగా, స్పష్టంగా ప్రకటించిన అవతారమిది.
   'పరమ స్పష్టమైన' శుద్ధ జ్ఞానమే రామబ్రహ్మము. (శుద్ధ బ్రహ్మ పరాత్పర రామ). యోగులు, ఋషులకు శ్రీరాముడు పరబ్రహ్మమని సుస్పష్టంగా తెలుసు.

'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
వసిష్ఠాపి మహాతేజా యే చ మే తపసి స్థితాఃII (బాలకాండ)

– "మహాత్ముడైన సత్యపరాక్రముడు రాముడు నాకు తెలుసు. వసిష్ఠునకు తెలుసు. తాపసులకు తెలుసు" అని బ్రహ్మర్షి విశ్వామిత్రుని పలుకు. యుద్ధకాండలో మందోదరి కూడా – **"వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనఃII"** అని చెప్పినది. 'సనాతనమైన పరమాత్మయే ఈ మహాయోగిగా వ్యక్తం (స్పష్టం) ఐనాడు.'

సచ్చిదానంద ఘనమైన బ్రహ్మము శ్రీరాముడు. 'పరమస్పష్టఃI' – అనేది 'సచ్చిత్' లక్షణాన్ని తెలియజేస్తే, ఆనంద లక్షణాన్ని తెలియజేస్తూ తరువాతి నామం –

తుష్టఃI.. 391

1. ఆనంద స్వరూపుడు.

నిరంతరం తోషము (ఆనందం)తో నుండువాడు. తుష్టియే తన స్వరూపంగా కలవాడు. ఆనంద ఘనుడు.

తృప్తి, తుష్టి పరిపూర్ణుడైన హరి స్వరూపాలు. దివ్య గుణాలలో 'తుష్టి' ఒకటి.

అకామో ధీరో అమృతఃI స్వయంభూ రసేన తృప్తో న కుతశ్చనూనఃII
(అథర్వవేదం)

కోరికలు లేనివాడు, ధీరుడు, శాశ్వతుడు, స్వయంభువైనవాడు ఆనంద స్వరూపంచేత తృప్తుడై, ఏ లోటూ లేనివాడై ఉన్న పరమాత్ముడు.

2. ఈ ఆనంద స్వరూపంతో ఆవిర్భవించి కౌసల్యా దశరథులను, వసిష్ఠ విశ్వామిత్రులను, సీతమ్మను, లక్ష్మణ భరత శత్రుఘ్నులను, హనుమత్సుగ్రీవ జాంబవదంగద విభీషణాదులను, అయోధ్య వాసులను తృప్తి పరచినవాడు ఈతడే.

జ్ఞానానందమయుడైనందున నిత్యపూర్ణుడు.

శుభ గుణ ప్రపూర్ణుడైనందున వీక్షణ మాత్రం చేత శుభాలను ప్రసరించే –

పుష్టిః.. 392

1. నిండుదనం కలవాడు (పరిపూర్ణుడు).

   దివ్యగుణాలైన తుష్టినీ పుష్టినీ కలిగినవాడితడు. నిత్య సమృద్ధి భావమే పుష్టి.

2. పోషించగలిగే బలమే పుష్టి. విశ్వమంతా ఈ పోషక బలంచే (పుష్టిచే) నిండిన విష్ణుని చేతనే ప్రతి ప్రాణికి పుష్టి లభిస్తున్నది. గాలిని తిని జీవించే వాటికి వాయువు, మట్టిలో పోషించబడే వాటికి మన్ను, ఇలా ప్రతి జీవికి పోషక శక్తిని నింపిన దయాళువీ పుష్టి స్వరూపుడు.

   సహో ఓజః పుష్యతి విశ్వమానుషక్ ॥ (అథర్వవేదం)

   అగ్నే త్వం పురీష్యోరయిమాన్ పుష్టిమాన్ అసి ॥ (యజుర్వేదం)

   పుష్టానాం పతయే నమః॥

   సుగంధిం పుష్టివర్ధనమ్ ॥ (యజుర్వేదం)

3. వాక్పుష్టి, జ్ఞాన పుష్టి, శరీర పుష్టి, గుణ పుష్టి... మొదలైన పుష్టులన్నీ కలిగిన పూర్ణావతారుడు శ్రీరాముడు.

   "తమేవ గుణసంపన్నం రామం" (బాలకాండ).

   తుష్టి పుష్టి వంటి శుభగుణాలతో దర్శనమాత్రంచేత శుభంకరుడై -

శుభేక్షణః.. 393

1. శుభకరమైన దర్శనము కలవాడు.

   విష్ణు దర్శనం లభిస్తే చాలు.... ముముక్షువులకు మోక్షం. భోగార్థులకు భోగం లభిస్తుంది. సర్వ సందేహాలు తీరి జ్ఞానం లభిస్తుంది. అన్ని కర్మ బంధనాలు విడివడతాయి. అవిద్య నివృత్తి అవుతుంది.

   భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః ।

   క్షీయంతే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥ (ముండకోపనిషత్తు)

   'పరతత్త్వంగా పరుడు (ఉత్కృష్టుడు)ను, జగద్రూపంగా అవరుడును అయిన ఆ పరమాత్ముడు దర్శన గోచరుడు కాగానే (తెలియగానే) ఉపాసకుని

హృదయంలోని అవిద్యాగ్రంధి భేదిల్లి, సర్వ సంశయాలు ఛిన్నములై, కర్మములన్నీ క్షయమౌతాయి."

2. సూర్య చంద్ర నేత్రుడై వెలుగునీ, చలువనీ పంచుతున్న విరాడ్రూపుడు. సూర్యుడు నేత్రములై, చంద్రుడు మనోదృష్టియై ఉన్నవాడు. చూపులోను, మనస్సులోను సైతం శుభ లక్షణం కలవాడు. లోకంలో సద్గుణాలు కలవాని చూపులు శుభంకరాలని ప్రసిద్ధి. మతి, పుష్టి, తుష్టి వంటి సద్గుణాలు కల్గిన సచ్చిదానంద ఘనుడైన శ్రీమహావిష్ణుని చూపులు శుభంకరాలవడం అత్యంత స్వాభావికం.
3. చూసిన వెంటనే మనసునకు ప్రసన్నతను, బ్రహ్మానందాన్ని ప్రసాదించే దివ్య మంగళ విగ్రహునిగా అవతరించిన వాడు శ్రీరాముడు.

రూపౌదార్య గుణైః పుంసాం దృష్టి చిత్తాపహారిణమ్ ॥ (అయోధ్యకాండ) రూప, ఔదార్య గుణాలతో సర్వజీవుల (పురుషుల = జీవుల) దృష్టినీ, చిత్తాన్ని హరించే కమనీయ మంగళ మూర్తి.

"కన కన రుచిరా కనకవసన! నిన్ను"

"సొగసు చూడతరమా!" – అని నాదబ్రహ్మ త్యాగయ్య ఈ రామ సౌందర్యాన్నే పరవశిస్తూ గానం చేశారు.

యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో నపశ్యతి।
నిందితస్స వసేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే ॥ (అయోధ్యకాండ)

"రాముని ఎవడు చూడలేదో, రాముడు ఎవనిని చూడలేదో – వాడు లోకంలో నిందితుడై బ్రతికేవాడు. వాని మనస్సు కూడా వానిని నిందిస్తుంది" అయోధ్యవాసుల రామభక్తి అది.

భగవానుడైన శ్రీరాముని కనలేని వాని జన్మ వ్యర్థం. రాముని చలువ చూపుల కరుణకు (అనుగ్రహ వీక్షణానికి) నోచుకోని వాని బ్రతుకు వృధా. ఆ మనస్సే ఆ జీవిని నిందిస్తుంది. వాడు ఆత్మద్రోహి. పరమాత్మునెరుగని వానిని 'ఆత్మద్రోహి'గా, 'ఆత్మఘ్ని'గా ఉపనిషత్తు వర్ణించింది. ఆ భావాన్నే ఈ శ్లోకంలో చెప్పి మహర్షి వాల్మీకి "శ్రీరాముడు పరమాత్మ"అని సుస్పష్టంగా ప్రకటించాడు.

"చంద్రకాన్తాననం రామం అతీవ ప్రియ దర్శనమ్"

"ప్రీతి కలిగించే దర్శనం కల, చన్ద్రుని వలె కమనీయమైన మోము కలవాడు రాముడు" అని వాల్మీకి మాట.

4. **"రామో రాజీవలోచనః" "రామః కమలపత్రాక్షః"** అని పలుమార్లు రాముని కన్నుల సొగసును వర్ణించాడు వాల్మీకి.

సుభ్రూరాయత తామ్రాక్షః సాక్షాద్విష్ణు రివస్వయమ్ ॥(అయోధ్యకాండ)

"అందమైన కనుబొమలు, విశాలమైన ఎఱ్ఱనివైన నేత్రాలు కల రాముడు సాక్షాత్తు విష్ణువువలె ఉన్నాడు" అని ప్రత్యేకించి నేత్రాలను కీర్తించాడు.

'పరర్ధిః' నుండి 'పుష్టః' వరకు చెప్పబడిన సచ్చిదానంద లక్షణంతో, కల్యాణ దివ్యగుణాలతో శుభదర్శనునిగా అవతరించిన వాడే –

రామో విరామో విరతో(జో) మార్గో నేయో నయోనయః।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మ విదుత్తమః॥... 43

394. రామః, 395. విరామః, 396. విరతః (విరజః),
397. మార్గః, 398. నేయః, 399. నయః,
400. అనయః। 401. వీరః, 402. శక్తిమతాంశ్రేష్ఠః,
403. ధర్మః, 404. ధర్మవిదుత్తమః॥

రామః.. ——— **394.**

1. ఆనంద స్వరూపుడు.

రమయతీతి రామః– ఆనందింపజేయువాడు. స్వతః సచ్చిదానంద స్వరూపుడైన విష్ణువు సర్వులను రమింపజేసే లక్షణం చేత 'రాముడ'య్యాడు. తత్త్వవేత్తలు, భక్తులు ఏ స్వామిని ధ్యానించి, కీర్తించి, స్మరించి, అర్చించి ఆనందిస్తున్నారో ఆ మహావిష్ణువు రాముడు.

2. **'రమణీయత్వాత్ రామః'** – అన్ని విధముల రంజింపచేసే లక్షణాల చేత రాముడు. నారాయణుడు తన తారక బ్రహ్మతత్త్వాన్ని రామావతారంలో

ప్రకటించాడు. స్వేచ్ఛగా రమణీయ రూపధారియై అవతరించిన దాశరథి రాముడు. రూపంలో, గుణంలో, చరిత్రలో, ధర్మంలో, వాగ్వైదుష్యంలో, శీలంలో, జ్ఞానంలో... అన్నిటా ఆనందింపజేసే స్వభావం చేత రాముడు. 'అందమైనవాడు' అని అర్థాన్ని గ్రహిస్తే ఆనందస్థానమే అందం. **'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్'**... పూర్ణానంద బ్రహ్మయే శ్రీరాముడు.

3. **'రము క్రీడాయాం'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి – విశ్వం ఎవరి యందు క్రీడిస్తున్నదో, ఎవడు విశ్వమందు క్రీడిస్తున్నాడో అతడు రాముడు. అదే 'లీల'. లీలామయుడే రాముడు. విశ్వమంతా ఆనందంగా చరించేది పరతత్త్వంలోనే. ఆ విష్ణువే అందరిలో ప్రవేశించిన ఆత్మస్వరూపుడు. ఆయన చేతనే ప్రపంచం క్రీడిస్తున్నది.

'రమించు వారెవరురా! రఘూత్తమా! నిను వినా
శమాదిషడ్గుణగణ! సకల భువన జనులలో'.... అని త్యాగరాజస్వామి 'అందరిలో క్రీడించే ఆనంద స్వరూపు'ని ఉపాసించి కీర్తించారు.

సృష్టి స్థితి లయలనే ఆట నాడుతున్న విష్ణువే రాముడు. ప్రజలను తన చక్కని పాలనతో రంజింపజేసే రాజువలె పంచ భూతాదులు, అద్భుతమైన ప్రకృతి, జ్యోతిర్వ్యవస్థ ఏర్పరచి ప్రపంచాన్ని ఆనందింపజేస్తున్న మహారాజు శ్రీవిష్ణురాముడు.

రమంతే యోగినో యస్మిన్ నిత్యానందే చిదాత్మని।
ఇతిరామపదే నైతత్ పరం బ్రహ్మేతి ధీయతే।।

"ఏ నిత్యానంద చిదాత్ముని యందు యోగులు నిత్యం రమిస్తున్నారో (ఆనందిస్తున్నారో) ఆ పరమాత్మయే 'రామ' పదం చేత చెప్పబడుతోంది."

ఇన్ద్రగ్ం సఖాయో అను సగ్ం రభధ్వమ్ ।।(యజుర్వేదం)
అయం చిద్ వాతో రమతే పరిజ్మన్ । (ఋగ్వేదం)

– అని శ్రుతి రమణశీలుడైన బ్రహ్మమును ప్రస్తావించింది.

ఈ నామం మహామంత్రం. తరింపజేసే (మోక్షమిచ్చే)ది కనుక తారక

మంత్రం. మహామహిమాన్వితమైన ఈ మంత్రంలో అనేకానేక రహస్యాలున్నాయి. మంత్ర శాస్త్రాలు, ఉపాసనాపరమైన 'రామతాపినీయోపనిషత్తు', 'సారతారోపనిషత్తు' వంటివి ఈ నామానికి చాలా అర్థాలు చెప్పాయి. ఇంతటి శక్తిగల నామం కనుకనే –

'సారసారతర తారకనామము
సర్వమతములకు సమ్మతమైన
పేరిడి నిన్ను పెంచిన వారెవరే...' అంటూ త్యాగయ్య పరవశించారు.

'వేదవర్ణనీయమౌ నామమి'ది అని స్పష్ట పరచారు.

స్వర జీవ లక్ష్యమైన ఆనందం ఈ నామంలో దాగి ఉంది కనుక – ఇది విశ్వజనీన మంత్రం.

4. **"రాజతే స్వే మహిమ్ని ఇతి రామః"** – తన మహిమయందు తాను ప్రకాశించువాడు రాముడు.

'రామో రమయతాం శ్రేష్ఠః' (శ్రీమద్రామాయణం అయోధ్యకాండ).

'గుణాభిరామం రామంచ (సుందరకాండ)

సృష్టిలో ఆనందింపజేసే వాటన్నిటిలోనూ అత్యంత శ్రేష్ఠమైనవాడు. 'రామ'ను మించిన ఆనందం మరోచోట లేదు. అది అఖండాద్వితీయ రసానందం. **"శ్రీరామ నీ నామ మేమి రుచిరా"** అని రామదాసు, **"నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా"** అని త్యాగయ్య స్వానుభవంతో పలికారు.

5. మంత్రపరంగా శబ్ద శక్తిని పరిశీలిస్తే –

రకారో అగ్ని బీజంస్యాత్, అకారో సూర్యబీజకం, మకారం చన్ద్రబీజం చ।

'ర' అగ్ని బీజం, 'అ' సూర్యబీజం, 'మ' చన్ద్ర బీజం.

రామ=అగ్ని సూర్య చన్ద్ర బీజాన్వితం. విశ్వానికి హేతువైన చిజ్జ్యోతి నుండే సూర్యచన్ద్రాగ్నులు ఉద్భవించారు.

'యదాదిత్య గతం తేజో జగద్భాసయతేఖిలం।
యచ్చన్ద్ర మసి యచ్చాగ్నౌ తత్తేజోవిద్ధిమామకమ్॥ – అని భగవద్గీత.

ఆదిత్యునిలో, చన్ద్రునిలో, అగ్నిలో ఏ తేజస్సున్నదో అది పరమాత్ముని తేజస్సని గ్రహించాలి. అగ్ని బీజం (ర) కర్మ బీజాలను దహింపజేసి, సూర్యబీజం (అ) జ్ఞానాన్ని ప్రసరించి, చన్ద్ర బీజం(మ) అమృతమైన బ్రహ్మానంద రసానుభూతి నిస్తుంది. జీవుని ఈ క్రమంలో తరింపజేసే శక్తిమంతమైన దివ్యనామమిది. అందుచేతనే ఈ నామం భారతీయ హృదయ నాదంగా ధ్వనిస్తోంది.

అగ్నీ సూర్యులను వాటి లక్షణానుసారం ఒక్కటిగా గ్రహిస్తే - 'రా' అగ్ని శక్తి. అందుకే 'ర+అ' కలిపి ఒకటయ్యింది. 'మ' అమృత (రస) స్వరూపుడైన చన్ద్ర శక్తి **(సోమోభూత్వా రసాత్మకః)**. ఇలా ఈ నామం **"అగ్నీ సోమాత్మకం జగత్"** అనే దర్శనాన్నిస్తుంది. విశ్వమంతా చలువ, వేడిమిల (సోమాగ్నుల) కలయిక. ఈ విశ్వశక్తి అంతా ఈ ఒక్క నామంలో ఇమిడి ఉంది.

'ర-అ-మ' - సత్ - చిత్ - ఆనందమయ బ్రహ్మమును, 'అ-ఉ-మ'లతో కూడిన ప్రణవాన్నీ ప్రకటిస్తోంది. మనలో ఇడ, పింగళ, సుషుమ్న సూర్యాగ్ని చన్ద్రనాడులు. వీటిలో చరించే ప్రాణ శక్తికి సంకేతమే 'రామ'. ఆ కారణం చేతనే రామనామజపం ప్రాణోపాసనాత్మకమైన యోగం. నిరంతర రామనామ జప పరాయణుడు మహాయోగి.

బ్రహ్మ విష్ణు శివాత్మకమైన పరతత్వ మితడని మంత్రశాస్త్రం స్పష్టం చేస్తోంది. ఇంతటి శక్తి కలిగినది కనుకనే 'రామ' నామాన్ని మహర్షులు, మహాత్ములు, భక్తులు మనకు గొప్ప మార్గంగా ఉపదేశించారు. పరమాత్మకు సంబంధించిన సర్వ విషయాలు ఈ ఒక్క నామంలో ఇమిడి ఉన్నాయి.

ఈ ఆనందాన్ని అనుభవించడం తెలిసినవారు ప్రాపంచిక సుఖాభాసల్ని విడచి ఇందులోనే లీనమై విశ్రమిస్తారు కనుక -

విరామః.. 395

1. (ప్రపంచక్రీడకు) ముగింపు అయినవాడు.
   విశ్వనిర్వహణ అనే క్రీడను ఆపి తనలో లయం చేసుకొనేవాడు.
   'యత్రామృతం చ మృత్యుం చ పురుషేధి సమాహితే" (అథర్వవేదం)
   జీవితాల ఆటలో అలసిన ప్రాణులకు విశ్రాంతి నిచ్చేవాడు.
   బ్రతుకు పరుగులాటలో అలసి, విషయాల వెంపర్లాటలో విసిగి –
   'అంతర్యామీ! అలసితి సొలసితి ఇంతట నీ శరణిదె జొచ్చితిని' అని
   అంతర్ముఖుడైన సాధకుని తనలో లీనం చేసుకొనే బ్రహ్మమితడు.
   యోగులు బాహ్యాలను విరమించుకొని ఈ తత్త్వమందే ఒదిగి
   లీనమౌతున్నారు.
   'లీయమాన మిదం సర్వం బ్రహ్మణ్యేవహి లీయతే' అని శ్రుతి.
2. అధర్మ వర్తనలకు 'ఆటకట్టు' ఇతడు. రావణాది దనుజుల స్వేచ్ఛావిహారానికి,
   విచ్చలవిడి క్రీడకు ముగింపు నిచ్చి, వారిని సంహరించినవాడు.
   బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా...
   త్రాతుం నశక్తాః యుధిరామవధ్యమ్ (సుందరకాండ).
   "బ్రహ్మాది దేవతలు కూడా రాముడు వధించదలచుకున్న శత్రువును
   కాపాడలేరు"
   జగతిని ఉద్ధరించడానికై అవతరించిన అతడు జగద్విషయాలపై
   ఆసక్తిలేనివాడు కనుక –

విరతః.. 396

1. ఆసక్తి లేనివాడు.
   స్వతః పరిపూర్ణానంద స్వరూపుడు. (తానే ఆనందం). కనుక బాహ్యం నుండి
   ఆనందాన్ని అపేక్షించడు. విషయ సుఖాలపై ఆసక్తి లేని విరాగి. శబ్దాది
   బాహ్య విషయానుభవం అవసరం లేని రాముడు (ఆనందరూపుడు).

జగతిని నిర్వహిస్తున్న విష్ణువు జగద్విషయాలపై మక్కువలేని నిర్లేపుడు – నిరంజనుడు.

2. రామావతారంలో ఈ విరాగ లక్షణాన్ని అద్భుతంగా ప్రకటించాడు. భోగాల కన్నా ధర్మం శాశ్వతమని, రాజ్యభోగాన్ని కూడా తృణ ప్రాయంగా విసర్జించాడు. ఆ సమయంలో 'రాజ్యభోగం కోల్పోతు'న్న వేదన ఈషణ్మాత్రం లేని స్థితిలో ఉన్నాడు.

'నాహమర్థపరో లోకే' – నేను అర్థపరుడనుకాను. (అయోధ్యకాండ)

'సపితుర్వచనం శ్రీమాన్ అభిషేకాత్పరం ప్రియమ్' (సుందరకాండ)

'రాజ్యాభిషేకం కన్నా తండ్రి వచనమే ప్రియమని తలచిన'వాడు.

ధర్మాపదేశాత్త్యజతశ్చ రాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతిమ్।
నాసీద్వ్యథాయస్య న భీః నశోకః।। (సుందరకాండ)

"ధర్మ నిమిత్తమై రాజ్యాన్ని వదలినప్పుడుగానీ, నన్ను అరణ్యానికి తీసుకు వచ్చినప్పుడు కానీ ఎవనికి కష్టం, భయం, దుఃఖం లేవో".... అని సీతమ్మ శ్రీరాముని 'విరతి'ని గురించి వివరించింది.

రాజ్యాన్ని వదలి అరణ్యాలకు వెళ్లేటప్పుడు కైకేయితో శ్రీరాముని వచనం:

'విద్ధిమాం ఋషిభిస్తుల్యం' 'కేవలం ధర్మమాస్థితం'

"నేను ఋషులతో సమానమైనవాడినని తెలుసుకో." "కేవలం ధర్మమునందే నా స్థితి". రామావతార లక్షణమంతా ఇందులో ఉంది. అవతార ధర్మ నిర్వహణే తప్ప లౌకిక అర్థాది విషయాసక్తి లేనివాడు. విరాగి – అని స్పష్టపరచాడు. విరక్తి కలవాడే ధర్మాన్ని నిర్భయంగా, నిర్మోహంగా, నిబ్బరంగా నిర్వహించగలడు.

అకామో ధీరో అమృతః స్వయంభూః। ।।అథర్వవేదం।।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్య నశ్నన్నన్యో అభిచాకశీతి (ఋగ్వేదం)
తమసః పరస్తాత్।। (యజుర్వేదం) – అని శ్రుతి పరమాత్ముని విరతిని చెప్తోంది.

3. *'విరతః' బదులుగా 'విరజః' అని పాఠాంతరం కూడా ఉంది –*

'రజః' అంటే దుమ్ము – కలుషత్వం. ఆ రజము లేనివాడు 'విరజుడు'. ఏ మాత్రమూ కల్మషంలేని నిర్మల చరిత్రుడు రాముడు. మాయ అనే దుమ్ము లేని శుద్ధ బ్రహ్మమైన విష్ణువు.

రాజస భావ ప్రకోపంలేని శుద్ధమైన సాత్త్విక ధర్మాన్ని ప్రతిష్ఠించిన అవతారమిది. ఈ శ్లోకమంతా రామావతార లక్షణాన్ని ఒక్కొక్క నామంలో అద్భుతంగా ఆవిష్కరించారు వ్యాసులు. వేదసమానమైన రామాయణంలోని మర్మాలను, వైదిక విష్ణు తత్త్వ వచస్సులతో అనుసంధానించి ఈ మంత్రాక్షరాలను సమకూర్చారు. ఈ 'విరతః' – 'విరజః' – రామావతార లక్షణాన్ని చెబుతున్నాయి. వెనుకటి నామం (విరామః) పౌలస్త్యవధ అనే అవతార ప్రధాన ప్రయోజనాన్ని ప్రకటించింది.

శుద్ధ సాత్త్విక మర్యాదతో కూడిన తన ప్రవర్తననే మనకు త్రోవగా ప్రదర్శించినందున –

మార్గః.. 397

1. త్రోవైనవాడు.

పరమాత్మను గురించి పరమాత్మే ప్రకటించగలడు. సాధనమతడే – సిద్ధీ అతడే. ఏ మార్గంలో మనం వెళ్లాలో దానిని తానే మలచాడు. వేదాది ధర్మ రూపంలో, శాస్త్ర రూపంలో తానే వ్యక్తమై మార్గమయ్యాడు. వాటిలో చెప్పిన ధర్మాన్ని ఎలా అనుసరించాలో చేసి చూపించే అవతారమూర్తి అయ్యాడు. ధర్మమార్గం, కైవల్య మార్గం రెండూ తానై ఇహపరాలను సిద్ధింపజేసే స్వామి. ప్రవృత్తి మార్గ, నివృత్తి మార్గ ధర్మస్వరూపుడు. దేవయాన, పితృయాన రూపుడు. జీవుల రాకపోకలను నడిపేవాడు.

పరమాత్మ జ్ఞానమే పరమాత్మ స్వరూపం. ఆ ఆత్మజ్ఞాన రూపమే ముక్తికి మార్గం. జ్ఞాన రూపుడని అర్థాన్ని గ్రహించవచ్చు.

ఈ 'మార్గ'నామంలో ఇన్ని అర్థాలున్నాయి.

2. 'రామాయణమ్' – అనే మాటలోనే 'మార్గం' ఉంది.
'రాముడే అయనం' 'రాముని అయనం' – అని రెండు విధాలుగా ఈ శబ్దాన్ని గ్రహించవచ్చు. 'అయనం' అంటే త్రోవ. రాముని త్రోవే రాముడు. ఒక వ్యక్తి – అంటే అతడి వర్తన, గుణం, వ్యక్తిత్వం అన్నీ కలిపి గ్రహిస్తాం. అలాగే రాముని సర్వ చరిత్రే రాముడు. ఆ చరిత్రనే మనం అనుసరించాలి.
'విరజః – మార్గః' రెండు పదాలుగా కాక, ఒక్క పదంగా గ్రహిస్తే – విరజోమార్గః = ఏ దుమ్మూ ధూళీ లేని నిర్మల ధర్మమార్గమే రాముడు. ఇహానికి గానీ, పరానికి గానీ రాముని మించిన త్రోవ లేదు.

3. **'మృజూ శుద్ధౌ'** అనే ధాతువునకు **'ఘఞ్'** ప్రత్యయం చేరి 'మార్గః' అనే శబ్దం లభిస్తుంది. 'శుద్ధమైనవాడు', 'శుద్ధి చేయువాడు' రాముడు. ధర్మమార్గంలో ఎలా వెళ్లాలో చూపి నడిపించే వాడితడే.

నేయః.. 398

1. కొనిపోబడువాడు. తీసుకువెళ్ళబడువాడు.
జ్ఞానమార్గంలో తీసుకువెళ్ళబడే జీవుడు పరమాత్మలో లీనమై బ్రహ్మైక్యం పొందుతున్నాడు. **'బ్రహ్మ విద్బ్రహ్మైవ భవతి'** – బ్రహ్మవేత్త బ్రహ్మయే అవుతున్నాడు. ఆ విధంగా జీవుని పరమాత్మతో (తనతో) తాదాత్మ్యం చెందించి అభేదాన్ని సిద్ధింపజేయడం చేత – ఈశ్వరునిచే నడిపించబడే జీవుడు కూడా విష్ణుచైతన్యమేనని ఈ నామం చెబుతున్నది.

2. భక్తులు తమ భావనామార్గాలలో తీసుకువెళ్ళదగిన వాడితడే.
"సర్వప్రమాణ విషయత్వాత్ –
మనసా నేతుమర్హః – మంతుం యోగ్య మననీయో భవతి" (సత్యభాష్యం)
అన్నిటికీ లక్ష్యమైన ఈతడే మనసా (బుద్ధిచే – ఆలోచనాదులచే) గ్రహించవలసిన మననీయుడు. భక్త సులభుడై హనుమంతునిచే సుగ్రీవుని

వద్దకు రావణుని వద్దకు తీసుకువెళ్ళబడినవాడు.

వాయుసూనోః సుహృత్త్వేన భక్త్యా పరమయా చ సః।
శత్రూణాం అప్రకంప్యోపి లఘుత్వమగమత్కపేః।। (యుద్ధకాండ)

"హనుమంతుని సుహృత్వం (స్నేహం) చేత, పరమభక్తి చేత – శత్రువులు సైతం కదల్చలేని గరిమగలవాడు అతి తేలికగా మారాడు."

2. శ్రీరాముడు విశ్వామిత్ర, వసిష్ఠ, భరద్వాజ, శరభంగ, అగస్త్యాది మహర్షులు చూపిన మార్గాన వెళ్ళి – "ఋషులు చెప్పిన ధర్మాన్ని అనుసరించాలి" అని బోధించాడు. ఆ విధంగా ఋషి వాక్కులచే తీసుకుపోబడి, శబరి వంటి భక్తుల తపస్సులచే కొని రాబడిన వాడై 'నేయః' అయ్యాడు.
3. **'ణీఞ్' 'ప్రాపణే'** ధాతువు ననుసరించి **'నేయః – ప్రాప్యః'** అని అర్థం. పొందదగినవాడు. సర్వ జీవులకు ఏకైక లక్ష్యమితడే. రాముడే లక్ష్యంగా నడిచిన జీవుడే ధన్యుడు.

నారాయణునిచే తన నిర్దేశిత నియమంలో తీసుకుపోబడే విశ్వమే 'నేయః'. ఈ విశ్వమంతా తానే నిండి ఉన్నందున ఈ నామాన్ని తానే స్వీకరిస్తున్నాడు.

విశ్వో దేవస్య నేతుర్మర్తోవురీత సఖ్యమ్।। యజుర్వేదం.
నహి త్వదన్యన్మఘవన్ న ఆప్యం వస్యో అస్తిపితా చ న।। (ఋగ్వేదం)

– అని శ్రుతి మంత్రాలలో పల్లవించినవే పై భావాలు.

ధర్మమార్గంలో నడిచిన విష్ణువును నడిపించేది ఆయనే. తన సంకల్పంతో తనను నడిపించుకున్నాడు. 'స్వేచ్ఛయా' అవతరించినవాడు. తనచే నడిపింపబడేది తానేనని ఈ నామంతో (నేయః) తెలియజేసి, నడిపించేది తానేనని తరువాతి నామంలో తెలుపుతూ –

నయః.. 399

1. తీసుకు వెళ్లేవాడు.

   ఆశ్రయించిన జీవులను మోక్షస్థితికి తీసుకువెళ్లేది ఈతడే.

   భక్తుల వద్దకు తానే వచ్చి సద్గతిని చేర్చుతాడు. రాముని ధర్మ మార్గాన్ని గమనించినవారిని అయనే నడిపిస్తాడు.

   'గతి' ఈతడే 'గమనం' ఇతడే. 'రామః' గమ్యం.

   దానికి 'మార్గం' ఇతడే. తత్త్వతః – "మార్గః – నేయః – నయః" – త్రిపుటి. 'త్రోవ – తీసుకువెళ్ళబడేవాడు – తీసుకువెళ్ళేవాడు' మూడూ విష్ణువే. సాధన స్థితిలో మూడూ విడిగా ఉన్నా, సిద్ధి స్థితిలో ఐక్యమే. ఇదే పరమసత్యం. 'జ్ఞానం – జ్ఞాత – జ్ఞేయం' మూడింటి ఏకత్వం (త్రిపుటీ ఏకత్వం) వేదాంత విజ్ఞానం. ఆ విజ్ఞానాన్ని చక్కని క్రమంలో కూర్చారు. ఆ స్థితి అందాక ఇంక మూడులేవు. అదే తురీయం. రామోపాసన వల్ల సిద్ధించే ఆ తురీయస్థితిని తరువాతి నామం చెబుతోంది –

అనయః.. 400

1. నాయకుడు (నడిపించువాడు) లేనివాడు.

   విష్ణువు విశ్వాన్ని నడుపుతున్నాడు. ఆయనని నడిపేవాడు లేడు. నడిపేవాడే నాయకుడు. స్వామి మనకు నాయకుడు. ఆయనకు నాయకుడు లేడు.

   భక్తుల ఇచ్ఛ కొలది నడుస్తున్నట్లు (నేయః) కనిపిస్తున్నా, తన ఇచ్ఛ చేతను నడిచేవాడతడు.

   ధర్మ మర్యాదలకు తానే కర్త.

   'మర్యాదానాం చ కర్తా' (సుందరకాండ). తానే మోక్ష స్థితి (గతి) అయిన వాడు కనుక ఆ గతికి ఈతనిని ఎవరు తీసుకుపోనక్కరలేదు.

2. ఈయనను ఎవరూ లొంగదీయలేరు. రాక్షసాదులకు అంతు చిక్కనివాడు, అధర్మపరులకు అందనివాడు.

చతుర్థ శతకమ్ సమాప్తమ్

తనపై ఏ నాయకుడూ లేని ఏకైక నాయకునిగా సర్వులను శాసించడం చేత -

వీరః.. 401

1. గొప్ప విక్రమము కలవాడు.

   విశ్వమునంతా ఆక్రమించి తన అతిశయత్వాన్ని చాటిన విష్ణువే వీరుడు.

   ఏ దేవతలకీ సాధ్యం కాని దనుజులను దునుమాడిన పరాక్రమ శాలి.

2. శ్రీరాముని‌గా ఈ వీరత్వాన్ని ప్రకటించాడు.

   'అజతీతి వీరః' - దనుజులను పారద్రోలినవాడు. తాటకిని, మారీచ సుబాహులనీ, ఖర దూషణాదులను, కుంభకర్ణ రావణాది మహారాక్షసులను అవలీలగా మట్టుపెట్టిన 'భండన భీముడు'.

   బ్రహ్మదండ ప్రకాశానాం విద్యుజ్జ్వలిత వర్చసామ్।

   స్మరన్ రాఘవ బాణానాం వివ్యధే రాక్షసేశ్వరః ॥ (యుద్ధకాండ)

   "బ్రహ్మదండం వలె మెఱుపు తీగల్లా ప్రకాశించే రాఘవుని బాణాలను తలచుకొని రావణుడు చాలా వ్యధ చెందాడు."

   మాతంగ ఇవ సింహేనా గరుడేనేవ పన్నగః॥

   అభిభూతో భవద్రాజా రాఘవేణ మహాత్మనా ॥ (యుద్ధకాండ)

   "సింహం చేత ఏనుగవలె, గరుడునిచే సర్పంవలె రావణుడు రామునిచే పరాభవింపబడ్డాడు."

   రామునిచే దెబ్బతిన్న మారీచునికి ప్రతి వృక్షమందు ధనుర్ధారియైన రాముడే కనిపించసాగాడని 'అరణ్యకాండ'లో వర్ణన.

   విభీషణునకు అభయమిచ్చేటప్పుడు 'నా కాలి బొటన వ్రేలితో పిశాచ యక్ష రాక్షసాదులను సైతం ఎగరగొట్టగలన'ని ప్రకటించిన వీరుడతడు.

   బాణాగ్రంతో సముద్రునే గడగడలాడించిన ప్రకృతి శాసకుడు.

   అంతటి శక్తి కలవాడు కనుకనే -

శక్తిమతాంశ్రేష్ఠః.. 402

1. శక్తిగలవారిలో గొప్పవాడు.

సృష్టిలో ప్రకృతి శక్తులు మొదలుకొని దేవతాశక్తుల వరకు అనేకం ఉన్నాయి. వాటన్నిటికీ శక్తినిచ్చి, వాటిని మించినవాడు విష్ణువు. బ్రహ్మేంద్రాది దేవతలు శక్తిమంతులు. వారిని మించిన శక్తిమంతుడు.

కనుకనే శక్తిమంతులలో 'కీర్తింప దగినవాడు' (శ్రేష్ఠః).

య ఉగ్రేభ్యశ్చి దోజీయాత్ శూరేభ్యశ్చిచ్ఛూరతరః (ఋగ్వేదం)

ఉగ్రులలో ఉగ్రతరునిగా, శూరులలో శూరతరునిగా శ్రుతి పేర్కొన్నది. ఈ శక్తిని తన అవతారాలలో ప్రకటించి కీర్తింపబడ్డాడు.

2. పరశురాముడు శ్రీరాముని శక్తిని చూసి – **'అక్షయం మధుహన్తారం జానామి త్వాం సురేశ్వరమ్'** – "రామా! నీవు దేవనాథుడవు, మధుసూదనుడవు. శాశ్వత బ్రహ్మమవు అని తెలుసుకున్నాను" అంటూ కీర్తించాడు.

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేన్ద్ర
గన్ధర్వ విద్యాధర నాగయక్షాః
రామస్య లోకత్రయ నాయకస్య
స్థాతుం న శక్తాః సమరేషు సర్వే ॥ (సుందరకాండ)

"దేవతలుగానీ, దైత్యులుగానీ, గన్ధర్వ విద్యాధర నాగయక్షులుగానీ – ముజ్జగాల నాయకుడైన రాముని ఎదుట యుద్ధంలో నిలువలేరు" అని హనుమంతుడు రావణుని హెచ్చరించాడు.

ఈ శ్రేష్ఠత్వం ద్వారా తాను ప్రతిష్ఠించిన ధర్మమే తన స్వరూపం.

ధర్మః.. 403

1. ధర్మ స్వరూపుడు.

ధరతీతి ధర్మః. ధరించునది ధర్మం. ఈ సమస్త విశ్వాన్ని పట్టి ఉంచేది ధర్మం. అలా పట్టి ఉంచిన విష్ణు చైతన్యమే ధర్మం.

– మనం పతనం కాకుండా మనల్ని పట్టిఉంచే ధర్మం నారాయణ రూపమే. వేదం, స్మృతి, మహాత్ముల ఆచరణ – అనే మూడు రూపాలతో మనకు నిర్దేశితమైన ధర్మమే సాక్షాన్నారాయణుడు.

2. **'అణురేష ధర్మః' (కఠోపనిషత్తు).** అణువు వలె మిక్కిలి సూక్ష్మమైనది ధర్మం. దీని ఆధారంగానే జగతి నిలిచి ఉన్నది. మనలో అత్యంత సూక్ష్మమైన పరమాత్మ చైతన్యంతోనే మన ఉనికి నిలిచి ఉంది కనుక, ఆ పరమాత్మయే ధర్మం.

   ధ్రువాం భూమిం పృథివీం ధర్మణా ధృతామ్॥ (అథర్వ)

   ధర్మాణ మగ్నిం విదథస్య సాధనమ్॥ (ఋగ్వేదం) –అని శ్రుతి ధర్మస్వరూపునిగా పరమేశ్వరుని పలుచోట్ల కీర్తించింది.

3. యజ్ఞాది ధర్మములచే ఆరాధింపబడేవాడు.

4. ధర్మావతారుడైన రాముడే సాక్షాత్తు ధర్మస్వరూపుడు.

   "రామో విగ్రహవాన్ ధర్మః" అని మారీచుడే స్వయంగా దర్శించి పలికాడు. "ధర్మం రూపుధరించితే రాముడు." ఇది రామలక్షణం. అందుకే రామావతార నామాలలో ఈ నామాన్ని కూర్చారు వ్యాసులవారు.

   ధర్మాత్మా సత్య సంధశ్చ రామో దాశరథిర్యది ।

   పౌరుషేచా ప్రతిద్వంద్వః శరైనం జహిరావణిమ్ ॥ (యుద్ధకాండ)

   "దాశరథి రాముడు ధర్మ స్వరూపుడైతే, సత్య సంధుడైతే, పరాక్రమంలో సాటిలేని వాడైతే – ఈ బాణం ఇంద్రజిత్తును చంపును" అని ప్రతిజ్ఞాపూర్వకంగా అస్త్రాన్ని ప్రయోగించి లక్ష్మణుడు రావణ పుత్రుని సంహరించాడు.

   అదేవిధంగా – శ్రీకృష్ణ స్వరూపంతో ధర్మ విగ్రహునిగా భాసించాడు విష్ణువు.

   యే చ వేదవిదో విప్రాః యే చాధ్యాత్మ విదోజరాః।

   తే వదన్తి మహాత్మానం కృష్ణం ధర్మం సనాతనమ్॥ (భారతం)

   ... సాక్షాద్దేవో పురాణోసౌ స హి ధర్మః సనాతనః ॥ (భారతం)

"వేదవేత్తలైన విప్రులు, ఆత్మజ్ఞాన సంపన్నులు మహాత్ముడైన శ్రీకృష్ణుని 'సనాతన ధర్మమే ఇతడ'ని చెబుతారు" "పురాణ పురుషుడైన ఈ దైవమే (శ్రీకృష్ణుడే) సనాతన ధర్మ స్వరూపి."

ఇలా రామకృష్ణాద్యవతారాలలో మూర్తీభవించిన సనాతన ధర్మంగా సాక్షాత్కరించినవాడు.

ధర్మమే తానైన వాడు కనుక, ధర్మవేత్తలలో ఈయనను మించినవాడు లేడు.

ధర్మవిదుత్తమః.. 404

1. ధర్మము తెలిసినవారిలో ఉత్తముడు.
   విష్ణుని నుండి వచ్చిన వేద ధర్మాలనే బ్రహ్మాదులు, మహర్షులు, దేవతలు గ్రహించి అనుసరించి ధర్మవేత్తలయ్యారు. వారికి ధర్మాల నిచ్చిన పరమాత్ముడైన విష్ణువే ధర్మవిదుత్తముడు. శ్రుతి స్మృతులన్నీ హరి యాజ్ఞలు.
2. ఈ అనంత విశ్వంలో దేనిని ఎలా పట్టి నిలపాలో తెలిసినవాడు అతడొక్కడే. వివిధ లోకపాలురు విష్ణు దత్త శక్తితో తమ తమ లోకాలలో ధర్మాలను నెలకొల్పే జ్ఞానం తెలుసుకున్నా వారి తెలివి పరిమితి కలది.
   వారిని సైతం నిలిపి ఉంచే విశ్వనియమకర్త విష్ణువు. విశ్వంలో ప్రతి దాని నియమం ఆయనకే తెలుసు.
   "సనోబంధుర్జనితా సవిధాతా ధామాని వేద భువనాని విశ్వా। (యజుర్వేదం)
3. ధర్మ సూక్ష్మములు తెలిసిన శ్రీరాముడు వాలి వధలో, వాలి ప్రశ్నలకు సమాధానమిస్తూ - "సత్పురుషుల ధర్మము సూక్ష్మమైనది. అది స్థూల దృష్టికి అవగతం కాద"ని సృష్టపరచాడు. ధర్మపు లోతులు, సూక్ష్మములు చక్కగా తేటపరచి ఆచరించిన శ్రీరాముడు ధర్మ విదుత్తముడు.
   'వేదవిద్భిః సుపూజితః' (సుందరకాండ) **'యథావత్సాంగవేదవిత్'** (అయోధ్యకాండ) - 'వేదవేత్తలచే చక్కగా పూజింపబడినవాడు', 'సాంగోపాంగంగా వేదమును తెలిసినవాడు' అని వాల్మీకి శ్రీరాముని వర్ణించాడు.

త్వమప్రమేయశ్చ దురాసదశ్చ
జితేన్ద్రియ శ్చోత్తమధార్మికశ్చ॥ (కిష్కింధకాండ)
"అప్రమేయుడు, ఇతరులచే సాధించలేనివాడు, జితేంద్రియుడు,
'ఉత్తమ ధార్మికుడు' - అని రామలక్షణాలు వాల్మీకంలో వర్ణితాలు.
ఈ ధర్మగతిలో ఎక్కడ కుంటుపడని వాడై -

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయురధోక్షజః॥... 44

405. వైకుంఠః, *406.* పురుషః, *407.* ప్రాణః, *408.* ప్రాణదః,
409. ప్రణవః, *410.* పృథుః॥ *411.* హిరణ్యగర్భః, *412.* శత్రుఘ్నుః,
413. వ్యాప్తః, *414.* వాయుః, *415.* అధోక్షజః॥

వైకుంఠః.. 405

1. గతిలో ఆటంకాలు తొలగించువాడు.
'కుఠి ప్రతిఘాతే' అనే ధాతువు ననుసరించి 'కుంఠ' శబ్దానికి - గతిలో ప్రతిహతి - 'నడకలోని ఆటంకం' (కుంటుతనం) అని అర్థం. ఈ ఆటంకాన్ని తొలగించడం 'వికుంఠం'. వికుంఠ కర్త - వైకుంఠుడు. ఆ ఆటంకాలను తొలగించువాడు.
కలియుటలో, కలుపుటలో, కొనసాగుటలో కలిగే విఘాతాన్ని (సంశ్లేష విఘాతాన్ని) తొలగించేవాడు.

మయా సంశ్లేషితా భూమి రద్ధిర్వ్యోమ చ వాయునా ।
వాయుశ్చ తేజసా సార్ధం వైకుంఠత్వం తతోమమ ॥ (మహాభారతం)

"భూమిని జలంతో, ఆకాశాన్ని వాయువుతో, వాయువును తేజంతో కలిపిన వాడను నేను. ఆ విధంగా నాకు 'వైకుంఠుడు' అనే నామం ఏర్పడింది" అని శ్రీకృష్ణుని మాట.

ఒక విత్తనం వృక్షంగా మారకుండా కుంటు (అడ్డు) పరచే లక్షణాన్ని తొలగిస్తూ, నేలలో వేసి దానిని అంకురింపజేసే కర్షకుని వలె ఈ జగతిని అన్ని అవరోధాలను తొలగించి వృద్ధి పరచినవాడు.

2. జగతి గతి కుంటుపడకుండా నిర్వహిస్తున్న వైకుంఠుడు – తనను చేరదలచి తపించే భక్తుల సాధనాగతి కుంఠం చెందకుండా చేసి తనతో కలుపుకొనే కరుణాళువు. జీవులను అన్ని ఆటంకాలు తొలగించి తనలో కలుపుకొనే స్థానమే వైకుంఠం. విష్ణువే విష్ణు పదం.
కుంటుతనం మితి. వైకుంఠం అనంతం – అపరిమితం – పరిపూర్ణం.

3. ధర్మగతికి కుంఠత్వం ఏర్పడినప్పుడు, ఆ అవరోధాన్ని తొలగించడానికి శ్రీరామాది అవతారములు ధరించి తన వైకుంఠ భావాన్ని నిరూపించినవాడు. పరిపూర్ణ వైకుంఠానందాన్ని ఇలకు దించి, సర్వులను అనుగ్రహించినవాడు. జగతి గతిని సవరించేవాడు, భూతాదులను సంశ్లేష పరచినవాడు వాటికి పూర్వమే ఉన్నవాడు కనుక –

పురుషః.. 406

1. అన్నిటికంటే ముందున్నవాడు.
'పురా–సద్. సర్వస్మాత్ పురా సీదతి'.
"స యత్పూర్వో స్మాత్సర్వస్మాత్సర్వాన్ పాప్మన ఔషత్తస్మాత్ పురుషః"
(బృహదారణ్యకోపనిషత్తు).
"అతడు ఈ కనబడుతున్న ప్రతి దానికంటెను పూర్వుడై, సర్వ పాపాలను దహించినందు వలన పురుషుడు." **పురూన్ ఓష దహతి** – గొప్పవైన పాపాలను దహించువాడు.

2. **సవా అయం పురుషః సర్వాసు పూర్షు పురిశయః** (బృహదారణ్యకోపనిషత్తు)
"ఆ పరమాత్మయే సర్వపురములందు (శరీరాలందు) ఉంటూ పురుషుడనబడుతున్నాడు". **పురి–శయః** – పురమందున్నవాడు.

3. **పిపర్తి పృణాతి పాలయతి పూరయతి పురుషః,**
   సమస్తాన్నీ పాలించువాడు, తన చైతన్యంతో పూరణ (నింపుట) చేసినవాడు.
4. **"పుర అగ్రగమనే"** – అన్నిటికీ ముందుండి నడుపువాడు.
   ఈ నాలుగు లక్షణాలు కల నారాయణుడు పురుషుడు.
   శ్రీరామాది పూర్ణావతారాలు ధరించి పాపాలను దహించి, సమస్తాన్నీ పాలించి, ముందుండి నడిపి, సర్వజీవుల దహరంలో నిలచిన పురుషుడితడు.
   పురషతత్త్వం మూర్తీభవించినవాడు శ్రీరాముడు.
   పంచస్వన్తఃపురుష ఆవివేశ తాన్యన్తఃపురుషే అర్పితాని ॥ (యజుర్వేదం)
   పురుష ఏవేదం సర్వం యద్ భూతం యచ్చ భవ్యమ్ । ॥యజుర్వేదం ।:
   పురుషంజాతమగ్రతః ॥ ఋగ్వేదం॥
   – అని శ్రుతి పురుష శబ్దాన్ని బహుధా పలికింది.
   ఈ పురుషుడే జగతిని నిండి (పూరణ చెంది) జీవింపజేస్తున్నాడు కనుక –

ప్రాణః.. 407

1. జీవింపజేయువాడు.
   'ప్రాణితి అస్మాత్ సర్వం.'
2. **'ప్రాపూరణే'** అనే ధాతువు ననుసరించి 'ప్రాణః' అంటే పూర్ణుడు అని అర్థం.
   అంతటా పూర్ణమైనది ప్రాణం.
   సర్వవ్యాపక చైతన్యమైన విష్ణుని లక్షణమిది –
   'ప్రాణాయ' నమో యస్య సర్వమిదం వశే ॥ (అథర్వవేదం)
   – అని శ్రుతి 'పూర్ణాయ' అని అర్థంలో ప్రస్తుతించింది.
   పూర్ణునిచే పూరణ పొందిన జగతి ప్రాణవంతమైనది కనుక –

ప్రాణదః.. 408

1. పూర్ణతను ఇచ్చువాడు.

పాలలో నేయి వలె, పాలు కలిగిన చెట్లలా పాలవలె, శరీరాలలో ధాతువు వలె జగమంతా తన పూర్ణ చైతన్యాన్ని నింపిన వాడతడు.

సృష్టికంతటికీ ఈతడే ప్రాణం కనుక, ఈయన విరహంలో భక్తులు తపించిపోతారు. అంతెందుకు – స్థావర జగతి కూడా పరమాత్మ లేనప్పుడు ఉండలేవు.

అపివృక్షాः పరిమ్లానాः స పుష్పాంకురకోరకः (అయోధ్యకాండ)

శ్రీరాముడు అరణ్యాలకు వెళ్లినప్పుడు రామ విరహంతో అయోధ్యలోని వృక్షాలు సైతం పూలతో, మొలకలతో, మొగ్గలతో సహా వాడిపోతాయట. అవతారమూర్తిగా వచ్చినప్పుడు ఈ ప్రాణద లక్షణాన్నే ప్రదర్శించాడు. మరణించిన గురుపుత్రుని తిరిగి బ్రతికించి, కాళీయ సర్పదష్టులైన గోవులను, గోపాలకులను జీవింపజేసి, ఏడు అహోరాత్రులు అన్న పానాలు లేని గోకుల వాసులందర్నీ గోవర్ధన గిరి క్రింద తన అమృతపు చూపులతోనే ప్రాణవంతుల్ని చేసి శ్రీకృష్ణుడు 'ప్రాణదు'డయ్యాడు.

యో విపశ్యతి యఃప్రాణతి ॥ (అథర్వవేదం)

యఃప్రాణదఃప్రాణదవాన్ బభూవ ॥ (అథర్వవేదం)

– అని శ్రుతి పేర్కొన్నది.

ప్రాణములిచ్చి బ్రతికించే ఇతడే ప్రాణశక్తిచే ఉపాసింపబడి తరింపజేసే తారకబ్రహ్మము కనుక –

ప్రణవః.. 409

1. ఓంకారస్వరూపుడు.

ప్ర–ణవః = బాగుగా దాటించునది. భవజలధి నుండి దాటించే పరబ్రహ్మ వాచకమైన ఓంకారం తారకం. (తరింపజేయునది). దీని ద్వారానే

పరమాత్మను వేదం నమస్కరిస్తున్నది.

'ప్రణమన్తీహ వైవేదాస్తస్మాత్ ప్రణవ ఉచ్యతే (సనత్కుమార వచనం) "వేదములు ప్రణమిల్లే తత్త్వం కనుక పరమాత్మ 'ప్రణవః' అని పిలువబడుతున్నాడు"

"తస్మాదోమితి ప్రణౌతి" – "ఓం అని ఉచ్చరించి ప్రస్తుతి చేయును" అని శ్రుతి వాక్యం.

సర్వే వేదా యత్పదమామనన్తి
తపాంసి సర్వాణి చ యద్వదన్తి।
యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి
తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్ ॥ (కఠోపనిషత్తు)

'అన్ని వేదములు దేనిని పొందుతున్నాయో, సర్వ జ్ఞానములు దేనిని చెబుతున్నాయో దేనిని కోరి బ్రహ్మచర్యాన్ని (బ్రహ్మజ్ఞానాన్ని) ఆచరిస్తున్నారో ఆ పదం – ఓంకారం.' ఈ సర్వలక్ష్యమైన బ్రహ్మమే విష్ణువు కనుక ఆతడే ఓంకార స్వరూపుడు.

ఓం ఖం బ్రహ్మ ॥యజుర్వేదం॥

ఈ 'ప్రణవ' (తారక) తత్త్వమే తారకమంత్రమైన 'రామ' మంత్రంగా, 'రామ' రూపంగా రామోపాసనలో ఆవిష్కరింపబడింది.

2. ***పాఠాంతరంలో "ప్రణమః" అని కూడా ఉన్నది.***

ఈ నామానికి అర్థాన్ని చూస్తే –

'ప్రణమయతీతి ప్రణమః' – ఎవరి మహిమాతిశయాన్ని చూసి సర్వులు బాగా నమ్ముతారో అతడు ప్రణముడు.

'కస్మాచ్చతే న నమేరన్ మహాత్మన్' – "ఓ మహాత్మా! నిన్ను నమస్కరించకుండా ఎవరుండగలరు?" – అని అర్జునుడు శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని చూసి వివశుడై **"సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః"** – "సిద్ధ సంఘములన్నీ నిన్ను నమస్కరిస్తున్నాయ"ని దర్శించి, కీర్తించాడు. **'పునశ్చ**

భూయోపి నమో నమస్తే' – 'మాటిమాటికి నీకు పలు నమస్సులు' – అని వినమ్రుడయ్యాడు.

ఏక ఏవ నమస్యో విక్ష్వీడ్యః ॥అథర్వవేదం॥

విశ్వమంతటిచే ఆరాధింపబడే ఒక పరమాత్మ నమస్యుడు (నమస్కరింపదగినవాడు).

అలా నమస్కరింపదగిన దివ్యకీర్తి కలవాడు కనుక –

పృథుః..410

1. ప్రథ (విఖ్యాతి, విస్తృతి) కలిగినవాడు.

   'ప్రథ విస్తారే' అనే ధాతువు ననుసరించి విశ్వరూపుడై విస్తరించిన విష్ణువే పృథువు. స్వామి వేదాదులలో విస్తృతంగా కీర్తింపబడినాడు. లోకమంతా ప్రత్యణువున తన దివ్యమహిమను విస్తరింపజేస్తున్నవాడతడు.

   ఉరుః పృథుః సుభూర్భవ ఇతిత్వోపాస్మహేవయమ్ ॥ (అథర్వవేదం)

   ఉరుః పృథు సుకృతః కర్తృభిర్భూత్ ॥ (యజుర్వేదం)

   .... రయిర్బహులో విశ్వతస్పృథుః ॥ (ఋగ్వేదం)

   – అని శ్రుతి పలువిధాల ప్రస్తుతించింది.

2. విరాట్పురుషునిగా తన పృథులక్షణాన్ని ప్రకటించినవాడు.

   అవతారపురుషునిగా విశ్వ విఖ్యాత కీర్తిని పొంది సంకీర్తనలందుకున్నాడు.

   "పృథుశ్రీః ప్రార్థివాత్మజః" "రామో నామ జనైః శ్రుతః" (బాలకాండ)

   "రాజపుత్రుడైన రాముడు విస్తారమైన కీర్తి కలిగిన జనులందు ప్రసిద్ధుడైనాడు"

   "యశసశ్చైక భాజనం" (కిష్కింధ కాండ) – కీర్తికి ముఖ్యమైన స్థానమితడే!

3. వేనుని భుజాన్ని మహర్షులు మథించగా భూ రక్షణ కోసం ఆవిర్భవించిన విష్ణువు 'పృథు' నామధేయుడైన చక్రవర్తి. 'అర్చి' నామంతో తనతో ఉదయించిన అనపాయిని లక్ష్మితో అవతరించి – భూమిని వ్యవస్థీకరించి, అద్భుత నాగరికతను ఆవిష్కరించి, యజ్ఞాలను ప్రతిష్ఠించి భూమి నుండి

దివ్యౌషధులను సాధించిన భవ్యావతారం ఈ నామంలో స్మరింపబడింది. ఈ పృథుచక్రవర్తిచే ఉద్ధరింపబడినందుకు భూమికి 'పృథ్వి' అని పేరు. అంతేకాక విస్తారమైనది కనుక 'పృథ్వి' అని అర్థం చెప్పవచ్చు. నారాయణుడు పృథులక్షణంతో వ్యాపించి భూమి మొదలైన వాటికి ఉనికినిస్తున్నాడు.

ఇలా భూమ్యాదుల ఉనికికి హేతువైన తేజశ్శక్తి తనయందు కలవాడు కనుక –

హిరణ్యగర్భః.. 411

1. హిరణ్యమునకు లోపలనున్నవాడు.

   ఈ బ్రహ్మాండమే హిరణ్మయాండము. విష్ణు తేజస్సు దీప్తమంతమై హిరణ్యం (బంగారం) వలె భాసించునది. దాని నుండి ఏర్పడిన బ్రహ్మాండముల మూలావస్థ హిరణ్మయాండం. దానిని తనయందు దాల్చినవాడు – దానియందు తాను చేరినవాడు.... హిరణ్య గర్భుడు. ఒక జ్యోతి తన చుట్టూ ఏర్పడిన కాంతి పుంజానికి గర్భంలో (కేంద్రంలో) ఉన్నట్లే తనచే ఆవృతమైన పృథువైన విశ్వమండలానికి తాను కేంద్రమై ఉన్నాడు. జ్యోతిలో కాంతి ఉన్నది – కాంతిలో జ్యోతి ఉన్నది. అదేవిధంగా విశ్వానికి తాను గర్భంలో ఉన్నాడు. తనలో దానిని ధరించాడు. జ్యోతి లేనిదే కాంతి లేనట్లే – హిరణ్యగర్భుడు లేనిదే విశ్వం లేదు.

2. హితం రమ్యత (హిరణ్యం) కలిగించేవి ఇంద్రియాలు. వీటియందు వ్యాపించిన చైతన్యం హిరణ్యం. ఈ చైతన్యానికి మూలమైన ఆత్మస్వరూపుడు హిరణ్యగర్భుడు.

   హిరణ్యగర్భుడు ముందు ఉన్నవాడు. తరువాత వచ్చినది హిరణ్మయాండం.

   'హిరణ్యగర్భః సమవర్తతాగ్రే...' అనే వేదమంత్రం (యజుర్వేదం) ఈ భావాన్నే చెబుతున్నది.

   హిరణ్యగర్భం పరమమనత్యుద్యం జనా విదుః। (అథర్వవేదం) అని కూడా

శ్రుతి పలికినది.

ఈ మహా తేజశ్శక్తి చేతనే విశ్వధర్మ విఘాతకులను శిక్షించగలుగుతున్నందున –

శత్రుఘ్నుఃఃః

వృత్రహన్ శత్రుహోసి । (అథర్వవేదం)

సద్యో జజ్ఞానో నిరణాతిశత్రూన్ । (యజుర్వేదం)

శత్రువులెవరూ ఆయన నుండి తప్పించుకోలేని విధంగా, చుట్టుముట్ట గలిగే వ్యాపకత్వం చేత –

వ్యాప్తః.. 413

1. వ్యాపించినవాడు.

కారణరూపంగా కార్యంలో వ్యాపించినవాడు. బంగారు నగలకి కారణమైన బంగారం నగనిండా వ్యాపించినట్లుగా, విశ్వానికి హేతువైన హిరణ్యగర్భుడు విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు. **'విశేషేణ ఆప్నోతి'** – సంపూర్ణంగా నిండియున్న వాడితడు. విష్ణుడు లేని అణువు లేదు.

యో అగ్నౌ రుద్రో అప్సు య ఓషధీషు

యో రుద్రో విశ్వా భువనా వివేశ – (యజుర్వేదం)

ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాంజగత్ – (యజుర్వేదం)

2. తన కారుణ్యాది గుణాలను లీలా వైభవాలను సర్వత్ర, సర్వ కాలములందు వ్యాపింపజేసిన శ్రీరామాది అవతారాలను ఈ నామంలో స్మరించవచ్చు. తన వాత్సల్యాన్నీ, కారుణ్యాన్నీ అయోధ్యాదులందు వ్యాపింపజేసినవాడు. తన కీర్తి సర్వకాల, సర్వ దేశ వ్యాప్తిగా విరాజిల్లినవాడు.

వ్యాపించిన స్థిరుడే కాక, చలించి పయనించగలిగే చైతన్య రూపుడు కనుక –

వాయుః.. 414

1. అంతటా చలించువాడు (వెళ్ళువాడు).

వాతి సర్వత్ర గతో భవతి – అడ్డులేకుండా అంతటికీ వెళ్లగలిగేవాడు వాయువు. ఇది విష్ణు చైతన్య లక్షణం. విష్ణుని సంకల్పానికి గానీ, క్రియకి

గానీ ఏ అడ్డు లేదు. ఆయన ఎంత దూరమైనా, ఎప్పుడైనా పయనించగలడు. దేశకాలాల అడ్డు, ఆపులు లేని చలనశక్తి అది. ప్రాణ రూపంగా ప్రతి ఇన్ద్రియంలో చలించుతూ, విశ్వానికే ఊపిరిగా ఉన్న వాయువు విష్ణువే.

2. వాయువు తనంత తాను కదలి మనలను సేదతీర్చునట్లుగా, కుసుమాదుల గంధాలను గ్రహించి ప్రసరించినట్లుగా – భగవానుడే మన చెంతకు వచ్చి అనుగ్రహిస్తాడు. **"సోభ్యగచ్ఛన్మహాతేజా శబరీం శత్రుసూదనః"** (రామాయణం) – శ్రీరాముడు వాయువువలె తానే కదలివెళ్లి తనకోసం తపిస్తున్న అహల్య, శబరి, భరద్వాజ, గుహ, సుగ్రీవాదుల వద్దకు వెళ్లాడు. చివరకు గత జన్మలో కింకరుడైన రావణుని వద్దకు కూడా కదలి వెళ్లి శత్రురూపంలో అనుగ్రహించాడు.

తానే కదలి వెళ్ళి కుబ్జను, సుదాముని, బహులాశ్వుని, శ్రుతదేవుని కృష్ణ రూపంతో అనుగ్రహించాడు.

అంతటా వ్యాపించి చరించేవానిని గ్రహించాలంటే అంతర్దృష్టి ఉండాలి. ఆ లోచూపు గలవారికి గోచరించే పరమాత్ముడే –

అధోక్షజః.. 415

1. లోపల దర్శించేవారికి (అంతర్ముఖులకు) అనుభవంగా కలుగువాడు.

అధో భూతే హ్యక్షగణే ప్రత్యగ్రూప ప్రవాహితే ।
జాయతే తస్య వై జ్ఞానం తేనాధోక్షజ ఉచ్యతే ॥

'అక్ష' అంటే ఇన్ద్రియం అనే అర్థం ఉంది. అక్ష గణాలు – ఇన్ద్రియగణాలు. ఇన్ద్రియాలు అంతర్ముఖంగా ప్రవహించగా ఆతని గురించిన జ్ఞానం జనిస్తుంది. "అధోభూతమై (వెనుకకు – మూల స్థానమునకు) అక్ష గణములు మరలగా కలిగిన జ్ఞానం ఆత్మజ్ఞానం". కొమ్మలకు క్రిందనున్న మూలం వేళ్లు. అలాగే ఇన్ద్రియాలకు క్రిందున (మూలంగా – హృదయంలో) ఉన్న ఈశ్వరుని వైపు అంతర్ముఖమైనవాని జ్ఞానానికి అనుభవమై అందేవాడు విష్ణువు.

"కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్" – ఏ ఒక్క ధీరుడో అంతర్ముఖుడై ఆత్మను గోచరింపజేసుకోగలడని ఉపనిషన్మంత్రం.

2. తన స్థితి నుండి చలించనివాడు.

వాయువు వలె అంతటా వ్యాపించి చలిస్తున్నా, తన సచ్చిదానంద స్థితిని వదలనివాడు. ఎంతగా తన శక్తిని ప్రసరిస్తున్నా తరుగుదల (క్షీణత) లేనివాడు. శ్రీరామాది అవతారాలలో లీలలను నెఱపుతూ విహరించినప్పటికీ తన సహజ పరబ్రహ్మావస్థ నుండి చలించనివాడు.

అధో న క్షీయతే జాతు యస్మాత్తస్మా దధోక్షజఃI (భారతం)

'ఎన్నడూ క్రిందకు (దిగజారడు) క్షయము కాడు.' విష్ణు చైతన్యం సదా విశ్వాన వ్యాప్తమై నడిపిస్తున్నా ఎన్నడూ తరుగనిది. అది ఎన్నటికీ ఉన్నతమే.

3. 'అధః' అనగా క్రిందిదైన భూమి. 'అక్షః' అనగా దివి. ఈ రెండింటి నడుమ (జః) కలిగిన (ఆవిర్భవించిన) వైరాజరూపుడు (విరాట్పురుషుడు) అధోక్షజుడు.

4. దివి నుండి క్రిందికి కలుగువాడు (కిరణాలను ప్రసరించువాడు) – సూర్యుడు. సూర్యరూప నారాయణుడు ఈ నామం ద్వారా వ్యక్తమౌతున్నాడు. **'యాదృగేవ దదృశే తాదృగుచ్యతే'** అని ఋగ్వేదమంత్రం. 'ఎలా కనబడుతుందో అలా చెప్పబడుతుంది'. సూర్యుడు మనకంటే ఊర్ధ్వమైన ఆకాశంలో (అక్షంలో) ఉదయిస్తున్నాడు. కానీ ఆయన కిరణాల ద్వారా కాంతిశక్తులు క్రిందికి రావడం చేత ఆయనను చూస్తున్నాం. ముందు క్రింద చూసి, ఆ కాంతికి మూలమైన వానిని తెలుసుకుంటున్నాం. అందుకే ముందు 'అధః', తరువాత 'అక్షః', అటుపై 'జః'.

ఆ సూర్యశక్తిగా ప్రసరిస్తున్న విష్ణు చైతన్యంతోనే నడుస్తున్న భూమియందు కూడా ఈ 'అధోక్షజ' లక్షణం కనిపిస్తుంది. క్రిందికి కురిసే వర్షం వల్లనే సస్యాలు 'జ'నిస్తున్నాయి. క్రిందికి చేరిన విత్తనమే మొలకగా మొక్కగా జనిస్తోంది. సృష్టిలో ప్రతిజీవి జననం 'అధోక్షజ' వ్యవస్థ. ఆ విధంగా

అధోక్షజమై వ్యాపించిన విష్ణు చైతన్యం ఈ నామంలో స్మర్తవ్యం.
ఈ విధంగా ప్రసరిస్తున్న మహిమతో, కాలాదులలో వివిధ పరిణామాలను ఏర్పరస్తున్నందున -

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః।
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః॥... 45

416. ఋతుః, 417. సుదర్శనః, 418. కాలః, 419. పరమేష్ఠీ, 420. పరిగ్రహః। 421. ఉగ్రః, 422. సంవత్సరః, 423. దక్షః, 424. విశ్రామః, 425. విశ్వదక్షిణః॥

ఋతుః.. 416

1. ఋతువుల రూపంలో ఉన్నవాడు.

భగవానుడైన విష్ణువు కాలరూపుడై తెలియబడుతున్నాడు. విశ్వ వ్యవస్థాపకునిగా ఋతువులుగా వ్యక్తమౌతున్న విష్ణు చైతన్యాన్ని పరిశీలించితే భగవదనుభవం ఇక్కడే లభ్యమౌతుంది.

'ఋగతి, ప్రాపణయోః' అనే ధాతువునకు 'నడచుట, చేరుట, చేర్చుట' అని అర్థాలు. ఆ ధాతువు నుండి జనించినదే 'ఋతు' శబ్దం. గమన లక్షణం - పరిణామం. ఒక్కొక్క పరిణామంలో ఒక్కొక్క స్థితి ప్రాప్తిస్తుంది కనుక రెండు భావాలకు సరిపోయే పదం 'ఋతువు'. కాలం దీనిచేతనే తెలియబడుతోంది. ఋతువుల ననుసరించి జీవులలోని ధాతు శక్తులు సైతం స్పందిస్తాయి. ప్రతి జీవి ఉనికిపై ఋతువుల ప్రభావం ఉంటుంది.

ఋచ్ఛతి గచ్ఛతీతి ఋతుః - కదిలే స్వభావం గల కాలానికి మరో పేరిది. సూర్యకాంతిని పృథివి గ్రహించే భేదాల ననుసరించి ఉత్తరాయణ దక్షిణాయనాలు ఏర్పడతాయి. వీటికనుగుణంగా భూమిపై జరిగే మార్పులే ఋతువులు. ఉత్తరాయణం తీవ్రకాంతినీ, ఉష్ణతనీ ప్రకటిస్తే, దక్షిణాయనం

రసత్వాన్ని ప్రకటిస్తోంది. వీటిని బట్టి వసంతాది ఋతువులు. విష్ణుని కాలయజ్ఞ స్వరూపంలో ఇవి ప్రధానాంగాలుగా పురుష సూక్తం వర్ణించింది. –

వసంతోఽస్యా సీదాజ్యం గ్రీష్మ ఇధ్మః శరద్ధవిః॥ (యజుర్వేదం)
ద్వే తే చక్రే బ్రహ్మాణ ఋతుథా విదుః।
...విశ్వాన్యన్యో భువనాభి చష్ట ఋతూఁరన్యో విదధజ్జాయతే పునః ॥
(ఋగ్వేదం)

గ్రీష్మంలో తపించినవారికి మేఘుం వలె, తపించిన దశరథాదులను శాంతింపజేసిన శ్రీరాముడు తనదైన కాల రూప విష్ణు లక్షణాన్ని ప్రకటించాడని రామాయణం వర్ణించింది –

"ఘర్మాభి తప్తైః పర్జన్యం హ్లాదయన్త మివ ప్రజాః' (రామాయణం)

అదేవిధంగా – శ్రీకృష్ణుడు ఆయా ఋతువులలో వివిధ శోభలను వెలార్చుతూ వివిధ పరిణామాలతో గోకులాన్ని ఆనందింపజేసిన విషయం భాగవతం వర్ణించింది.

మళ్ళీ మళ్ళీ కలిగే ఋతువులు చక్రంవలె తిరగడం చేత కాలచక్రధారి విష్ణువే దీని రూపంతో ఉన్నాడని అవగాహన కలుగుతుంది. ఈ చక్రంలోని గమనాలు, పరిణామాలు ఎప్పటికప్పుడు నిత్యనూతనాలు, దర్శనానికి శోభనాలు కనుక –

సుదర్శనః.. 417

1. చక్కని దర్శనం కలవాడు.

'సు' శుభే – శోభనే. శుభకరమైన, శోభామయమైన దర్శనమే సుదర్శనం. ఏ పొరలూ తెరలూ లేని సత్యజ్ఞానమే సుదర్శనం. ఇదే అసలు విషయాన్ని చూపించగలదు. వెలుగే దాని మూలమైన జ్యోతిని చూపించినట్లుగా – ఆత్మజ్ఞానమే ఆత్మానుభవాన్నిస్తుంది. ఆ అచ్చమైన జ్ఞాన రూపుడే సుదర్శనుడు.

'సుదర్శన! మహాజ్వాల! సూర్యకోటి సమప్రభ!
అజ్ఞానాంధస్య మే దేవ! విష్ణోర్మార్గం ప్రదర్శయ॥

కోటి సూర్యకాంతులని మించిన సుదర్శన జ్వాలలు అజ్ఞానాంధకారాన్ని తొలగించి విష్ణు మార్గాన్ని ప్రదర్శిస్తాయి.

2. సుదర్శన చక్ర రూపుడు.

సుదర్శన చక్రం స్వామి ఆయుధదైవంగా ఆరాధ్యం. ప్రత్యేక దేవతగా కూడా సుదర్శనుని ఉపాసించే సంప్రదాయం ఉంది. కాలాగ్ని చక్రమే సుదర్శనం. ఆరు ఋతువులనే ఆరు చక్రాలకు (మూలాధారాది ఆజ్ఞాచక్రం వరకు) పైన ఉన్న 'సహస్రార' చక్రమే సుదర్శనం. ఆ చక్రానికి చేరుకున్నవారు కాలాతీతులు. అక్కడ యోగికి లభించే పరబ్రహ్మానుభవమే విష్ణు పదప్రాప్తి. షట్కోణమధ్యంలోని సుదర్శన శక్తి రహస్యమిదే.

ఈ సుదర్శనుడే కాలబద్ధులైన జీవుల బంధనాలను విడిపించే విష్ణ్వనుగ్రహస్వరూపుడు. విష్ణువు మనపై ప్రసరించే సుదర్శనం (గొప్ప అనుగ్రహమే) సుజ్ఞానం. **'ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా'** (శంకరులు). ఆ సుజ్ఞానమే రాక్షసత్వ (అవిద్యా) నాశన హేతువు.

ఋతువుల ఆవృతులతో కూడిన కాల చక్రాన్ని అవగతం చేసుకున్న వానికి కాల నిర్వాహకుడైన కాలాతీతుడు అర్థమౌతాడు.

సుదర్శన దేవతాశక్తిని కాలాగ్ని రూపంగా ఈ నామాల కూర్పులో గ్రహించవచ్చు.

'చక్రం సదాహం శరణం ప్రపద్యే' అని ఈ దివ్య చక్రాన్ని నమస్కరిస్తారు. శ్రీవేంకటేశుని చెంత ప్రత్యేకంగా ఆరాధింపబడే సుదర్శన దేవుడు; విశ్వచక్ర – కాలచక్రాలలో ప్రసరిస్తున్న విష్ణు చైతన్యాన్ని అవగతం చేసే జ్ఞానాగ్ని తత్త్వం.

'సుదర్శన నమస్తుభ్యం సహస్రార! అచ్యుత ప్రియ' అని వందనాలందుకొనే సుదర్శన చక్ర దేవతా రూపాన్ని మంత్ర శాస్త్రాలు వర్ణించాయి. దానిని

అన్నమయ్య ఒక్క పాటలో చిత్రించాడు.

నమో నమో దానవవినాశ చక్రమా!
సమర విజయమైన సర్వేశు చక్రమా!
అట్టె పదారు భుజాల నమరిన చక్రమా!
పట్టిన ఆయుధముల బలు చక్రమా!
నెట్టిన మూడు గన్నుల నిలిచిన చక్రమా!
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా!
ఆరయ నారు గోణాల నమరిన చక్రమా!
ధారలు వేయిటితోటి తగు చక్రమా!
ఆరకమీదికి వెళ్లే అగ్ని శిఖల చక్రమా!
గారవాన నీదాసుల గావవే చక్రమా!
రవిచంద్రకోటి తేజరాసియైన చక్రమా!
దివిజసేవితమైన దివ్య చక్రమా!
తవిలి శ్రీవేంకటేశు దక్షిణకర చక్రమా!
యివల నీ దాసులము యేలుకోవె చక్రమా!

'పదహారు భుజాలతో, పలు ఆయుధాలు ధరించి మూడు కన్నులతో నుండి, షట్కోణాలలో అమరి, వేయి అంచులతో అగ్ని శిఖలతో, భాసించే ఈ చక్రాన్ని **'మర్ద మర్ద మమ బంధాని – దుర్దాంత మహా దురితాని'** – అని కూడా వినుతించాడు అన్నమయ్య.

శ్రీ కూర నారాయణ యతి అనే మహానుభావుడు సుదర్శనుని ఉపాసించి మంత్ర శక్తి గర్భితమైన మహామహిమాన్విత 'సుదర్శన శతకా'న్ని రచించాడు. సుదర్శన చక్రానికి సంబంధించిన జ్వాల, నేమి, అర, నాభి, అక్షము, పురుషుడు – అనే భాగాలపై అద్భుత శ్లోకాలతో చేసిన వర్ణన అది.

3. చక్కని చూపులు కలవాడు.

'పద్మపత్రాయతేక్షణాం' అని చెప్పినట్లుగా శోభనమైన దర్శన శక్తి కల విష్ణువు సుదర్శనుడు.

4. ఆనందకరంగా చూడబడువాడు.

చూస్తున్న కొద్దీ చూడాలనిపించే సత్య సుందర విగ్రహుడు విష్ణువే సుదర్శనుడు. శ్రీరామావతారంలో **'సోమవత్ ప్రియదర్శనః'** (చంద్రుని వలె ప్రియంగా చూడబడుతాడు) **'అతీవ ప్రియదర్శనః'** (అత్యంత ప్రియదర్శనుడు) అని వాల్మీకి వర్ణించాడు.

5. సర్వమునకు బహిరంతర్వ్యాపకుడై సమ్యక్ దర్శనంతో గమనించు విష్ణువు సుదర్శనుడు.

'దేవో యాతి భువనా విపశ్యన్' – అనే శ్రుత్యనుసారం భువనాలను వీక్షించే సూర్యరూప విష్ణువే సుదర్శనుడు. విశ్వాన్ని మనకు చూపించుతూ, తాను విశ్వాన్ని పరిశీలించే సమగ్ర దర్శన శక్తి సంపన్నుడు. మన శరీరంలో మనం కూడా గ్రహించలేనంతగా మన అనుభవాలను, అవస్థలను దర్శిస్తున్న ఆత్మచైతన్యం, జగతిని గమనిస్తున్న సూర్యచైతన్యం **(సూర్య ఆత్మా జగతః – శ్రుతి)** .... రెండింటిగా వ్యాపించిన విష్ణువే సుదర్శనుడు.

మా తే యుయోమ సన్దృశః । (అథర్వవేదం)
ధాతా విధాతా పరమో సన్దృక్ । (యజుర్వేదం)
జ్యోక్ తే సన్దృశి జీవ్యాసమ్ ! (యజుర్వేదం)
సుసన్దృశం త్వా వయం మఘవన్ వన్దిషీమహి । (యజుర్వేదం)

ఈ సర్వదర్శనం చేతనే ఏది, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎంత – అనే స్పష్టమైన లెక్క తెలిసిన వాడితడే –

కాలః.. 418

1. గణన చేయువాడు (లెక్కించువాడు).

సర్వమును లెక్కించేవాడు. **'కాలః కలయతా మహమ్'** – అని గీతాచార్యుని వాక్కు. 'లెక్కించువాటిలో కాలాన్ని నేను'. దేశ, వస్తువులు కాలాధారాలు.

ఒక వస్తువు యొక్క పరిణామాన్ని పొడవు, వెడల్పు, లోతు (ఎత్తు) – అనే మూడు కోణాలతో మనం దర్శిస్తాం. కానీ వీటి వెనుక స్థూలానికి గోచరించని, శక్తిమంతమైన పరిమాణం కాలం. అసలు దేశ వస్తు పరిమాణ పరిణామాలను నిర్దేశించేది కాలం.

'సు' దర్శనుడైన విష్ణువునకే ఇది సాధ్యం.

సమర్థుడైన ఒక కార్యాలయ యజమాని తన క్రింద పనిచేసేవారిని సరిగ్గా గమనించి (సుదర్శించి) వారి సమర్థతనీ, పని తీరునీ, నిజాయితీని, ఆవిష్కరించిన పనినీ వారి అవసరాలనీ క్షుణ్ణంగా 'గణించి' వారి వారికనుగుణంగా తగిన వేతనాన్నీ, పదోన్నతినీ, మందలింపులనీ, తొలగింపులనీ, ప్రశంసలనీ ఎలా అందజేస్తాడో అలాగే విశ్వంలో ప్రతి జీవికీ ఖచ్చితమైన కర్మానుగుణ ఫలాల నిచ్చే చైతన్య వ్యవస్థ విశ్వంలో కాలంగా ఉన్నది. సృష్టి నుండి లయం వరకు, ఇహం నుండి పరం వరకు... ఇలా సర్వమూ గొప్ప లెక్కల నిపుణుడైన ఆ విష్ణుని పనే. కాలరూపంలో వ్యాపించిన హరి నిర్వాకమిది.

రావణాది దనుజులు కూడా ఈ కాలపు లెక్క నుండి తప్పించుకోలేదు. కాలస్వరూపుడైన రాముడు అవతరించి లెక్క చెల్లించాడు. శిశుపాలుని తప్పుల్ని సైతం లెక్కించిన కాలమూర్తి కృష్ణుడు. ఆయన లెక్కల ననుసరించే దేవతల, ప్రకృతి శక్తుల, జీవుల పరిణామాలు సంభవిస్తుంటాయి.

కాలోఽమూ దివమజనయత కాల ఇమాः పృథివీరుత।
కాలా దాపः సమభవన్।
కాలः ప్రజా అసృజత కాలో అగ్రే ప్రజాపతిమ్।
సంఖ్యాతా అస్య నిమిషో జనానామ్।

– అని 'అథర్వవేదం' వివిధ స్థలాలలో, వివిధ మంత్రాలతో పరమేశ్వరుని కాలస్వరూపునిగా పేర్కొన్నది.

2. సర్వమును తనలో (కలతే సంకలతే) చక్కగా ఇముడ్చుకొనే లక్షణం చేత కూడా విష్ణువు కాలస్వరూపుడు.

జరుగుతున్న పరిణామాల (ఉదా॥ సూర్యోదయ, అస్తమయాల) ఆధారంగా కాలాన్ని భావిస్తాం గానీ, నిజానికి అంతుపట్టనిది. పరిణామప్రదాయకంగా భాసించే వ్యవస్థను నడిపేవాడు, ఈ పరిణామ శీలాన్ని దాటి వెలిగే పరిణామ రహితుడు – కాలాతీతుడు. ఈ కారణం చేతనే –

పరమేష్ఠీ.. 419

1. పరమ (అన్నిటినీ దాటిన అత్యున్నత) పదము నందున్నవాడు. 'పరమే-ష్ఠీ' పరమమందున్నవాడు.

   శరీరాన్నంతటినీ శాసించే జ్ఞానేంద్రియాలు, బుద్ధి (మేధస్సు) శరీరంపై భాగంలో ఉన్నట్లే, విశ్వానికి వెలుగునీ శక్తినీ ఇచ్చే సూర్యుడు ఉన్నతాకాశాన నిలిచినట్లే... సర్వ జగతినీ నడిపే జ్ఞాన చైతన్యస్వరూపుడు జగతికంటే పరమమందు (ఉన్నతస్థానమందు) ఉన్నవాడు.

   బుద్ధిని సైతం ప్రేరేపించే ఆత్మ స్వరూపుడు పరమపదస్థుడు.

   మస్తిష్కాదూర్ధ్వః ప్రైరయత్ ప వవమానోధి శీర్షతః – అని అథర్వవేదం వర్ణించింది.

   ఋచోక్షరే పరమే వ్యోమన్ ॥ (ఋగ్వేదం)

   పరమేష్ఠీ త్వా సాదయతు దివస్పృష్టే జ్యోతిష్మతీమ్ ॥ (యజుర్వేదం)

   తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః॥

   యే పురుషే బ్రహ్మ విదుస్తే విదుః పరమేష్ఠినమ్॥

   – అని శ్రుతి పరమేష్ఠిని ఆవిష్కరించింది.

2. నాశనరహితమైన అక్షర ధామమే పరమవ్యోమం. పరాకాశం – చిదాకాశం – దహరాకాశమే 'పరమము' – దానియందున్నవాడు – (హృదయ స్థానమందున్నవాడు).

   జ్యోతిషాం జ్యోతిరేకం (యజుర్వేద) – ప్రకాశించేవాటిని ప్రకాశింపజేసే పరమస్థానమది. **'పరమేష్ఠీ విభ్రాజతే'** అని కూడా శ్రుతి.

3. తన గొప్పదైన మహిమయందు తానున్నవాడు. (ప్రకృష్టే స్వే మహిమ్ని స్థితః) శ్రీరామాద్యవతారాలలో కూడా ఈ స్థితిలోనే భాసించి, అవతార పరిసమాప్తి తరువాత తన పరంధామానికి చేరినవాడు.
సమున్నత స్వస్థితి నుండే సర్వమును గ్రహించగలుగుతున్నందున-

పరిగ్రహః.. 420

1. అన్ని విధముల, అన్నిటిని గ్రహించువాడు (స్వీకరించువాడు).
2. అన్ని విధములు, అందరిచే గ్రహింపబడువాడు.
పరమస్థానమందున్న పరమేశ్వరశక్తి ఈ విశ్వంలో ప్రతి అణువునందూ వ్యాపించుట చేత అన్నిటినీ అన్ని విధాల గ్రహించగలుగుతున్నది. మనలో, మన వెలుపల వ్యక్తమయ్యే సర్వమూ ఆయన గ్రహించగలడు.
మన నుండి గ్రహిస్తున్నవాడే, మనచే గ్రహింపబడుతున్నవాడు.
మనం స్వీకరిస్తున్న ప్రతి వస్తు శక్తీ విష్ణు చైతన్యమే. అదేవిధంగా దానిని స్వీకరిస్తున్న మనలోని చైతన్యమూ విష్ణు స్వరూపమే (**అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః** - అనే శ్రుత్యర్థమిదే).
యేనేదం భూతం భువనం భవిష్యత్ పరిగృహీత మమృతేన సర్వమ్
(యజుర్వేదం)
అనంత కాలాన్నీ, అనంత భువనాలనీ సర్వమును గ్రహించేవాడితడేనని వేదవచనం.

✦సర్వగతుడైన వాడు కనుక అందరూ అన్ని వైపుల నుండి ఆయనను గ్రహించగలరు. శరణార్థుల చేత అన్ని విధముల ఆశ్రయింపబడుతున్నవాడు.
యే యథామాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్।
మమ వర్త్మాను వర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః।। (భగవద్గీత)
"ఎవరెవరు ఏఏ విధాలుగా ఆశ్రయిస్తున్నారో (**గ్రహిస్తున్నారో**) వారిని ఆయా

విధాలుగా అను 'గ్రహిస్తున్నాను'. అందరూ నా మార్గాన్ని అనుసరిస్తున్నవారే".

✦భక్తులు భక్తితో సమర్పించే 'పత్రం పుష్పం ఫలం తోయం' వంటి వాటిని, వారి భక్తి కారణంగా 'పరిపూర్ణ ప్రీతితో గ్రహిస్తున్నవాడు. మనం చేసే ఏ ప్రార్థన గానీ, పూజ గానీ వ్యర్థం కావు. లోకంలోని వారు పరిమిత బుద్ధితో గ్రహించలేక పోవచ్చుగానీ – పరిపూర్ణ జ్ఞాన స్వరూపుడైన విష్ణువు, అన్నీ గ్రహించి అనుగ్రహిస్తాడు.

'నో దేవతాసు జడిమా, జడిమా మనుష్యే' (విద్యారణ్యులు) "దేవత యందు జడత్వం లేదు. మనుష్యులందే జడిమ ఉన్నది."

అన్ని విధములు గ్రహించగిలిగే శక్తితో అన్నిటినీ శాసించుతున్న వాడై –

ఉగ్రః.. 421

1. భయము గొలుపువాడు.

   మహా చక్రవర్తివలె అందరినీ ప్రేమతో పాలించే విష్ణుని పరమేష్ఠిత్వం చేత దేవతలు, ప్రకృతి శక్తులు ఆయన శాసనం పట్ల, భీతితో స్వధర్మాన వర్తిస్తున్నారు– రాజ దండన భీతితో ప్రజలు న్యాయంగా జీవిస్తున్నట్లుగా. ఎటునుండైనా ఎలాగైనా గ్రహించగల (పరిగ్రహః) ప్రభువు కనుక ఆ ఉగ్రశాసనునికి భీతిల్లి గ్రహాదులు, పంచభూతాలు సక్రమంగా పనిచేస్తున్నాయి. వివిధావతారాలలో అధర్మం పట్ల తన ఉగ్ర (ప్రచండ)తను ప్రదర్శించి ధర్మాన్ని ప్రతిష్ఠించాడు.

2. **ఉత్** – **గ్రసతి.** తనను గ్రహించిన వారిని ఉత్కృష్ట స్థితికి చేర్చువాడు. 'పరమేష్ఠి' కనుక – ఉన్నత స్థితిలో ఉన్న ఆయనను శరణు వేడితే (పరిగ్రహిస్తే) కరావలంబన మిచ్చి (చేయూతనిచ్చి) ఉన్నత గతి యందుంచుతాడు. అందుకే ఆ 'ఉగ్ర' నరసింహుని **'లక్ష్మీనృసింహ! మమ దేహి కరావలంబమ్'** అని వేడుకున్నారు ఆదిశంకరులు.

3. **'ఉచ సమవాయే'** అనే ధాతువు ననుసరించి – 'సమస్తమును తనయందు

చక్కగా సమన్వయపరచి, నింపుకొని సమగ్రంగా నిర్వహిస్తున్నవాడు' అని అర్థాన్ని గ్రహించవచ్చు. **యస్మిన్ సర్వం సంవీతం సమవేతం సమ్యగ్గతం ప్రోతం వా భవతి – ఉగ్రః.** (సత్యభాష్యం).

నమ ఉగ్రాయ చ భీమాయ చ ॥ (యజుర్వేదం)

యాసదుగ్రః. ॥ (యజుర్వేదం)

ఉగ్రం యుయుజ్య పృతనాసు సాసహిమ్ ॥ (ఋగ్వేదం)

ఉగ్ర ఉగ్రాభిరూతిభిః॥ (ఋగ్వేదం)

సర్వము తనయందు 'సమ్యగ్గతం' 'సమవేతం' (చక్కగా చేర్చుట,సమకూర్చుట) చేసిన 'ఉగ్రుడు' కనుక – అన్నీ ఈయనయందే ఉండుటచే –

సంవత్సరః.. 422

1. అన్నిటినీ చక్కగా తన యందు వసింపజేయువాడు.

'సమ్యగ్ నివసతి జగత్ అస్మిన్' – సర్వవ్యాపకుడైన విష్ణుని యందే జగతి సమగ్రంగా వసించి ఉన్నది.

ఋతువులన్నీ ఏ కాలంలో పూర్తిగా వసించి ఉన్నాయో – ఆ కాల పరిమితిని 'సంవత్సరం' అంటాం. నిజానికి కాలమంతటికీ 'సంవత్సరం' అని పేరు. కాలంలోనే అన్నీ పూర్తిగా నివసిస్తున్నాయి. అన్నిటి పూర్తి ఉనికి కాలమందే. అందుకే కాలమే సంవత్సరమనిపించుకుంటున్నది.

వ్యవహారపరంగా – ఆరు ఋతువులు, పన్నెండు మాసాలు, రెండు అయనాలు మార్పులు కలవి. ఈ మార్పులన్నీ ఏ కాల పరిమితిలో జరుగుతున్నాయో దానిని 'సంవత్సరం' అంటాం. ఇది కూడా వైదిక సిద్ధాంతమే. ఎందుకంటే – ఈ ఆరు ఋతువుల విషయాలే – తరువాతి కాలపరిమితిలోను ఆవృతమవుతున్నాయి. అందుకే ఆరు ఋతువుల ఒక ఆవృతికి ఒక 'సంవత్సరం' అంటున్నాం.

సంవత్సర కాలాన్ని ఆధారం చేసుకొనే ఆయా మాసాలలో, ఆయా

ఋతువులలో వివిధ వైదిక యజ్ఞాలు (దర్శపూర్ణ మాసలు, చాతుర్మాస్యలు మొదలైనవి) చెప్పబడ్డాయి. సంవత్సరం తరువాత ఇవే పునరావృతమవుతాయి.

ఇలా కాల స్వరూపుడైన విష్ణువునే సంవత్సర రూపంగా తెలుసుకొని కొలుచుకొనే వారికి అన్ని సంవత్సరాలు ఆనంద దాయకాలే.

సంవత్సరే సమపృచ్యన్త ధీతిభిః । (ఋగ్వేదం)

సంవత్సరస్తే యజ్ఞం దధాతునః ప్రజా చ పరిపాతునః । (యజుర్వేదం)

3. సర్వజీవులు, సర్వకాలములు, సర్వలోకములు అన్నీ విరాట్పురుషునిలోనే సంపూర్ణంగా జీవించి ఉన్నాయి. అయనకు వెలిగా ఏ ఒక్కదాని ఉనికీ లేదు.

ఈ సంవత్సర లక్షణం చేతనే విశ్వరూపంగా పెరిగినవాడై –

దక్షః.. 423

1. వృద్ధి చెందేవాడు – శీఘ్రముగా కర్మచేయువాడు.

'దక్ష వృద్ధౌ శీఘ్రార్థేచ'. దక్షతే వర్ధతే క్షిప్రంవా కురుతేదక్షః.

జగద్రూపంలో వృద్ధి చెందేవాడు. జగత్కార్యాలను సమయానుకూలంగా చతురతతో, శీఘ్రంగా చేయువాడు.

భక్తుల, యోగుల సాధనానుగుణంగా వృద్ధి చెంది, వారి సాధనల ఫలాన్ని జాగులేకుండా ప్రసాదించేవాడు.

"క్షిప్రకారీ జనార్దనః" – చింతిత కార్యాలను వెంటనే చేసేవాడు జనార్దనుడు. విశ్వకర్మలన్నీ ఏమాత్రం వాయిదాలు లేకుండా కాలానుసారంగా నిర్వహిస్తూ, తానే విశ్వమందు వివిధ శక్తులుగా వృద్ధి చెందుతున్న కారణంగా దక్షుడు. సూర్యరూపంలో భాసించే విష్ణువు ఉదయాస్తమయాలను, తన కాంతి గమనాన్ని శీఘ్రంగా అవిశ్రాంతంగా నిర్వహిస్తూ, ఉదయించిన నుండి వృద్ధి చెందుతుంటాడు. కనుక – 'దక్ష' శబ్దంతో సౌరమూర్తిని భావించవచ్చు.

ధర్తా దివః పవతే కృత్వ్యో రసో దక్షో దేవానామనుమాద్యో నృభిః ॥
(ఋగ్వేదం)

ఇన్ద్రర్దక్షః శ్యేన ఋతావా హిరణ్య పక్షః శకునో భురణ్యుః ॥ (యజుర్వేదం)

ఆదిత్యరూపుడైన విష్ణువును వేదం దక్షునిగా వర్ణించింది.
దక్షునిగా జగతిని సృష్టి స్థితులతో శీఘ్రంగా వృద్ధి చేసే వాడే సమయమెరిగి విశ్రాంతినిస్తున్నవాడు కనుక –

విశ్రామః.. 424

1. విశ్రాంతి నిచ్చువాడు.

శ్రమభావమే శ్రామం (శ్రాంతి). దానిని తొలగించువాడు 'విశ్రాముడు'. జీవిత గమనంలో, సృష్టిగమనంలో అలసిన ప్రాణులను లయరూపంలో తనయందు నిద్ర పుచ్చి విశ్రాంతి నిచ్చువాడు. ఆటలాడి, విద్యనభ్యసించి తిరిగి తిరిగి అలసిన సంతానాన్ని తల్లి సమయమెరిగి నిద్ర పుచ్చినట్లుగా సర్వజగతిని తనయందు చేర్చి సేదతీర్చే వాడితడు. రాత్రి రూపంగా కాలంలో ఏర్పడి జగతిని సేద తీర్చే స్వామి.

వేదనపడిన భక్తుల అలసటనీ, ఆర్తినీ పోగొట్టి విశ్రాంతినిచ్చేది విష్ణువే. క్షుత్పిపాస, శోక మోహ, జరామరణాలనే షడూర్ములతో, అవిద్య, అస్మితా, రాగ, ద్వేష, అభినివేశమనే పంచ క్లేశాలలో, పాపపుణ్యాల త్రోపుడులతో అలసిన జీవులు 'స్వామీ! ఇంక ఆట చాలు. ఆదుకోవయ్యా' అని శరణువేడి ముముక్షువులైతే (మోక్ష కాంక్ష కాలవారైతే) వారిని తన చెంత చేర్చుకొని జనన పరంపరల శ్రమ బంధం నుండి తొలగించి కైవల్యరూప శాంతి నిచ్చే ముక్తి ప్రదాత.

"పిల్లవాడు ఆట బొమ్మలతో ఆడుకుంటూ ఉన్నంతకాలం అమ్మ సైతం గుర్తురాదు. ఆటతో అలసి, విసిగి 'అమ్మా' అని పిలవగానే, ఎంత పనిలోనున్న తల్లైనా పరుగున వచ్చి ఆదుకుంటుంది. అదేవిధంగా ప్రాపంచిక విషయాలతో

ఆడుకొనే జీవుడు, అలసి ఆర్తిగా పిలిస్తే 'దక్షుడై' (శీఘ్రంగా) విశ్రాంతినీ శాంతినీ అనుగ్రహించే దయాళువు నారాయణుడు" అని శ్రీ రామకృష్ణ పరమహంస భావన.

మోక్ష మివ్వగలిగే దక్షుడే విశ్రాముడు.

2. విశ్రమించువాడు.

పిల్లవాడ్ని నిద్రపుచ్చి విశ్రాంతి తీసుకొనే తల్లి వలె – సర్వజగతిని తనయందే విశ్రమింపజేసి, తాను స్వాత్మస్థితిలో యోగనిద్ర లోకి చేరే విష్ణువే విశ్రాముడు.

ఈ విధమైన సృష్టి స్థితి లయాది క్రియలను చాలా నేర్పుతో నిర్వహిస్తున్నందున –

విశ్వదక్షిణః.. 425

1. అన్నిటి (అందరి)కంటే నేర్పరి – సమర్థుడు.

విశ్వస్మాత్ దక్షిణః – నేర్పరులకు నేర్పరి ఈతడే.

అన్నిటికంటే, అందరికంటే, అన్ని కర్మలందు (విశ్వసు) ఎంతో సమర్థతను కనబరచి సంపూర్తి చేసే జ్ఞానవైచిత్రి ఈ సర్వజ్ఞుని సొత్తు.

'దక్షిణా శేముషీప్రోక్తా' – అని ఉపనిషద్వచనం (దక్షిణామూర్త్యుపనిషత్తు). మేధాశక్తి (నేర్పరితనం) దక్షిణ. దానిని ప్రతి పనిలోను చూపించుతాడు. విశ్వంలో ప్రతిఅణువులో జరిగే క్రియలో విష్ణుని నేర్పరితనమే గోచరిస్తుంది. ఏ మేధావికీ అంతుపట్టని అద్భుతమేధావి నారాయణుడు.

2. దాక్షిణ్యభావం కలవాడు దక్షిణుడు.

విశ్వానికి 'సమస్తము' అని అర్థం. విష్ణుని సమస్తమూ దాక్షిణ్యమే. ఆయన అణువణువూ దయామయుడు. ఆ కారుణ్యమే విశ్వమంతా విస్తరించింది. కురిసే నీటిలో, వెలిగే కాంతిలో, వీచే వాయువులో, అగ్నిలో, ఆకాశంలో, సూర్య చన్ద్రాదులలో, చివరికి మనలో ప్రతి జీవిలో పరమాత్ముని దాక్షిణ్యమే నిండి ప్రవహిస్తోంది.

లోకంలో ఎవరైనా దుఃఖపడితే వారిని ఓదార్చుతూ మనం దుఃఖాన్ని ప్రకటిస్తాం. అది కేవలం దయ. కానీ వారి దుఃఖాన్ని సంపూర్ణంగా పోగొట్టగలిగే సమర్థత కలిగిన దయ ఉంటే దానిని 'దాక్షిణ్యం' అంటారు. ఆ దాక్షిణ్యంతోనే విశ్వంలో ఇన్ని సమకూర్చాడు. విశ్వమంతా నిండిన విష్ణుని కారుణ్యాన్ని గ్రహించగలిగేవాడే ధన్యుడు.

శాశ్వతదుఃఖనిర్మూలనమే మోక్షం. నిజమైన విశ్రామం. దానినివ్వగలిగే సమగ్ర (విశ్వ) దాక్షిణ్యం విష్ణునికే సాధ్యం.

3. పరశురాముడై కార్తవీర్యార్జునుని, దుష్ట క్షత్రియుల్ని సంహరించి, కైవసం చేసుకున్న భూమినంతటినీ కశ్యపునకు దానమిచ్చినవాడు.

అదేవిధంగా కల్కిగా అవతరించి మ్లేచ్ఛసంహారం చేసిన అనంతరం అశ్వమేధ మహాయాగాన్ని చేసి పృథివిని బ్రాహ్మణులకు దక్షిణగా సమర్పించనున్నవాడు.

తతశ్చ రక్షణం కృత్వా ద్విజేభ్యః పృథివీమిమాం।
వాజిమేధే మహాయజ్ఞి విధివత్సం ప్రదాస్యతి ॥ (భారతం. అరణ్యపర్వం)

దాక్షిణ్య (సమర్థవంతమైన కారుణ్య) భావాన్ని విశ్వమంతా నింపి, నిండినవాడు కనుక –

విస్తారః స్థావరస్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్।
అర్థోనర్థో మహాకోశో మహాభోగో మహాధనః॥... 46

426. విస్తారః, 427. స్థావరస్థాణుః, 428. ప్రమాణమ్,
429. బీజమవ్యయమ్। 430. అర్థః, 431. అనర్థః,
432. మహాకోశః, 433. మహాభోగః, 434. మహాధనః

విస్తారః.. 426

1. విస్తరింపజేయువాడు.

విశ్వలక్షణమే విస్తారం. పరమాత్ముని చైతన్య విస్తారమే విశ్వం. తనయందే సమస్తలోకాలనీ విస్తృతపరచినవాడు.

రాజు తన సామ్రాజ్యాన్ని విస్తృతపరచుకొని కృతకృత్యుడౌతాడు. విష్ణువే విశ్వ సామ్రాజ్ర విస్తారకర్త. ఆ సార్వభౌముడే మత్స్యాది బహు విధావతారాలతో ధర్మాన్ని విస్తృతపరచినవాడు.

సూర్యాదుల ద్వారా ఈ విస్తార లక్షణాన్ని ప్రసరింపజేస్తూ కాంతినీ, శక్తినీ, పంచభూతాలనీ విస్తృతపరుస్తున్న విశ్వదక్షిణుని స్వభావమది.

జగత్తులన్నీ తనలోనే బీజ రూపంగా అవ్యక్తంగా ఉంచి, తిరిగి స్థూలరూపంగా వ్యక్తం చేసి విస్తారపరచేవాడు విష్ణువు.

ఏష యజ్ఞానాం వితతో బహిష్టో విష్టారిణం పక్త్వా దివమా వివేశ।

(అథర్వవేదం)

విశ్వ నిర్వహణలనే యజ్ఞాలను విస్తృత పరచేవాడు. విశ్వాన్ని సార్థక పరచి దివి నాక్రమించి యున్నాడని వేద వచనం.

ఈ వ్యక్తావ్యక్తావస్థలోనున్న జగతిని తనయందే సర్వ అవస్థలలో స్థిరపరచుకున్న కారణంగా –

1. నిలచినవాటిని తనయందు నిలిపియుంచి నిలచినవాడు.

స్థిరముగా ఉండే స్వభావం కలవి స్థావరములు. విశ్వవ్యవస్థ స్థిరమైనది. భూమి, గ్రహనక్షత్రాదులు, సముద్రాలు పంచ భూతాలు ఇవి ఎల్లప్పుడూ స్థిరమైన వ్యవస్థలో ఉన్నవి. వాటి గమనాదులు మారని నియమాలతో సాగుతున్నవి. అటువంటి స్థిర నియమబద్ధమైన జగతిని తాను నిశ్చలుడై ధరిస్తున్నందున స్థాణువు. (స్థావరములను స్థాణువై (నిశ్చలంగా) ధరించువాడు).

విష్ణువేర్పరచిన విశ్వనియమం స్థిరం. దానిననుసరించే లోకాలు స్థావరములు. వాటికాధారమైనవాడు స్థిరస్థాణువు.

3. **సర్వత్ర తిష్ఠతి – సర్వస్మిన్ తిష్ఠతీతి స్థావరః.**

అంతటా తానుండువాడు – తనయందన్నిటినీ ఉంచువాడు స్థావరుడు. ఈ స్థావరుడే అన్నిటికీ ఆధారమై యున్నవాడు. కదలక పెరిగే వృక్షాది స్థావరాలకు పర్వతాదులు ఆధారమైతే, ఆ పర్వతాలకు పుడమి ఆధారం. అటువంటి పృథివ్యాది స్థావరాలకు ఆధార చైతన్యం విష్ణువు. ఆధార శక్తులకు ఆధారమైన సర్వాధారుడనేది తాత్పర్యం.

ప్రత్యఙ్ జనాస్తిష్ఠతి సర్వతోముఖః । (యజుర్వేదం)
అయం విశ్వాని తిష్ఠతి పునానో భువనోపరి । (ఋగ్వేదం)
యోన్తరిక్షే తిష్ఠతి విష్టభితః । (అథర్వవేదం)
నిర్దహనీ యా పృషాతక్యస్మిన్ తాం స్థాణావధ్వా సజామి. (అథర్వవేదం)
కృతం తీర్థం సుప్రపాణం శుభస్పతీ స్థాణుం పథేష్ఠామప దుర్మతింహతమ్. (ఋగ్వేదం)

'స్థావర స్థాణువు' అని శ్రుతి ఇలా పలు విధాల పేర్కొన్నది.
ఈ సర్వాధారుడే దేనిని ఎంతగా తనయందు వ్యక్తం చేయాలో తెలిసినవాడు కనుక –

ప్రమాణమ్..

1. జ్ఞాన స్వరూపుడు.

   తన నుండి వ్యక్తమయ్యే విశ్వానికి తానే ప్రమాణం. తానన్నిటినీ తెలుసుకొనేవాడు. తనను సంపూర్ణంగా తెలుసుకోగలిగేది ఏదీ లేదు. సృష్టిలో దేనిని తెలియాలన్నా అతడిచ్చిన తెలివితోనే తెలుసుకోగలం. అన్ని తెలివితేటలకీ మూలమైన తేటతెలివి. సర్వ ప్రకాశకుడైన స్వయం ప్రకాశక జ్ఞాన స్వరూపుడు.

2. విశ్వధర్మానికి పరమ ప్రమాణమైన వేదమే తానై 'ప్రమాణం' అనిపించుకున్నాడు. వేదాలకే స్వతః ప్రమాణమని పేరు. వాటికవే ప్రమాణం. మరో ప్రమాణంతో వేదాన్ని నిర్ధారించలేం.

3. 'ఏది ఎప్పుడు ఎంత ఎక్కడ ఎవరికి ఎలా?' అని అన్ని 'మానములు' (కొలతలు) తెలిసి కొలిచి విశ్వ నిర్మాణం చేసిన ప్రమాణుడు. ఒక శిల్పి తన మనస్సులో ఒక చిత్రాన్ని భావించి ఆ కొలతలతో దానిని ఒక శిలపైనో, ధాతువుపైనో ఆవిష్కరిస్తాడు. అదేవిధంగా విశ్వ నిర్మాణానికి పూర్వమే ప్రత్యంశపు ఉనికీ, మనుగడ సర్వము తనయందు నిర్మించుకొని, దానిని విశ్వాకృతిగా ప్రకటించేవాడు. **'మిమీతే'** తన ఎరుకను ఒక ఆకృతిగా కొలతపెట్టువాడు. ఆయనను కొలవగలిగేది లేదు కనుక అతడే పరమమైన ప్రమాణం. స్వతః ప్రమాణుడు.

   స పశుభ్యో విచష్టే త్రయాణ్ణికో విమిమీతే అధ్వనః।

   .... సవ ప్రాణాన్ నవభిః సం మిమీతే దీర్ఘాయుత్వాయ శతశారదాయ

   - అని 'అథర్వవేదం' పేర్కొన్నది.

   కొలతలతో పెంచి, తుంచి, పంచి వెలిగే స్వామి ఈ విశ్వానికి ఆదియై, తాను మాత్రం పెంచలేని తుంచలేని పంచలేని శాశ్వతుడైన కారణంగా -

బీజమవ్యయమ్..426

1. మార్పులేని కారణమైనవాడు.
   మారే విశ్వానికి కారణమై (బీజమై), తాను మారనివాడు.
2. విశ్వంలో ప్రత్యంశమూ వ్యక్తము కాని ముందు బీజరూపంలో ఉంటుంది. ఆ బీజంలో ఉన్నదే వ్యక్తం అవుతుంది. దానిలో లేనిది కొత్తగా కలుగదు. **'అన్యధాభావ రహితః** (ఒక విధంగా ఉన్నది మరొక విధంగా అయ్యే స్థితి కలుగదు). వటవృక్ష బీజం నుండి మామిడి చెట్టురాదు. ఆ వృక్ష లక్షణమంతా ఆ బీజంలో పూర్వం నిబద్ధమై ఉన్నదే వెలికివస్తుంది. ఆ విధంగా బీజమందు అన్వయతత్త్వంగా నిండిన చైతన్యమే 'బీజమవ్యయమ్.'
3. **వివిధం జాయతే** – బీజం. అనేక రకములుగా అయ్యేది బీజం. కాండంగా, కొమ్మలుగా, రెమ్మలుగా, ఫలాలుగా వివిధ రూపాలలో పరిణమించ గలిగేది 'బీజం'. పుట్టుక పెరుగుదల మార్పు ముగింపు వంటి వికారాలు లేనిది 'అవ్యయం'.

   విశ్వం బీజం – దానికి కారణమైన తత్త్వం 'అవ్యయం'. రెండూ తానే అయిన విష్ణువు బీజమవ్యయం. **"అజాయమానో బహుధా విజాయతే"** (పుట్టుకలేని వాడైనా బహువిధాలుగా (విశ్వరూపంగా) కలుగుతున్నవాడు) – అని యజుర్వేదం చెప్పిన భావమిది.

   అవ్యయం నాభా పృథివ్యాం ధరుణో మహోదివః ।

   – అని ఋగ్వేదం అవ్యయతత్త్వాన్ని పేర్కొన్నది.

   తరుగుదలలేని ఆ శాశ్వతతత్త్వమే జ్ఞానులు కోరుకొనే అక్షయ సంపద –

అర్థః.. 430

1. కోరబడువాడు. పొందబడువాడు.

దేనిని కోరతారో అది 'అర్థం'. అందరూ కోరేది ఆనందం. ఆ ఆనందమే విష్ణువు. ఆ పరతత్త్వమే ఆనందమని స్పష్టంగా తెలుసుకున్నవారు, ఆభాస సుఖాలైన విషయాదులను విడచి చిత్స్వరూపుడైన విష్ణువునే వాంఛిస్తారు. అలా భక్తులచే యోగులచే కోరబడేవాడు.

'యమిచ్ఛన్తం బ్రహ్మచర్యం చరన్తి' – దేనిని కోరి యోగులు బ్రహ్మచర్యాన్ని (బ్రహ్మజ్ఞాన సాధనను) అవలంబిస్తున్నారో ఆ బ్రహ్మమే 'అర్థః'.

విశ్వంలో దేని నివ్వాలన్నా విశ్వరూపుడైన విష్ణువే ఇవ్వాలి. నాట్యం చూడాలన్న కోరికతో ఉన్నవాడు – నాట్యంగా వ్యక్తమయ్యే నటుని చూడదలచుకున్నట్లే, నాట్యంలోని పలుభంగిమలు, హావ భావాలు ఆ నటుడే లేకుంటే రావు. అదేవిధంగా విశ్వంలో మనం కోరే 'అర్థా'లన్నీ విష్ణుని విన్యాసాలే. ఈ అర్థాలన్నీ (ప్రయోజనాలన్నీ) ఆయనే.

అర్థం చిదస్య సుధితం యదేతవ ఆవర్తయన్తి దావనే । (ఋగ్వేదం)

చైతన్యమే అసలైన అర్థమని వేద హృదయం.

అన్నిటి లక్ష్యం, అన్నిటి ప్రయోజనం ఆ చిత్స్వరూపుడే. మనకు అతడే పరమార్థం. కానీ అతనికి ఏ ప్రయోజనమూ లేదు కనుక –

అనర్థః.. 431

1. కోరవలసినదేదీ లేనివాడు.

పరిపూర్ణుడైన ఆయనకు పొందదగిన ఏ ప్రయోజనమూ లేదు. కొరత (వెలితి) ఉన్న వానికే కోరిక. కొరతే లేని ఆత్మారాముడైన విష్ణువునకు ఏదీ అవసరం లేదు. అన్ని అవసరాలు ఆయనే సమకూర్చుతున్నాడు.

2. వెనుకటి నామం 'అర్థః' – ఈ నామం 'అనర్థః'.

అర్థమూ అతడే – అనర్థమూ అతడే. కోరదగినవీ, కోరదగనివీ రెండిటిలో

వ్యాపించినది విష్ణు చైతన్యమే. ఒకరికి కావలసినది ఇంకొకరికి అవసరం లేదు. వీరికి అనవసరమైనది మరి యొకరికి అవసరం. అందరి అవసరాలు తీర్చే ఆదిదేవునికి అన్నీ సమానమే.

మనం కోరుకోని మనకు అనవసరపు బురద, అందులో బ్రతికే జీవులకు అవసరం – అర్థం. అంతేకాదు ఒకే వ్యక్తికి ఒకప్పటి అర్థం, మరొకనాటికి అనర్థం. ఒకచో అర్థం – మరొక చోట అనర్థం. ఆరోగ్య స్థితిలో 'అర్థ'మైన ఆహారం – అనారోగ్యంలో అనర్థం. నదిలో అర్థమైన పడవ, నేలపై అనర్థం. ఈ అర్థానర్థాలన్నిటా నిండి – ఎవరికేది ఇవ్వాలో తెలిసిన 'ప్రమాణ' స్వరూపుడు విష్ణువు.

చివరికేది కావాలన్నా ఆయన స్వరూపమైన విశ్వమనే మహా భాండారం సిద్ధంగా ఉంది –

మహాకోశః.. 432

1. గొప్ప కోశముగా (నిధిగా) ఉన్నవాడు.
   అనేకమైన విలువైన వాటిని దాచుకున్న చోటును కోశం అంటారు. నిధి, కోశం సమానార్థక పదాలు. ఎన్నటికీ తరగని పెద్ద కోశం విష్ణువే. విశ్వమంతా వ్యాపించిన ఆయన లోనే అంతుపట్టని బ్రహ్మాండాలు, వాటిలో చిత్రాతిచిత్రమైన ప్రాణి సమూహం, వస్తు సమూహం, ఒక ఆశ్చర్యకరమైన మహాకోశమే ఈ మహావిశ్వం. ఇన్నీ కల్పించి తనలోనే ఉంచి పంచేవాడు. ఈ కోశలక్షణాన్ని పుడమి, సముద్రం వంటి వాటిలోనూ వ్యాప్తి చేశాడు. అనేక రత్నాలకు, సంపదలకు పృథ్వి కోశం. జలానికి మేఘం, లెక్కలేని సంపదలకు సముద్రం, వృక్షాలకు అరణ్యం.... ఇలా విశ్వకోశంలో, మళ్ళీ ఎన్నో కోశాలు. ఈ ఆశ్చర్యకరమైన కోశ వ్యవస్థగా వ్యాప్తి చెందిన మహా చైతన్యమే విష్ణువనే మహాకోశం.
2. మన శరీరమే ఒక మహాకోశం. అనేక ధాతువులు, బహు భావకల్పనలు

చేసే మనోవృత్తులు, వివిధ నాడులు, అవయవాలు – అన్నీ నిర్వహించే అంతర్గత విష్ణు చైతన్యం మనలోనే ఉన్న మహాకోశం.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ – అనే పంచకోశాల ఆవరణ మాటున ఉండి, పంచకోశాలలో తన చైతన్యాన్ని విస్తరింపజేసిన మహాకోశమే ఆత్మ స్వరూపుడైన విష్ణువు.

పూష్ణ శ్చక్రం న రిష్యతి కోశోవపద్యతే । (ఋగ్వేదం)

ఉరుః కోశో వ వసుధానస్తవాయం యస్మిన్నిమా విశ్వా భువనాన్యన్తః ।
(అథర్వవేదం)

అపూర్ణో అస్య కలశః స్వాహా సేక్తేవ కోశం సిసిచే పిబధ్యై। (ఋగ్వేదం)

– అని మహాకోశ స్వరూపుని శ్రుతి వినుతించింది.

మహా కోశునిగా ఉన్నవాడు, కోశాదుల ఆవరణలన్నిటికీ ఆవల భాసించే ఆనంద స్వరూపుడు కనుక –

మహాభోగః.. 433

1. గొప్ప భోగము కలవాడు.

   ఆనందమే అనుభవము. అనుభవమే భోగం. కేవలం అనుభవ స్వరూపుడై, అపరిచ్ఛిన్నమైన ఆనందమే తానైన కారణంగా మహాభోగుడు సచ్చిదానంద స్వరూపుడు.

2. గొప్ప పాలనావ్యవహారము కలవాడు.

   'భుంజతి – పాలయతి ఇతి భోగః' అనే అర్థాన్ని అనుసరించి అనంతకాలం లోకాలను ఏర్పరచి సూర్యాది విభూతులతో పాలిస్తున్నవాడు.

   అంతర్యామి అయిన ఈశ్వర చైతన్యమే కోశాదులయందు వ్యాపించి భోగాదులను అనుభవించే జీవచైతన్యంగా వ్యక్తమౌతోంది. ఈ అనుభవరూప చైతన్యమే మహాభోగం.

   హిరణ్యయముత భోగం సమాన హత్వీ దస్యూన్ ।ఫ్రార్యవర్ణమావత్ ॥
   (ఋగ్వేదం)

3. వివిధ దేవతారూపాలతో భక్తుల అభీష్టాలను నెరవేర్చి, గొప్ప ఫలాలను ప్రసాదించడం చేత కూడా ఈ నామంతో వ్యవహరింపబడుతున్నాడు.

లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్ (భగవద్గీత)

విహితమైనవీ, హితమైనవీ అన్ని కోరికలు నాచేతనే తీర్చబడుతున్నవి.

4. ఆనందరూపుడైన ఈతనినే ధ్యాన, స్మరణాది భక్తి సాధనలతో భక్తులు, జ్ఞానులు, యోగులు అంతరంగంలో అఖండంగా అనుభవరూపంగా గ్రహించి ఆనందిస్తున్నారు. ఈవిధంగా యోగులచే ఆనందింపబడే మహాభోగమీతడే.

"నిధి చాల సుఖమా – రాముని సన్నిధి సేవ సుఖమా" – అని శ్రీరామునే ఆనందానుభవంగా గ్రహించారు త్యాగయ్య.

మహాధనః.. 434

1. గొప్ప ధనము కలవాడు – గొప్ప ధనమే తానైనవాడు.

"ప్రీణన హేతుకం ద్రవ్యం" – ప్రీతిని కలిగించే ద్రవ్యాన్ని 'ధనం' అంటారు. సర్వజీవులను ప్రీతిచెందించగలిగే మహాధనమే తన అనంత విభూతులుగా విస్తరింపజేసినవాడు.

"ధనమగ్నిర్ధనం వాయుః ధనం సూర్యో ధనం వసుః" – అని శ్రుతి నుడివినట్లుగా అగ్ని వాయు సూర్యాదుల రూపంతో విస్తరించిన ధనమే విష్ణువు. వీటి చేతనే విశ్వంలోని జీవులందరూ తృప్తి చెందుతున్నారు. ఈవిధంగా అనంతమైన విభూతులు (ఐశ్వర్యములు) తన చైతన్య స్వరూపాలుగా వ్యాప్తి చెందిన విష్ణువు 'మహాధనుడు'.

శతః సహస్రమయుతం న్యర్బుదమసంఖ్యేయం స్వస్మిన్ నివిష్టమ్ ॥

(అథర్వవేదం)

అహం భువం వసునః పూర్వ్యస్పతిరహం ధనాని సంజయామి శశ్వతః ॥

(ఋగ్వేదం)

అసంఖ్యాక సంపదలు తనయందు కలిగిన విరాడ్రూప పరమాత్ముని వేదం పలువిధాల ప్రస్తావించింది.

సర్వజీవుల భోగాలకు మూలమైన ధనమీ విష్ణువు. విరాట్పురుషుడైన ఈతని నుండే దేవ మనుష్యాదు లందరికీ భోగసామగ్రి లభిస్తోంది.

మరీచి మిశ్రైః దక్షేణ తథైవాన్యై రనన్తతః।
ధర్మః ప్రాప్త స్తథా చాన్యైః అర్థః కామస్తథా పరైఃll (విష్ణుపురాణం)

"మరీచి, దక్షుడు మొదలైన వారందరూ అనంతుడైన నారాయణుని నుండే ధర్మార్థ కామాలను పొందుతున్నారు.

2. భక్తులకు, యోగులకు ధన్యతను, ప్రీతిని కలిగించే పరమార్థ స్వరూపుడు. "అర్థం" నామం నుండి ఈ నామం వరకు "అర్థ" రూప పురుషార్థంగా ఉన్న పరమార్థ స్వరూపుడు విష్ణువేనని ప్రతిపాదించి, దుఃఖాది దారిద్ర్యాలను పరిహరించే నారాయణుని సంపద్రూపాన్ని ఈ నామాలలో చక్కని క్రమంలో మహర్షి సమకూర్చాడు.

తాను సహజ ప్రీతి స్వరూపుడై, సర్వులకు ప్రీతి సంధాయకమైన అఖండానంద బ్రహ్మము కనుక–

అనిర్విణ్ణఃస్థవిష్ఠోభూర్ధర్మయూపో మహామఖః।
నక్షత్రనేమిర్నక్షత్రీ క్షమఃక్షామఃసమీహనఃll... 47

435. అనిర్విణ్ణఃll **436.** స్థవిష్ఠఃll **437.** అభూఃll (భూఃll),
438. ధర్మయూపఃll **439.** మహామఖఃll **440.** నక్షత్ర నేమిఃll,
441. నక్షత్రీll, **442.** క్షమఃll, **443.** క్షామఃll,
444. సమీహనఃll

అనిర్విణ్ణఃll.. 435

1. నిర్వేదము (విసుగు, కలవరం, క్లేశం, ఆలస్యం – వంటి వేదనలు) లేనివాడు. పరిపూర్ణుడు, ఆప్తకాముడు, జ్ఞానరూపుడు కనుక 'విసుగు' వంటి అజ్ఞాన జనిత వికారాలు లేనివాడు.

కర్తవ్యాన్ని చక్కగా పాలించేవానికి 'అనిర్వణ్ణస్థితి' ఉండాలి. విశ్వ నిర్వహణలో ఏనాడూ విసుగుచెందని ఈ లక్షణం విశ్వమంతటా ప్రదర్శిస్తున్నాడు. సముద్రం, భూమి, సూర్య చంద్రాదులు నిరంతరం మహోత్సాహంగా, విసుగులేకుండా దీపిస్తున్నారు. ఈ విశ్వకావ్యం ఏనాడూ విసుగురానిది. 'కావ్యం' వేదవాచకం కూడా. తన శబ్దరూపమైన వేదంగా కూడా విసుగురానివాడు విష్ణువు.

'దేవస్య పశ్య కావ్యన్న మమార న జీర్యతి' అని అథర్వణ వేద వచనం. సృష్టి స్థితి లయాదులు మనకు ఆద్యంతాలు ఎరుగని విసుగురాని విష్ణులీలలు. విసుగురాని సూర్యోదయ చన్ద్రోదయములు, అస్తమయాలు, ఋతుపరివర్తనాదులు అన్నీ విశ్వవ్యాపక అనిర్వణ్ణ చైతన్య స్వరూపాలే.

ద్రవన్నస్య వాజినో న శోకా భయన్తే విశ్వా భువనా యద్ భ్రాట్ (ఋగ్వేదం)

అతన్ద్రో బ్రహ్మణా ధీరః ప్రాణో మాను తిష్ఠతు॥ (అథర్వ వేదం)

– వంటి శ్రుతి వాక్యాల ద్వారా శోకభయాదులు, అలసత్వము వంటి వికృతులు లేని విష్ణుని మహిమ వినుతించబడింది.

"అవ్యుచ్ఛిన్నా స్తతస్త్వేతే సర్గస్థిత్యన్త సంయమాः"

– 'ఈతని వలననే ఎడతెగక ఈ సృష్టి స్థితులు నడుస్తున్నాయ'ని విష్ణుపురాణం స్పష్టంచేసింది.

ఈ అనిర్వణ్ణ లక్షణంతో ఇంత జగతిగా పెంచి పెద్దది చేస్తూ గోచరిస్తున్నందున –

స్థవిష్ఠः.. 436

1. మిక్కిలి స్థూలమైనవాడు.

విశ్వరూపునిగా ఈ మహా స్థూల జగతిగా సాక్షాత్కరిస్తున్న వాడు. విశ్వమందంతటా తానే ప్రవేశించి మన దృష్టి పరిమితుల కందనంతగా వర్ధిల్లిన వాడితడే.

'అగ్ని ర్మూర్ధా చక్షుషీ చన్ద్ర సూర్యౌ' అని ముండకోపనిషత్తు 'విరాట్పురుషునిగానున్న పరమాత్మునకు అగ్నియే శిరస్సు. చన్ద్ర సూర్యులే నేత్రముల'ని స్పష్టపరచింది. దిగంతాలను మించిన దివ్యతేజః స్వరూపుడు.

విశ్వంలో ప్రతి వస్తువు గోచరింపబడేలా స్థూలాకృతి నిచ్చే చైతన్య స్వరూపుడు విష్ణువు.

2. మహా జ్యోతిర్మండల స్వరూపుడై అంతరిక్షాన శింశుమార చక్రరూపంగా బలిసి కనిపించే తేజోమయుడు.

"తారామయం భగవతః శింశుమారాకృతిః ప్రభోః" (విష్ణువు పురాణం)

స్థూరస్య రాయో బృహతో య ఈశే తముష్టవామ విదథేష్విన్ద్రమ్।
(ఋగ్వేదం)

స వర్ధితా వర్ధనః పూయమానః సోమా మీధ్వాన్ అభినో జ్యోతిషాయాత్॥
(ఋగ్వేదం)

ప్రాణాది రసస్వరూపుడై ప్రతి పదార్థాన్ని స్థూలీకరించి, వర్ధిల్లజేస్తున్న విరాడ్రూపుడు ఎప్పుడూ ఆధారమై ఉన్నవాడేగానీ, కొత్తగా పుట్టినవాడు కాదు కనుక –

అభూః.. 437

1. కలుగువాడు కాడు.

పుట్టి నశించే ఉపాధులతో కూడినదీ జగతి. 'కలుగుట' మొదలైన వికారాలు జగతిలో ఉన్నా, దీనియందు వ్యాపించిన చైతన్యం ఆ వికారాలు లేనిది. ఇది కలిగేది కాదు. ఉన్నది.

భావవికారాలు లేనివాడు. ఆత్మయై సదా ఉన్నవాడు. అన్నిటికీ తానే ఆధారమై ఉన్నా, తనకే ఆధారమూ లేనివాడు.

అభూర్వ్యక్షీర్వ్యు ఆయురానడ్ ॥ (ఋగ్వేదం)

2. భూః = శాశ్వతమైన ఉనికిగల పరతత్త్వం.

'స్థవిష్ఠోభూః' అనే రెండు నామాలను 'స్థవిష్ఠః, అభూః' అనే కాక, **'స్థవిష్ఠః, భూః'** అని కూడా గ్రహించవచ్చు.

తనకుతాను ఆవిర్భవించువాడేకాక, అన్నిటికీ ఆధారమైన ఉనికి తానే. **'భూ సత్తాయామ్'** అనే ధాతువు ననుసరించి, కేవలము ఉండుటయే స్వభావమైన 'సత్తామాత్ర' పరతత్త్వమితడు.

3. ఆధార లక్షణం చేత ఈ పృథ్విికి 'భూమి' అని పేరున్నది. ఇదికూడా నారాయణ విభూతియే. భూమికి ఆధారశక్తి విశేషం విష్ణు పరాక్రమమే. **'సదాధార పృథివ్యాం'** -అని శ్రుతి పేర్కొన్నది.

'పరిభూః, స్వయంభూః' అనే వేద వాక్యానుసారం. అంతటా తానే తనంత తానై కలుగువాడు (వ్యక్తమగువాడు).

ఈ ఉనికి చేతనే అన్ని విశ్వధర్మాలకు ఆధారమైన -

ధర్మయూపః.. 438

1. ధర్మములను తనయందు (ద్వారా) నిబద్ధించువాడు.

విశ్వధర్మములకు 'యూపం' వంటివాడు. యజ్ఞంలో ఉండే స్తంభం యూపం. దీనికి యజ్ఞ పశువులు కట్టబడి ఉంటాయి. అలాగే విశ్వంలో ఆకాశాది ధర్మాలు (ధారకమైనవి - ధరించునవి - ధర్మములు) ఏ ఆత్మ స్వరూపాన్ని ఆధారం చేసుకొని వ్యవహరిస్తున్నాయో - ఆ ఆత్మయే ధర్మాధారకం - వివర్ధకం.

విష్ణు సమారాధన రూపములైన సకల ధర్మాలు ఈ యజ్ఞేశ్వరుని యందే నిలువబడి ఉన్నాయి. **'యౌతీతి యూపః'** - చేర్చుకొనునది 'యూపం'. ధర్మాలను తనయందు చేర్చుకొనువాడు.

అతో ధర్మాణి ధారయన్ ॥ (ఋగ్వేదం)

తస్మిన్ ఛ్రయన్తే య ఉ కే చ దేవా

వృక్షస్య స్కన్ధః పరిత ఇవ శాఖాః॥ (అథర్వవేదం)

చెట్టు కాండాన్ని ఆధారం చేసుకొని కొమ్మలు అన్నివైపుల వర్ధిల్లినట్లు, యజ్ఞస్వరూపుడైన విష్ణుని దృఢమైన యూపం (స్తంభం) వలె ఆధారంగా చేసుకొని దేవతలు, విశ్వధర్మాలు నిలచి వర్ధిల్లుతున్నాయి.

విశ్వమే విష్ణుని యజ్ఞరూపం. యజ్ఞం నిరంతరాయంగా, నిర్విణ్ణత లేకుండా (అనిర్విణ్ణః), సుస్థిరంగా చేయగలగాలి. (స్థవిష్ఠః). అన్నిటికీ ఆధారమైన (ధర్మయూపః) ఆ యజ్ఞతత్త్వమితడు కనుక-

మహామఖః.. 439

1. గొప్ప మఖ (యజ్ఞ) స్వరూపుడు.

ధర్మాలన్నిటికీ శిరస్సువలె (**ధర్మో మూర్ధాన మాశ్రితః**) ఆధారమైనవాడు కనుక గొప్ప యజ్ఞ స్వరూపుడు. విశ్వమంతా విష్ణుని యజ్ఞరూపం. **మఖ్యతే గమ్యతే ప్రాప్యతే స్వాభీష్టం యేన 'మఖో' యజ్ఞం.** దేని ద్వారా స్వాభీష్టాన్ని పొందగలమో, చేరగలమో అది మఖం. అనగా 'యజ్ఞము'. సర్వాభీష్ట ప్రదాయకుడైన హరియే మహామఖ స్వరూపుడు.

విశ్వమంతా ఈ మఖలక్షణం స్పష్టంగా గోచరిస్తుంది. జలాలను గ్రహించి (ఆదానం) తిరిగి శుద్ధీకరించి, విస్తృతపరచి తిరిగి ఫలముగా అందించే (ప్రదానం) సూర్య, మేఘాదులు విష్ణు విభూతులై ప్రత్యణువూ యజ్ఞమయం చేశాయి. ఈ ఆదాన ప్రదాన లక్షణ రూప చైతన్యంగా విస్తరించిన విష్ణువు 'మహామఖః' అని పొగడబడుతున్నాడు.

2. యజ్ఞాలన్నీ నారాయణుని యందు సమర్పింపబడి గొప్పవైన నిర్వాణ (మోక్ష) రూపఫలాన్ని ఇస్తున్నందున అతడు మహామఖుడు. (మఖములు ఈయనను చేరి మహా ఫలవంతములౌతున్నాయి).

విశ్వమనే గొప్ప యజ్ఞమే తన స్వరూపంగా గల హరి ఆ యజ్ఞక్రియగా నక్షత్రాదులను నిర్వహిస్తున్నందున-

నక్షత్రనేమిః.. 440

1. నక్షత్రములను నియమించువాడు (నడుపువాడు).

జ్యోతిశ్చక్రాలను ప్రవర్తింపజేస్తున్న పరమాత్మ.

నేమిః – నయతి ప్రాపయతి. కదిలించునది – పొందించునది నేమి. ఎల్లవేళలా గతిశీలమైన ఈ జగతి కదులుతున్నప్పటికీ దేనిని ఆధారం చేసుకొని తన పరిధి నుండి దాటకుండా నిబద్ధమై ఉందో అది ఈ జగతికి 'నేమి'. రథచక్రంలోని అరలు తిరుగుతున్నా నేమిని ఆధారం చేసుకొని, చెదరకుండా చలిస్తున్నట్లుగా, నక్షత్రాదులన్నీ సృష్ట్యాది నుండి ప్రళయం వరకు అటు ఇటు తొణకకుండా విశ్వనియమాన్ని అతిక్రమించకుండా సంచరిస్తున్నాయి. ఇలా నక్షత్రాదులను వాటి పరిధులలో నుంచే విష్ణు చైతన్యమే 'నక్షత్రనేమి'.

కృష్ణయజుర్వేదారణ్యకం స్వాధ్యాయ బ్రాహ్మణంలో శిశుమార వర్ణన ప్రస్తావనలో 'శిశుమార చక్రానికి విష్ణువే హృదయమని' (విష్ణుర్హృదయమ్) పేర్కొన్నారు.

నక్షత్రతారకైః సార్ధం చన్ద్రసూర్యాదయో గ్రహాః।

వాయు పాశమయై ర్బన్ధైర్నిబద్ధా ధ్రువసంజ్ఞికే। (స్వాధ్యాయబ్రాహ్మణం)

'శిశుమారం' (శింశుమారం) అనేది ఒక జలచర విశేషం. దానివలె గోచరించడం చేత జ్యోతిశ్చక్రానికి ఈ పేరును వేదం వ్యవహరించింది. ఈ చక్ర వ్యూహానికి పుచ్ఛ దేశంలో (తోకగా) ఉన్నది ధ్రువుడు. చక్ర మధ్యంలో హృదయస్థానంలో విష్ణువున్నాడు. వ్యాపకశక్తితో సమస్త నక్షత్రాది జ్యోతిర్మండలాన్ని నియంత్రించువాడితడు.

ఈ విషయాన్ని విష్ణుపురాణం ఈవిధంగా వివరిస్తోంది.

ఏషభ్రమన్ భ్రామయతి చన్ద్రాదిత్యాదికాన్ గ్రహాన్।

భ్రమన్తమనుతం యాన్తి నక్షత్రాణి చ చక్రవత్।।

"ఈతడు తాను భ్రమణం చేస్తూ (చైతన్యంగా చలిస్తూ) చంద్ర సూర్యాది

గ్రహాలను నిర్వహిస్తున్నాడు. అలా చుడుతున్న వానిని నక్షత్రాలు చక్రంవలె అనుసరిస్తున్నాయి".

శింశుమారాకృతి ప్రోక్తం యద్రూపం జ్యోతిషాం దివి।
నారాయణో నయన్ ధామ్నాం తస్యాధారః స్వయం హృది।।

"దివియందు జ్యోతిషరూపంగా చెప్పబడిన శింశుమార చక్రానికి హృదయాన సకలతేజోనియంత అయిన విష్ణువు ప్రకాశిస్తున్నాడు".

2. బహిరాకాశంలోనే కాక జీవుల దహరాకాశంలో (హృదయంలో) నున్న అంతర్యామి పరమాత్మయే శరీరంలో ప్రత్యణువునా చైతన్యనియామకుడు. హృదయంలో నేమిగా ఉండి క్షతమెరుగని (క్షయమెరుగని) చైతన్యాన్ని దేహాలలో ప్రసరింపజేస్తున్న పరమాత్మ.

ఏకచక్రం వర్తత ఏకనేమి సహస్రాక్షరం ప్రపురోన పశ్చా। (అథర్వవేదం)
తస్యామూ సర్వా నక్షత్రావశే (అథర్వవేదం)
నక్షత్రాణి రూపమశ్వినౌ వ్యాత్తమ్। (యజుర్వేదం)

- అని శ్రుతి నక్షత్రనేమిగా ఉన్న పరమాత్మను పేర్కొన్నది.

ఈ విధంగా నక్షత్రాదులన్నిటినీ నియమించడం చేతనే-

నక్షత్రీ..——— 441

1. నక్షత్రాలకు ఆశ్రయమైనవాడు.

'నేమి' వంటి ఈయననే ఆశ్రయించుకొని అశ్వన్యాది నక్షత్రాలున్నాయి. అలా వాటికి ఆశ్రయస్థానమైన వాడితడు.

క్షేత్రానికి ఆధారమైన ప్రభువు క్షేత్రి. శరీరానికి అధిపతి శరీరి. అలాగే నక్షత్రాదులన్నిటికీ అధిపతి 'నక్షత్రీ'. జ్యోతిర్మండలాలకు అధిపతి శ్రీహరి. శరీరానికి మనస్సు, మనస్సుకి ఆత్మ అధిపతులు. అలా నక్షత్రమయమైన విశ్వానికి ఆత్మ అయిన విష్ణవతడు. ఈ విరాట్పురుషుని దేహంలోనివే సర్వనక్షత్రాలు.

సర్వ నక్షత్రాలను నియమిస్తున్న ఈ సమర్థత కారణంగా-

క్షమః.. 442

1. సహించే సమర్థుడు.

   అనిర్విణ్ణుడై విస్తృతమైన జ్యోతిర్మండలాలను సహిస్తున్నందున ఈ నామం. శరీరంలో సుఖదుఃఖాదులన్నిటినీ సాక్షిగా సహించి చూస్తున్న ఆత్మస్వరూపుడు.

2. భూస్వరూపుడు.

   నక్షత్రాదులగానేకాక పృథివియందు భాసించే చైతన్యరూపుడితడే.

3. క్షమించే సద్గుణం ఈతనిదే.

   "క్షమయాపృథివీసమః" – క్షమలో భూమితో సమానుడని శ్రీరామచన్ద్రుని వాల్మీకి అభివర్ణించాడు. శరణాగతుల అపరాధాలను క్షమించి దయజూపే దయాళువు.

   అభి ద్యాం మహినా భూవమభీమాం పృథివీం మహీమ్ ॥ (ఋగ్వేదం)

   అని క్షమాస్వరూపుని శ్రుతి పేర్కొంది.

   సర్వాన్నీ సహించడమేకాక, సమయమెరిగి సమయించడం చేత-

క్షామః.. 443

1. అన్నీ క్షయమొందినప్పటికీ, తాను మిగులువాడు.

   క్షాయన్తి వినీయన్తేస్మిన్నితి క్షామః. ఎవనియందు సర్వము వినీనమౌతుందో ఆతడు క్షాముడు. నామరూపాత్మకమైన ఈ జగమంతా అవాంతర ప్రళయంలో భగవానునిలో లీనమై తిరిగి ఉద్భవించే వరకు ఉండే కాలం క్షామం. ఆ స్వరూపంగా ఉన్నవాడు క్షామః.

   యతః సూర్య ఉదేత్యస్తం యత్ర సగచ్ఛతి ॥ (అథర్వవేదం)

   సనః పర్వదతి దుర్గాణి విశ్వా క్షామద్ దేవోఽతి దురితాత్యగ్నిః॥

   (అథర్వవేదం)

   అని శ్రుతి పై భావాలను ప్రకటిస్తోంది.

2. విష్ణుపురాణానుసారం –

శిశుమారాకృతి గల తారాగణం క్షయమైనా నాలుగు నక్షత్రాలతో ధ్రువతార ఉంటుంది. ఆ ధ్రువరూప విష్ణు చైతన్యమే క్షామః. అన్నీ నశించినా మిగిలి ఉండేది.

తారకాः శింశుమారస్య నాస్తమేతి చతుష్టయమ్॥
యావన్మాత్రే ప్రదేశేతు మైత్రేయావస్థితో ధ్రువः॥
క్షయమాయాన్తి తావత్తు భూమే రాభూత సంప్లవే॥ (విష్ణు పురాణం)

"అవాంతర ప్రళయకాలంలో ధ్రువుడుండే ప్రదేశం వరకు నశిస్తున్నాయి. నాలుగు నక్షత్రాలు నశించవు". ఈ కాలస్థితిలో ఉన్న శాశ్వతుడు విష్ణువు.

3. వికారాలన్నీ క్షయంకాగా మిగిలిన కేవల చిదాత్మక స్వాత్మతత్త్వంగా మిగిలినవాడు. 'ఇదికాదు – ఇదికాదు' (నేతి నేతి) అని ఇంద్రియ మనోబుద్ధ్యాది వికారాలను తోసివేయగా మిగిలిన శుద్ధ శాశ్వత తత్త్వమీతడు. ప్రళయానంతరం తిరిగి సృష్ట్యాది వ్యాపారాలకు సంకల్పించుకొనేవాడు కూడా ఈతడే కనుక–

సమీహనः.. 444

1. చక్కని కోరిక, చేష్ట కలవాడు.

'ఈహ చేష్టాయాం' అనే ధాతువు ననుసరించి **'సమ్యక్ ఈహతే'** – **సమీహనः.** సృష్ట్యాది కార్యకలాపాలను చక్కగా కోరుకొనువాడు, చేయువాడు, ప్రేరేపించువాడు, (సమీహాయతి – ప్రేషయతి) నియమించువాడు.

'బహుస్యాం ప్రజాయేయ' 'ధాతా యధా పూర్వమకల్పయత్'... వంటి శ్రుతి వాక్యాలు ఈ భావాన్ని తెలియజేస్తున్నాయి.

సర్వభూత హితాన్నీ కోరేవాడు, విశ్వకార్యాలను చేసేవాడు.

సాయంత్రం అస్తమించి, ప్రభాతాన తిరిగి చక్కగా భూత హితం కోరి, ఉదయాది కార్యాలను నిర్వహించు సూర్యుని రూపంలో నారాయణుడు 'సమీహను'నిగా వ్యక్తమౌతున్నాడు.

యతో యతః సమీహతే తతో నో అభయం కురు। (యజుర్వేదం)

యో అస్య నర్వజన్మన ఈశే సర్వస్య చేష్టతః। (అథర్వవేదం)

అని శ్రుతి సర్వభూతహితుడై, చేష్టాదులను నిర్వహించే విష్ణుని వివరించింది. విశ్వహితకారి కనుకనే శుభఫలదాయకుడైన –

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః।
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్॥... 48

445. యజ్ఞః, 446. ఇజ్యః, 447. మహేజ్యః చ, 448. క్రతుః,
449. సత్రం, 450. సతాంగతిః, 451. సర్వదర్శీ, 452. విముక్తాత్మా,
453. సర్వజ్ఞః, 453. జ్ఞానముత్తమమ్.

యజ్ఞః.. 445

1. యజ్ఞ స్వరూపుడు.

యజ్ఞములన్నీ నారాయణ స్వరూపాలు. సర్వదేవతలకు యజ్ఞభాగాలను అందజేయడం ద్వారా సంతృప్తిపరచుతూ యజ్ఞరూపంలో ఉన్నవాడు. **"యజ్ఞోవై విష్ణుః"** – అని తైత్తిరీయ సంహిత. విశ్వమంతా యజ్ఞమయం. విశ్వంలో ప్రతి భాగము యజ్ఞం చేతనే కల్పించబడుతోంది. (కలుగుతుంది – సమర్థమంతమవుతోంది)

చక్షుర్యజ్ఞేన కల్పతామ్। ప్రాణోయజ్ఞేన కల్పతామ్।
...యజ్ఞో యజ్ఞేన కల్పేతామ్॥ (యజుర్వేదం)

అహం క్రతురహం యజ్ఞః॥ (భారతం)

విశ్వాంతర్గతుడై విశ్వాన్ని కలుపుతూ, విడదీస్తూ సంయోగ వియోగలక్షణ, ఆదాన ప్రదాన లక్షణ యజ్ఞతంతువుగా వర్తిల్లజేస్తూన్న విశ్వరూపుడే యజ్ఞమయుడు.

యేన యజ్ఞేన బహవో యన్తి ప్రజానన్తః ॥ (అథర్వవేదం)

యజ్ఞేన యజ్ఞమయజన్త ॥ (ఋగ్వేదం)

– శని శ్రుతి వాక్యాలు విశ్వం యజ్ఞమయమని చెబుతున్నాయి. యజ్ఞంలోని ద్రవ్యాలు, మంత్రాలు, అంగాలు... అన్నీ వేదమయుడైన విష్ణుని రూపాలే.

తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే।

ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మా దజాయత।। (యజుర్వేదం)

విరాట్పురుషుడే యజ్ఞస్వరూపుడని పురుషసూక్తం స్పష్టం చేస్తోంది.

2. అందరిచే ఆరాధింపబడువాడు (ఇజ్యతే), తెలియబడువాడు (సంగమ్యతే). ఆత్మరూపుడై స్వీకరించువాడు (అందరిచే – దాయతే– ఈయబడువాడు). తమను తాము సమర్పించుకొనే విధమే యజ్ఞం. అదే విష్ణుమయం.

3. 'యత్' జ్ఞానము – యజ్ఞం. అదే విష్ణువు.

'యతో'వా ఇమాని భూతాని జాయన్తే

'యేన' జాతాని జీవన్తి, 'యత్' ప్రయన్త్యభిసంవిశన్తి।।

'దేని' నుండి ఈ ప్రాణులు కలుగుతున్నారో, 'దేనివలన' జీవిస్తున్నారో, 'దేని' యందు లీనమవుతున్నారో –

యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్।

స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః।। (గీత)

'ఎవని' వలన అన్నీ [illegible] ఆ పరమాత్మను అర్చించి మానవుడు సిద్ధిని పొందుతున్నాడని పరమాత్మవచనం.

'ఎవడు? ఏది? ఎవరిని? ఎవరిచేత? ఎవరికోసం? ఎవనివలన? ఎవనిది? ఎవనియందు?'... వీటన్నిటికీ (యత్ – శబ్దానికి) సమాధానంగా లభించే పరతత్త్వమే 'తత్'. (అది – అనిర్వచనీయం – బ్రహ్మము). ఈ ప్రశ్నలకు సమాధానంగా తెలియజేసే బ్రహ్మ జ్ఞానమే 'యజ్ఞం'.

ఆ శుద్ధజ్ఞానమే విష్ణువు (యజ్ఞః).

ప్రతివారూ వారి కర్మలతో ఆరాధించేది ఈతనినే కనుక –

ఇజ్యః.. 446

1. పూజింపబడువాడు.

యజ్ఞములందు వివిధ దేవతా రూపాలుగా అర్చింపబడేవాడు. వృష్టిని (వర్షాన్ని) కోరుకొనేవారు ఇన్ద్రుని, ధనకాములు కుబేరుని.. ఇలా వేర్వేరు ప్రయోజనాలకు వేర్వేరు దేవతలను ఆరాధిస్తారు. వారందరూ భగవానుని రూపాలే. బహుదేవతారూపుడై యజ్ఞాలతో ఆరాధింపబడే నారాయణుడు ఇజ్యుడు.

యజ్ఞమునకు గమ్యమైనవాడు, మూలమైనవాడు, స్తుతింపబడువాడు శ్రీహరి.

అర్చత ప్రార్చత ప్రియమేధాసో అర్చత। (అథర్వవేదం)

య ఆత్మదా బలదా యస్య విశ్వ ఉపాసతే ప్రశిషం యస్య దేవాః॥

(యజుర్వేదం)

సర్వ దేవాదులచే చక్కగా ఆరాధింపబడేవాడు విష్ణువే.

అహంకార రహితులై సర్వం విష్ణుమయమని తెలిసి అర్చించే (యజనం చేస్తున్న) వారు సాక్షాత్తు యజ్ఞస్వరూపులే.

యే యజంతి మఖైః పుణ్యైర్దేవాతాదీన్ పితౄనపి।

ఆత్మానమాత్మనానిత్యం విష్ణుమేవ యజన్తి తే ॥ (హరి వంశం)

"ఎవరు నిత్యం పుణ్య (పవిత్ర) కర్మలతో దేవతలను మొదలుకొని పితృదేవతలను కూడా యజిస్తున్నారో వారు సాక్షాత్తు తామే అయిన విష్ణువును తామే ఆరాధిస్తున్నారు" అని చెప్పబడింది.

ఆరాధింపబడే ఈశ్వరునితో తాదాత్మ్యం చెంది అర్చించేవాడు, తానే విష్ణువవుతున్నాడు. ఆవిధంగా ఆరాధిత విష్ణు చైతన్యమే ఆరాధకునిలో గోచరిస్తుంది. క్రమంగా ఆ తాదాత్మ్య స్థితిలో జగతి పట్టదు. బ్రహ్మమే మిగులుతుంది. అదే ఆరాధ్యం కనుక 'ఇజ్యః'.

యే యజన్తి పితౄన్ దేవాన్ బ్రాహ్మణాన్ స హుతాశనాన్।

సర్వభూతాన్తరాత్మానం విష్ణుమేవ యజన్తి తే ॥ (భారతం. శాన్తిపర్వం)

"ఎవరు పితృ - దేవతా - బ్రాహ్మణ - అగ్నులను ఆరాధిస్తున్నారో, వారు సర్వభూతములకు అంతరాత్మయగు విష్ణువునే ఆరాధిస్తున్నారు".

కనుక యజింపబడేవారందరూ విష్ణు స్వరూపులే.

సర్వమయుడైన ఈతనిని మించి పూజ్యులు లేరు కనుకనే -

మహేజ్యుఁ.. 447

1. గొప్పవాడు, పూజింపబడువాడు. గొప్పగా పూజింపబడువాడు.

   పూజింపబడే దేవతలందరిలోను సర్వాధికుడు. పూజ్యులైన బ్రహ్మేంద్రాదులచే పూజింపబడేవాడితడు. మోక్షఫలమనే గొప్పఫలాన్ని ఇచ్చే పరమాత్మ గొప్ప పూజ్యుడు. ఆతడే విష్ణువు.

   దేవయజ్ఞాదులు పంచ మహాయజ్ఞాలు. ఔపసర్గాదులు సప్త పాకయజ్ఞాలు. అగ్ని హోత్రాదులు సప్తహవిర్యజ్ఞాలు. అగ్నిష్టోమాదులు సప్త సోమసంస్థలు. వీటన్నిటి రూపంలో పూజింపబడే యజ్ఞ స్వరూపుడు -

   యజిష్ఠో వహ్నితమఃశోశుచానో విశ్వా ద్వేషాంసి ప్రముముగ్ధ్యస్మత్॥

   (ఋగ్వేదం)

   త్వం దేవానామసి యహ్వాహోతా స ఏనాన్ యక్షీషితో యజీయాన్।

   (యజుర్వేదం)

   - అని శ్రుతి ఆ పరమును ప్రస్తుతించింది.

2. నిష్కాములైన యోగులచే ఆరాధింపబడే (ధ్యానింపబడే) పరమాత్మ.

   యేతు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాఃl
   అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతేll (గీత)

   "సర్వకర్మలను నా యందు సమర్పించి, మత్పరులై అనన్య యోగంతో నన్ను ధ్యానించి ఉపాసిస్తున్న వారిని ముక్తులను చేస్తున్నాను". అని భగవానుని వచనం. ఆ విధంగా ఉపాసింపబడుటచే విష్ణువు మహేజ్యుడు.

   యజ్ఞ స్వరూపుడు కనుక సర్వ యజ్ఞ విశేషాలు ఈయనే -

క్రతుః.. 448

1. క్రతు స్వరూపుడు.

'క్రియతే ఇతి క్రతుః'. చేయబడు కర్మ క్రతువు. ఆ కర్మ స్వరూపుడు కనుక విష్ణువు క్రతునామంతో స్తోతవ్యుడు. అంతేకాక **'క్రియతే యేన జ్ఞానేన ఇతి'** ఏ జ్ఞానంతో చేయబడుతుందో... అది క్రతువు. జ్ఞానరూపుడు. మొత్తంగా 'జ్ఞానపూర్వక కర్మ – క్రతువు' అని గ్రహించవచ్చు.

కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః – శ్వేతాశ్వతరోపనిషత్తు.

కర్మాధ్యక్షుడైన విష్ణువు సంపూర్ణ జ్ఞానంతో విశ్వరూపకర్మగా విస్తరించి 'క్రతుస్వరూపుని'గా పేర్కొనబడుతున్నాడు. అనంతమైన అద్భుత విశ్వ నిర్వహణ కర్మలను జ్ఞానరూపుడై చేయడంచేత 'శతక్రతు' అని కూడా శ్రుతి స్తుతించింది.

త్వం హి నః పితా వసోత్వం మాతా శతక్రతో బభూవిథ।। (అథర్వవేదం)

త్వం భద్రో అసి క్రతుః। (ఋగ్వేదం)

సాహ్వాన్ విశ్వా అభియుజః క్రతుర్దేవానా మమ్మృక్తః।। (ఋగ్వేదం)

2. యూపసహితమైన యజ్ఞానికి క్రతువు – అని వ్యవహారం. ఆ క్రతువు నారాయణుని విభూతియే.

జ్ఞాన, కర్మలేకాక సంకల్పాది ప్రేరణలు కూడా ఆతడే కనుక –

సత్తమ్.. 449

1. 'చోదనా' రూపమైనవాడు.

'సదతి – ఉపైతి చోదనా లక్షణం'

'చేయాలి', 'చేస్తుంటారు' – వంటి 'విధి' వాక్యాలే 'చోదన'లు (ప్రేరణలు). యజ్ఞాది కర్మలన్నీ విధిరూపంగా చెప్పబడినవే. ఈ చోదనా ధర్మస్వరూపాలైన విధులు విష్ణుని విభూతులు.

2. సత్పురుషులను రక్షించువాడు.

'సతాం త్రాయతే ఇతి – సత్ర'. యజ్ఞాది వైదిక ధర్మాలను విష్ణుప్రీతిగా తెలిసి ఆచరించే సత్పురుషులను అతడే రక్షిస్తున్నాడు.

3. అంతట వ్యాపించువాడు, విస్తరింపజేయువాడు.

యజ్ఞ లక్షణంచేత విశ్వమంతట విస్తరించువాడితడు.

'సీదతి గచ్ఛతి సర్వత్ర – సత్రయతే విస్తారయతి విశ్వం ఇతి సత్రమ్' –

(సత్యభాష్యమ్)

అంతట సంచరించి – విశ్వంగా విస్తరింపజేయడంచే విష్ణువే 'సత్రమ్' అని వ్యవహరింపబడుతున్నాడు.

యేన ఋషయస్తపసా సత్రమాయన్ ఇంధాన అగ్నిం స్వరాభరన్తః॥

(యజుర్వేదం)

సత్రస్య ఋద్ధిరస్యగన్మ జ్యోతిషా జ్యోతిరమృతా అభూమ। (యజుర్వేదం).

4. బహుకాలం అనేక యజమానులు కలసి మాసోపవాసాదులతో చేయదగిన యాగాలను 'సత్రయాగా'లంటారు. అటువంటి యజ్ఞముల రూపంలో భాసించువాడు.

ఇలా వివిధ యజ్ఞాది సత్కర్మల నాచరించేవారంతా ఆశ్రయించేది ఈతనినే కనుక –

సతాంగతిః.. 451

1. సజ్జనులకు ఆశ్రయమైనవాడు.

నిర్మలులైన యోగులకు, భక్తులకు, ముముక్షువులకు ఈ పరమాత్మయే గతి (ఆశ్రయం). ఇంతకు మించిన గతిలేదు. (**గతిరన్యో నవిద్యతే**).

నిర్ధూత దోష పంకానాం యతీనాం సంయతాత్మనామ్।

స్థానం తత్ పరమం విప్ర పుణ్యపాప పరిక్షయే॥ (విష్ణు పురాణం)

"దోష పంకిలం తొలగిన ప్రయత్నశీలురైన దృఢ మనస్కులకు (సత్పురుషులకు) పుణ్యపాప కర్మక్షయానంతరం ఆ పరమపదం లభిస్తుంది".

ఆ విధంగా సత్పురుషులు పొందే సద్గతి (పరంధామ) ఆ విష్ణుతత్త్వమే.

2. సృష్టిదశలయందు ప్రవర్తించే పంచభూతాది ప్రకృతి కార్యాలే 'సత్త'లు. వాటికి ఆశ్రయమైనవాడు (గతి) - సతాంగతిః.

పంచభూతాలు విష్ణ్వాశ్రయం చేతనే చైతన్యవంతాలై, గతి శీలమౌతున్నాయి.

ఈ విధంగా విశ్వశక్తులకు ఆశ్రయమై గమనిస్తున్నందున -

సర్వదర్శీ.. 451

1. అన్నిటినీ (అంతటను) దర్శించువాడు.

సర్వప్రాణులు ఆచరించిన కర్మలను, ఫలాలను తన స్వాభావిక జ్ఞానశక్తి చేత దర్శించే శక్తిశాలి ఈ పరమేశ్వరుడే. తామేమి చేసి, ఏమి అనుభవిస్తున్నారో తెలియని ప్రాణుల గతులన్నీ తెలిసిన వాడితడే. అన్ని కాలాలను, అన్ని దేశాలను, అన్ని ప్రాణులను గమనించుకొనే నిత్య బోధ స్వరూపుడు.

విష్ణుః పశ్యత కర్మాణి (విష్ణుసూక్తం)

విశ్వం సం పశ్యన్త్సు విదత్రో యజత్ర ఇదం శ్రుణోతు యదహం బ్రవీమి।
(అథర్వవేదం)

బృహన్నేషామధిష్ఠాతా అన్తికాదివ పశ్యతి। (అథర్వవేదం)

విశ్వమంతా అధిష్ఠించి, అత్యంత సామీప్యంగా చూసేవాడితడని శ్రుతి తెలియజేస్తున్నది. ప్రాణుల ప్రవృత్తి, నివృత్తి రూపధర్మాలను అధ్యక్షుడై చూస్తున్నవాడు.

2. సూర్యాది దర్శన (ప్రకాశ) శక్తులుగా జగతిని పరిపాలిస్తున్నదితడే.

హిరణ్యయేన సవితా రథేన దేవోయాతి భువనా విపశ్యన్। (యజుర్వేదం)

అంతటినీ కనిపెడుతున్నా దేనికీ కట్టుబడని వాడు కనుక-

విముక్తాత్మా.. 452

1. విడువబడిన స్వరూపుడు.

'విముక్త స్థితియే తన స్వరూపంగా కలవాడు'.

అంతటినీ దర్శిస్తున్నా, ప్రకృతిపరమైన నామరూపాదులచే విడువబడినవాడు. ఆకాశం వలె దేనికీ అంటక, జగత్కర్త అయినప్పటికీ ప్రకృతికి కట్టుబడనివాడు. 'సర్వదర్శన' (451) లక్షణం కేవలం సాక్షిగా మాత్రమే.

'విముక్తశ్చ విముచ్యతే' అని కఠోపనిషత్తు.

'తాను విడువబడినవాడై విముక్తుడౌతున్నాడు'. ఆత్మ స్వభావం విముక్తం (దేనికీ కట్టుబడనిది). కేవలం అవిద్యచే కర్మాదులలో బంధితుడిననే భ్రాంతి కలుగుతుంది. ఈ భ్రాంతిని వదిలించుకున్నవాడే తన స్వాభావిక విముక్త స్థితిని తెలుసుకోగలడు. ఆ స్థితిలోని అఖండాత్మ తత్త్వమే నారాయణుడు. అదే విముక్తాత్మ. 'స్వాభావికంగా ముక్తమై ఉన్న ఆత్మయే విష్ణువు' అని తాత్పర్యం.

యుజ్యమానో వైశ్వదేవో యుక్తః ప్రజాపతిర్విముక్తః సర్వమ్ ॥

(అథర్వవేదం)

– అని శ్రుతి స్పష్టం చేసింది.

2. **'నివృత్తాత్మా'** అనే పాఠాంతరం ఉంది. దాని ప్రకారం సర్వజగతిని సాక్షిగా దర్శిస్తూ, వాటి గుణాది బంధనాల నుండి మరలినవాడని – పై భావాన్నే గ్రహించవచ్చు.

ఒకదానికి కట్టుబడని విముక్తుడు కనుకనే సర్వాన్నీ తెలుసుకున్న జ్ఞాన చైతన్యమితడే –

సర్వజ్ఞుఃఃః

యస్మాత్ కోశాత్ ఉద్భరామ వేదం తస్మిన్నన్తరవ దధ్మపనమ్।

(అథర్వవేదం)

తమేవ విదిత్వాతి మృత్యుమేతి నాన్యః పన్థా విద్యతేయనాయ।

(యజుర్వేదం)

ఈ జ్ఞానమే విశ్వనియమాలను నడుపగలిగేది కనుకనే-

సుప్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్।
మనోహరో జితక్రోధో వీరబాహు ర్విదారణఃII... 49

455. సుప్రతః, 456. సుముఖః, 457. సూక్ష్మః, 458. సుఘోషః,
459. సుఖదః, 460, సుహృత్. 461 మనోహరః, 456. జితక్రోధః,
463. వీరబాహుః, 464. విదారణఃII

సుప్రతః.. 455

1. మంచి నియమము (కర్మాచరణము) కలవాడు.
   సమస్త విశ్వమును సువ్యవస్థతో నడిపించే నియమము కలవాడు.
   భగవానుడు నిర్వహించే ప్రతి కర్మమూ శుభము - శోభనము కనుక అవి 'సు-ప్రతములు'.

   విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే। (యజుర్వేదం)
   అగ్నే! వ్రతపతే వ్రతమచారిషమ్ ॥ (యజుర్వేదం)
   త్వం రాజేవ సువ్రతో గిరః సోమా వివేశిథ ॥ (ఋగ్వేదం)

   పూర్తి జ్ఞానముతో, ఐశ్వర్యముతో కూడిన భగవచ్ఛక్తి 'సు' శబ్దం ద్వారా వ్యక్తమౌతోంది. అటువంటి శక్తితో విశ్వ నియమము నడుపువాడు కనుక 'సువ్రతు'డు.

2. ప్రపన్నులను (శరణాగతులను) రక్షించుట అనే ఉత్తమ వ్రతము కలవాడు.
   సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।

అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ।।

"ఒక్కమారు (సుస్థిర చిత్తంతో) 'నేను నీవాడను' అని శరణువేడి యాచించినవానికి సర్వభూతముల నుండి అభయాన్నిస్తున్నాను" అని శ్రీరామచంద్రుని వచనం (రామాయణం – యుద్ధకాండ). ఈ విధంగా భక్త రక్షణ అనే మరో నియమం కలవాడు శ్రీమన్నారాయణుడు.

ఈ మేలైన నియమం చేతనే –

సుముఖః.. 456

1. స్వభావసుందరమైన ముఖము కలవాడు.
   లోకహితాన్ని కలిగించే శోభనమైన ముఖము కలవాడు.

   ప్రసన్నవదనం చారు పద్మపత్రాయతేక్షణమ్।।

   'అందమైన పద్మపత్రాల వంటి కన్నులతో, ప్రసన్నమైన ముఖం కలవాడు' అని విష్ణుపురాణ వచనం.

   'చిరునవ్వు ముంగురులు మరి కన్నులతేటో
   వరత్యాగరాజనుత! వందనీయ ఇటువంటి సొగసు చూడ'
   'కళకళమను ముఖకళ గని సొక్కుచు
   పలుకుల నమృతము నొలికే సామిని'

   – అని త్యాగయ్య కీర్తనలు 'సుముఖ' లక్షణాన్ని వర్ణించాయి.

   'కుటిల కుంతలం శ్రీముఖం చ తే
   జలరుహాననం చారు దర్శయ' (భాగవతం –గోపికాగీతలు)
   "నల్లనివాడు పద్మనయనమ్ములవాడు కృపారసముపై జల్లెడువాడు,
   మౌళి పరిసర్పిత పింఛమువాడు, నవ్వురాజిల్లెడు మోమువాడు..."

   అని భాగవతం శ్రీ కృష్ణుని సుముఖ శోభను వర్ణించింది.
2. **'ఖను అవదారణే'** అనే ధాత్వర్థాన్ని అనుసరించి, లోతైన చీలిక (త్రవ్వబడినది) కలది అనే అర్థంలో 'ముఖ' శబ్దాన్ని గ్రహించవచ్చు. పెదవుల నడుమ

గహ్వరము వలె ఏర్పాటైనది ముఖము. ఇది అన్నిటినీ తనలోనికి గ్రహించగలిగేది.

భగవానుని ముఖం అగ్ని. "అగ్ని ర్ముఖం..." ఈ అగ్ని ముఖము ద్వారా హవ్య కవ్యాలను స్వీకరించి దేవతలకు, పితృదేవతలకు, తద్వారా లోకాలకు హితమును (సు – శోభనం, హితం) కలిగించువాడు కనుక అగ్నిముఖుడైన హరి 'సుముఖుడు'.

అగ్నిం యశ్చక్ర ఆస్యం తస్మై జ్యేష్ఠాయ... (అథర్వవేదం)

త్వం హి విశ్వతోముఖ విశ్వతః పరిభూరసి (ఋగ్వేదం)

యస్య బ్రహ్మ ముఖమాహుర్జిహ్వాం మధుకశామృత।। (అథర్వవేదం)

3. ఎటువంటి వికారములేని, ఎల్లవేళలా శోభతో ప్రకాశించే ప్రజ్ఞాసుందరమైన ముఖం కలవాడు.

కైకేయి శ్రీరాముని అరణ్యవాసానికై వెళ్లమని పితృవాక్యంగా ఆదేశించినప్పుడు కూడా, స్వామి ముఖంలో మార్పురాలేదు. మునుపటి ప్రసన్నత చెక్కు చెదరలేదు. **'దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః। వీతరాగ భయ క్రోధః స్థితధీర్మునిరుచ్యతే।।'** – అనే గీత వచనానుసారం, 'దుఃఖాలలో ఉద్విగ్నత లేకుండా, సుఖాలలో ఉబ్బిపోకుండా, రాగభయ క్రోధాలు లేని స్థిత ప్రజ్ఞత్వా'న్ని కలిగిన రాముని వదన సౌందర్యాన్ని వాల్మీకి వర్ణించారు.

'ఇతీవతస్యాం పరుషం వదన్యాం

న చైవ రామః ప్రవివేశ శోకమ్'

"శ్రుత్వా న విव్యధే రామః కైకేయీ చేదమబ్రవీత్'

"ఆమె (కైకేయి) ఈ విధంగా పరుష వాక్యాలు పలికినప్పటికీ రామునకు ఏమాత్రం దుఃఖం కలుగలేదు". "అప్రియమైన ఆమె మాటలు విన్నప్పటికీ రాముడు ఏమాత్రమూ వ్యధ చెందక భాషించాడు".

– అని రామాయణ వాక్యాలు.

4. లోక హితకరమైన వేదాది సర్వ విద్యలను ఉపదేశించినవాడు కనుక 'సుముఖుడు'.

సర్వదా అందరికీ హితకరుడై, ప్రసన్నుడై అనుకూలంగా ఉండువాడు. ఈ సువ్రత, సుముఖ లక్షణాలతో జగన్నియమాన్ని సర్వవ్యాపకుడై నిర్వహించుట చేత-

సూక్ష్మః.. 457

1. సర్వవ్యాపకుడై, స్థూలమునకు అగోచరుడైనవాడు.
పంచభూతాలలో భూమి స్థూలమైనది. దాని కంటె జలము సూక్ష్మం. దాని కంటె అగ్ని, దాని కన్న వాయువు... ఇలా క్రమ క్రమ సూక్ష్ములై, సర్వ వ్యాపకమైన ఆకాశం సర్వ భూతములలోను సూక్ష్మమై ఉన్నది. ఆ ఆకాశము కంటె సూక్ష్మమైనది ఆత్మ. అదియే నారాయణుడు.

'అశబ్ద మస్పర్శమ్' - 'సర్వగతం సుసూక్ష్మమ్' (ముండకోపనిషత్తు) - వంటి శ్రుతి వాక్యాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

2. ఆత్మను తెలియజేయు చైతన్యమే సూక్ష్ముడు.

సూచయతి జ్ఞాపయతి ఆత్మానమితి సూక్ష్మః *(సత్యభాష్యమ్)*

మన ఇంద్రియాదులు, విశ్వము.... ఇవన్నీ తమలోనున్న ఆత్మను సూచించుతూ, చైతన్యాన్ని వ్యక్తపరుస్తున్నాయి. వీటి ద్వారా వీటికి మూలమైన ఆత్మ చైతన్యాన్ని గ్రహించగలం. ఇలా తనను తెలియజేసే చైతన్య స్వరూపుడై, వ్యక్తమైన ఆత్మ కనుక నారాయణుడు. విద్యుత్పరికరాల కార్యాన్ని బట్టి, కారణమైన విద్యుత్తును గ్రహించినట్లుగా, ఇంద్రియాల, ప్రకృతి పదార్థాల నిర్వహణ ద్వారా వాటికి కారకమైన ఈశ్వర చైతన్యాన్ని తెలుసుకోగలుగుతాం. అలా తెలియజేసే చైతన్య స్వరూపుడు సూక్ష్ముడు.

దేవస్య పశ్య కావ్యం నమమార న జీర్యతే॥ *(అథర్వవేదం)*

భగవంతుని కావ్యాన్ని (జగతిని) పరిశీలించితే, శాశ్వతమైన ఆయన తత్త్వం అవగతమౌతుందని వేదవాక్కు.

సూక్ష్మ లక్షణం చేతనే పంచభూతాలలో సూక్ష్మమైన ఆకాశానికి శబ్దగుణకంగా హేతువై -

1. శుభకరమైన వేదమే తన ధ్వనిగా కలవాడు.
   వేదం భగవానుని శబ్దరూపం. అది లోక శుభకరము కనుక 'సు'. అటువంటి హితకరవేద రూప ధ్వని కల హరి.
2. మేఘు, నదీప్రవాహ, వాయు తరంగాదుల ద్వారా చక్కని ధ్వనిని వ్యాపింపజేయువాడు. ఈ ధ్వనుల ద్వారా తనను తెలియజేయువాడు. గర్జన ద్వారా మేఘము, గల గల సవ్వడి ద్వారా జలము... ఇలా ఒక్కొక్క ధ్వని దానికి కారణమైన దానిని జ్ఞప్తికి తెస్తుంది. అలాగే వేదములు పరమాత్మను తెలియజేస్తున్నాయి. అందుకే అవి సుఘోషములయ్యాయి. వాటిని కలవాడు సుఘోషుడు.

   'వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః। (గీత)
   'ఆఘోష యన్తః పృథివీ ముపద్బిభిః'।।
   'శాసురాగాదితి ఘోష ఆసీత్'।।
   'ఏతద్వచో జరితర్మాపి మృష్టా ఆయత్తే ఘోషానుత్తరా యుగాతి।।'
   "నరో యత్ర దుహతేకామ్యం మధ్వాఘోషయన్తో అభితో మిథస్తురః।।"
   - వంటి ఋగ్వేద వాక్యాలు 'సుఘోష' నామాన్ని స్పష్టపరుస్తున్నాయి.
3. గొప్ప ధ్వని ఓంకారం. అదే పరమాత్ముని స్వరూపం.
   'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ'
   'త్రిధాబద్ధో వృషభో రో రవీతి' - అని అకార ఉకార మకారాత్మక ప్రణవ ఘోషయే ఈశ్వర రూపంగా ఋగ్వేదం తెలియజేస్తోంది.

   'సుప్రతాది' మేలిమి లక్షణాలతో, వేదాలతో స్వామి సర్వజగతికీ సుఖములనిచ్చువాడు కనుక -

సుఖదః.. 459

1. సుఖమునిచ్చువాడు.
2. సుఖమును పోగొట్టువాడు.

సుఖం దదాతి – సుఖం ద్యతి (ఖండయతి) – అని రెండు అర్థాలలో ఈ నామాన్ని గ్రహించవచ్చు. ధర్మ మార్గులైన సత్పురుషులకు సుఖము నిచ్చువాడు, అసత్పురుషుల సుఖములను తొలగించువాడు. రక్షారూపుడు, శిక్షారూపుడు. వేదముల ద్వారా (సుహోషుడై) తెలియజేసిన ధర్మములను అనుసరించువారికి సుఖదాత. వాటికి బాహ్యులైనవారికి సుఖహర్త. అయితే రక్షయైనా, శిక్షయైనా జగద్ధితం కోసమే కనుక –

సుహృత్.. 460

1. మంచి హృదయము కలవాడు (స్నేహితుడు).

ప్రత్యుపకారము కోరని ఉపకారి. నారాయణుడు విశ్వవ్యాపకుడై అందరి హితాన్ని కోరి విశ్వ నిర్వహణను చేస్తున్నాడు. తద్వారా ఆయనకు ప్రయోజనమేమీ లేదు. విశ్వ క్షేమానికై స్నేహితుని వలె విశ్వ కార్యాలను నడుపుతున్నాడు.

కారుణ్యాది దివ్యత్వాలతో కూడిన హృదయము కలవాడు 'సుహృత్తు'.

"<u>సుహృదం</u> సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి"

"సర్వ భూతములకు స్నేహితునిగా నన్ను తెలుసుకొనువాడు శాంతిని పొందగలడు" అని భగవద్వచనం (గీత).

ఈ సుహృల్లక్షణం చేతనే అందరికీ అతడు –

1. అందరి మనస్సులను హరించు (తనవైపునకు త్రిప్పుకొను)వాడు. నిరతిశయమైన (తనకంటె గొప్పదిలేని) ఆనందమే తన స్వరూపంగా కలవాడు కనుక అందరికీ మనోహరుడు. అందరి మనసులను ఆకర్షించేది ఆనందమే. ఆ సచ్చిదానందమే ఈశ్వర స్వరూపం. మధుర పదార్థం మాధుర్యాన్నే ఇస్తుంది. ఆనంద స్వరూపుడైన పరమాత్మ ఆనంద దాయకుడు (సుఖదః). అందుకే అతడు మనోహరుడు.

   'యో వై భూమా తత్ సుఖం –

   నాల్పే సుఖమస్తి' (ఛాందోగ్యం)

   'ఏది అన్నిటికంటె' మహోన్నతమై, పరిపూర్ణమైనదో అదే సుఖం. దానికంటె తక్కువ వాటియందు సుఖము లేదు'. ఆ పరిపూర్ణతయే నారాయణ తత్త్వం.

2. ఇతరముల వైపు వెళ్లు మనస్సును తనవైపు ఆకర్షించువాడు.

   ఈ జగతిలోని విచిత్ర సృష్టి విశిష్టతలను చూస్తూ 'ఎవరిచేత ఇది నడుపబడుతున్నదనే' ప్రశ్న ద్వారా – సృష్టి కారకమైన తన మహా చైతన్యాన్ని స్ఫురింపజేసి, తనయందు మనసునుంచేలా సాధకులను అనుగ్రహించు వాడు.

   విచిత్రంగా వివిధంగా సృష్టిని తన శక్తితో నిర్వహిస్తూ, దానియందు జీవుల మనస్సును రమించునట్లు చేయువాడు కూడా ఆతడే.

   'తద్ వ ఆవర్తయామసి మయి వో రమతాం మనః' (అథర్వవేదం)

   'యుఞ్జతే మన ఉతయోవిప్రా' ... (యజుర్వేదం)

   – ఇటువంటి శ్రుతి వాక్యాలు మనోహరుని వైభవాన్ని వివరించాయి. ఆనంద స్వరూపము చేతనే, క్రోధాది వికారాలు లేనివాడై –

జితక్రోధః.. 462

1. క్రోధమును జయించినవాడు.

మనోహరుడు, సుహృత్తు అయిన స్వామి మరి దనుజులను దునుముటకు క్రోధాన్ని ప్రదర్శించలేదా? అనే ప్రశ్నకు 'అది క్రోధముకాదు' అని సమాధానం. ధర్మ మర్యాదారక్షణకై, రాక్షస సంహారం. అంతేకానీ అది క్రోధ ప్రకటనం కాదు.

తనకు ప్రతికూలమైన దానిపట్ల కలిగే చిత్త వికారము క్రోధం. సర్వేశ్వరునికి అన్నీ వశమునందున్నవే. ప్రతికూలమేదీ లేదు. కనుక అతడు స్వభావతః క్రోధరహితుడు.

అహేడమానో వరుణేహ భోధ్యురుశగ్ంస మా న ఆయుః ప్రమోషీ: ॥

(యజుర్వేదం)

నూనః క్రుధః పశుపతే నమస్తే ॥ *(అథర్వవేదం)*

– అని శ్రుతి వాక్యాలు జితక్రోధుని కీర్తించాయి.

అయితే లోకరక్షకుడు తన పరాక్రమాన్ని ప్రదర్శించువాడు కనుక–

వీరబాహుః.. 463

1. గొప్ప చేతులు కలవాడు.

వీర – విక్రాంత్యర్థకాత్. విక్రమించు లక్షణమే వీరత్వము. దానిని ప్రదర్శించేవి బాహువులు. శత్రువులపై విక్రమించి ఓడించే బలమైన బాహువులు కలవాడు.

2. వ్యాపక ధర్మం కలవి బాహువులు. కర్మను తెలియజేయునవి. అందుకే వీటికి 'కరముల'ని కూడా పేరు. విశ్వమంతా వ్యాపించి విశ్వక్రియను పరాక్రమంగా నిర్వర్తించువాడు.

'బాహుర్మే బలమస్తు' 'బహు బాహ్వోర్బలమ్' వంటి శ్రుతివాక్యాలు బాహువులను బలస్థానములుగా వర్ణించాయి. విక్రమ లక్షణం కలిగిన బలము కల వీరబాహువు విష్ణువు. వీటితో ప్రతి వస్తువును వాటి వాటి

గుణములతో నియమించి నడుపుతున్నవాడు.

నవ్యాంగం పురా చన జజ్ఞే వీరతస్తవ।।

... బాహుశధ్యుగ్రధన్వా ప్రతిహితాభిరస్తా।।

సం బాహుభ్యాం ధమతి...।।

– వంటి ఋక్ శ్రుతి వాక్యాలు వీరబాహుత్వానికి ద్యోతకాలు. తన పరాక్రమ బాహువులతో శత్రువులను శిక్షించువాడై –

విదారణః.. 464

1. చీల్చువాడు.

అధార్మికులను చీల్చి సంహరించువాడు.

లోక రక్షణార్థం తన వీరబాహువులతో ధర్మఘాతకులను శిక్షించువాడు.

ధర్మ ప్రతిష్ఠాపనయే నారాయణుని 'సువ్రతము'. సుముఖుడై సూక్ష్మ ధర్మ వేత్తయై (సూక్ష్మః), తాను వేద ధ్వనిగా చాటిన ధర్మము (సుఘోషః) ద్వారా, లోకమునకు సుఖం కలిగించే జగద్ధిత కర్త (సుఖదః, సుహృత్), మనోహర మైన స్వరూపంతో, క్రోధాది రహితుడైనా (మనోహరః, జితక్రోధః), తన సువ్రతానికై పరాక్రమయుక్తమైన బాహువులతో (వీరబాహుః), శత్రువులను దునుమాడుతున్నాడు (విదారణః).

– 455వ నామం నుండి 464 వ నామం వరకు చక్కని క్రమముతో కూడిన నామాల కూర్పు ఇది.

దీనిని రామ పరంగా అన్వయిస్తే – 'భక్తరక్షణ' అనే వ్రతం కలిగిన (సువ్రతః) రాముడు, విభీషణుని పట్ల సుముఖుడై కరుణించాడు. సుగ్రీవాదులకు కూడా అవగతం కాని ఈ ధర్మం అత్యంత సూక్ష్మమైనది. భక్త వాత్సల్యమనే సూక్ష్మ ధర్మాన్ని నిర్వర్తించిన (సూక్ష్మః) రాఘవుడు **'అభయం సర్వభూతేభ్యః'** అని అభయధ్వనిని చాటి 'సుఘోషః' అయ్యాడు. అలా మనోహరుడు శత్రు సోదరునికి అభయమిచ్చి తన 'జితక్రోధత్వాన్ని

చాటాడు. ఈ అభయ ప్రదానంతో సుఖదుడై, విభీషణాది భక్తులకు 'సుహృత్తు'గా సాక్షాత్కరించి రావణాదులకు వీరబాహువులతో విదారణుడయ్యాడు.

... ఈ క్రమం కూడా ఈ నామాల కూర్పులో కనిపిస్తుంది. (శ్రీ పరాశరభట్టు 455 నుండి 474 వరకు గల నామాలకు కూడా క్షీర సాగరమథన గాథను భావించారు).

2. సృష్టి నిర్వహణను 'చీల్చుట' అనే క్రియ ద్వారా నిర్వహించువాడు. విశ్వం స్త్రీ పురుష రూపంగా రెండుగా విభజింపబడింది. కాలం పగలుగా, రాత్రిగా రెండయ్యింది. సంవత్సరం రెండు అయనాలుగా చీలినది. ఇలా విభజించి తన శక్తిని వ్యాప్తం చేసిన విదారణుడు.

నవయో నవతిం పురో బిభేద బాహ్వోజసా॥
విభక్తారం హవామహే వసోశ్చిత్రస్య రాధసః॥

– అనే ఋగ్వేద వాక్యాలు ఈ భావాన్ని చెబుతున్నాయి.

దుష్టులను సహరించే విదారణుడు, తనను తాను మరుగుపరచుకొని తాను దుష్టులకు కానరాకుండా మాయను పరచుతాడు కనుక –

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైక కర్మకృత్।
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః॥ ... 50

465. స్వాపనః, 466. స్వవశః, 467. వ్యాపీ, 468. నైకాత్మా,
469. నైక కర్మకృత్, 470. వత్సరః, 471. వత్సలః, 472. వత్సీ,
473. రత్నగర్భః, 474. ధనేశ్వరః.

స్వాపనః.. 465

1. నిద్రపుచ్చువాడు.

   తన మాయాశక్తి చేత ప్రాణులను ఆత్మజ్ఞానము లేనివారిగా నిదుర పుచ్చువాడు. 'దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా' – జగతిని ప్రవర్తింపజేసేందుకై, తన ప్రబలమాయా శక్తిని జీవుల యందు ఆవరింపజేయువాడు.

2. ప్రళయరూపంలో సృష్టిని కర్మ నుండి నివర్తింపజేసి నిద్రపుచ్చువాడు. నిత్యం రాత్ర్యాది రూపములలో జీవులను నిద్రపుచ్చే చైతన్యమితడే. ఈశ్వర్య చైతన్యం చేతనే మెలకువ, నిదుర కలుగుతున్నాయి. నిదురలో సేద తీరిన జగతి, తరువాత కర్మ నిర్వహణకు సన్నద్ధమౌతుంది. ఇలా నిద్రారూప చైతన్యంగా సర్వుల యందు వ్యాపించినవాడు స్వాపనుడు.

   తనయందు యోగనిద్రను, జీవులయందు మోహనిద్రను ప్రవర్తింపజేయువాడు ఇతడే.

   నిష్వాపయా మిథూదృశా సస్తామ బుధ్యమానే॥ *(ఋగ్వేదం)*
   తేనా సహస్యేనా వయం నిజనాన్ స్వాపయామసి॥ *(ఋగ్వేదం)*
   స్వప్న స్వప్నాభికరణేన సర్వం ని ష్వాపయా జనమ్॥ *(అథర్వవేదం)*

   – ఈ శ్రుతి వాక్యాలు నిద్రపుచ్చే ఈశ్వర చైతన్యాన్ని ప్రస్తుతించాయి.

   "యా దేవీ సర్వభూతేషు 'నిద్రా' రూపేణ సంస్థితా" – అని 'దేవీమాహాత్మ్యం'

(మార్కండేయ పురాణం) ఈశ్వరశక్తిని నిద్రారూపంగా కీర్తించింది.
నిద్ర, మెలకువలతో జగతిని తన అధీనమందుంచుకొని నిర్వహిస్తున్నందున-

స్వవశః.. 466

1. తన అధీనమున తానుండువాడు స్వతంత్రుడు.

సర్వజగతి సృష్టి స్థితి లయలను నిర్వహించుట చేత అంతటినీ తన అధీనంలో ఉంచుకొని, తాను దేనికీ అధీనుడు కానివాడు.

బాహ్య ప్రకృతి పదార్థముల అవసరం లేని ఆప్తకాముడు, ఆత్మారాముడు విష్ణువు స్వవశుడు. శక్తి కలవానికి మరియొకదాని ప్రాపు అవసరం లేదు. సర్వశక్తిమంతుడైన భగవానుడు ఇతరములకు లోబడకుండా, జగతిలోని సర్వమును తన లొంగుబాటులో ఉంచుకొను స్వతంత్రుడు.

అహోరాత్రాణి విదధత్ విశ్వస్య మిషతో వశీ ॥
అథేదం విశ్వం పవమాన తే వశే త్వమింద్రో ప్రథమో ధామధా అసి॥
(ఋగ్వేదం)

విశ్వాన్ని నియంత్రించే ఈ స్వతంత్రుడు, ఆ విశ్వనియంతగా ప్రత్యణువున భాసించడం చేత-

వ్యాపీ.. 467

1. వ్యాపించినవాడు.

కారణ స్వరూపముగా సర్వకార్యములందు వ్యాపించిన వాడు. **'ఆకాశ వత్సర్వగతశ్చ నిత్యః'** - ఆకాశము వలె ప్రతిదానియందు వ్యాపించువాడు.

తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః॥ (యజుర్వేదం)
స ఓతః ప్రోతశ్చ విభుః ప్రజాసు॥ (యజుర్వేదం)

- అని శ్రుతివాక్యాలు పరమేశ్వరుని సర్వవ్యాపకత్వాన్ని పేర్కొన్నాయి.

సర్వవ్యాపకుడైన అతడు, ఒక్క తీరుగా కాక, అనేకవిధాలుగా వ్యక్తమవుతున్న కారణంగా -

నైకాత్మా.. 468

1. అనేక స్వరూపములతో ఉండువాడు.

విశ్వ సృష్టి స్థితి లయాదులలో ఆవిర్భవించిన తన నిమిత్త శక్తులతో (తాను నిమిత్తము కాగా ఏర్పడే శక్తులతో), విభూతులతో అనేక విధములుగా ఉండువాడు.

వ్యాపకత్వము చేత బహురూపమైనవాడు.

తదే వాగ్ని స్తదాదిత్యస్తద్ వాయుస్తదు చన్ద్రమాः ॥ (యజుర్వేదం)

ఆదిత్యాగ్ని వాయు చన్ద్రాదులన్నీ భగవానుడు ప్రకటించిన రూపాలే. **'రూపం రూపం బహురూపో బభూవ'** - అనే శ్రుతి వాక్యం.

ఇలా బహు రూపాలు ధరించడమేకాక -

నైక కర్మకృత్.. 469

1. ఒకటికాని కర్మలను (అనేకములను) ఆచరించువాడు.

జగత్తుల ఉత్పత్తి, సంపత్తి, స్థితి (ఉనికి), పోషణ, విపత్తి, నాశనము మొదలైన బహు కర్మల నాచరించువాడు.

విష్ణోः కర్మాణి పశ్యత యతోవ్రతాని పస్పశే। (యజుర్వేదం)

యుజా కర్మాణి జనయన్ విశ్వాజా అశాస్తిహో విశ్వమనాస్తు రాషాట్।

(ఋగ్వేదం)

విశ్వనియమములను ప్రవర్తింపజేసే బహు కర్మలతో నడుపు వానియందే సర్వమూ ఉన్న కారణంగా అతడే - 'వత్సరः' (470).

✦ ✦ ✦

455వ నామం (సువ్రతः) నుండి ఈ 469వ నామం వరకు నారాయణుని క్షీరసాగరమథన సమయలీలను భావించారు శ్రీపరాశరభట్టరు.

అమృతమథనమనే మరో నియమముతో (సువ్రతः), దేవతల కనుకూలుడై (సుముఖः), తన ఆంతర్యాన్ని దనుజులకు తెలియనీయనివాడై (సూక్ష్మः),

సాగరమథన వేళలో మంచి ఘోషము కలవాడై (సుఘోషః), దేవతలకు సుఖకరుడై, దానవులకు శిక్షకుడై (సుఖదః), రెండు కార్యముల చేత మిత్రుడై (సుహృత్), ముల్లోకములను మోహింపజేసే మోహినీ రూపము ధరించి (మనోహరః), ఆ రూపం ద్వారా దానవులకు దేవతలపైనున్న క్రోధాన్ని పోగొట్టి (జితక్రోధః), తన బాహువులతో అమృతాన్ని పంచి, జరిగిన దానిని గ్రహించి దానవులను జయించి (వీరబాహుః), రాహువు మొదలైనవారిని చీల్చి సంహరించిన (విదారణః) వాడు. తన మాయతో దానవుల కన్నుగప్పి (స్వాపనః), స్వేచ్ఛగా విహరించి (స్వవశః), వాసుకి మందర పర్వతాదుల శక్తి తగ్గినప్పుడు తన శక్తితో వారియందు వ్యాపించి (వ్యాపీ), కూర్మమై ధన్వంతరియై మోహినియై పలురూపాలతో (నైకాత్మా), గిరిని మోయుట, అమృతమును పంచుట, దనుజులను దునుమాడుట వంటి పలు పనులను చేసినవాడు (నైక కర్మకృత్).

✦ ✦ ✦

వత్సరః.. 470

1. అన్నిటినీ తనయందు వసింప జేసి, తాను అన్నిటియందు వసించువాడు. **'వస నివాసే'** – అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **'వసతీతి వత్సరః'**. నివసించువాడు, నివసింపజేయువాడు. ఈ సమస్త విశ్వము ఎవనియందు ఉన్నదో, సర్వజగతి యందు చైతన్యమై ఎవడు ఉన్నాడో ఆతడు వత్సరః. విశ్వపు వసతికి ఆధారమైనవాడు.

సంవత్సరోసి పరివత్సరోసీదావావత్సరోసీద్వత్సరోసి॥ *(యజుర్వేదం)*

– అని కాలస్వరూపుడైన నారాయణుని శ్రుతి కీర్తించింది. కాలమునందే సర్వము, సర్వమునందు కాలము వ్యాపించినవి. కాలరూప చైతన్యమైన విష్ణువు వత్సరుడు.

అన్నిటికీ ఆధారమై ఉండి, తన ప్రేమను (కారుణ్యాన్ని) చాటుతున్నందున–

వత్సలః.. 471

1. స్నేహము కలవాడు.

ఏకాగ్ర బుద్ధితో తనను ధ్యానించు భక్తులపై స్నేహ భావము కలవాడు. దుఃఖపడుతున్న పసివానిని చూసి తల్లికి కలిగే కారుణ్య భావం వలె, భగవానునకు భక్తుల పట్ల కలిగే అనుగ్రహమే వాత్సల్యం. సర్వ సముడైనప్పటికీ తనని ఆశ్రయించిన అనన్య భక్తులను కరుణించే దయాళువు. ఈ వాత్సల్య భావంతోనే విశ్వమంతా జీవులను సంపోషిస్తున్నాడు.

వాశ్రేవ విద్యున్ మిమతి వత్సం న మాతా సిషక్తి ॥ *(ఋగ్వేదం)*

అన్యో అన్యమభిహర్యత వత్సం జాత మివాఘ్న్యా॥ (అథర్వవేదం)

భగవానుని వాత్సల్యాన్ని శ్రుతులు వక్కాణిస్తున్నాయి.

"విదితస్సహి ధర్మజ్ఞః శరణాగత వత్సలః" – అని రామాయణ వాక్యం. ఆయన వాత్సల్య భాగ్యానికి నోచుకున్న సర్వ ప్రాణులకు ఆధారమైన వాడు కనుక –

వత్సీ.. 472

1. ఆశ్రితులైన ప్రాణులను కలవాడు.

వత్సాః అస్యాస్తీతి వత్సీ. స్తన్యపానము చేయు దూడలు వత్సలు. విశ్వవ్యాపక ఈశ్వర శక్తిచే పోషించబడుతున్న ప్రాణులు, భగవత్ప్రేమ పాత్రులు వత్సలు. అటువంటి వత్సలన్నిటికీ ఆధారమైనవాడు 'వత్సీ' (వత్సలు కలవాడు).

జగత్పిత అయిన పరమాత్మునికి జీవులందరూ శిశుస్థానీయులే.

శ్రుణ్వన్తు విశ్వే అమృతస్య పుత్రాయే ధామాని దివ్యాని తస్థుః ॥

(ఋగ్వేదం)

పరంధామస్థితుడైన అమృత స్వరూపుని పుత్రులే జీవులు. అనగా – ఆనంద స్వరూపుడైన ఆ సర్వేశ్వరుని చేత పోషింపబడుతున్నవారు.

2. శ్రీకృష్ణావతారంలో దూడలను ఏలినవాడు. **వత్సానాం పాలనాత్ వత్సీ.** 'దూడలనావులగాచి దొరయైనవాడు' - అని అన్నమయ్య మాట. వత్సల వలె తనను ఆశ్రయించిన వారికి వలసిన ఐశ్వర్యములన్నీ తనలో కలవాడు కనుక-

రత్నగర్భః.. 473

1. ఆనంద సాధనములను తనలో కలవాడు.
   రమయతీతి - రత్నం. రంజింప (ఆనందింప) జేయునది రత్నం. సుఖ సాధనములైన విశ్వశక్తులను సృజించి నియమించి తనలో దాల్చిన విశ్వగర్భుడే రత్నగర్భుడు.
   అంతేకాక - 'ఆనందసాధనములందు అంతర్యామియైన ఆనంద స్వరూపుడు' - అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు.
2. రమణీయమైన వస్తువులన్నిటికీ తానే ఆధారభూతుడు. లోక ప్రసిద్ధిగా ఖనిజాదులు రత్నములు. వీటిని దాల్చిన భూమి, సముద్రము మొదలైనవి భగవద్విభూతులు. శ్రేష్ఠములైన ఐశ్వర్యములను తనలో దాల్చిన సముద్రాది రూపములతో భాసించేది విష్ణువే.
   హోతారం రత్నధాతమమ్॥ (ఋగ్వేదం)
   హిరణ్యగర్భః సమవర్తతాగ్రే - ॥ (యజుర్వేదం)
   దధత్ రత్నా దాశుషే వీర్యాణి ॥ (యజుర్వేదం)
   ఇలా శ్రుతి వాక్యాలు పరమాత్ముని రత్న నిలయునిగా వినుతించాయి. సర్వైశ్వర్యమయుడు గనుకనే -

ధనేశ్వరః.. 474

1. ధనములకు ప్రభువైనవాడు.

సంపదలపై భగవానునిదే ఈశ్వరత్వం. సంపదలయందు వ్యాపించినవాడు, సంపదలను మనకు కలిగించువాడు లక్ష్మీపతి. **అశ్నుతే వ్యాప్నోతి సంహన్తివా ఈశ్వరః** – వ్యాపించువాడు, ఒకదానిని మరొకదానితో సంఘటింపజేయు వాడు ఈశ్వరుడు. ఇలా ధనములయందు తాను వ్యాపించుట చేతనే అవి జీవులను కృతకృత్యులను చేస్తున్నాయి. ఎవరికి

ఏది ఎంత ఎలా ఉచితమో తెలిసి అందించే అధికారి కూడా ఆయనే.

అహం భువం వసునః పూర్వ స్పతిరహం ధనాని సంజయామి శాశ్వతః॥
త్వం హి రాధస్పతే రాధ సో మహః క్షయస్యాసి విధతః॥ (ఋగ్వేదం)

... శ్రుతి వాక్యాలు పైవిధంగా భగవానుని ధనపతిగా ప్రస్తుతించాయి.

2. సూర్యచంద్రాగ్ని భూమ్యాదులన్నీ ధనములే. వాటికి పతియైనవాడు విష్ణువు.

(ధనమగ్ని ర్ధనం వాయు ర్ధనం సూర్యో ధనం వసుః... శ్రుతి)

ఈ ధనములను ధర్మానుగుణంగా జీవులకు అందజేసే పాలకుడు కనుకనే–

ధర్మగుద్ధర్మకృద్ధర్మీ సదసత్ క్షరమక్షరమ్।
అవిజ్ఞాతా సహస్రాంశు ర్విధాతా కృతలక్షణఃII.. .51

475. ధర్మగుప్, 476. ధర్మకృత్, 477. ధర్మీ, 478. సత్,
479. అసత్, 480. క్షరమ్, 481. అక్షరమ్, 482. అవిజ్ఞాతా,
483. సహస్రాంశుః, 484. విధాతా, 485. కృతలక్షణః.

ధర్మగుప్.. 475

1. ధర్మమును రక్షించువాడు.

ధర్మం గోపయతీతి రక్షతీతి ధర్మగుప్.

ఒక పనిచేసేవాడు ఆ పని పూర్తయ్యేవరకు ఆ కార్యాంగాలన్నిటినీ

కాపాడుకుంటూ పనిని పదిలం చేసుకుంటాడు. అలాగే సృష్టి మొదలుకొని లయం వరకు సర్వ విశ్వమును నియమబద్ధంగా నడిపిస్తున్నందున ధర్మగోప్త ఆతడు.

ధారణాద్ధర్మ మిత్యాహుః... విశ్వంలోని ప్రతిదానిని పట్టి నడిపే శాశ్వత నియమాలు ధర్మములు. వాటిని కాపాడువాడు విష్ణువు. వేదాది శాస్త్రముల ద్వారా వ్యక్తుల ధర్మములను నియమించి, ఆ ధర్మములను, గతి తప్పినప్పుడు తానే అవతరించి రక్షించేవాడు కనుక ధర్మరక్షకుడు.

'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని స్వయంగా గీతాశాస్త్రం ద్వారా చాటినవాడు.

విష్ణుర్గో పా అదాభ్యః॥
తతో ధర్మాణి ధారయన్ ॥ (యజుర్వేదం)
త్వం విశ్వస్మాత్ భువనాత్ పాసి ధర్మణా సుర్యాత్ పాసి ధర్మణా॥
(ఋగ్వేదం)

తాను ఏర్పరచిన ధర్మ వ్యవస్థను తానే రక్షిస్తూ, తనను తానే ఆదర్శంగా చూపిస్తాడు కనుకనే -

ధర్మకృత్.. 476

1. ధర్మమును ఆచరించువాడు - కలిగించువాడు. తాను ఏ ధర్మాన్ని రక్షిస్తున్నాడో, దానిని తానే ఏర్పరచాడు.
   విశ్వంలో ప్రతి పస్తువుకీ ఒక 'మర్యాద' ఉంది. ఆ మర్యాదలను కలిగించినవాడై, తన వ్యాపకత్వ ధర్మం చేత వాటిని నిర్వహించువాడై ధర్మకర్త అయ్యాడు.
2. రామాద్యవతారముల ద్వారా తాను విశ్వశ్రేయస్సుకై, తనకు ఆవశ్యకం కాకున్నా, లోకసంగ్రహార్థం ధర్మాన్ని ఆచరించాడు.
   ధర్మకృతే విపశ్చితే పనస్యవే॥ (అథర్వవేదం)
   ఉతమిత్రోభవసి దేవ ధర్మభిః॥ (ఋగ్వేదం)

ధర్మములను ఏర్పరచి, రక్షించే భగవానుడే సర్వ ధర్మ నిలయుడు కనుక -

ధర్మీ.. 477

1. ధర్మములను నిలుపువాడు. కలిగినవాడు.

విశ్వంలో ప్రతి వస్తువు తన ధర్మాన్ని తాను కలిగి ఉంటుంది. లయ పర్యంతం తన ధర్మాన్ని వదులుకోదు. అగ్నికి వేడిమి, నీటికి చలువ... ఇలా వాటి స్వాభావిక ధర్మాలు వాటిని వీడవు. ఆ ధర్మముల చేతనే అవి ఉనికి కలిగి ఉంటాయి. విశ్వంలో అన్నిటి ధర్మాలకు ఆలంబనమైన విష్ణువు 'ధర్మీ' అని పిలువబడుతున్నాడు.

సమస్త ధర్మములకు తానే మూలము కనుక **"విగ్రహవాన్ ధర్మః", "ధర్మస్య ప్రభురచ్యుతః"** అని కీర్తితుడు.

అగ్నిః పృధుర్ధర్మణస్పతిః॥ (యజుర్వేదం)

వృషా ధర్మాణి దధిషే ॥ (ఋగ్వేదం)

- ధర్మ స్వరూపుని శ్రుతులు పలు విధాల నుతించాయి.

'యద్యదాచరతి శ్రేష్ఠః, తత్త దేవేతరో జనః' - ఉత్తముడేది ఆచరిస్తాడో దానినే ఇతరుడు ఆచరిస్తాడని - గీతలో చెప్పిన భగవానుడు ధర్మగోపనమునకై ధర్మముల నాచరిస్తూ, ఆ ధర్మములకు తానే ఆధారమైనాడు. శాశ్వతమైన విశ్వనియమాలను నడుపుతున్న, శాశ్వతుడు కనుక ఈతడే -

సత్.. 478

1. ఉనికియైనవాడు.

సత్తా లక్షణం కలిగిన భగవానుడు తన సత్త్వముతోనే సర్వత్ర వ్యాపించి ఆధారమైనాడు. పరిణామాల జగతికి ఆధారమై, శాశ్వతమై ఉన్న అపరిణామ చైతన్యమే సత్.

అవితథం పరం బ్రహ్మ సత్.

'ఏది కనబడుతుందో, వాస్తవంగా, అదికాదు' – అనడాన్ని 'వితథం' అంటారు. మాయ, మాయ వలన కలిగే జగము 'వితథములు'. వాటికి భిన్నంగా ఉన్న శాశ్వత అస్తిత్వమే అవితథమైన పరబ్రహ్మ.
ఎల్లప్పుడునూ ఉన్న ఈ సత్యమే సృష్టికి ముందు, వెనుక కూడా ఉన్నది. మారుతున్నది సృష్టి. ఈ మార్పు దేని ఆధారం వల్ల జరుగుతున్నదో అది మార్పు లేనిది.

'సదేవ సోమ్యే ద మగ్ర ఆసీత్' *(ఛాందోగ్యం)*

ఈ దృశ్యమానమైన జగమంతా మొదట 'సత్' రూపమైన పరబ్రహ్మమే. **ఏకం సత్ విప్రా బహుధా వదన్తి** *(ఋగ్వేదం)* అని బహు రూపమైన జగతికి ఆధారం – ఏకమైన సత్.

అపక్షయ వినాశాభ్యాం పరిణామార్థి జన్మభిః ।
వర్జితః శక్యతే వక్తుం యస్సదాస్తీతి కేవలమ్ ॥ *(విష్ణు పురాణం)*

"క్షయం (తగ్గుట), నాశనం, మార్పు, పెరుగుట, పుట్టుక మొదలైనవి లేక, ఎల్లప్పుడూ 'ఉండువాడు' అని మాత్రమే చెప్పబడేవాడు.
'సత్తామాత్ర శరీరం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్' అని ఆదిశంకరులు స్వామిని కీర్తించారు.

ఇదే బహురూపంగా భాసిస్తోంది కనుక –

జగద్రూపుడైనవాడు.
పంచీకృత పంచ మహాభూతాలతో, చతుర్వింశతి తత్త్వములతో కూడినది జగతి. దీనియందు వ్యాపించినవాడు తానే అయినా వీటి వికారాదులేవీ తానుకాడు. పరిణామాలన్నీ జగతివి. తాను పరిణామరహితుడు. కానీ ఆయన లేనిదే పరిణామాలు జరుగవు. ఇలా పరిణామాదులు ఆయన స్వరూపములుగా భాసిస్తున్నవి కనుక – పరిణామాత్మక జగతి ఆయన

రూపంగానే భావించబడుతోంది. బెల్లం చెరకురసం యొక్క పరిణామం. రసరూపంలో చెరకు అక్కడ వ్యాపించినా, అది చెరకుగా వ్యవహరింపబడలేదు. కానీ అది ఇక్షు స్వరూపమే.

2. మాయాత్మకమైన జగతికి అతీతమైనప్పుడు 'సత్' అనీ (పరబ్రహ్మమనీ), మాయోపాధికమైన బ్రహ్మము – ఈశ్వరుడు 'అసత్' అనీ (అపరబ్రహ్మమనీ) చెప్పబడుతున్నాడు.

వాచారంభణం వికారో నామధేయం – మృత్తికేత్యేవ సత్యమ్

(ఛాందోగ్యోపనిషత్తు)

వాక్కు ఉపాధిగా ఉన్న పేరు తప్ప 'వికారం' అనేది తత్త్వతః లేదు. కుండకు కారణం మట్టి. కుండ ఉపాధిగా కల్పితమైన మృత్తికయే. కనుక మృత్తిక కుండలోనూ వ్యాపించింది. కానీ వస్తుతః మృత్తిక కుండకాదు.

అలాగే జగతిగా గోచరించే వికారముల (కార్యతత్త్వముల) అస్తిత్వములేవీ తానుకాని వాడు 'అసత్'.

'న సత్ న చాసత్సః' – అని శాస్త్రం పేర్కొన్నది.

అసచ్చ సచ్చ పరమేవ్యోమన్ – *(ఋగ్వేదం)*

అసచ్చ యత్ర సచ్చాన్తః – *(అథర్వవేదం)*

– అని శ్రుతులు సదసద్రూపుని పేర్కొన్నాయి.

"సదసత్ చాహమర్జున" – అని గీతావాక్యం.

జగద్దృష్టితో అసత్, పరబ్రహ్మ దృష్టితో 'సత్'... ఇలా రెండుగా భాసించే ఏకచైతన్యం విష్ణువు. అంతేకాక – అవ్యక్తం 'అసత్'. వ్యక్తం 'సత్'. రెండూ తానైనవాడు.

జగద్రూపంగా ఉన్నప్పుడు, జగతిలోని భూతములుగా వ్యక్తమౌతున్నందున–

క్షరమ్.. 480

1. గమనశీలమైన జగద్రూపుడు.

'క్షర సంచలనే' అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **'క్షరతి సంచలతీతి గమనశీలం జగత్'**. కదలుట, మారుట.... అనే ధర్మము కల గమనశీలమైన జగతి క్షరము. జగతిగా భాసించడం చేత భగవానుడు ఈ నామము ద్వారా వ్యవహరింప బడుతున్నాడు.

'క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే' – అని గీతావచనం. పరిణామధర్మం కల భూతములు క్షరములు. వాటియందు గూఢమై వ్యాపించిన చైతన్యం అక్షరం. క్షరమైన జగతిగా భాసిస్తున్నా, దీనికి అతీతుడు కనుక–

అక్షరమ్.. 481

1. నాశనము లేనివాడు.

జగతియందు విడువక (అనుస్యూతముగా) వ్యాపించి ఉన్నా, తాను కదలనివాడు, నశించనివాడు.

ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।
క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥

శరీరాది ఉపాధులతో తాదాత్మ్యం చెందిన జీవచైతన్యం (ప్రాణులు) 'క్షర' శబ్దము ద్వారా పేర్కొనబడి, నిరుపాధికమైన ఈశ్వరచైతన్యం 'అక్షరు'నిగా చెప్పబడుతోంది. కెరటాలు క్షరములు – సముద్రం అక్షరం. కానీ కెరటాలను కూడా సముద్రంగానే వ్యవహరిస్తాం. అదేవిధంగా అక్షరుడు – క్షరమైన జగద్రూపంగా వ్యవహరింపబడుతున్నాడు.

ఋచో అక్షరే పరమే వ్యోమన్...॥
అక్షరేణ ప్రతిమిమ ఏతామృతస్య నాభావధి సంపునాతి ॥
తతః క్షరత్యక్షరం తద్విశ్వముపజీవతి॥

– అని ఋగ్వేదం పలుకుతోంది.

జగతిగా వ్యవహరింపబడే ఉపాధిగత లక్షణాలే మన ఇంద్రియాలకు బుద్ధికి తెలుస్తాయి. బుద్ధీంద్రియ అనుభవాలకు అతీతుడు కనుక-

అవిజ్ఞాతా.. 482

1. కర్తృత్వాది అనుభవములు ఎరుగని (లేని)వాడు.

   'విజానాతి అనుభవతి కర్తృత్వాదికం ఇతి విజ్ఞాతా జీవః'

   'తనయందు కర్తృత్వం, భోక్తృత్వం మొదలైనవి ఉన్నాయి' అనే అనుభవం పొందేవాడు 'విజ్ఞాతా'. అతడు జీవుడు. అత్మ తత్త్వమందు ఈ కర్తృత్వ భోక్తృత్వాది 'వికల్పజ్ఞానం' కల్పితం.

   (వికల్పజ్ఞానం - వివిధముల అనుభవము). అటువంటి అనుభవములచే (వాసనలచే) కప్పివేయబడిన జీవుడు విజ్ఞాత. ఆ వాసనలులేని శుద్ధ చైతన్యరూపుడు అవిజ్ఞాతా.

2. తెలిసినవాడు లేనివాడు.

   అందరినీ తెలుసుకునేవాడు నారాయణుడు. ఆయనను తెలిసినవాడు ఉండడు.

   భగవానుడు తెలుసుకోదగినవాడు. తెలివియే తానైనవాడు. త్రిపుటి (జ్ఞానం, జ్ఞాతం, జ్ఞేయం) ఏకత్వంలో మిగిలేది జ్ఞానమే. అక్కడ జ్ఞాతలేదు. ఆ ఏకత్వమే విష్ణువు.

3. రక్షించువాడు - తెలుసుకొనువాడు.

   "అవ్ రక్షణాదౌ" అనే ధాత్వర్థాన్ని అనుసరించి, **'అవతి రక్షతి సర్వం ఇతి అవిః'** - సూర్యాది రూపములతో ప్రకాశించుచూ, శరణాగతుల మొరలను వినుచు, అంతర్యామి రూపంలో అంతటా వ్యాపించి, సకల విశ్వస్వామిగా 'రక్షించే' ధర్మంతో సర్వమును తెలిసిన జ్ఞానస్వరూపుడు. (సత్యభాష్యం)

   అవి ర్వైనామ దేవతర్తేనాస్తే పరీవృతా। (అథర్వవేదం)
   గృభ్ణాతి రిప్రమవిరస్య తాన్వా... ॥ (ఋగ్వేదం)

4. భక్తుల దోషాదులను ఎరుగనివాడు.

తనను ఆశ్రయించిన సత్పురుషుల అపరాధాలను ఎరుగనట్లుగా ఉండి అనుగ్రహించువాడు.

శ్రీ కూరత్తాళ్వారు అనే విష్ణుభక్తుడు –

'సర్వజ్ఞతా మేవ ముపాలభా మహే
త్వం హ్యజ్ఞ ఏవాశ్రిత దోషజోషణః' – అని స్తుతించాడు.

"నీ సర్వజ్ఞత్వాన్ని ఇలా నిందిస్తున్నాము. నువ్వు తెలియనివాడవే – ఏలయన, ఆశ్రితుల దోషాలను ఎరుగకున్నావే"

నిజానికి ఇది భక్త వాత్సల్యంతో అపరాధాలను ఉపేక్షించడమే.

ఈ చమత్కృతిని ఈ నామార్థంగా శ్రీ పరాశరభట్టరు వ్యాఖ్యానించారు.

జ్ఞాన స్వరూపుడు కనుక తన అనంత ప్రకాశాన్ని వ్యాప్తి చేస్తూ –

సహస్రాంశుః.. 483

1. అనంత కిరణములు కలవాడు.

వ్యాపన ధర్మము కలవి అంశువులు (కిరణములు).

తన స్వరూపమైన జ్ఞానమునే అంతటా వ్యాపింపజేయువాడు. 'అనంతముగా విశ్వమంతా వ్యాపించినది విష్ణు చైతన్యమే'– నని ఈ నామం తెలియజేస్తోంది.

'అనంత జ్ఞాన సంపన్నుడు' అని కూడా మరియొక అర్థం.

ప్ర ప్యాయస్వ ప్రస్యన్దస్వ సోమ విశ్వేభిరంశుభిః॥ (ఋగ్వేదం)
సహస్రశృంగో వృషభస్తదోజా విశ్వం అగ్నే సహసా ప్రాస్యన్యాన్॥ (ఋగ్వేదం)

వంటి శ్రుతులు భగవానుని అనంత జ్ఞానం, అనంత శక్తులను తెలియజేస్తున్నాయి.

2. సూర్యరూపముతో ప్రకాశించువాడు.

'యేన సూర్య స్తపతి తేజసేద్ధః' (తైత్తిరీయ బ్రాహ్మణం)

'ఏ పరమాత్ముని తేజముచే ప్రజ్వలింపబడి సూర్యుడు లోకమును తపింపజేస్తున్నాడో' అని శ్రుతి పేర్కొన్నది. **'యదాదిత్య గతం తేజః- తత్తేజో విద్ధి మామకమ్'** అని గీతా వాక్యం. సూర్యునిలోనున్నది ఈశ్వరతేజమే. కనుక ముఖ్యమైన సహస్రాంశువు విష్ణువే.

అపరిమిత జ్ఞానముచే జగతిని ధరించి పోషిస్తున్నందున -

విధాతా.. 481

1. విశేషముగా ధరించువాడు - పోషించువాడు.

   వివిధములైన నియమములతో, ఫలప్రదాయకుడై పాలించి ధరించువాడు. కర్మానుభవానికై ప్రాణులకు వివిధములైన శరీరములను విధానముచేసి, విశ్వనియమములను విధించి పోషించుటచే విధాతా.

   సనో బన్ధుర్జనితా స విధాతా
   ధామాని వేద భువనాని విశ్వా। (యజుర్వేదం)

2. సర్వభూతములను ధరించే శేషువు, అష్టదిగ్గజాలు, సప్త కుల పర్వతాలు - మొదలైన శక్తులన్నిటినీ ధరించు పరమేశ్వరుడితడు.

   విశ్వ నియమకర్తగా, పోషకునిగా సర్వ లక్షణములను ఏర్పరచుటచే-

కృతలక్షణః.. 485

1. కల్పించిన లక్షణములు కలవాడు.

   నిత్యసిద్ధ (శాశ్వత) చైతన్యరూపుడు కనుక - 'ఇవి ఈతని లక్షణాలు' అని గుర్తు చేప్పలేము. అయినప్పటికీ ఉపాసనకై - తనకు తాను దివ్యలక్షణములను ఏర్పరచుకొని అనుగ్రహిస్తున్నాడు.

   ఈవిధంగా - 'కృతమైన (కల్పించిన) లక్షణములతో' భాసించుటచే 'కృతలక్షణుడు'.

2. శాస్త్రములను ఏర్పరచినవాడు.

'లక్షణములు' అంటే శాస్త్రములు. వేదాది సర్వశాస్త్రములు భగవానుని వలన ఏర్పడినవి.

'వేదాః శాస్త్రాణి విజ్ఞానం ఏతత్ సర్వం జనార్దనాత్' (మహాభారతం)

'వేదములు శాస్త్రములు, విజ్ఞానం ఈ మొదలైన వాఙ్మయమంతా జనార్దనుని నుండి జనించినది'. **'శాస్త్రయోనిత్వాత్'** – అని బ్రహ్మసూత్రం.

'యస్య నిఃశ్వ సితం వేదాః' – 'ఎవరి ఊర్పులు వేదములో అతడు పరమేశ్వరుడు' అని శ్రుతి వాక్యం.

తన వక్షస్థలమందు శ్రీవత్సమను లక్షణం (చిహ్నం) కలవాడు.

4. లక్షణములను ఏర్పరచువాడు.

సృష్టిలో ప్రతి వస్తువుకు అనేకములైన లక్షణాలున్నాయి. ఈ లక్షణాలన్నిటినీ ఏర్పరచినది ఈశ్వర చైతన్యమే.

అలాగే– లోని దుఃఖానికి కళ్లు చెమర్చుట, అంతర్గత హర్షానికి పెదవుల నవ్వు చిహ్నాలు. ఇలా అంతర్గత గుణభావాలను వ్యక్తపరచే చిహ్నములన్నీ మనలోని ఈశ్వర్య చైతన్యం వల్లనే చేయగలుగుతున్నాం. అందుకే అతడు కృతలక్షణుడు.

'సజాతీయ విజాతీయ వ్యవచ్ఛేదకం లక్షణం సర్వభావానాం కృతం అనేన ఇతి కృతలక్షణః' (శంకరభాష్యం)

పదార్థాలన్నిటినీ వానితో సజాతీయ పదార్థాల నుండి, వాని కంటే విజాతీయాలైన పదార్థాల నుండి వేరుపరచే లక్షణాలు ఎవనిచేత సృష్టియందే చేయబడినవో ఆతడు.

ఇలా అనంత లక్షణములను వ్యాప్తిచేసిన తన జ్ఞాన కిరణములకు తానే మూలమైనందున–

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః।
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః॥... 52

486. గభస్తినేమిః, 487. సత్త్వస్థః, 488.సింహః, 489. భూతమహేశ్వరః, 490. ఆది దేవః, 491. మహాదేవః, 492. దేవేశః, 493. దేవభృద్గురుః॥

గభస్తినేమిః.. 486

1. కిరణ చక్రమధ్యమున ఉన్నవాడు (సూర్యాత్మకుడు).

   'గభస్తీన్ మయూఖాన్నయతి ప్రాపయతి - గభస్తినేమిః'

   మయూఖములను కలిగించి సర్వత్ర ప్రకాశింపజేయువాడు.

   అన్ని ప్రకాశములకు ప్రకాశకుడైన విష్ణువే సూర్యరూపంగా ఉన్నవాడని వెనుకటి పలు నామాలలో తెలుసుకున్నాం.

   మయూఖముల చక్రమునకు నడుమ - కేంద్రమైన సూర్యుడే గభస్తినేమి.

   నేమిం నమన్తి చక్షషా మేషం విప్రా అభిస్వరా॥ (అథర్వవేదం)

   అనంత జ్ఞానశక్తి కిరణములకు కేంద్రమైన జ్ఞానజ్యోతి... అని కూడా భావించవచ్చు. ఈ జ్ఞానరూపత చేతనే ప్రతిదానినీ ప్రకాశింపజేస్తున్నందున-

సత్త్వస్థః.. 487

1. సత్త్వగుణమును ప్రధానంగా అధిష్ఠించినవాడు.

   ప్రకాశ శక్తి కలిగిన సత్త్వగుణాన్ని ప్రధానంగా అధిష్ఠించుటచే ఈ నామవాచ్యుడు. తన శుద్ధ సత్త్వము ద్వారా తనను తాను ప్రకటించు కొనువాడు.

2. ప్రాణులయందున్నవాడు.

   సత్త్వములనగా ప్రాణులు. వాటియందున్న అంతర్యామి.

3. హృదయమందున్నవాడు.

హృదయానికి కూడా సత్త్వమని శాస్త్ర సిద్ధార్థం.

ప్రతివారి హృదయమందున్న పుండరీకాక్షుడు కనుక సత్త్వస్థుడు.

హృత్ప్రతిష్ఠమ్ యదజిరమ్ ॥యజుర్వేదం॥

4. సాత్త్వికులైన భక్తుల హృదయమందు గోచరించువాడు.

భగవానుడు సర్వహృదయస్థుడైనప్పటికీ, జ్ఞానులకు మాత్రమే అనుభవానికి అందుతున్నాడు. అటువంటి భగవదనుభవాన్ని పొందిన వారి హృదయం భగవన్నిలయం. వారి హృదయం సత్త్వమయం. వారు సాత్త్వికులు. వారి యందున్నందున స్వామి సత్త్వస్థుడు.

హృదియది భగవాన్ అనాది రాస్తే
హరిరపిచక్ర గదాధరోవ్యయాత్మా ।
తదఘమఘ విఘాత కర్తృభిన్నం
భవతి కథం సతి చాన్ధకారమర్కే॥ (విష్ణుపురాణం)
స్ఫటికమణి శిలామలః క్వవిష్ణుః?
మనసినృణాం క్వచమత్సరాది దోషః? (విష్ణుపురాణం)

"విష్ణువు ఎవని హృదయంలో వసిస్తున్నాడో, సూర్యుని ఎదుట చీకటి వలె వాని పాపములు నశిస్తున్నాయి.

స్ఫటికమణి వలె అతి నిర్మలుడైన విష్ణువెక్కడ? అతడు వసించు మనుష్యుల హృదయంలో మత్సరాది దోషము లెక్కడ?" అని

భక్తుల హృదయం నిర్మలసత్త్వ నిలయంగా పురాణాలు వర్ణించాయి.

ప్రాణుల హృదయమందుండి కర్మ ఫలానుగుణంగా రక్షా శిక్షాదులను చేయుటచే-

1. కర్మఫలములను కురిపించువాడు.

'సించతి మేఘైః పృథివీం - కర్మఫలైర్వా జగత్- సింహః' (సత్యభాష్యం)

మేఘాదుల ద్వారా భూమిని తడుపువాడు, కర్మఫలముల ద్వారా జగతిని నడుపువాడు. పృథ్విని తడుపు సూర్యశక్తి, జగతిని నడుపు ఈశ్వరశక్తి రెండూ విష్ణు స్వరూపాలే. 'సింహ' శబ్దం వేదం సూర్యపరంగా కూడా వాడినది.

2. (కాలరూపుడై) హింసించువాడు.

ప్రతిక్షణం ప్రతి ప్రాణి ఆయువు కాలము ద్వారా కబళించబడుతోంది. ఈ కాలము ద్వారా అన్నీ క్షీణిస్తున్నాయి- లయిస్తున్నాయి.

సింహం బలానికి ప్రతీక. బలవత్తరమైన కాలమే విష్ణుని సింహస్వరూపం. కర్మఫలముల నిచ్చునదీ, అన్నిటినీ కబళించునదీ కాలబలమే.

సింహం నసన్త మధ్వో అయాసం హరిమరుషం దివో అస్యపతిమ్ ॥

(ఋగ్వేదం)

సింహం హిన్వన్తి మహతే సౌభగాయ ॥ (అథర్వవేదం)

2. నృసింహస్వరూపుడు.

'సర్వభూతములందు ఉన్నవాడను (సత్త్వస్థుడు) నేనే' అని తన సర్వవ్యాపకత్వాన్ని ఋజువు చేసిన స్వరూపం. సాత్త్వికుడైన ప్రహ్లాదునిలో భాసించి అనుగ్రహించడానికై ఆవిర్భవించినవాడు.

'సత్యభామా' అనే నామాన్ని 'భామా' అనే నామం ద్వారా వ్యవహరించినట్లుగా, 'నృసింహ' నామం 'సింహం'గా పలుకబడినది.

తన భక్తులను బాధించువారిని హింసించుటచే, దుష్టశిక్షణచే సింహ పద వాచ్యుడయ్యాడు.

ఈ రక్షణకీ శిక్షణకీ ఆయనకు గల అర్హతయే -

భూతమహేశ్వరః.. 489

1. సర్వభూతములకు గొప్ప ప్రభువు.
ఆయనను మించిన ఈశ్వరుడు లేడు కనుక మహేశ్వరుడు. లేదా – మహత్త్వము, ఈశ్వరత్వము – గొప్పతనం, పాలకత్వం కలిగినవాడు. త్రికాలములలో కలుగునవి భూతములు– వాటిని నియమించి పాలించువాడు.

భూతేన సత్యేన స ఏవ మహాన్ ఈశ్వరః (ఆదిశంకర భాష్యం)

'సత్యముగా ఈతడే పరమ ఈశ్వరుడు' – భూతమహేశ్వరః.

భూతపతీ పశుపతీ నమో వామ్॥ (అథర్వవేదం)

యో భూతానామధిపతి ర్యస్మింల్లోకా అధిశ్రితాః॥
య ఈశే మహతో మహాంస్తేన గృహ్ణామిత్వామహమ్ ॥ (యజుర్వేదం)

– ఈ ఈశ్వరత్వము అతనికి సృష్టికి పూర్వమే ఉన్నది కనుక –

ఆదిదేవః.. 490

1. మొదటిగా ప్రకాశించినవాడు.
జగత్‌సృష్టికి పూర్వము కైవల్యావస్థగా ఉన్నవాడు. 'దేవ' శబ్దం జ్యోతిస్వరూపాన్ని తెలియజేస్తోంది. సృష్టికి పూర్వమే జ్యోతి స్వరూపంగా, నిర్వికారుడై ఉన్నవాడు.

'తమసః పరస్తాత్' పెంజీకటికావల – ప్రకాశించే జ్యోతి.

2. సర్వమును తనలోనికి గ్రహించు దేవుడు.
'ఆదత్తే గ్రసతి సర్వమంతకాలే' – సర్వమును ప్రళయములో తనలోనికి గ్రహించువాడు. లయమొనర్చువాడు.
ఈ నామం సృష్టికి ముందు, వెనుక కూడా ఉండే శాశ్వత చైతన్యస్వరూపుడైన పరమాత్మను తెలియజేస్తోంది.

3. ఇచ్చుపుచ్చుకొను చైతన్య స్వరూపుడు.

విశ్వమంతా ఆదాన ప్రదాన రూపంగా ఈశ్వరచైతన్యం వ్యాపించింది. సూర్యుడు జలములను తన కిరణములతో స్వీకరిస్తాడు. మళ్ళీ తానే వర్షాదులను కల్పించి నీటిని అందిస్తాడు. ఇలా విశ్వమంతా ఆదాన ప్రదానరూపంగా ఉన్న ఆదిదేవుడు కదా.

త్వమగ్నే ప్రథమో అంగిరా ఋషిర్దేవో దేవానామభవః శివః సఖా ॥

(ఋగ్వేదం)

ఏషోహి దేవః ప్రదిశోను సర్వాః పూర్వోహిజాతః స ఉ గర్భే అన్తః।

(యజుర్వేదం)

ఇలా ఆదిదేవునిగా తన మహత్వాన్ని చాటుతున్నందున -

మహాదేవః.. 491

1. పూజింపబడు ప్రకాశ స్వరూపుడు.

   'మహ పూజాయాం' అనే ధాతువు ననుసరించి 'మహత్' శబ్దం పూజ్యతను తెలియజేస్తుంది. సర్వలోకములందు సర్వులచే పూజింపబడే చైతన్య స్వరూపుడు మహాదేవుడు.

2. అన్నిటినీ మించిన చైతన్యరూపుడు.

   అన్ని భావాలను వదలి - చాలా గొప్పదైన ఆత్మజ్ఞాన యోగం అనే ఐశ్వర్యముతో తన స్థితియందు పూజింపబడువాడు. మనలో ఇంద్రియ మనః ప్రాణాలకు అవల గొప్పగా ప్రకాశించే ఆత్మస్వరూపుడు మహాదేవుడు.

   మహస్తే సతో మహిమా పనస్యతే అద్ధా దేవ మహాం అసి। (యజుర్వేదం)

   స ఈశే మహతో మహాంస్తేన గృహ్ణామి త్వాహమ్॥ (యజుర్వేదం)

   వట్ సూర్య శ్రవసా మహాం అసి సత్రా దేవమహాం అసి। (ఋగ్వేదం)

   సోర్యమా సవరుణః సరుద్రః మహాదేవః। (అథర్వవేదం)

   సోవర్ధత స మహానభవత్ సమహాదేవోభవత్। (అథర్వవేదం)

   ఈ లక్షణం చేతనే దేవతలకు సైతం ప్రభువై -

దేవేశః.. 492

1. దేవతలకు శాసకుడు. ప్రధానుడు.
   ఇంద్రాది దేవతలకు అధీశుడై ప్రేరేపించి నియమించి వ్యవస్థపరచుట చేత విష్ణువు దేవేశుడు.
   స దేవానామధిపతి ర్బభూవ సో అస్మాసుద్రవిణ మా దధాతు ॥
   (అథర్వవేదం)
   యో దేవేష్వధిదేవ ఏక ఆసీత్ కస్మై దేవాయ హవిషావిధేమ ॥ (ఋగ్వేదం)
2. సర్వేంద్రియములను శాసించు ఆత్మ స్వరూపుడు.
   మనస్సుతో కలసి సర్వేంద్రియాలు 'దేవ' శబ్దంతో తెలియజేయబడుతున్నాయి.
   ఈ సర్వేంద్రియ నియామకమైన ఆత్మస్వరూపుడే దేవేశుడు.
   దేవతలను శాసించడం చేతనే –

దేవభృద్గురుః.. 493

1. దేవతలను పోషించువానికి గురువు.
   'భృత్ – పాలన పోషణయోః'. భృత్ – శబ్దానికి 'పాలించుట, పోషించుట' అని అర్థం.
   దేవతలను పాలించువాడు ఇంద్రుడు. ఆ ఇంద్రునికి సైతం పూజ్యుడైన దేవేశుడు హరి. 'గురు' శబ్దం 'పెద్దవాడు' అనే అర్థాన్ని తెలియజేస్తుంది.
   ఇంద్రుని కంటె పెద్దవాడు.
2. దేవతలను పోషించువాడు – విద్యలను అందించువాడు.
   ప్రతిదేవతను పాలించి పోషించడమేగాక, సర్వవిద్యలకు ఆదియై బోధించే జ్ఞాన స్వరూపుడు.
   "దేవభృత్ చ అసౌ గురుశ్చ".
3. విశ్వమంతటినీ భరించి, దాని ద్వారా తన నిగూఢ స్వరూపాన్ని తెలియపరచువాడు.

'దేవ' శబ్దానికి విశ్వమనే అర్థాన్ని గ్రహించవచ్చు. మనచుట్టూ ప్రకాశించే (గోచరించే)ది విశ్వం. దానియందు – తిలలలో తైలం వలె – నిగూఢముగా సర్వత్ర వ్యాపించినవాడు. తత్త్వమును తెలుసుకొనగోరువారికి విశ్వంలో ప్రతి వస్తువు ద్వారా, క్రియద్వారా తన ఉనికిని చాటుతాడు పరమాత్మ. అదే గురుత్వం.

అంతేకాదు – విశ్వంలో జరిగే ప్రతి చర్య ఏదో విషయాన్ని బోధిస్తుంది. చెట్లకు చిగురింత వసంతకాలం వచ్చిందని తెలియజేస్తుంది. మయూరాలు పింఛం విప్పడం వాటి నియత కాలాన్ని వ్యక్తపరుస్తుంది. ఇలా విశ్వంలో ప్రతిదీ ఏదో వ్యక్తీకరిస్తున్నది. ఈ వ్యక్తీకరణయే గురుభావం. దానిని చేస్తున్నది విశ్వాన్ని భరించే విష్ణు చైతన్యమే.

స దేవాన్ విశ్వాన్ బిభర్తి ॥ఋగ్వేదం॥

2. బ్రహ్మకు సైతం వేదాలను ఉపదేశించిన హయగ్రీవాది రూపాలతో రాజిల్లిన విష్ణువు.

యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై ॥

'ఎవడు బ్రహ్మను కలిగించి ఆయనకు వేదాలను ఉపదేశించాడో...' అని శ్వేతాశ్వతరోపనిషద్వచనం.

జగ్రాహవేదానఖిలాన్ రసాతలగతాన్ హరిః ।
ప్రాదా చ్చ బ్రహ్మణే రాజన్ తతః స్వాంప్రకృతిం గతః॥

రసాతలమున దాగిన వేదాలను తీసుకువచ్చి బ్రహ్మదేవునికిచ్చి తన స్థానానికి వెళ్లిన హరి 'దేవభృద్గురువు'.

ఇలా దేవతలకు, విశ్వమునకు పోషకుడై గురువై, తన జ్ఞానముతో భక్తులను తరింపజేస్తున్నందున – ఉత్తరః.

ఉత్తరో గోపతి ర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః।
శరీరభూత భృద్భోక్తా కపీన్ద్రో భూరిదక్షిణః॥... 53

494. ఉత్తరః, 495. గోపతిః, 496. గోప్తా, 497. జ్ఞానగమ్యః,
498. పురాతనః, 499. శరీరభూతభృత్, 500. భోక్తా, 501. కపీన్ద్రః,
502. భూరిదక్షిణః॥

ఉత్తరః. 494

1. గొప్పగా దాటియున్నవాడు.
   ఉత్ – తరః. 'తృ– ప్లవన సంతరణయోః' – ఎగురుట, దాటుట – అనే ధాత్వర్థాన్ని అనుసరించి ఉత్కృష్టముగా దాటిన 'ఉత్తరుడు'.
   జన్మసంసార బంధనము నుండి దాటియున్నవాడు, ఆవలనున్నవాడు, ఊర్ధ్వమునందున్నవాడు, భక్తులను దాటించువాడు. ఇంద్రియబుద్ధులను దాటిన తరువాత ఆత్మరూపుడు. **నమః ప్రతరణాయ చ ఉత్తరణాయచ** అని శ్రుతి (యజుర్వేదం)
2. గొప్పవారిలో శ్రేష్ఠుడు (అందరికంటె గొప్పవాడు)
   ఉత్కృష్టమైన వారిలోకెల్లా గొప్పవాడు.
   విశ్వస్మాదింద్ర ఉత్తరః ॥ (అథర్వవేదం)
   నకిరిన్ద్ర త్వదుత్తరః ॥ (ఋగ్వేదం)
   ...భరస్యుత్తరో ధురోవహతి ప్రదేదిశత్ ॥ (ఋగ్వేదం)
   ఉదౌ వయం తమసస్పరి స్వః పశ్యన్త ఉత్తరమ్ ॥ (యజుర్వేదం)
3. భక్తుల ఆపదలను దాటించువాడు.
   ఉత్తరన్తి అస్మాత్. దేవతలకు అసురుల నుండి కలిగే ఆపదలను తప్పించి, భక్తులను భవబాధల నుండి దాటించి అనుగ్రహించువాడు.
4. సూర్యరూపుడు.

ఊర్ధ్వగతి కలిగి చరించువాడు.

... 'జ్యోతిరుత్తరమ్ దేవన్దేవత్రా సూర్యమగన్మ జ్యోతిరుత్తమమ్.

'ఉద్యన్నద్య మిత్రమహః ఆరోహన్నుత్తరాం దివం।'

మొదలైన శ్రుతి వాక్యములిందుకు ప్రమాణములు.

ఇలా సూర్యాది ప్రకాశరూపుడై పృథివిని పాలించుట చేత-

గోపతిః.. 495

1. భూమికి పతి.

   'గౌః' అనే శబ్దానికి భూమి అని అర్థం. సూర్య కిరణాలే భూమిని పాలించుతున్నవి. ఈ విధంగా భూమికి ప్రభువుగానున్నవాడు. ధర్మోద్ధరణ చేసి భూమిని పాలించువాడు.

2. వేదములకు నియామకుడు.

   గోశబ్దమునకు 'వేద వాక్యములు' అని అర్థం.

   వేదములచే ప్రతిపాదింపబడి, వేదములను పాలించు ధర్మస్వరూపుడు పరమాత్మ విష్ణువు 'గోపతి'.

3. గోవులకు పతిగా భాసించిన కృష్ణుడు.

4. ఇంద్రియములను నియమించువాడు.

   'గో' శబ్దమునకు ఇంద్రియములని కూడా అర్థం. ఆ ఇంద్రియాలను నియంత్రించే ముఖ్య ప్రాణ స్వరూపము విష్ణు విభూతియే.

   త్వమిన్మే గోపతిం విశ్వ ఆహా (ఋగ్వేదం)

   అభి ప్ర గోపతిం గిరేన్ద్ర మర్చ యథావిదే। (అథర్వవేదం)

   తే సత్యేన మనసా గోపతిం గా ఇయానాస ఇషణయన్త ధీభిఃఁ।

   (అథర్వవేదం)

   - వేదములకు, పృథ్వికి పాలకుడై వేద ధర్మము ద్వారా పృథ్విని రక్షించే లక్షణం చేతనే -

గోప్తా.. 496

1. రక్షించువాడు.

'గుపూ రక్షణే' అనే ధాతువు ననుసరించి 'గోప్తా' అనగా 'రక్షకుడు' అని అర్థం.

సమస్త భూతములను రక్షించువాడు, ధర్మాదులను ప్రవర్తింపజేయువాడు.

అగ్ని ర్మేగోప్తా మరుతశ్చ సర్వేవిశ్వే
దేవా అభిరక్షన్తు పక్ష్యమ్ ॥ (అథర్వవేదం)
త్రీణి పదావిచక్రమే విష్ణుర్గోపా అదాభ్యః॥ (యజుర్వేదం)
విశాం గోపా జనితా రోదస్యోర్దేవా... ॥ (ఋగ్వేదం)

గురువై, రక్షకుడై వేదాది ధర్మ ప్రవర్తకుడై, రక్షించు వీనిని గ్రహించడానికి జ్ఞానమే మార్గము కనుక –

జ్ఞానగమ్యః.. 497

1. జ్ఞానముచే పొందబడువాడు.

'తెలుసుకొనడమే' మార్గం, తెలియబడేది పరతత్త్వం.

ఇంద్రియాదుల ద్వారా కాక – కేవలం ధ్యాన సమాధుల ద్వారా, విచారణ ద్వారా మనస్సుకి అతీతమైన ఆత్మను గ్రహించగలం. ఆ గ్రహింపునకు మాత్రమే లభ్యమయ్యేవాడు పరమాత్మ.

'న కర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకేన అమృతత్వమానశుః'

– అని వేదాంత వాక్యం.

'కర్మలచేగానీ, జనన ధర్మం కలిగిన ఇంద్రియాదులచేగానీ, సంపదలచేగానీ అమృతత్వము లభింపదు. వీటిని వదలిన జ్ఞానము చేతనే లభ్యము'.

'జ్ఞానాదేవహి కైవల్యం' అని ప్రసిద్ధ వచనం.

'జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం అచిరేణాధిగచ్ఛతి' (గీత)

– 'జ్ఞానం పొందినవాడే వెంటనే పరమమైన శాంతిని పొందగలడు'.

ఆ శాంతమైన, అమృతత్వమే పరమాత్మ.

విద్యయాఽమృతమశ్నుతే । (యజుర్వేదం)

విద్య (జ్ఞానం) ద్వారా అమృతము లభిస్తున్నది.

ఈ అమృత పరతత్వం శాశ్వతం కనుక -

పురాతనః.. 498

1. మునుపే కలిగినవాడు.

సృష్టికి పూర్వముననే ఉన్న శాశ్వతుడు. కాలపరిమితి లేనివాడు కావున, కాలాతీతుడై, 'సనాతన, పురాతన, పురాణ, సదాతన' అని వ్యవహరింపబడుతున్నాడు.

బ్రహ్మ జజ్ఞాన ప్రథమం పురస్తాత్

వి సీమతః సురుచో వేన ఆవః ॥ (అథర్వవేదం)

యస్మాజ్జాతం న పురా కించినైవ

య ఆబభూవ భువనాని విశ్వా ॥ (యజుర్వేదం)

సృష్టిలోని ఉపాధుల కంటే ప్రాచీనుడై తన తరువాత తన నుండి తాను సృజించిన ఉపాధులకు తానే పోషకుడైనందున

శరీరభూతభృత్.. 499

1. శరీరమును నిర్మించువాటిని భరించువాడు.

శరీరాన్ని నిర్మించే భూతములు శరీరభూతములు. ప్రాణతత్త్వరూపుడై ఆ భూతములను భరించువాడు. వాటిని కూడా నిలిపి ఉంచే చైతన్య స్వరూపుడు. శరీరంలో ఉన్న ప్రాణాది వాయువులు, అంతఃకరణం, ఇంద్రియాలు వీటన్నిటికీ పోషకుడై భరించువాడు.

2. తనకు శరీరములైన వాటిని భరించువాడు.

'యస్య పృథీవీ శరీరమ్'

'ఆకాశ శరీరం బ్రహ్మ' - మొదలైన శ్రుతి వాక్యములను పరిశీలిస్తే -

'తనకు శరీరములుగానుండు తత్త్వములను భరించువాడు' అనే అర్థాన్ని గ్రహించవచ్చు.

పంచతన్మాత్ర, పంచభూత, పంచప్రాణ, దశేంద్రియ, అంతఃకరణాదులన్నీ తాను దాల్చిన శరీరములే! (శీర్ణ లక్షణము కలది శరీరం). అదేవిధంగా - ముల్లోకములు స్వామి శరీరముగా ఉన్నవి. **"త్రిభువన వపుషం విష్ణుమీశం నమామి".** ఆ విరాట్పురుషుని దేహమే సకల విశ్వము. దేహము నందు ప్రాణము వలె, తన శరీరమైన విశ్వమునందంతట వ్యాపించి భరించి పోషించువాడు.

శరీరములందు ఇంద్రియబుద్ధులు మొదలైన వాటిని పరస్పర సన్ధానపరచే చైతన్యమీతడే. ఈ భావాన్నే -

సంసిచో నామతే దేవా యే సంభారాన్త్సమభరన్।
సర్వం సంసిచ్య మర్త్యం దేవాः పురుషమావిశన్ ॥
శిరోహస్తావథో ముఖం జిహ్వాం గ్రీవాశ్చ కీకసాः
త్వ చా ప్రావృత్య సర్వం తత్ సన్ధా సమదధాన్మహీ।'

-అనే అథర్వ వాక్యాలు తెలియజేస్తున్నాయి.

విశ్వశరీరాన్ని భరిస్తూ దానిని రక్షించువాడు, తద్గత చైతన్యంగా అనుభవ స్వరూపుడు కనుక -

భోక్తా.. 500

1. పాలించువాడు.

   'భుజ పాలనాభ్యవహారయోः' అనే ధాత్వర్థాన్ని అనుసరించి **'భునక్తి భుంక్తే వా జగత్ భోక్తా. రక్షకో భక్షకశ్చ'.**

   - జగతిని భుజించువాడు - అనగా 'రక్షించువాడు - భక్షించువాడు'.

   సృష్టి - స్థితి - లయ కర్త ఆతడే.

2. అనుభవించువాడు.

విశ్వంలో ప్రతిదీ మరియొకదానికి అనుభవ స్వరూపమే. ఆయా ఇంద్రియ మనోబుద్ధులకు ఉన్న అనుభవించే చైతన్యం ఈశ్వర స్వరూపమే. జీవరూప చైతన్యంగా పరమానంద సందోహాన్ని అనుభవించువాడు.

3. యజ్ఞ స్వరూపుడై హవ్య కవ్యాలను భుజించువాడు.

ఈ పై అర్థాలకు ప్రమాణ భూత శ్రుతివాక్యం.

అపాదగ్రే సమభవత్ సో అగ్రే స్వరాభరత్।
చతుష్పది భూత్వా భోగ్యః సర్వమాదత్త భోజనమ్. (అథర్వవేదం)
భోక్తారం యజ్ఞతపసా సర్వలోక మహేశ్వరమ్ ॥ – అనే గీతావాక్యం కూడా ఈ భావాన్ని ప్రకటిస్తోంది.

ఈ భోక్తృరూప చైతన్యంగా విశ్వాన్ని భరిస్తూ నడిపిస్తున్నందున అతడు కపీన్ద్రుడు(**501**).

శ్రీ విష్ణు సహస్రనామ భాష్యారూపమైన
'శ్రీ విష్ణు విద్య'లో
ప్రథమార్ధము పంచమ శతకము సంపూర్ణమ్॥

నామానుక్రమణిక

256. వృషాహీ 3
257. వృషభః 4
258. విష్ణుః 5
259. వృషపర్వా 6
260. వృషోదర 7
261. వర్ధనః 7
262. వర్ధమానః (చ) 8
263. వివిక్తుః 9
264. శ్రుతి సాగరః 9
265. సుభుజుః 11
266, దుర్ధరః 13
267. వాగ్మీ 13
268. మహేంద్రః 15
269. వసుదః 16
270. వసుః 17
271. నైకరూపః 17
272. బృహద్రూపః 19
273. శిపివిష్టః 20
274. ప్రకాశనః 22
275. ఓజస్తేజోద్యుతిధరః 23
276. ప్రకాశాత్మా 24
277. ప్రతాపనః 26
278. ఋద్ధః 26
279. స్పష్టాక్షరః 27
280. మంత్రః 28
281. చంద్రాంశుః 30
282. భాస్కరద్యుతిః 31
283. అమృతాంశూద్భవః 33
284. భానుః 34
285. శశబిన్దుః 34
286. సురేశ్వరః 36
287. ఔషధం 36
288. జగతః సేతుః 39
289. సత్యధర్మ పరాక్రమః 40
290. భూతభవ్య భవన్నాథః 41
291. పవనః 42
292. పావనః 43
293. అనలః 43
294. కామహా 44
295. కామకృత్ 45
296. కాన్తః 46
297. కామః 46
298. కామప్రదః 47
299. ప్రభుః 48
300. యుగాదికృత్ 49
301. యుగావర్తః 50
302. నైకమాయః 50
303. మహాశనః 51
304. అదృశ్యః, 52
305. వ్యక్తరూపః 53

306. సహస్రజిత్ 54
307. అనన్తజిత్ 55
308. ఇష్టః 56
309. అవిశిష్టః 57
310. శిష్టేష్టః 58
311. శిఖణ్డీ 59
312. నహుషః 60
313. వృషః 61
314. క్రోధహా 62
315. క్రోధకృత్ కర్తా 63
316. విశ్వబాహుః 65
317. మహీధరః 66
318. అచ్యుతః 67
319. ప్రథితః 68
320. ప్రాణః 68
321. ప్రాణదః 69
322. వాసవానుజః 69
323. అపాంనిధిః 70
324. అధిష్ఠానమ్ 71
325. అప్రమత్తః 72
326. ప్రతిష్ఠితః 73
327. స్కన్దః 74
328. స్కన్దధరః 75
329. ధుర్యః 76
330. వరదః 76
331. వాయువాహనః 77
332. వాసుదేవః 79
333. బృహద్భానుః 82
334. ఆదిదేవః 83
335. పురన్దరః 84
336. అశోకః 85
337. తారణః 86
338. తారః, 86
339. శూరః 87
340. శౌరిః 88
341. జనేశ్వరః 88
342. అనుకూలః 88
343. శతావర్తః 90
344. పద్మీ 92
345. పద్మనిభేక్షణః 93
346. పద్మనాభః 94
347. అరవిన్దాక్షః 95
348. పద్మగర్భః 96
349. శరీరభృత్ 98
350. మహర్ధిః 100
351. ఋద్ధః 100
352. వృద్ధాత్మా 100
353. మహాక్షః 101
354. గరుడధ్వజః 102
355. అతులః 103
356. శరభః 104
357. భీమః 106

358. సమయజ్ఞః	108	384. వ్యవసాయః	134
359. హవిర్హరిః	109	385.వ్యవస్థానః	135
360. సర్వలక్షణ లక్షణ్యః	111	386. సంస్థానః	135
361. లక్ష్మీవాన్	112	387. స్థానదః	136
362. సమితింజయః	112	388. ధ్రువః	137
363. విక్షరః	113	389. పరర్ధిః	138
364. రోహితః	114	390. పరమస్పష్టః	139
365. మార్గః	115	391. తుష్టః	140
366. హేతుః	116	392. పుష్టః	141
367. దామోదరః	116	393. శుభేక్షణః	141
368. సహః	119	394. రామః	143
369. మహీధరః	119	395. విరామః	147
370. మహాభాగః	120	396. విరతః (విరజః)	147
371. వేగవాన్	121	397. మార్గః	149
372. అమితాశనః	122	398. నేయః	150
373. ఉద్భవః	124	399. నయః	152
378. క్షోభణః	125	400. అనయః	152
379. దేవః	126	401. వీరః,	153
380. శ్రీగర్భః	126	402. శక్తిమతాంశ్రేష్ఠః	154
381. పరమేశ్వరః	127	403. ధర్మః	154
382. కరణమ్	128	404. ధర్మవిదుత్తమః	156
383. కారణమ్	129	405. వైకుంఠః	157
384. కర్తా	130	406. పురుషః	158
385. వికర్తా	131	407. ప్రాణః	159
386. గహనః	132	408. ప్రాణదః	160
387. గుహః	133	409. ప్రణవః	160

410. పృథుః	162	436. స్థవిష్ఠః	191
411. హిరణ్యగర్భః	163	437. అభూః (భూః)	192
412. శత్రుఘ్నుః	164	438. ధర్మయూపః	193
413. వ్యాప్తః,	165	439. మహామఖః	194
414. వాయుః	165	440. నక్షత్ర నేమిః	195
415. అధోక్షజః	166	441. నక్షత్రీ	196
416. ఋతుః	168	442. క్షమః	197
417. సుదర్శనః	169	443. క్ష్మామః	197
418. కాలః	172	444. సమీహనః	198
419. పరమేష్ఠీ	174	445. యజ్ఞం	199
420. పరిగ్రహః	175	446. ఇజ్యః	201
421. ఉగ్రః	176	447. మసేజ్యశ్చ	202
422. సంవత్సరః	177	448. క్రతుః	203
423. దక్షః	178	449. సత్రం	203
424. విశ్రామః	179	450. సతాంగతిః	204
425. విశ్వదక్షిణః	180	451. సర్వదర్శీ	205
426. విస్తారః	182	452. విముక్తాత్మా	206
427. స్థావరస్థాణుః	183	453. సర్వజ్ఞః	207
428. ప్రమాణమ్	184	453. జ్ఞానముత్తమమ్	207
429. బీజమవ్యయమ్	185	455. సువ్రతః	208
430. అర్థః	186	456. సుముఖః	209
431. అనర్థః	186	457. సూక్ష్మః	211
432. మహాకోశః	187	458. సుఘోషః	212
433. మహాభోగః	188	459. సుఖదః	213
434. మహాధనః	189	460. సుహృత్	213
435. అనిర్విణ్ణః	190	461 మనోహరః	214

456. జితక్రోధః 215
463. వీరబాహుః 215
464. విదారణః 216
465. స్వాపనః 218
466. స్వవశః 219
467. వ్యాపీ 219
468. నైకాత్మా 220
469. నైక కర్మకృత్ 220
470. వత్సరః 221
471. వత్సలః 222
472. వత్సీ 222
473. రత్నగర్భః 223
474. ధనేశ్వరః 224
475. ధర్మగుప్ 224
476. ధర్మకృత్ 225
477. ధర్మీ 226
478. సత్ 226
479. అసత్ 227
480. క్షరమ్ 229
481. అక్షరమ్ 229
482. అవిజ్ఞాతా 230
483. సహస్రాంశుః 231
484. విధాతా 232
485. కృతలక్షణః 232
486. గభస్తినేమిః 234
487. సత్త్వస్థః 234
488. సింహః 236
489. భూతమహేశ్వరః 237
490. ఆది దేవః 237
491. మహాదేవః 238
492. దేవేశః 239
493. దేవభృద్గురుః 239
494. ఉత్తరః 241
495. గోపతిః 242
496. గోప్తా 243
497. జ్ఞానగమ్యః 243
498. పురాతనః 244
499. శరీరభూతభృత్ 244
500. భోక్తా 245

హరిః ఓమ్ శివాయ గురవేనమః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాన్తయే ॥
వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్ ।
పరాశరాత్మజం వన్దే శుకతాతం తపోనిధిమ్ ॥
వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥
యస్య స్మరణమాత్రేణ జన్మసంసారబంధనాత్ ।
విముచ్యతే నమ స్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే ॥
ఓమ్ నమో విష్ణవే ప్రభవిష్ణవ ఇతి.

✧ ✧ ✧

ఓమ్

శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రమ్

వైశంపాయన ఉవాచ :

1. శ్రుత్వా ధర్మా నశేషేణ పావనాని చ సర్వశః ।
యుధిష్ఠిరః శాంతనవం పునరేవాఽభ్యభాషత ॥

యుధిష్ఠిర ఉవాచ :

2. కి మేకం దైవతం లోకే కిం వాఽప్యేకం పరాయణం ।
స్తువన్తః కం క మర్చన్తః ప్రాప్నుయుర్మానవా శ్శుభమ్ ॥
3. కోధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమో మతః ।
కిం జపన్ముచ్యతే జన్తుః జన్మ సంసారబంధనాత్ ॥

శ్రీభీష్మ ఉవాచ :

4. జగత్ప్రభుం దేవదేవమనన్తం పురుషోత్తమమ్ ।
స్తువ న్నామ సహస్రేణ పురుష స్సతతోత్థితః ॥

5. తమేవ చాఽర్చయ న్నిత్యం భక్త్యా పురుష మవ్యయమ్ ।
ధ్యాయన్ స్తువన్ నమస్యంశ్చ యజమాన స్తమేవ చ ॥

6. అనాదినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం ।
లోకాధ్యక్షం స్తువ న్నిత్యం సర్వదుఃఖాఽతిగో భవేత్ ॥

7. బ్రహ్మణ్యం సర్వధర్మజ్ఞం లోకానాం కీర్తివర్ధనమ్ ।
లోకనాథం మహద్భూతం సర్వభూతభవోద్భవమ్ ॥

8. ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః ।
యద్భక్త్యా పుండరీకాక్షం స్తవై రర్చే న్నర స్సదా ॥

9. పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః ।
పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్ ॥

10. పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ మంగళం ।
దైవతాం దేవతానాం చ భూతానాం యోఽవ్యయః పితా ॥

11. యతః సర్వాణి భూతాని భవం త్యాది యుగాగమే।
యస్మింశ్చ ప్రలయం యాన్తి పున రేవ యుగక్షయే ॥

12. తస్య లోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే ।
విష్ణో ర్నామసహస్రం మే శృణు పాపభయాఽపహమ్ ॥

13. యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః ।
ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే ॥

14. ఋషి ర్నామ్నాం సహస్రస్య వేదవ్యాసో మహా మునిః।
ఛందోఽనుష్టుప్ తథా దేవో భగవాన్ దేవకీ సుతః॥

15. అమృతాంశూద్భవో బీజం శక్తి ర్దేవకినందనః।
త్రిసామా హృదయం తస్య శాంత్యర్థే వినియుజ్యతే.

16. విష్ణుం జిష్ణుం మహావిష్ణుం ప్రభవిష్ణుం మహేశ్వరం।
అనేకరూపదైత్యాంతం నమామి పురుషోత్తమమ్.

అస్య శ్రీ విష్ణో ర్దివ్య సహస్ర నామ స్తోత్ర మహామంత్రస్య – శ్రీ వేదవ్యాసో భగవాన్ ఋషిః– అనుష్టుప్ ఛందః– శ్రీ మహా విష్ణుః శ్రీమన్నారాయణో దేవతా – అమృతాంశూద్భవో భానుః ఇతి బీజం – దేవకీనందనః స్రష్టా – ఇతి శక్తిః – ఉద్భవః క్షోభణో దేవః – ఇతి పరమో మంత్రః – శంఖభృన్నందకీ చక్రీ ఇతి కీలకం – శార్ఙ్గధన్వా గదాధరః ఇత్యస్త్రం – రథాంగపాణి రక్షోభ్యః ఇతి నేత్రం – త్రిసామా సామగః సామ – ఇతి కవచం – ఆనందః పరబ్రహ్మ – ఇతి యోనిః – ఋతుః సుదర్శనః కాలః ఇతి దిగ్బంధః – శ్రీ విశ్వరూపం ఇతి ధ్యానమ్, శ్రీ మహావిష్ణు ప్రీత్యర్థే సహస్ర నామజపే వినియోగః.

ధ్యానమ్

క్షీరోదన్వత్ప్రదేశే శుచిమణివిలస – త్సైకతే మౌక్తికానాం।
మాలాక్లప్తాసనస్థః స్ఫటికమణినిభై – ర్మౌక్తికై ర్మండితాంగః।
శుభ్రై రభ్రై రదభ్రై రుపరివిరచితై – ర్ముక్తపీయూష వర్షైః।
ఆనందీ నః పునీయా దరినలినగదా – శంఖపాణి ర్ముకుందః.

భూః పాదౌ యస్య నాభి ర్వియ దసు రనిల – శ్చంద్రసూర్యౌ చ నేత్రే।
కర్ణా వాశాః శిరోద్యౌ ర్ముఖ మపి దహనో – యస్య వాస్తేయ మబ్ధిః।
అంతఃస్థం యస్య విశ్వం సురనరఖగగో – భోగిగంధర్వదైత్యైః।
చిత్రం రంరమ్యతే తం త్రిభువనవపుషం – విష్ణు మీశం నమామి.

ఓం నమో భగవతే వాసుదేవాయ.

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం।
విశ్వాకారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం।
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం।
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్.

మేఘశ్యామం పీత కౌశేయ వాసం।
శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం।
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం।
విష్ణుం వందే సర్వలోకైకనాథమ్.

సశంఖచక్రం సకిరీటకుండలం।
సపీత వస్త్రం సరసీరుహేక్షణం।
సహారవక్షఃస్థలశోభి కౌస్తుభం।
నమామి విష్ణుం శిరసా చతుర్భుజమ్.

హరిః ఓమ్

విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః ।
భూతకృద్భూతభృద్భావో భూతాత్మా భూతభావనః ॥ 1

పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః ।
అవ్యయః పురుషః సాక్షీ క్షేత్రజ్ఞోఽక్షర ఏవ చ ॥ 2

యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః
నారసింహవపుః శ్రీమాన్ కేశవః పురుషోత్తమః॥ 3

సర్వః శర్వః శివః స్థాణుః భూతాదిర్నిధి రవ్యయః ।
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః ॥ 4

స్వయంభూః శంభురాదిత్యః పుష్కరాక్షో మహాస్వనః ।
అనాదినిధనో ధాతా విధాతా ధాతురుత్తమః ॥ 5

అప్రమేయో హృషీకేశః పద్మనాభోఽమర ప్రభుః ।
విశ్వకర్మా మను స్త్వష్టా స్థవిష్ఠః స్థవిరో ధ్రువః ॥ 6

అగ్రాహ్యః శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్దనః ।
ప్రభూత స్త్రికకుబ్ధామ పవిత్రం మంగళం పరమ్ ॥ 7

ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః ।
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః ॥ 8

ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః ।
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్ ॥ 9

సురేశః శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః ।
అహః సంవత్సరో వ్యాలః ప్రత్యయః సర్వదర్శనః ॥ 10

అజః సర్వేశ్వరః సిద్ధః సిద్ధిః సర్వాది రచ్యుతః ।
వృషాకపి రమేయాత్మా సర్వయోగవినిఃసృతః ॥ 11

వసు ర్వసుమనాః సత్యః సమాత్మా సమ్మిత స్సమః।
అమోఘః పుణ్డరీకాక్షో వృషకర్మా వృషాకృతిః॥ 12

రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోనిః శుచిశ్రవాః।
అమృతః శాశ్వతస్థాణు ర్వరారోహో మహాతపాః॥ 13

సర్వగః సర్వవిద్భాను ర్విష్వక్సేనో జనార్దనః ।
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవి త్కవిః ॥ 14

లోకాధ్యక్షః సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతా-కృతః।
చతురాత్మా చతుర్వ్యూహ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః॥ 15

భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః।
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః॥ 16

ఉపేన్ద్రో వామనః ప్రాంశు రమోఘః శుచి రూర్జితః।
అతీన్ద్రః సంగ్రహః సర్గో ధృతాత్మా నియమో యమః॥ 17

వేద్యో వైద్యః సదాయోగీ వీరహా మాధవో మధుః।
అతీన్ద్రియో మహామాయో మహోత్సాహో మహాబలః॥ 18

మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్తి ర్మహాద్యుతిః।
అనిర్దేశ్యవపుః శ్రీమా నమేయాత్మా మహాద్రిధృక్ ॥ 19

మహేష్వాసో మహీభర్తా శ్రీనివాసః సతాంగతిః।
అనిరుద్ధః సురానన్దో గోవిన్దో గోవిదాంపతిః।। 20

మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః।
హిరణ్యనాభః సుతపాః పద్మనాభః ప్రజాపతిః।। 21

అమృత్యు స్సర్వదృక్ సింహః సంధాతా సంధిమాన్ స్థిరః।
అజో దుర్మర్షణః శాస్తా విశ్రుతాత్మా సురారిహా ।। 22

గరు ర్గురుతమో ధామ సత్యః సత్యపరాక్రమః।
నిమిషోఽనిమిషః స్రగ్వీ వాచస్పతి రుదారధీః।। 23

అగ్రణీర్గ్రామణీః శ్రీమాన్ న్యాయో నేతా సమీరణః ।
సహస్రమూర్ధా విశ్వాత్మా సహస్రాక్షః సహస్రపాత్ ।। 24

ఆవర్తనో నివృత్తాత్మా సంవృత స్సంప్రమర్దనః।
అహః సంవర్తకో వహ్ని రనిలో ధరణీధరః।। 25

సుప్రసాదః ప్రసన్నాత్మా విశ్వధృగ్ విశ్వభుక్ విభుః।
సత్కర్తా సత్కృతః సాధు ర్జహ్ను ర్నారాయణో నరః ।। 26

అసంఖ్యేయోఽప్రమేయాత్మా విశిష్టః శిష్టకృ చ్ఛుచిః।
సిద్ధార్థః సిద్ధసంకల్పః సిద్ధిదః సిద్ధిసాధనః।। 27

వృషాహీ వృషభో విష్ణు ర్వృషపర్వా వృషోదరః।
వర్ధనో వర్ధమానశ్చ వివిక్తః శ్రుతిసాగరః।। 28

సుభుజో దుర్ధరో వాగ్మీ మహేన్ద్రో వసుదో వసుః।
నైకరూపో బృహద్రూపః శిపివిష్టః ప్రకాశనః।। 29

ఓజస్తేజోద్యుతిధరః ప్రకాశాత్మా ప్రతాపనః।
ఋద్ధః స్పష్టాఽక్షరో మన్త్ర శ్చన్ద్రాంశు ర్భాస్కరద్యుతిః।। 30

అమృతాంశూద్భవో భానుః శశబిన్దుః సురేశ్వరః।
ఔషధం జగతః సేతుః సత్యధర్మపరాక్రమః।। 31

భూతభవ్యభవన్నాథః పవనః పావనోఽనలః।
కామహా కామకృ త్కాన్తః కామః కామప్రదః ప్రభుః।। 32

యుగాదికృ ద్యుగావర్తో నైకమాయో మహోఽశనః।
అదృశ్యో వ్యక్తరూపశ్చ సహస్రజి దనంతజిత్।। 33

ఇష్టోఽవిశిష్టః శిష్టేష్టః శిఖండీ నహుషో వృషః।
క్రోధహా క్రోధకృత్కర్తా విశ్వబాహు ర్మహీధరః।। 34

అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవాఽనుజః ।
అపాంనిధి రధిష్థాన మప్రమత్తః ప్రతిష్ఠితః।। 35

స్కన్దః స్కన్దధరో ధుర్యో వరదో వాయువాహనః।
వాసుదేవో బృహద్భాను రాదిదేవః పురన్దరః।। 36

అశోక స్తారణ స్తారః శూరః శౌరి ర్జనేశ్వరః।
అనుకూలః శతావర్తః పద్మీ పద్మనిభేక్షణః।। 37

పద్మనాభోఽరవిన్దాక్షః పద్మగర్భః శరీరభృత్।
మహర్ధి ర్ఋద్ధో వృద్ధాఽఽత్మా మహోక్షో గరుడధ్వజః।। 38

అతులః శరభో భీమః సమయజ్ఞో హవిర్హరిః।
సర్వలక్షణలక్షణ్యో లక్ష్మీవాన్ సమితింజయః।। 39

విక్షరో రోహితో మార్గో హేతు ర్దామోదర స్సహః।
మహీధరో మహాభాగో వేగవా నమితాఽశనః।। 40

ఉద్భవః క్షోభణో దేవః శ్రీగర్భః పరమేశ్వరః।
కరణం కారణం కర్తా వికర్తా గహనో గుహః।। 41

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధ్రువః
పరర్ధిః పరమస్పష్ట స్తుష్టః పుష్టః శుభేక్షణః।। 42

రామో విరామో విరతో(జో) మార్గో నేయో నయోఽనయః।
వీరః శక్తిమతాం శ్రేష్ఠో ధర్మో ధర్మవిదుత్తమః।। 43

వైకుంఠః పురుషః ప్రాణః ప్రాణదః ప్రణవః పృథుః।
హిరణ్యగర్భః శత్రుఘ్నో వ్యాప్తో వాయు రధోక్షజః।। 44

ఋతుః సుదర్శనః కాలః పరమేష్ఠీ పరిగ్రహః।
ఉగ్రః సంవత్సరో దక్షో విశ్రామో విశ్వదక్షిణః।। 45

విస్తారః స్థావరః స్థాణుః ప్రమాణం బీజమవ్యయమ్।
అర్థోఽనర్థో మహాకోశో మహాభోగో మహాధనః।। 46

అనిర్విణ్ణః స్థవిష్ఠోఽభూ ర్ధర్మయూపో మహామఖః।
నక్షత్రనేమి ర్నక్షత్రీ క్షమః క్షామః సమీహనః।। 47

యజ్ఞ ఇజ్యో మహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః।
సర్వదర్శీ విముక్తాత్మా సర్వజ్ఞో జ్ఞానముత్తమమ్।। 48

సువ్రతః సుముఖః సూక్ష్మః సుఘోషః సుఖదః సుహృత్।
మనోహరో జితక్రోధో వీరబాహు ర్విదారణః।। 49

స్వాపనః స్వవశో వ్యాపీ నైకాత్మా నైకకర్మకృత్ ।
వత్సరో వత్సలో వత్సీ రత్నగర్భో ధనేశ్వరః ।। 50

ధర్మగు బ్ధర్మకృ ద్ధర్మీ స దసత్ క్షర మక్షరమ్ ।
అవిజ్ఞాతా సహస్రాంశు ర్విధాతా కృతలక్షణః।। 51

గభస్తినేమిః సత్త్వస్థః సింహో భూతమహేశ్వరః ।
ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః।। 52

ఉత్తరో గోపతి ర్గోప్తా జ్ఞానగమ్యః పురాతనః ।
శరీరభూతభృ ద్భోక్తా కపీన్ద్రో భూరిదక్షిణః।। 53

సోమపోఽమృతపః సోమః పురుజి త్పురుసత్తమః।
వినయో జయః సత్యసంధో దాశార్హః సాత్వతాం పతిః।। 54

జీవో వినయితాసాక్షీ ముకుందోఽమితవిక్రమః।
అంభోనిధి రనంతాత్మా మహోదధిశయోఽంతకః।। 55

అజో మహార్హ: స్వాభావ్యో జితామిత్రః ప్రమోదనః ।
ఆనందో నందనో నందః సత్యధర్మా త్రివిక్రమః॥ 56

మహర్షిః కపిలాచార్యః కృతజ్ఞో మేదినీపతిః ।
త్రిపద స్త్రిదశాఽధ్యక్షో మహాశృంగః కృతాంతకృత్ ॥ 57

మహావరాహో గోవిందః సుషేణః కనకాంగదీ ।
గుహ్యో గభీరో గహనో గుప్త శ్చక్రగదాధరః॥ 58

వేధాః స్వాంగోఽజితః కృష్ణో దృఢః సంకర్షణోఽచ్యుతః।
వరుణో వారుణో వృక్షః పుష్కరాక్షో మహామనాః॥ 59

భగవాన్ భగహాఽఽనందీ వనమాలీ హలాయుధః।
ఆదిత్యో జ్యోతిరాదిత్యః సహిష్ణు ర్గతిసత్తమః ॥ 60

సుధన్వా ఖండపరశు ర్దారుణో ద్రవిణప్రదః ।
దివఃస్పృక్ సర్వదృగ్వ్యాసో వాచస్పతి రయోనిజః॥ 61

త్రిసామా సామగ స్సామ నిర్వాణం భేషజం భిషక్।
సంన్యాసకృ చ్ఛమః శాంతో నిష్ఠా శాంతిః పరాయణమ్॥ 62

శుభాంగః శాంతిదః స్రష్టా కుముదః కువలేశయః ।
గోహితో గోపతి ర్గోప్తా వృషభాక్షో వృషప్రియః ॥ 63

అనివర్తీ నివృత్తాత్మా సంక్షేప్తా క్షేమకృ చ్ఛివః ।
శ్రీవత్సవక్షాః శ్రీవాసః శ్రీపతిః శ్రీమతాంవరః ॥ 64

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీవిభావనః ।
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః॥ 65

స్వక్షః స్వంగః శతానందో నంది ర్జ్యోతిర్గణేశ్వరః ।
విజితాత్మా విధేయాత్మా సత్కీర్తి శ్ఛిన్నసంశయః ॥ 66

ఉదీర్ణః సర్వతశ్చక్షు రనీశః శాశ్వతస్థిరః।
భూశయో భూషణో భూతి ర్విశోకః శోకనాశనః॥ 67

అర్చిష్మా నర్చితః కుంభో విశుద్ధాత్మా విశోధనః ।
అనిరుద్ధో ఽప్రతిరథః ప్రద్యుమ్నో ఽమితవిక్రమః॥ 68

కాలనేమినిహా వీరః శౌరిః శూరజనేశ్వరః ।
త్రిలోకా ఽత్మా త్రిలోకేశః కేశవః కేశిహా హరిః॥ 69

కామదేవః కామపాలః కామీ కాంతః కృతాగమః ।
అనిర్దేశ్యవపు ర్విష్ణు ర్వీరో ఽనంతో ధనంజయః॥ 70

బ్రహ్మణ్యో బ్రహ్మకృ ద్బ్రహ్మా బ్రహ్మ బ్రహ్మవివర్ధనః
బ్రహ్మవి ద్బ్రాహ్మణో బ్రహ్మీ బ్రహ్మజ్ఞో బ్రాహ్మణప్రియః॥ 71

మహాక్రమో మహాకర్మా మహాతేజా మహోరగః
మహాక్రతు ర్మహాయజ్వా మహాయజ్ఞో మహాహవిః॥ 72

స్తవ్యః స్తవప్రియః స్తోత్రం స్తుతిః స్తోతా రణప్రియః ।
పూర్ణః పూరయితా పుణ్యః పుణ్యకీర్తి రనామయః॥ 73

మనోజవ స్తీర్థకరో వసురేతా వసుప్రదః ।
వసుప్రదో వాసుదేవో వసు ర్వసుమనా హవిః॥ 74

సద్గతిః సత్కృతిః సత్తా సద్భూతిః సత్పరాయణః ।
శూరసేనో యదుశ్రేష్ఠః సన్నివాసః సుయామునః॥ 75

భూతా ఽవాసో వాసుదేవః సర్వా ఽసునిలయో ఽనలః
దర్పహా దర్పదో దృప్తో దుర్ధరో ఽథాపరాజితః ॥ 76

విశ్వమూర్తి ర్మహామూర్తి ర్దీప్తమూర్తి రమూర్తిమాన్
అనేకమూర్తి రవ్యక్తః శతమూర్తిః శతాననః ॥ 77

ఏకో నైకః సవః కః కిం యత్త త్పద మనుత్తమమ్
లోకబంధు ర్లోకనాథో మాధవో భక్తవత్సలః ॥ 78

సువర్ణవర్ణో హేమాంగో వరాంగ శ్చందనాంగదీ ।
వీరహా విషమః శూన్యో ఘృతాశీ రచల శ్చలః ॥ 79

అమానీ మానదో మాన్యో లోకస్వామీ త్రిలోకధృక్।
సుమేధా మేధజో ధన్యః సత్యమేధా ధరాధరః ।। 80

తేజోవృషో ద్యుతిధరః సర్వశస్త్రభృతాం వరః ।
ప్రగ్రహో నిగ్రహో వ్యగ్రో నైకశృంగో గదాఽగ్రజః।। 81

చతుర్మూర్తి శ్చతుర్బాహు శ్చతుర్వ్యూహ శ్చతుర్గతిః ।
చతురాత్మా చతుర్భావ శ్చతుర్వేదవి దేకపాత్।। 82

సమావర్తోఽనివృత్తాత్మా దుర్జయో దురతిక్రమః ।
దుర్లభో దుర్గమో దుర్గో దురావాసో దురారిహా।। 83

శుభాంగో లోకసారంగః సుతంతు స్తంతువర్ధనః ।
ఇంద్రకర్మా మహాకర్మా కృతకర్మా కృతాఽఽగమః।। 84

ఉద్భవః సుందరః సుందో రత్ననాభః సులోచనః।
అర్కో వాజసనః శృంగీ జయంతః సర్వవిజ్జయీ।। 85

సువర్ణబిందు రక్షోభ్యః సర్వవాగీశ్వరేశ్వరః ।
మహాహ్రదో మహాగర్తో మహాభూతో మహానిధిః।। 86

కుముదః కుందరః కుందః పర్జన్యః పావనోఽనిలః।
అమృతాశోఽమృతవపుః సర్వజ్ఞః సర్వతోముఖః।। 87

సులభః సువ్రతః సిద్ధః శత్రుజి చ్ఛత్రుతాపనః।
న్యగ్రోధోదుంబరోఽశ్వత్థ శ్చాణూరాంధ్రనిషూదనః।। 88

సహస్రార్చిః సప్తజిహ్వ్యః సప్తైధాః సప్తవాహనః।
అమూర్తి రనఘోఽచింత్యో భయకృద్ భయనాశనః।। 89

అణు ర్బృహత్ కృశః స్థూలో గుణభృ న్నిర్గుణో మహాన్।
అధృతః స్వధృతః స్వాఽఽస్యః ప్రాగ్వంశో వంశవర్ధనః।। 90

భారభృత్ కథితో యోగీ యోగీశః సర్వకామదః।
ఆశ్రమః శ్రమణః క్షామః సుపర్ణో వాయువాహనః।। 91

ధనుర్ధరో ధనుర్వేదో దండో దమయితా దమః।
అపరాజితః సర్వసహో నియంతాఽనియమో యమః।। 92

సత్త్వవాన్ సాత్త్వికః సత్యః సత్యధర్మపరాయణః ।
అభిప్రాయః ప్రియాఽర్హోఽర్హః ప్రియకృత్ ప్రీతివర్ధనః।। 93

విహాయసగతి ర్జ్యోతిః సురుచి ర్హుతభు గ్విభుః।
రవి ర్విరోచనః సూర్య స్సవితా రవిలోచనః।। 94

అనంతో హుతభుగ్ భోక్తా సుఖదో నైకజోఽగ్రజః।
అనిర్విణ్ణః సదాఽమర్షీ లోకాధిష్ఠాన మద్భుతః।। 95

సనాత్ సనాతనతమః కపిలః కపి రవ్యయః।
స్వస్తిదః స్వస్తికృ త్స్వస్తీ స్వస్తిభుక్ స్వస్తిదక్షిణః।। 96

అరౌద్రః కుండలీ చక్రీ విక్రమ్యూర్జితశాసనః।
శబ్దాతిగః శబ్దసహః శిశిరః శర్వరీకరః।। 97

అక్రూరః పేశలో దక్షో దక్షిణః క్షమిణాంవరః।
విద్వత్తమో వీతభయః పుణ్యశ్రవణకీర్తనః।। 98

ఉత్తారణో దుష్కృతిహా పుణ్యో దుఃస్వప్ననాశనః।
వీరహా రక్షణః సంతో జీవనః పర్యవస్థితః।। 99

అనంతరూపోఽనంత శ్రీ ర్జితమన్యు ర్భయాపహః।
చతురశ్రో గభీరాఽఽత్మా విదిశో వ్యాదిశో దిశః।। 100

అనాది ర్భూర్భువోలక్ష్మీః సువీరో రుచిరాంగదః।
జననో జనజన్మాది ర్భీమో భీమపరాక్రమః।। 101

ఆధారనిలయో ధాతా పుష్పహాసః ప్రజాగరః।
ఊర్ధ్వగః సత్పథాచారః ప్రాణదః ప్రణవః పణః।। 102

ప్రమాణం ప్రాణనిలయః ప్రాణభృ త్ప్రాణజీవనః।
తత్త్వం తత్త్వవి దేకాత్మా జన్మమృత్యుజరాతిగః।। 103

భూర్భువః స్వస్తరు స్తారః సవితా ప్రపితామహః।
యజ్ఞో యజ్ఞపతి ర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞవాహనః॥ 104

యజ్ఞభృ ద్యజ్ఞకృ ద్యజ్ఞీ యజ్ఞభు గ్యజ్ఞసాధనః।
యజ్ఞాన్తకృ ద్యజ్ఞగుహ్య మన్న మన్నాద ఏవ చ॥ 105

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః॥ 106

శంఖభృ న్నందకీ చక్రీ శార్ఙ్గధన్వా గదాధరః।
రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః॥ 107

సర్వప్రహరణాయుధ - ఓం నమ ఇతి

ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః।
నామ్నాం సహస్రం దివ్యానా మశేషేణ ప్రకీర్తితమ్॥ 108

య ఇదం శృణుయా న్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్।
నాఽశుభం ప్రాప్నుయా త్కించి త్సోఽముత్రేహ చ మానవః॥ 109

వేదాన్తగో బ్రాహ్మణః స్యాత్ క్షత్రియో విజయీ భవేత్।
వైశ్యో ధనసమృద్ధః స్యా చ్ఛూద్రః సుఖ మవాప్నుయాత్॥ 110

ధర్మార్థీ ప్రాప్నుయా ద్ధర్మ మర్థార్థీ చార్థ మాప్నుయాత్।
కామా నవాప్నుయా త్కామీ ప్రజార్థీ చాప్నుయా త్ప్రజామ్॥ 111

భక్తిమా న్యః సదోత్థాయ శుచి స్తద్గతమానసః।
సహస్రం వాసుదేవస్య నామ్నా మేత త్ప్రకీర్తయేత్॥ 112

యశః ప్రాప్నోతి విపులం జ్ఞాతిప్రాధాన్య మేవ చ।
అచలాం శ్రియ మాప్నోతి శ్రేయః ప్రాప్నో త్యనుత్తమమ్॥ 113

న భయం క్వచి దాప్నోతి వీర్యం తేజశ్చ విందతి।
భవ త్యరోగో ద్యుతిమాన్ బలరూపగుణాఽన్వితః॥ 114

రోగార్తో ముచ్యతే రోగాద్ బద్ధో ముచ్యేత బంధనాత్।
భయా న్ముచ్యేత భీతస్తు ముచ్యేతా ఽఽపన్న ఆపదః।। 115

దుర్గా ణ్యతితర త్యాశు పురుషః పురుషోత్తమమ్।
స్తువ న్నామసహస్రేణ నిత్యం భక్తి సమన్వితః।। 116

వాసుదేవాఽఽశ్రయో మర్త్యో వాసుదేవపరాయణః।
సర్వపాపవిశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్।। 117

న వాసుదేవ భక్తానా మశుభం విద్యతే క్వచిత్।
జన్మమృత్యుజరావ్యాధిభయం నైవోపజాయతే।। 118

ఇమం స్తవ మధీయానః శ్రద్ధాభక్తిసమన్వితః।
యుజ్యేతాఽఽత్మసుఖక్షాంతి శ్రీధృతిస్మృతికీర్తిభిః।। 119

న క్రోధో న చ మాత్సర్యం న లోభో నాఽశుభా మతిః।
భవంతి కృతపుణ్యానాం భక్తానాం పురుషోత్తమే।। 120

ద్యౌః సచంద్రార్కనక్షత్రా ఖం దిశో భూ ర్మహోదధిః।
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః।। 121

ససురాఽసురగంధర్వం సయక్షోరగరాక్షసం।
జగ ద్వశే వర్తతేదం కృష్ణస్య సచరాచరమ్।। 122

ఇంద్రియాణి మనో బుద్ధిః సత్త్వం తేజో బలం ధృతిః।
వాసుదేవాత్మకా న్యాహుః క్షేత్రం క్షేత్రజ్ఞ ఏవ చ।। 123

సర్వాగమానా మాచారః ప్రథమం పరికల్పతే।
ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభు రచ్యుత।। 124

ఋషయః పితరో దేవా మహాభూతాని ధాతవః।
జంగమాజంగమం చేదం జగ న్నారాయణోద్భవమ్।। 125

యోగో జ్ఞానం తథా సాంఖ్యం విద్యాః శిల్పాదికర్మ చ।
వేదాః శాస్త్రాణి విజ్ఞానం మేత త్సర్వం జనార్దనాత్।। 126

ఏకో విష్ణు ర్మహద్ భూతం పృథగ్భూతా న్యనేకశః।
త్రీన్ లోకా న్వ్యాప్య భూతాత్మా భుంక్తే విశ్వభు గవ్యయః।। 127

ఇమం స్తవం భగవతో విష్ణో ర్వ్యాసేన కీర్తితమ్।
పఠే ద్య ఇచ్ఛే త్పురుషః శ్రేయః ప్రాప్తుం సుఖాని చ।। 128

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభు మవ్యయం।
భజన్తి యే పుష్కరాక్షం న తే యాంతి పరాభవమ్।। 129

న తే యాంతి పరాభవం ఓం నమ ఇతి.

ఇతి శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం సంపూర్ణమ్.

అర్జున ఉవాచ:

పద్మపత్రవిశాలాక్ష! పద్మనాభ! సురోత్తమ!
భక్తానా మనురక్తానాం త్రాతా భవ జనార్దన!

భగవానువాచ:

యో మాం నామసహస్రేణ స్తోతు మిచ్ఛతి పాండవ!
సోఽహ మేకేన శ్లోకేన స్తుత ఏవ న సంశయః -

వ్యాస ఉవాచ:

వాసనా ద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయం।
సర్వభూతనివాసోఽసి వాసుదేవ నమోఽస్తుతే -
శ్రీ వాసుదేవనమోస్తు త ఓం నమ ఇతి.

పార్వత్యువాచ:

కేనోపాయేన లఘునా విష్ణో ర్నామసహస్రకం।
పఠ్యతే పండితై ర్నిత్యం శ్రోతు మిచ్ఛా మ్యహం ప్రభో।

ఈశ్వర ఉవాచ:

శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామత స్తుల్యం రామనామ వరాననే!
శ్రీ రామనామ వరానన ఓం నమ ఇతి.

బ్రహ్మో ఉవాచ:

నమోఽస్త్వనంతాయ సహస్రమూర్తయే।
సహస్రపాదాక్షిశిరోరుబాహవే।
సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే।
సహస్రకోటి యుగధారిణే నమః-
సహస్రకోటియుగధారిణే నమ ఓం నమ ఇతి.

సంజయ ఉవాచ:

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మతి.

శ్రీ భగవా నువాచ:

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.
ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః।
ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణశబ్దమాత్రం
విముక్తదుఃఖాః సుఖినో భవంతి.
కాయేన వాచా మనసేంద్రియై ర్వా।
బుద్ధ్యాఽఽత్మనా వా ప్రకృతేః స్వభావాత్।
కరోమి య ద్య త్సకలం పరస్మై।
నారాయణాయేతి సమర్పయామి.

ఓం తత్ సత్.



శ్రీవిష్ణువిద్య

(శ్రీ విష్ణు సహస్రనామ భాష్యము)

సామవేదం షణ్ముఖ శర్మ

"ఇది నామవిద్య.
ఈ నామాలు అక్షరాల గుంపులు కావు.
నారాయణుని శబ్దాకృతులు. మొత్తంగా ఈ సహస్రనామ స్తోత్రమే విష్ణుని శబ్దమయీమూర్తి. ఇవి వేదమందు ప్రతిపాదింపబడిన పరమాత్ముని శబ్దాలు. వీటి వ్యాఖ్యానం మన వైదిక విజ్ఞానాన్నీ, పరమేశ్వర జ్ఞానాన్నీ స్పష్టపరుస్తాయి. అందుకే ఇది 'విష్ణువిద్య'.
ప్రాచీన, అర్వాచీన భాష్యాల ననుసరించి, వైదిక శాస్త్రాల సంప్రదాయాధారంగా ఒక్కొక్క నామానికి ఉన్న ఔచితీమంతమైన క్రమబద్ధతనీ, నిర్దిష్టమైన వ్యాఖ్యానాన్నీ అందించే సమన్వయ భాష్యమిది.
ప్రతినామ వ్యాఖ్యానము పారాయణయోగ్యంగా,
భావనాయోగంగా సమకూర్చిన విష్ణుతేజో విలసిత గ్రంథమిది".

-సామవేదం

సమర్పణ : డా॥ వ్యాకరణం ఆంజనేయ శాస్త్రి

ఋషిపీఠం ప్రచురణలు